
# శ్రీ శివ శంకర కృతులు

షష్టి వర్ష పూర్తి
నందన వర్ష భాద్రపద కృష్ణ షష్ఠి
సెప్టెంబరు 9 1952





# శ్రీ శివశంకర కృతులు

పద్య . గేయ . కావ్యములు

ప్రథమ సంపుటి

UNIVERSITY OF HYDERABAD
LIBRARY

. సాహితీ . సమితి . రేపల్లె .

సర్వ స్వామ్యములు కృత్తివాస తీర్థులవి
ప్రథమ ముద్రణము (షష్టిపూర్తి) 1952

Sh64S
University of Hyderabad
LIBRARY
Acc. No. 29102
Dated 17.2.82
Hyderabad - 500 134.

. భారతీ . ప్రెస్ . తెనాలి .

# అనుక్రమణిక


| | | | |
|---|---|---|---|
| **హృదయేశ్వరి** | (1924—26) | | పుట |
| విభ్రమము | ... | ... | 1 |
| విరహావీచి | ... | ... | 17 |
| ఆశాజ్యోతి | ... | ... | 30 |
| వైతాళికము | ... | ... | 47 |
| శుభస్వప్నము | ... | ... | 53 |
| లోకయాత్ర | ... | ... | 68 |
| దేవాలయము | ... | ... | 79 |
| సందేశము | ... | ... | 86 |
| సమాగమము | ... | ... | 94 |
| **వకుళమాలిక** | (1935) | ... | 101 |
| **సాధకుడు** | (1936) | ... | 131 |
| ఆశావాన్ | ... | ... | 133 |
| శిలాప్రతిమ | ... | ... | 139 |
| వాతాయనము | ... | ... | 145 |
| అశరీరవాణి | ... | ... | 151 |

| | | | పుట |
|---|---|---|---|
| మృగతృష్ణ | ... | ... | 155 |
| అస్పృష్ట దేవత | ... | ... | 162 |
| **వ్రతభంగము** | (1942) | ... | 169 |
| **రత్నాకరము** | (1938–39) | ... | 207 |
| పూర్వ భాగము | ... | ... | 209 |
| ఉత్తర భాగము | ... | ... | 231 |
| **ఆవేదన** | (1917–27) | ... | 241 |
| ౧–౨ | (1917) | ... | 243 |
| ౩ | (1917) | ... | 244 |
| ౪ | (1917) | ... | 246 |
| ౫ | (1917) | ... | 247 |
| ౬ | (1918) | ... | 248 |
| ౭ | (1918) | ... | 249 |
| ౮ | (1919) | ... | 251 |
| ౯ | (1919) | ... | 252 |
| రుధిరోద్గారి | (1924) | ... | 253 |
| అజ్ఞాత మిత్రము | (1924) | ... | 253 |
| ఆవర్తము | (1924) | ... | 256 |

| | | | పుట |
|---|---|---|---|
| శ్రీపాద ప్రశస్తి | (1924) | ... | 258 |
| ఉత్తర హాయనము | (1925) | ... | 260 |
| ఉపలాలనము | (1925) | ... | 263 |
| ప్రపన్నుడు | (1925) | ... | 264 |
| చిత్త శుద్ధి | (1926) | ... | 265 |
| సుతి స్మృతి | (1925) | ... | 265 |
| ద్వాత్రింశత్ | (1924) | ... | 267 |
| శివ రాత్రి | (1926) | ... | 268 |
| వినతి | (1927) | ... | 270 |
| వాంఛలు | (1927) | ... | 271 |

కావ్యావళి — (ప్రథమ కదంబము) 273

| | | | |
|---|---|---|---|
| దివ్య లోచనములు* | (1924) | ... | 275 |
| శిష్యస్తోత్రాలు | (1924) | ... | 283 |
| ప్రభు తీర్థము | (1927) | ... | 287 |
| దీపారాధన | (1927) | ... | 294 |
| ప్రతాప కుమారి | (1930) | ... | 303 |
| పలిత కేశము | (1930) | ... | 309 |
| ప్రభు వాక్యము | (193?) | ... | 317 |

| | | | పుట |
|---|---|---|---|
| భామతి | (1930) | ... | 328 |
| లోపాముద్ర | (1935) | ... | 333 |
| **కావ్యావలి — (ద్వితీయ కదంబము)** | | | 337 |
| తరుణాపుత్రుడు | (1924) | ... | 339 |
| సందర్శనము | (1927) | ... | 339 |
| భావనాయిక | (1930) | ... | 340 |
| ప్రభాతము | (1935) | ... | 342 |
| పెత్రార్కా | (1936) | ... | 343 |
| పంచచత్వారింశత్ | (1936) | ... | 344 |
| తస్లీమ్ | (1937) | ... | 345 |
| ఉమర్ ఖయ్యామ్ | (1941) | ... | 347 |
| విస్మృత స్మృతి | (1940) | ... | 348 |
| వందనము | (1946) | ... | 358 |
| హస్తక్షేపము | (1950) | ... | 360 |
| ఆనంద మా | (1950) | ... | 363 |
| **కావ్యావలి — (తృతీయ కదంబము)** | | | 367 |
| చామెకాంబ | (1932) | ... | 369 |
| మేడూరివారి కోడలు | (1932) | ... | 381 |
| భ్రమర కీటము | (1949) | ... | 388 |

| | | | |
|---|---|---|---|
| అవధానుల వారి | | | పుట |
| అల్లుడు | (1949) | ... | 396 |
| సలిల సదనము | (1950) | ... | 414 |
| కా వ్యా వ లి – (చతుర్థ కదంబము) | | ... | 425 |
| నైయాయికుడు | (1930) | ... | 427 |
| వీర శైవుడు | (1931) | ... | 430 |
| క్రుద్ధ ముని | (1928) | ... | 431 |
| గురు శిష్యులు | (1930) | ... | 436 |
| ఛిద్ర ఘటి | (1932) | ... | 447 |
| అగ్ర వీక్ష | (1948) | ... | 460 |

పూజ్యులగు మానాయన గారి కావ్య సందోహ మంతయు సమీక్షించి, The Mind And Art of Sri Siva Sankara Sastri అను మహాగ్రంథము రచించిన పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి (M. A., M. Litt., Ph.D.,) గారికిని, शिव शंकर काव्य दर्शन అను సమీక్షాకృతిని హిందీలో రచించిన సాహిత్యరత్న, విద్వాన్, దాచకొండ నరసింహ మూర్తి గారికిని, మాతృక సరి చూచి సమగ్రముగా Proofs చదివిన కావ్యతీర్థ, కవితావతంస, గట్టి లక్ష్మీ నరసింహ శాస్త్రి గారికిని ధన్యవాదములు.

గ్రంథ ముద్రణములో సర్వవిధముల తోడ్పడిన బ్రహ్మశ్రీ అక్కపెద్ది వెంకట నరసింహము గారికిని, భారతీ ప్రెస్సు యజమానులగు శ్రీ మేడిసెట్టి సుబ్బయ్యగారికిని ధన్యవాదములు. వీరి సహకారము విస్మరించుటకు వీలు లేనిది.

తల్లావఝ్ఝల కృత్తివాస తీర్థులు

సాహితీ సమితి
సెప్టెంబరు 9 1952

# హృదయేశ్వరి

· అం కి త ము ·

శ్రీమతి వర్ధనీ దేవికి

# విభ్రమము

౧

మినుకు మినుకు కని చుక్కలు మెరయుచుండె
ఆవరించెను చిరుమబ్బు లాకసమ్ము
నెగురుగా దోచుచుండె మహీధరమ్ము
లుభయ పార్శ్వాల శోభిల్లె నుద్యానములు.

శాంత రమ్య తమస్విని సమయమందు
కలరవంబైన బందరు కాల్వలోని
నీరరేఖను బ్రాపించి కూరుచుంటి
ప్రాణసఖుతోడ ఘట్టాన పడవమీద.

ఆడజొచ్చెను పయ్యాట లస్మదీయ
లలిత పాండుర చేలాంచలాలతోడ
నీల సుస్నిగ్ధ నిబిడాలకాళితోడ
పవనబాలకుడా నీటిపట్టునందు.

కృష్ణవేణీ మహాపగా గీతిరవము
కర్ణముల మందమందమ్ముగా నదింప
నిన్ను వర్ణింప సాగెను నిరుపమాన
రమ్యవాక్కుల సుకవి నా ప్రాణసఖుడు.

హంసపల్కులచే నిషధాధిపతికి
భీమ భూపాల పుత్రిపై ప్రేమపోలె
ఆప్తవాక్కులచే రాగ మంకురించి
కోరకిత మాయె నయ్యెను కుసుమితంబు.

విజయవాటీ పురమ్మును వీడి యవల
కృష్ణవేణీ మహాతరంగిణిఁ దరించి
పర్వతశ్రేణి దాటి సంభ్రమముతోడ
దక్షిణాపథవర్తియై తరలె మనసు.

౨

ఆ మనోహర మాఘ సాయాహ్న వేళ
ఇష్టసఖుతోడ సరణి నే నేగుచుండ
అక్కజము కొల్పి తోచె నీయాననమ్ము
సరసిపై దేలియాడెడి జలజమట్లు.

మధుపమై పోయె నపుడె నామానసమ్ము
నీ ముఖాబ్జమ్ముపై వాలు నిరతితోడ.
పాదయుగళమ్ము తోడనె పార్శ్వమునకు
తిరిగి కదలఁగ జొచ్చె విధేయ మగుచు.

సుందర ద్వారదేశమ్మునందు నపుడు
సత్రపమ్ముగ నున్న నీగాత్రవల్లి
పటగతం బయి అవృతిబద్ధమైన
ప్రతిమపోలిక నాకు విభ్రమము గొలిపె.

ఆ ముహూర్తమునం దద్భుతావహముగ
నీకటాక్షేక్షణావళీ నిశిత విశిఖ
వితతి తాకగ మన్మనోవిహగ మపుడె
పల్లటిలి వాలె నీపాదపద్మయుగళి!

నీమనోహర వసన నిర్ణిద్ర విమల
సాంద్ర చిత్రిత సహకార జాలకాళి
మధ్యసీమను మీనాయమాన మగుచు
సంచరించె మదీయ లోచన యుగంబు.

మహిత లావణ్య విద్యోతమాన తావ
కానన సుధాంశు బింబమునందు నిలిచి
మరల దయ్యె చకోరము మాడ్కి దేవి,
దివ్య రాగార్ద్ర మైన నాదృష్టి యపుడు.

తప్ప దాయెను నిను వీడి తరలి చనక :
మరలి చూచితి, వీక్షణ మాలికలను
బరపితివి శాంతగతిని నాపైన దేవి,
ధన్యతం గంటి నంచు నే దలచుచుండ !

## 3

నీమనోహరమూర్తి నే నిలిపి మదిని
మెల్లగా బోవుచుంటి మీమేడదరిని.
తలపని తలంపుగా భవద్దర్శనంబు
కల్గినది నాకు కన్నులకరవు తీర.

పద్మ సంకాశ మైన నీపాణియందు
సంస్కృత గ్రంథరాజమ్ము సంతరించి
అంచనడకలతో నరుదెంచినావు
దివ్యశోభను భారతీదేవి భాతి.

కమ్ర సుస్నిగ్ధ నీలాంశుకమ్ము దాల్చి
యెదురుపడినావు నాకపు డింపు లొలుక
కోమలాంబుద సన్నిభ శ్యామగాత్రి
లలిత సంశ్లేషమందలి లక్ష్మివోలె.

కన్నులను మోడ్చి ఆననకమల మల్ల
రమ్యముగ వాల్చి లజ్జాభిరామగతిని
చలిత జంగమ కాంచన లతికరీతి
హర్మ్యభాగమ్ములోనికి నరిగినావు.

చటుల విభ్రమగతి ఘనకుటిలకేశ
జాలమున జిక్కుకొనియె లోచనయుగమ్ము:
నయము మోక్షము లేక బంధనమునందె
త్వత్కటాక్షమ్ము వరలునందాక దేవి!

## ౪

దేహళీ పార్శ్వమున నిల్చి దేవి, నాదు
నెదుకం గాంచుచుంటివి వెడలు "ప్రశ్నలు"
మూగమంటివి మిగుల సుత్సుకతతోడ
పథమున నిల్చి నీ ముఖప్రభలు నేను.

స్మిత కోమలమైన నీ సితవిలోక
నావళికి సాంద్రమైన నా యాసిత నిశిత
దృక్కులకు సంఘటిల్లిన యెదురుకోలు
కుసుమ నీలాంబుజంబుల గుమివిధాన.

తృప్తి తీరక భవదీయ దివ్యవదన
మండలాభయము న్నేను మరల మరల
వెను దిరిగి చూచుచుం బోతి వెగ్గలంపు
తమిని కెరలు రేగుచుండెడి తరుణివోలె.

మనసు నిలువంగ నోపక మగుడ నేను
క్షిప్రగమనముతో ప్రదక్షిణము చేసి
మరలివచ్చితి వేరొక మార్గమునను
నీముఖాంభోజ దర్శన నిష్ఠతోడ.

అరుగ నుంటివి సౌధాంతరాళమునకు,
దేవి, మద్వదనంబు నీదృష్టిపథము
నంటు దో మటచే భవదాననంబు
రక్తిమం దాల్చె లజ్జాభిరామ మగుచు.

లోనుల మనోజ్ఞ విమల దృక్కోణ తరళ
దివ్య శీతల భవదీయ దృష్టు లవల
పిక్కటిల్లి మదానన బింబమువయి
చెలువుగా వాలె వెన్నెలపులుగులట్లు.

మరలి చనుచుండ నీ వంత మందిరాంగ
ణ ప్రదేశము వెంట నానయనయుగళి
కమ్ర సుస్నిగ్ధ భవదీయ గండఫలక
భాగమున లాస్య మాడె జృంభణముతోడ.

గ్రీవము మనోజ్ఞముగ వంచి క్రింది చూడ్కి
మోహన మయూరిపోలిక నాహరించి
ఏకకాలమునందె మదీక్షణములు
చిత్తమునుగూడ, సౌధమ్ము చేరినావు.

౫

అగ్రహార నృసింహాలయాంగణమున
నీవు స్వజనాంతరితవుగా నిలిచి యుండ
కాన రాదాయె నీముఖకమల మయ్యె
పర్ణముల మాటువడిన పుష్పమ్మువోలె !
మధుర మంథరగతి నీవు మందిరమ్ము
లోని కేగుచునుండ నాలోలదృష్టి
హర్మ్యమున తన్మయం బయి యనుసరించె
పల్లవ మనోజ్ఞమైన నీపాదయుగళి.
నీముఖజ్యోత్స్న నామీద నెరయుకొరకు
ఆలయములోని కల్లన అరిగినాను.
ఇంతలోననె చంచలాకాంతవోలె
తరలిపోతివి వేరొక ద్వారసరణి.
చిమ్మచీకటి క్రమ్మె హృత్సీమ నపుడు,
చూడ్కులున్న సమస్తమ్ము శూన్య మయ్యె.
దేవి, ఈభక్తునకు నింక ధ్యేయ మొకటె,
స్థలకమల రమ్యమైన నీచరణయుగళి !

## ౬

దేవి, ఈనేత్రములకు యాదృచ్ఛికముగ
త్వన్మనోహర రూప సందర్శనాభి
సిద్ధికై యెన్నిసార్లు నిల్చితినో తెలియ
దహాశా వాతాయనమ్ముల కభిముఖముగ.

విమల కమనీయ వదనారవింద మధుర
వీక్షణక్షణరక్తి దేవి, త్వదీయ
సౌధసవిధమ్మునకు నెన్నిసార్లు తీర్థ
యాత్ర సల్పితినో తెల్ప నలవి కాదు.

అమల సంజీవనౌషధం బౌ త్వదీయ
శాంత రమ్య కృపాకటాక్షమ్ము కొరకు
చెలగి హర్మ్యమునకు ప్రదక్షిణము లెన్ని
చేసినాడనో లెక్కించి చెప్పలేను.

హృదయభార ఘనధ్వాంత విదళనాచ్ఛ
చంద్రికా కాంతిపూర యుష్మన్మనోజ్ఞ
దివ్య దరహాసమునకు మందిరములోని
కెన్నిసారులు వచ్చితి నెరుక లేదు !

## ౨

శాంత శీతల రమణీయ సాంధ్యవేళ
నరుగుదెంచుచు విద్యాలయమ్మునుండి –
రమ్యరూపము మన్మనోరథము దాల్చి
యెదురుపడినట్లు – నీవు కాన్పించినావు !

క్షేమధారుణిపై చతుష్పథమువెంట
ధీరగమనమ్ముతో నరుదెంచు నీవు
కమలగర్భుని కంఠశృంగాటకమున
చెలగు వాగ్దేవిపోల్కి దోచితివి నాకు.

పార్శ్వవర్తిను లుంటచే పక్షములను
ఇంచుక కదల్చి యిటు ప్రసారించినావు
మనసిజానిప్రపంచక మార్గణాభ
మైన నిశితేక్షణమ్ము రహస్యలీల.

ఫాలమున వాలి నాసికా పథమువెంట
నధరబింబముపై జారి యావల నీదు
మృదుకపోల తలమ్మున నొదిగి తుదకు
శోణతాటంకసీమ నాచూడ్కి నిలిచె.

భావభరమున నీమృదు పదయుగమ్ము
తొట్రిలగ సాగిపోతివి త్రోవవెంట.
విస్మరింపక యేకాంతవేళలందు
నన్ను దలపోతు వని మది నమ్మువాడ.

## ర

సాంద్ర హైమవిభావరీ సమయమందు
త్వన్ముఖ సుధాంశుబింబ సందర్శనాభి
లాషని నిల్చితి విహారహర్మ్య రమ్యపట్ట
భంగపాళీ లసత్పురోభాగమందు.

అంగణవిరాజమాన సాంద్రామ్రవిటపి
లలిత కుసుమ పరిమళలహరి దెచ్చి
గంధవాహకుమారుడు కనికరమున
నాకు నామోద మొనగూర్చినాడు మిగుల.

దీపికల్ సదనాంతర దేశమందు
వెల్గుచున్నవి తారకావిలసనమున.
మరువు గనెక్కడు భవదీయ ముఖ సుధాంశు
బింబ ముదయింప లేదు సంప్రీతి నెరప.

నిష్ఫలం బింక నిచ్చోట నిలుచు టనుచు
మది నిరాశను వ్యథ చెంది మగల నుండ
అంబువాహ తిరస్కరిణ్యంతరోది
తేందుమండలమట్లు గాన్పించినావు!

ధవళకౌశేయ పరిధాన ధారిణి వయి
దేహలత హేమదీధితి దేజరిల్ల
వల్గుగమనమ్ముతో నీవు వచ్చినపుడు
కేవలము లక్ష్మి వనియెదు భావ మొదవె.

అమృతబిందు కదంబక స్యంది హృదయ
హారి విస్ఫారిత విలోచనాబ్జయుగళి
నిండుగా నీవు నామీద నిలిపినపుడు
లయము నొందితి మాధుర్యలహరిలోన.

ద్వారదేశమునుండి తత్పార్శ్వమునకు
హంసయానమ్ముతోడ నీ వరిగినావు,
తోడనే రత్నపుత్రికా ద్యుతులతోడ
క్రమ్మరిలినావు ద్వారోపకంఠమునకు.

అలసవలితములై ఈషదార్ద్రము లయి
ముగ్ధహారిణీ విలోకనస్నిగ్ధము లయి
అలరు నీ నేత్రకోణ నిర్యత్కటాక్ష
పంక్తులకు పాత్రమైతిని ప్రణయదేవి!
మధురభావావళీ లసన్నతిని నేను,
మధురిమముకన్న మధుర మా మధురమూర్తి,
మధురయామినివేళ నీమధురిమమున
పూర్ణముగ ముగ్ధభావము పొందినాడ!

౬

మెలగుచున్నావు నేత్రనిమీలనమున
మెలగుచున్నావు వీక్షణోన్మీలనమున
నిన్ను నిరతమ్ము ధ్యానించుచున్నవాడ:
దేవి, వీనికి వేరొండు దృష్టి లేదు.

ముకుళితమ్లాన మైన నా ముఖసరోజ
వికసనము సేయు తరుణార్కబింబ మీవ ;
నవసిపోయిన నానేత్రకువలయముల
శోషణము బాపు శీతలజ్యోత్స్న వీవ ;

గాఢతాపార్త మైన నాగాత్రమునకు
సాంద్ర పరిమళ చందనచర్చ వీవ ;
అధిభరమున నిస్సార మైనహృదికి
చారు శీతల ఘనసుధాసార మీవ ;

ఇంపు లొల్కఁగ జంగమహేమవల్లి
భంగి కెలగెడి నాబహిఃప్రాణ మీవ;
నన్ను పాలింప కమనీయ నవ్యగాత్ర
లతిక గైకొన్న నాభాగ్యలక్ష్మి వీవ;

అతివిశాల గభీర భవార్ణవంబు
నన్ను దాటింప జాలిననౌక వీవ;
స్థిర పవిత్ర మదీయహృత్పీఠ నిహిత
దివ్య విమలానురాగాధిదేవి వీవ !

౧౦

నిర్మలప్రేమనిష్ఠమై నీపదాబ్జ
పీఠమున నుంచినాను నాస్వీకృతహృదిని.
నీయఖండిత కారుణ్యనిరతి నిపుడు
నాసమస్తము నర్పించినాను దేవి !

స్వచ్ఛ భవదీయ లావణ్యసరసిలోన
మజ్జనం బొనరించె మన్మానసంబు.
చిత్తమందు వానప్రస్థవృత్తు లెల్ల
క్షాళితము లయ్యె, నిర్మలచ్ఛవి జనించె.

సుహిత జీవన నిమ్నగా మధ్యమందు
ప్రబల నైరాశ్యభీషణావర్త వితతి
బడి యడంగుదు నేమొ! సప్రణయదృష్టి
పాణి గ్రహియించి నన్ను కాపాడగదవె!

ఇంతలోకములోన నీవే మదీయ
మార్గదర్శక దేదీప్యమాన తార,
వింత సంసారజలధి నీవే మదీయ
దివ్యసంస్థితి కమృతంపుదీవి దేవి!

౧౧

బౌద్ధులకు నాకు బుద్ధిలో ప్రణయమూర్తి,
ఆరయ నెంతటి తారతమ్యంబు కలదు!
ఉభయులకుగూడ సాదృశ్య మున్న దొకట:
నాకు వారలకును "త్రిరత్నములు" కలవు.

నిర్మలం బయి సంస్తవనీయ మగుచు
ఉత్సుకోత్తిష్ఠ మత్కర్ణయుగ్మమునకు
దివ్యభూషాయమానమై తేజరిల్లు
త్వద్గుణగణంబు ప్రథమరత్నంబు దేవి!

చతురవాణీ లసత్ గ్రంథజాత పఠన
సక్త దృఢమత్యనాదృత సమయ మగుచు
అక్కజము గొల్పు నీదువిద్యాభి నిరతి
తరళరూప ద్వితీయ రత్నంబు దేవి !

ధీర గంభీర శాంత మదీయ హృదయ
చలన మొనరించి మరల సంసారవాంఛ
వధిక మొనరించుచున్న నీయౌవనంపు
నవ్యశోభ తృతీయరత్నంబు దేవి !

౧౨

సుముఖుడ న్నేను సంసారసుఖముపెడల
వీతరాగులు, సంసారవిముఖ మతులు
శూన్యవాదులు బౌద్ధభిక్షుకుల కట్లు
దేవి, ఉన్నవి నాకును "త్రిశరణములు".

నిన్ను వర్ణించి నీయెడ నిరుపమాను
రాగ ముదయింప జేసిన రమ్యమూర్తి
ప్రౌఢకవి చంద్రముండు నా ప్రాణసఖుని
యమృత నిష్యంది వాక్కుల నాశ్రయింతు.

అఖిల శృంగారనిధి జగదాశ్రయుండు
భక్తవాంఛిత నిఖిల సంపత్ ప్రదుండు
నన్ను నిను బ్రోచు రాధికానాథదేవు
నంఘ్రిపంకేరుహమ్ముల నాశ్రయింతు.

అమలలోచనకారక, వంతరంగ
రాజ్యలక్ష్మివి, విమలానురాగనిధివి,
అస్మదీయ విశేషతపోనుభూతి,
వట్టి యుష్మత్కటాక్షమ్ము నాశ్రయింతు.

౧౩

తరుణ మార్తాండరుచిబోలె నరుణ మగుచు
నీరజాతమ్ముపోలిక స్వైర మగుచు
పృథుశిరీష సంవర్తికా పేశల మయి
అలరు నీపాదయుగళి ధ్యేయమ్ము నాకు.

వికసిత సరోజ నిర్ణిద్రవిభ్రమమ్ము,
పూర్ణిమాచంద్రబింబ విస్ఫూర్తిశాలి,
ఇందిరామందిరము, సుధాహేమకలశ
మైన భవదాననంబు ధ్యేయంబు నాకు.

ఫుల్ల నీలోత్పలప్రభాపుంజ మగుచు
అంగ్ల బాదామఫల రూపహారి యగుచు
మంజు లాకర్ణవిశ్రాంతి మహిత మగుచు
అలరు నీనేత్రయుగళి ధ్యేయంబు నాకు.

వాసవమణి ద్యుతిచ్ఛటా భాసురంబు
చిక్కణ తమాల దీధితిస్నిగ్ధ ముగ్ధ
మౌ కళిందసుతా తరంగాభిరామ
మగు భవత్కైశికంబు ధ్యేయంబు నాకు.

## ౧౪

దేవి, నీరమ్యమూర్తి మదీయహృదయ
పుండరీకాసనమున ప్రపూర్ణభక్తి
నిష్టదైవతముగ బ్రతిష్ఠించి యెపుడు
వివిధవిధముల నిన్ను సేవించుచుందు.

అపరిమేయానురాగ తోయమ్ముతోడ
నీకు నిత్యాభిషేకంబు నెరపుచుందు
మధురభావపరంపరా మాల్యములను
నీమనోహరగళమున నిలుపుచుందు.

గాఢరస మంజులకవిత్వగానఫణితి
వీను లలర భవత్కథల్ వినుతి చేతు.
హర్షభరమున నైక్యమే యలరునట్లు
అంతరంగము చేతు సమర్పణంబు.

## ౧౫

శ్రవణములు సోకినంత దుస్సహవిషాద
కర్దమక్షాళనము చేయ గలిగినట్టి
త్వన్మధుర నామధేయామృతమ్మె కాని
ఇతర మేమియు చెవి జేరనీయ నెపుడు.

దివ్య గంగాతరంగిణీ తీర్థమట్లు
భాషితావిల మార్జనపటిమ కల్గి
మధుమధుర మైనతావకకథలె గాని
ఇతరమును జిహ్వవెంట రానీయ నెపుడు.

చిత్తసధ్వాంతరాళ సంస్థితవిచార
గాఢతమసంబు హరియింప గలిగినట్టి
భవ్య భవదీయ రూపదీపమ్ముకన్న
ఇతరమును దృష్టిసరణి రానీయ నెపుడు.

చారునిర్మల చంద్రికాపూరమట్లు
హృదయతాపము చల్లార్చి ముదము గూర్చు
త్వన్నిరంతర మధురభావనలె కాని
ఇతర మేమియు మదికి రానీయ నెపుడు!

ప్రథమోచ్ఛ్వాసము

# విరహవీచి

## ౧౬

ప్రేయసీ, యేల వింటి నీపేరు నేను!
ఆలకించినదాది నామాక్షరముల
నేను వింతయొ కాని మదీయ హృదయ
దుగ్ధవారిధి మథన ముద్భూత మయ్యె.

అధిక మైనకోలందిని మథన మకట
ఉద్భవించెను కాలకూటోగ్ర విషము!
ప్రేయసీ, నిల్పితిని దాని బిగియబట్టి
కంఠకుహరమ్మునందు శంకరునిభాతి.

ఉత్సుకతతో నిరీక్షించుచున్నవాడ
భవ్య లక్ష్మీసమాగమ ప్రాప్తి కొరకు
పూర్ణ నిరతావ్యయ సుధానుభూతికొరకు:
ఎన్నటికి నాకు లభియించు నివి యెరుంగ.

## ౧౭

సందెవేళను ప్రథమదర్శనము మనకు
సంఘటిల్లిన విస్మయక్షణమునందె
చిక్కుకొన్నది మామకచిత్తఖగము
సంకుల భవద్విలోకన జాలకముల.

పట్టువడినది దృఢముగా పక్షియౌఁగళి,
ఎగురఁజాలక అకట, ఈహృదయఖగము
జీవితేశ్వరి, మిగుల కృశించుచున్న
దన్యగతి యేమి గాన కహర్నిశమ్ము.

కరుణ వహించి యీద్విజాగ్రణికి నింక
బంధనవిముక్తి చేయుట పాడి కాదె?
త్వన్మనోహర పాణి సంస్పర్శనమున
పులకితం బయి నిర్వృతి పొందగలుగు.

౧౪

అయ్యయో, యేల చూచితి వట్టు నన్ను-
ఆదినమ్మున మధురసాయాహ్నవేళ
దేహళిని నిల్చి మోహినీదృష్టితోడ-
పథము వెంబడి జనెడి విభ్రాంతహృదయు!

విపుల భవదీయలోచన విగళదసిత
బహుతరకటాక్ష దృఢశరపంజరమున
మన్మనోభీష్టమూర్తి యేమాట లేక
వేగముగ వాలి పడిపోయె వివశగతిని.

జర్జరిత మయ్యె నకట, నాసరళచిత్త,
మిప్పటికిఁగూడ బాధ శమింపలేదు.
చిలుక కొంటివ యేని నీస్నేహపూర
మింక సంజీవనౌషధం బేది నాకు?

## ౧౯

ఈహృదయదాహ మెట్టిదో యెఱుక గలదె
నీకు హృదయేశ్వరీ, నేను నిన్ను నమ్మి
సకలము త్యజించినాను నిస్సంశయముగ
నను కటాక్షింతు వనుచు నేనాటికైన.

ఎవ్వరికి తాను లేకుండ హృదయ మెల్ల
ఆక్రమించితి వొక్కతె వక్కజముగ !
స్మరణకు నతీత మా పూర్వజన్మమందు
విమలబాంధవ్య మేదియో వెలయు మనకు.

నిన్ను గాంచిన దాదిగా నేటివరకు
నిశ్చలమ్ముగ నీమీద నిలిచియుండె
బుద్ధి యనన్యముఖమ్ముగా బోవ లేదు:
దేవతారూపిణివి నాకు కేవలమ్ము!

## ౨౦

అన్నపానీయములు విడనాడి నేను
వివిధ సుఖముల నన్నిటి విడిచి ఘోర
తపము చేయుచునుంటి తాత్పర్యనిష్ఠ
నిన్నె లక్ష్యమ్ముగా మది నిలిపియుంచి.

అవయవమ్ములు ఘనతపోహవ్యవాహ
శిఖలతాకున మిగుల గృశించిపోయె
కరములు కదల్చుకున్న నకాండముగనె
జారిపడు నంగుళీయముల్ సాక్ష్య మిచ్చు.

దేవి, నానిశ్చలత్వమ్ము తెలిసికూడ
ఇప్పటికి నైన సాక్షాత్కరింప వేమి?
జాగు చేసిన నీ కటాక్షమ్ము వలన
ప్రాణములు పోవు పిమ్మట ఫలము కలదె?

౨౧

పక్షములు రెండు సర్వప్రపంచమునకు
కృష్ణపక్ష మొకటె నాకు కేవలమ్ము!
నీవె నిస్సంశయమ్ముగా జీవితేశ్వ
రీ, నిదానంబ వీవై పరీత్యమునకు.

ఎల్లకాల మమావాస్యయే మదీయ
హృదయమున: ఎన్నడేని నీవదనచంద్ర
కాంతి తోచునయేని ఆక్షణమునందు
మాత్రము చతుర్దశీరాత్రి మాడ్కి నుండు.

స్వచ్ఛ భవదీయ ముఖశరచ్చంద్రరోచి
ప్రణయినీ, చెప్పు మింక నెప్పటికి తోచు?
అంధకారము విరిసి నిరంతరముగ
పూర్ణిమా పూర్ణయామిని పొలుచు టెపుడు?

## ౨౨

గోచరించుచునుండును కొంతవరకు
మీయజిరభూరుహాగ్రముల్ మేడకొనయు
ఇపుడు నేను వసించెడి యీవిశాల
సమధికోత్తుంగ మంజుల సౌధమువరకు.

ద్వితలపర్యంకవర్తినై దేవి, విపుల
జాలమార్గమువెంట మీసౌధదిశను
గాంచుచుందును నే సముత్కంఠతోడ
సతత విస్ఫారితాగ్రలోచనుడ నగుచు.

నిర్నిమేషము లౌ కనీనికలతోడ
వెర్రినై పోయి సౌధము వృక్షశిఖలు
సుందరపథంబు మలకలు చూచుచుందు
వింతసంతస మావిర్భవించుచుండ.

## ౨౩

ప్రియతమా, భవదానన బింబదర్శ
నాభిలాషను మీమేడ కరుగుదెంచి
కనుగొనక నిన్ను మందభాగ్యమ్మువలన
మరలి ప్రాపించినాను మన్మందిరమ్ము.

మన్మనోహారిణీముఖ మంజులరుచికి
నోచుకొన్నవి కావు నాలోచనమ్ము
లనెడి సంతాపమున నుబ్బు నశ్రుబిందు
జాల మణచితి నెటులో కష్టముతోడ.

సౌధపార్శ్వమునందలి చలువరాతి
తిన్నెపై వాల్చితిని ప్రియా, దేహ మపుడు.
పండువెన్నెల యొడలిపై బర్వుచుండ
గొంతతడవున కొదవె నొక్కింత శాంతి.

ప్రియతమా, తావకీనాస్యబింబ చింత
నమునం దుంటి శర్వరీనాధకిరణ
ధౌత శీత వితర్దికా తలమునందు-
అవిదితమ్ముగ నిదుర నన్నావహించె.

## ౨౪

చంద్రికలు గాయు శర్వరీసమయమందు
సమధికోత్తుంగ నిర్జనసౌధ విపుల
జాలమార్గాంతికంబున శయ్యమీద
పవ్వళించితి స్వాపసంభావనమున.

కౌముదీస్పర్శచే గవాక్షమ్ము క్రింద
విరియ బూచిన 'రేరాణి' పరిమళంబు
సారెసారెకు పవనసంచాలనమున
నిఖిలదిక్కుల నిబిడమై నిండజొచ్చె.

సొబగు 'శేరాణి' వాసనా స్ఫూర్తి వలన
స్ఫురణకుం దాకె నా రాణి సోయగమ్ము.
ప్రేయసీ, మానసము విజృంభించు కతన
నీతలంపులతో రేయి నిదుర లేదు.

ఈ విధంబుగ గడచిన వెన్నొ నిశలు :
కలువ కనుదోయి నిరత జాగరముచేత
ఫుల్ల కోకనద చ్ఛవుల్ పూనె నకట !
నీకు దయ లేదు నామీద నేటికైన !

## ౨౫

మన్నివాస సౌధోపరి మండలమున
ఒప్పులొలుకు ప్రఘాణ నిర్వ్యూహవితతిఁ
బూలమొక్కలు వరుసగా వ్రేలుచుండు
నేత్రపర్వము గాగ మృత్పాత్రలందు.

నిన్ను దలచుచు బిళ్ళగన్నేరు పూల
తొట్లలో బోయుచుందును తోయములను
ఉభయ సంధ్యల విస్మృతి నొందకుండ
ప్రియతమా, అహరహమును ప్రీతితోడ.

ప్రసవపుంజమ్ము నొసగును ప్రతిదినమ్ము
పూలమొక్క లహర్ముఖవేళ నాకు.
వింతరంగుల నీను నావిరులతోడ
కూర్చి నీనామవర్ణముల్ గూర్చుచుందు.

## ౨౬

లక్ష్మి, నీనామ మెంతయు లలిత మహాహా !
ఎన్నిసారులు నేను జపించినానో
ఎన్నిపర్యాయములు లిఖియించినానో
తనివి తీరుట లేదు సుంతయును నాకు.

ఇతరులు మదంతికమున భాషించుపట్టు
లందు వినవచ్చుచో లక్ష్మి యనెడిపలుకు
సంభ్రమంబున నామేను ఝల్లు రనును
భూరితమముగ నొడ లెల్ల పులకరించు.

పఠన కాలమునన్ గ్రంథభాగమందు
రచనలో లక్ష్మి యనునక్షరద్వయంబు
కానవచ్చినయంత నాకన్నుదోయి
హర్షవశమున నగును బాష్పాకులంబు.

ఎన్ని లక్షలసారు లే నింతకు మును
పల్కితిని వింటి లక్ష్మి యన్ పలుకు లక్ష్మి!
ప్రకృత మధురిమ పొడమ దీపదమునందు
నిన్ను ప్రియతమ, చూడకమున్న నాకు.

## ౨౭

సంచలన శీల మైన నాస్వాంత మెట్లు
నిల్పుకొన్నావు నీపయి నిశ్చలముగ!

ఎట్లు హృదయేశ్వరీ, నీ కహీన గరిమ
గలిగె నింత మహావశీకరణశక్తి!

అన్యవశవర్తి కాక యిచ్ఛానుసార
గతిని జరియించు నీమతంగజము నవుర!
కట్టివేసితివే గుణగణముతోడ:
ఇట్టి యాధోరణత నీవు నెట్లు కలిగె!

విస్మయోద్దీపకము భవద్విజయ మహిమ-
దేవి, నా కించుకేనియు తెలియరాదాయె,
ఇంత సులువుగ ఈమతిమంతు డధిక
గర్వ యెట్టులు నీపదాక్రాంతు డయ్యె!

౨౮

నా హృదయవనమందు ననారతమ్ము
దారుణమ్ముగ చెలరేగు దావవహ్ని
శాంతి గనదాయె వైరాగ్య సలిలధార
లెంత వర్షింప— ఇంక నే నేమి చేతు!

మరచి పోవుద మన్నను మరపు రాదు
అయ్యరయో, జీవితేశ్వరీ, అనవరతము
నీ మహామోహినీమూర్తి నేత్రయుగళి
యెదుట వర్తించుచుండు— నే నేమి చేతు!

అనిశ భవదీయ భావనాయాస భార
వివశ మయ్యెను లక్ష్మి, ఈవిరహిబుద్ధి.

దుర్లభజనానురాగ దోదూయమాన
హృదయమున కేమి గతి– ఇంక నేమి చేతు!

## ౨౮

ఈ తనువుపై విరక్తి జనించె నాకు!
విడిచి తూలికా తల్పమ్ము విసువుతోడ
పవ్వళించితి ప్రియతమా, బహుదినములు
కఠిన పాషాణఫలక భాగమ్ముమీద.

లోచనరసాయనమ్ములు లోకమోహి
నీ మనోహరచంద్రికా నిశలయందు,
ప్రమదలుంటాక కాలరూపమ్ము లైన
అంధకార భయంకర యామినులను–

శ్రమము హరియించి హృదయప్రశాంతి గూర్చు
చల్లనిసమీరణము వీచుసమయములను,
ప్రబలరవమున శర్కరా పటలితోడ
చండిమమున రేగెడి ప్రభంజనములందు–

వేళ లన్నిట నే సమవృత్తితోడ
పవ్వళించితి పాషాణఫలకముపయి.
కాల మేగతి గడచెనో గాని యిపుడు
స్వప్నము విధాన దోచు సంస్మరణమునను.

బుద్ధియందుండి లోపించి పోయె నాకు
పూర్ణముగ హృదయేశ్వరీ, భోగవాంఛ.

కష్టము సుఖమ్ము ననువిభాగమ్ము లేక
నిర్గుణమ్ముగ నద్వైతనిష్ఠ నుంటి.

## 30

మబ్బుతెర యావరింపగ మానసమ్ము,
నేమి చేయుటకును నాకు నిచ్చ లేదు.
సర్వమును దోచుచున్నది స్వప్నమట్లు
నెలలు గడచుచు నున్నవి నిష్క్రియముగ.

వాసరమ్ముల కొలది నుల్లాసగరిమ
పూర్వము మదంతికమ్మున ప్రోగు పుచ్చి
మిగుల నన్ను ప్రేమించెడి మిత్రు లిపుడు
కాంతి ముఖభంగి శీఘ్రము కదలుచుంద్రు.

రమ్యరూపముతో మనోరంజనమ్ము
సలిపెడి విలాసవస్తువుల్ చక్షువులను
నేడు వేధించుచున్నవి నిశితశూల
ఫలక సంకాశ భయదరూపములు దాల్చి.

ఏది కనుగొన్న నాకిపు డేవగించె:
నేత్రయుగ్మము మూసి యానిర్జనాల
యమ్మున విలోల హృదయభారమ్ముతోడ
పవ్వళింతును పర్యంకభాగముపయి.

అఖిలవస్తువులం దసహ్యమ్ము పుట్టె,
జగము నాదృష్టి కిపుడు నిస్సార మయ్యె.

వేమరు జనించుచుండును విసువు నాకు
నాపయినిగూఢ హృదయసంతాపమునను.

## ౩౧

నీ హృదయ మెట్టిదో ప్రియా, నిశ్చయముగ
ఇంతవరకును దెలియ రా, దేమి చేతు!
నీవు హృదయాపహారిణీ, నిశ్చల వయి
విడువకున్నావు నైజగాంభీర్యముద్ర.
అమలినం బగు నా ప్రణయాబ్ధియట్టు
లతిగభీరమె తావకీనానురాగ?
మత్సదీయానురాగ హేమాద్రివోలె
ఒప్పునే నీకు ప్రేమ మహోన్నతముగ?
ఎంత కాలము నే నిరీక్షించుచున్న
పంపవైతివి ప్రియతమా, ప్రణయవార్త!
నీకు నాపయి లేదేమొ నిబిడరక్తి-
అకట, సంశయ మిపుడు నన్నావరించె.

## ౩౨

సౌధమున హంసతూలికా శయనము పయి
విశ్రమించు తలంపున వెన్న వాల్ప
తోచె హృదయేశ్వరీ, మహాదుస్సహముగ
వర్తమానాతిదుర్బలావస్థ నాకు.

ఈ విభావరి నా కది యేమొ కాని
తోచుచున్నది మాటికి దుర్భరముగ
ప్రియతమా, నీవు నాకు లభించు మాట
దుర్లభ పురోమరీచికా తుల్య మగుచు.

విరహసంతాపము ఘనీభవించి యుండె
అణచుకొన్నను నిలువక అపుడు పొంగి
జాలుగా ప్రవహించు బాష్పములవలన
తడిసె హృదయేశ్వరీ, ఉపధాన మెల్ల.

మాటి మాటికి బొడమెను మరణవాంఛ!
ఊరికి కృష్ణానదీ గభీరోదకముల
తనువు త్యజియించి నీపద ధ్యానమునను
అపనయింపగ నెంచితి నాధిబాధ!

## ద్వితీయాశ్వాసము

# ఆశా జ్యోతి

## 33

తావకోజ్జీవక వినూత్న దర్శనోత్స
వోత్సుక మదీయలోచన యుగళి దేవి,
భాగ్యముం గాంచె ప్రతికూల భాగధేయ
దుర్విపాకము నేటితో తొలగిపోవ!

మీ సమున్న తాట్టాలికమీద నిలిచి
నీ విలోకన సౌభాగ్య నిష్ఠతోడ
నిమ్నభాగాంగణమ్మున నిర్నిమేష
లోచనయుగమ్ము సారించి చూచుచుంటి.

అరుగుదెంచితి వపుడు నీ వజిరమునకు
కంధరము వాల్చి కేకినీ గమనమునను.
నీవు తోచిన యాదిమ నిమిషమందు
సమ్మదమ్మున గుండియ ఝల్లుమనియె.

కపిశ వర్ణ మనోజ్ఞాంశుకమ్ము దాల్చి
దేవి, నీ వంగణమ్మున బోవుచుండ
శాద్వలస్థలి నల్లన సంచరించు
సాధుమృగకాంత నాస్మృతి సరణి దోచె.

సంస్కరింపక కేశపాశమ్ము నీవు
జారుముడి వేసికొంటి వశ్రద్ధతోడ,
శాణ కోణాగ్ర దృఢనికషమ్ము గనని
యింద్రనీల మణిద్యుతి యింపు నింప.

పుణ్యము సమాచరించుట భూలతాంగి
తావక విలోకన ప్రభాధన్య యయ్యె;
గగన మండల మట్టాలకమ్ము నేను
సలుప మైతిమి పుణ్యలేశమ్ము గూడ!

క్రొమ్ముడిం గాంచి కమ్రచేలమ్ము గాంచి
శబలితశ్రోణి రమ్యదేశమ్ము గాంచి
స్థల కుశేశయ రుచిర పాదములు గాంచి
దేహభంగిమ గాంచి నే తృప్తి గంటి.

## ౩౮

బహుళ నిర్వేద పట పరంపర మదీయ
చిత్తకుహరమ్ము నావరించిన విధాన
గగన రంగస్థలమ్ము నాకస్మికముగ
ప్రబల నీరంధ్ర జలధర పటల మలమె.

సూచికాభేద్యమై తమస్స్తోమ మపుడు
క్రమ్ముకొనియెను దిగ్దిగంతమ్ములందు.
మార్గమును వీడి పోవక మందగతిని
పదము లిడుచుంటి నభ్యాసబలముచేత.

అల్లనల్లన నేను మీ హర్మ్యసవిధ
భాగముం జేరగా ప్రభాపటలి తోచె
ముక్త నిమ్న వాతాయన ముఖమునందు
యామినీ కామినీ మందహాసమట్లు.

దేవి, తావక మధుర దేదీప్యమాన
కాంత ముగ్ధ విలోకన క్షణమునందె
విరిసిపోయెను హృదయ నిర్వేదభరము
తరణి కిరణ ప్రభాస్పృష్టతమము వోలె.

గగనతల మావరించిన కాలమేఘ
పటలము తటాలునం బటాపంచ లయ్యె,
మినుకు మినుకని చుక్కలు మెరయ జొచ్చె,
దిక్కు లన్నియు నొక్కట తెలివి నొందె.

## ౩౫

పరిగణింపక మధ్యాహ్న భానుతాప
మాతపత్రము చేతితో నడ్డుపట్టి
త్వన్మనోహర వదనసందర్శనేచ్ఛ
బయలు వెడలితి మీసౌధ పథము వెంట.

అస్మదీయ విశేషభాగ్యమ్ము వలన
వివృతమై యుండె ద్వార మావేళ యందు.
బంధుపరివృత వగుచు సంభాషణమున
ప్రియతమా, కూరుచుంటివి పీఠముపయి.

స్మితగండస్థల ప్రతిబింబితాచ్ఛ
దివ్యతాటంకయుగళి సందీప్తవదన
మండలమ్ము వెలింగెను మదనదేవు
రమ్యచైత్ర చతుశ్చక్ర రథమువోలె.

సహజ నిబిడానురాగార్ద్ర శాంత రుచిర
నేత్రయుగ్మము నామీద నిలిపినావు,
విపులహర్షమునన్ మేను విస్తరించి
కాముదనిబోలె నెండలో కదలిపోతి.

## ౩౬

శాంతగతి నేను మీ మొగసాల చేర
అధివసించి మనోజ్ఞ పటాసనమ్ము
చదువుచుంటివి "శ్రీరామ చరిత మాన
సమ్ము" ప్రియతమ, కాకలీస్వరముతోడ.
స్తంభపార్శ్వస్థ సుమలతా జాలమునకు
చాటున నిల్చి, నీవికస్వరముఖమ్ము
కనుల పండువుగా గాంచి కదలిపోతి
కర్ణముల మ్రోగుచుండ నీ కలరవమ్ము.
ఎంతో సుకృతము చేసిన ట్లెంతు "భాష"
అట్లు కాదేని దానికి నబ్బె నెట్లు
నా మనోహారిణీ రసనాసుధాక్త
తీవ్ర పరిపూర్ణ మధురిమోద్దీపనంబు!

## ౩౨

ప్రణయినీ, జ్యేష్ఠమాస ప్రభాతరమ్య
సమయమున నేను మీ ప్రకోష్ఠమ్ము జేరి
గురుజన సమాదరమ్మున గూరుచుంటి
సీతె, భవదీయ దర్శనాపేక్షతోడ.

అవల మేము భాషించెడి యవసరమున
మామకీన స్వరాకృష్యమాణ వగుచు
వల్లు గమనమ్ముతో జేర వచ్చినావు
జీవితేశ్వరి, నన్ను వీక్షించుకోర్కె.

సన్నిహిత మా కవాటపార్శ్వమున నీవు
నిలిచి నాపయి చూపులు నిలిపి యుండు
నపుడు నాహృదయ స్పందన మధిక మయ్యె
నేత్రయుగ్మము సమ్మదోన్నిద్ర మయ్యె.

అంతటి సమీపమునకు నీ వరుగుదెంచి
ప్రియతమా, నిల్చుచో మహాప్రేమ మొల్కు
దృక్కుల, మదీయహృదయ ముద్రిక్త మయ్యె,
కాంక్ష పొడమె తటాలున కౌగిలింప!

శీత పవనము నీ ముఖ సీమ సోకి
అలకలు స్పృశించి అవల చేలాంచలంబు
మృదుగతి గదల్చి తుదకు నామేని నంట
పరవశుడ నైతి సమ్మదప్రాభవమున.

అవల నల్లన వాతాయనాంతికమ్ము
జేరి హృదయేశ్వరీ, సమాసీన వగుచు
నిర్భరప్రీతి నుత్ఫుల్ల నేత్రములను
గాఢముగ మన్ముఖప్రభల్ గ్రోలినావు.

నీవు నామీది నవనవోన్మేష రక్తిఁ
జెప్పకయె చెప్పుచుండె నోస్నిగ్ధహృదయ,
ఆననమ్మున విద్యోతమాన దీప్తి
తరళ నయనోచ్చల త్సముత్కంఠ దృష్టి.

గురుజనాంతికమందు గైకొని యనుజ్ఞ
వెడలి పోవుచు నే పరావృత్తిఁ గొంది
నప్పు డుపలబ్ధమైన రాగార్ద్ర దృష్టి
మన్మనోహారిణీ, యెట్లు మరవు వచ్చు!

## ౩౮

అవురా, నాకంటె నెంతటి యధిక విశద
పుణ్య మొనరించె మీయింటి పొగడ చెట్టు!
వివిధ విధముల నిన్ను సేవించుచుండు
యుక్తమైన ఫలమ్ముల నొందుచుండు.

ఆయత గవాక్ష పార్శ్వ వేత్రాసనమ్ము
నధివసించి వనప్రియా మధుర ఫణితి
కావ్యముల్ నీవు పఠియించు కాలమందు
చల్లదన మిచ్చు వకుళవృక్షమ్ము నీకు.

క్లాంతి గని నీవు మధ్యాహ్న కాలమందు
మృదుల పర్యంక తలమున మేను చేర్పఁ
జలుపు శీతల మారుత చాలనంబు
తాళవృంతాయమానమై తరువు నీకు.

చల్లబడినంత సాయాహ్న సమయమందు
మాఘునివిలసనమున నీవు మండనమ్ము
చేసికొనుచుండునప్పుడు విచిత్ర పత్ర
విభ్రమము గొల్పుచుండు పృథ్వీరుహమ్ము.

జాలమార్గమునందు నిషణ్ణ వైన
నీకు రజనిని వకుళావనీజ మధిక
సౌరభవ్యాప్తి గొల్పు విహార లీల
మాఘుని భావోపవన రమ్య మార్గములను.

నీవు తల్పశయానవై నిదుర వోవఁ
గన్నుగవ మూయ వకుళవృక్షమ్ము నీకు
మంద పవన చలత్పర్ణ మర్మరాను
గాన ఘోరణి స్వాపము గలుగఁ జేయు.

నీవు కరుణాతరంగిత నేత్రయుగళి
వెదకఁ సారించు వేళల వృక్షరాజి
సమ్మోదిత సంచలనమ్ము గ్రమ్ము
కంపమాన పత్రావళీ కైతవమున.

కుసుమములు సంగ్రహించెడి కోర్కె నీదు
మృదుకర స్పర్శనమ్మున ముదిత మైన
వేపథువు మాటుకొనుచుండు వృక్షరాజి
భూరి సంభ్రమ పతయాళు పుష్పమిషను.

అప్సర, నాకంటె నెంతటి యధిక విశద
పుణ్య మొనరించె మీయింటి పొగడచెట్టు!
వివిధ విధముల నిన్ను సేవించుచుండు
యోగ్య మైన ఫలమ్ముల నొందుచుండు!

## ౩౮

అస్మదీయ ప్రియా మృదు హస్త లిఖిత
దివ్య నాగర వర్ణ మౌక్తికములార!
అపగతం బయ్యె నేత్ర జాడ్యమ్ము మిమ్ము
గాంచ గల్గుటచే చిర కాలమునకు!

భవ్య గీర్వాణ వాణీ రూప ప్రతిష్ఠ
బొందె నత్యంత మాన్యత పూర్ణమంచె,
ప్రణయినీ కరలేఖన ప్రాభవమున
మాన్యతరము నాగర వర్ణమాల నేడు.

తోచుచున్నవి నూతన ద్యుతి మదీయ
నామధేయాక్షరమ్ము లీనాడు నాకు,
రమ్య మూర్తులతో ద్వినారము తదీయ
హస్త పల్లవ విలిఖితం బగుటవలన.

ఆమె రూపము గాంచు భాగ్యము లేక
నిజవికాసము తరుగు నా నేత్రములకు
నూతనోల్లాస మిప్పు డనూన భంగి
సంఘటించితి రహహా, అక్షరములార!

జీవితేశ్వరి, హృదయా విజృంభమాణ
విమల రాగము నీరీతి వెల్లడించి
సంచలించెడి మామకాశా ప్రదీప
శిఖను పోషించితివి నేడు స్నేహవృష్టి.

## ౪౦

పుణ్య మొనరించినావు మత్పుస్తకంబ!
ఎంత సుకృతమ్ము చేయని దెటు లభించె
నాకు దుర్లభ మయ్యును నీకు నామె
పాణి పల్లవ మంజుల స్పర్శనమ్ము!

ఎంత సుకృతమ్ము చేయని దెటు లభించె
కమ్ర తత్కర నీరజ గ్రథిత మైన
లలిత నాగర సుకోమల స్రజంబు!
భూరి సుకృతివి నీవు మత్పుస్తకంబ!

ఎంత సుకృతమ్ము చేయని దెట్లు నీకు
పఠన కాలమునందు సంప్రాప్త మయ్యె
అశ్రుపోయుగ విశ్రాంత హారి లోల
నయన విగళత్సితాసిత నలినపంక్తి!

అనిలవశమున తన్మధురాధరమ్ము
గండపాళి యుత్తుంగ వక్షః స్థలమ్ము
స్పర్శనము చేసియుందువు చాలసార్లు:
నీవు నాకంటె సుకృతివి నిశ్చయముగ!

## ౪౧

నేను మీప్రాంగణమ్మున నిలిచియుండ
కామినీజన మంజుల కంఠ జనిత
దివ్యసంగీతరవ మరుదెంచి నాకు
విస్మయము గొల్పి వీనుల విందు చేసె.

జీవితేశ్వరి, గానము చేయుచుండు
వనెడి యాశ తటాలున నంకురింప
మోదమున కక్ష్య కే నభిముఖుడ నగుచు
కాంచితిని నిన్ను కన్నులకరవు తీర !

లలితకర్ణాట పట్టు చేలమ్ము దాల్చి
అపుడు ప్రియాతమ, అగ్రాసయాన వగుచు
వెలయుచుంటివి పర్యంకతలముమీద
రమ్యపీఠముపై మహారాజ్ఞివోలె.

లేచితివి నన్ను గాంచి సలీలముగను :
పల్కరింపగ నిన్ను నే ప్రశ్నమిడను
కీరగళమాన బదులు పల్కితివి నాకు
లజ్జ నర్తింప నీ కపోలములమీద.

నేడు సుదినమ్ము ప్రియాతమా, నీ మనోజ్ఞ
కంఠరవ మాలకించు భాగ్యమ్ము కలిగె.
ప్రథమవారము నీతోడ భాషణమ్ము
సలుపజాలు నదృష్టమ్ము సంఘటిల్లె !

సారెసారెకు మ్రోగు నా శ్రవణయుగళి
గళదమృత తుల్య మా భవత్కంఠరవము.
మృదులగాన తరంగిత హృదయసీమ
పొలుచుచున్నది గంధర్వభూమి వోలె !

## ౪౨

దేవి, నే నొకనాడు జ్యోతిష్కు జేరి
జన్మపత్రిక యాతనిహస్తమున నుంచి
"శాస్త్రదృష్టిని స్వామి, ఈ జాతకునకు
జీవితేశ్వరి యెట్టిదో చెప్పు" డంటి.

కంప మొందగ హృదయ ముత్కంఠ, నాత
డేమి పల్కునో యని నిరీక్షించుచుంటి.
ఆననమ్మున దరహాస మంకురింప
ఆదరమ్మున దైవజ్ఞు డనియె నిట్లు :

"ఆర్య, మీ ప్రియురాలు మహాకులీన,
పరమ కోమల హృదయ, లావణ్యమూర్తి,
అధిక గుణవంతురాలు, విద్యాభినిరత:
ఒప్పు ననుకూల దాంపత్య ముభయులకును.
"సత్యము వచింతు నేమియు దాపకుండ:
మీరు భార్యావిధేయులై మెలగుచుంద్రు"
అనగ మోమున చిరునగ వంకురింప
చేసినాను నమస్సులు భూసురునకు.

## ౪౩

ప్రియతమా, నేడు మిక్కిలి ప్రీతితోడ
పుష్పమాలిక బందరుపురములోని
స్నిగ్ధు లుంచిరి మత్కంఠసీమయందు,
వచ్చుటం జేసి మజ్జన్మవాసరమ్ము.

కంబుమంజులవరా భవత్కంఠమందు
ప్రియతమా, పుష్పదామ మర్పింప నిమ్ము.
గాఢనీల మనోహర కైశికమున
ప్రసవములు చూర్ప నిమ్ము నీ ప్రణయిజనుని.

పరమ కల్యాణ రమ్య రూపమ్ము దాల్చి
జీవితేశ్వరి, నీవు హృత్సీమ మెలఁగ,
వేడ్కతో మిత్రులం గూడి వివిధగతుల
వాసరము బుచ్చితిని మహోల్లాసమునను.

ఉత్సవము చేయుదును ప్రియా, యుష్మదీయ
జన్మవాసరవేళ నుత్సాహగరిమ.
ఎపుడు ఘటియిల్ల జేసెదో యీ సుఖమ్ము
సతత భవదీయ సేవనాసక్త మతికి!

## ౪౪

ప్రబల భవితవ్యతా ప్రభావమ్మువలన
స్థూలదేహము మిక్కిలి దూర మయ్యె

అనిశము మదీయ నూత్నదేహమ్ము నిన్ను
ననుసరించును ప్రియతమా, ఆదరమున.

క్రాంతి నీ కించుకేనియు గలుగ నీక
చామరము వేయుచుందు నిశ్శబ్దముగను.
గమనమున తొట్రుపాటు సంఘటిల నీక
నిన్ననుసరించి చరియింతు నేను గూడ.

మజ్జనానంతరము నీవు మండనమ్ము
చేసికొనుచుండు వేళ నేను సుస్నేహనయన
జలజముల గాంచుచుందు పార్శ్వమున నిలిచి
విమల భవదీయ కమనీయ విగ్రహంబు.

కావ్యమును చేత బట్టి యేకాంతమందు
శ్రావ్యముగ నీవు మెల్లన చదువుచుండు
సమయమున విందు కర్ణరసాయనముగ
ప్రణయినీ, నిల్చి నీ వామభాగమందు.

నీవు హృదయేశ్వరీ, గాఢనిద్ర వోవు
కాలమున నేను పర్యంకికా సమీప
సంస్థితుడనై నివారింతు సకలభూత
వార మంగుళి, నీదరి జేరకుండ.

స్వప్నకాలమునందు హర్షమున నీవు
నాథ యనియెడి సంబోధనమ్ము చేయ
గాఢరక్తి ముఖావలోకన మొనర్చి
కాంత, ఆనందగరిమ దీవింతు నిన్ను!

## ౪౫

మలయపవనాంకురావళుల్ మలయుచుండు
సంజవేళను మీమొగసాల కేను
వచ్చినది నిన్ను దర్శించు వాంఛతోడ,
కూరుచున్నది పెద్దల కోర్కెమీద!
ఇంతలో హృదయేశ్వరీ, శాంతగతిని
వచ్చితివి నీవు ద్వారపార్శ్వమ్ము జేర.
ఆ క్షణమ్మె నికామ నిరంకుశుండు
కామదేవుడు దృక్కులు కలిపినాడు.

అన్యులకు గానరాకుండునట్లు, నాకు
నభిముఖమ్ముగ నున్న వాతాయనమును
దరిసి రెక్కల నోరగా దెరచి నన్ను
చూచితివి ప్రేయసీ, మహోత్సుకతతోడ.

నన్ను గొనిపొమ్ము మన్ననో నాథ యన్న
విధమునం దోచె నపుడు నీ వీక్షణములు.
మదనదేవుడు నిరుపమ మధ్యవర్తి
నిన్ను నర్ధాంగిగా నాకు నిర్ణయించె.
విదితమేని తిరోధాన విద్య నాకు
అచటి నీబంధుజనమున కవిదితముగ
సత్వరమ్ముగ నిశ్శబ్దసరణి నిన్ను
భుజబలంబున నపుడె కొంపోయియుందు.

గడియల కొలంది నా గవాక్షమ్ము దరిని
నిల్చి ప్రేమార్ద్రదృక్కుల నీవు లక్ష్మి,
నను విలోకించుచో మహానందవృత్తి
నేమి భాషించి యుంటినో యెరుక లేదు !

## ౪౬

తీర్థయాత్రాభిలాషినై దేవి, నేను
పోవనెంచితి ఈ యాంధ్రభూమి విడిచి.
పోయనమ్ముల కొలది దేశాటనమ్ము
సలుపగా నాకు సమధికోత్సాహ ముండె.

నిన్ను గాంచిన యాదిమనిమిషమందె
ఎగిరిపోయిన నాయూహ లెచటి వచట.
నాటినుండియు దేవి, మీ నగరు నాకు
తథ్యము వచింతు — వైకుంఠ ధామ మయ్యె !

## ౪౭

ఏ శుభముహూర్తమున మన యీక్షణములు
విమలరాగమ్ముతో మేళవించె తొలుత
అపుడె నాహృదయేశ్వరివై తదాది
ఏలుచున్నావు నీవు, నా హృదయసీమ.

హృదయమున్ జొచ్చి కాంచెదవేని దేవి,
అమల తావక మూర్తి ప్రత్యక్ష మగును.
రమ్య భవదీయ నామాక్షరములు విమల
రోచి రుట్టంకితమ్ములై గోచరించు.

నిర్భరానంద బుద్ధినై నిరుపమాన
తావకీన స్తవమ్ము పద్యముల గూర్చ
ప్రియతమా, వాఙ్మయమున నీపేరు నిల్చు
శాశ్వతమ్ముగ నాహృదయేశ్వరి వని.

## ౪౭

అమరు నాయెడ నీకు గాఢానురాగ
మను మహోత్కర్షజనక వృత్తాంత కలన
వరలు చున్నాడ నుత్ఫుల్లవదనుడ నయి,
శాంతి నెలకొన్నయది ప్రియా, స్వాంతమందు.

నీవు హృదయేశ్వరీ, నన్ను నెమ్మనమున
నిరుపమ ప్రేమతోడ ధ్యానించుచుందు
వనుపద మ్మని యవగత మగుచునుండు
నాకు నీముఖపద్మ విలోకనమున.

కర్మ పరిపక్వమై శుభక్షణమునందు
దైవకృప నుపలబ్ధమా తావకీన
పాణి యనియెడి నిశ్చల ప్రత్యయమ్మె
లక్ష్మి, నాకిక జీవితాలంబనమ్ము.

నిర్భరప్రేమ వివశవై నీ వధైర్య
తిమిరమూం దోలి సాహసోద్దీప్తితోడ
పూర్ణవిశ్వాసమున మనఃపూర్వకముగ
లీల మధురః స్థలమ్ముపై వాలువరకు –
కల్పము లతీతమ్మై పోవుగాక దేవి,
వేచియుండు వికస్వరలోచనముల
ఏకనియతిని లోక మీక్షించుచున్న
శ్రీమదవలోకితేశ్వర స్వామి పోలె !

## తృతీయోచ్ఛ్వాసము

# వైతాళికము

## ౪౬

మేలుకొను మో జీవితేశ్వరి !
జాల మేటికి, చూడు మియ్యదె
జాల మార్గము క్రింద నిల్చితి పూల చాలులలో.

యోజనమ్ముల దూర మేను మ
హా జవమ్మున దాటి చేరితి
నోజ నిట భవదీయ వదనాంభోజ మీక్షింపన్.

చాల కాలము గడచినది ప్రియ
రాల, కన్నులపండువుగ నీ
వాలుగన్నుల తరళ కాంతులు వాలి నామీదన్.

మించు ననురాగమ్ముతో నే
తెంచితిని హృదయేశ్వరీ, నే
త్రాంచలమ్ముల ప్రణయిజను వీక్షించు మనురక్తిన్.

ఇంత కాలము ప్రణయినీ, నీ
యంతికమునకు నేను రామికి
నెంతగా చింతించుచుంటివో అంతరంగమునన్ !

నిక్కముగ ప్రాణేశ్వరీ, నే
నొక్కనిముసం బైన నీస్మృతి
దక్కియుండగ లేదుసుమి యేదిక్కునం దిరుగన్.

ఉల్లసత్త్వదీయ రూపం
బుల్లమున నెలకొల్పి దృఢముగ
ఎల్లవేళల దలతు నిన్నుత్ఫుల్లనేత్రుడనై.

ప్రేయసీ, యున్మత్తమగు నా
తాయనాధ్యము వెంట నను భవ
దాయతాత్ముల గనుము నా కాప్యాయనము కలుగన్.

కాంత, యీదూర ప్రయాణ
క్లాంతి వోవగ స్నేహపూర్ణా
త్యంత శీతల వీక్షణంబుల నుంత కనుగొనవే !

౧౦

అంతరిక్షమునుండి రజనీ
కాంతు డఖిలముఖస్థుల నిన్నిజ
కాంతులన్ వెదజల్లు, నా ప్రియకాంత, కనుగొనవే !

ఈ మనోహరవేళ ప్రియతమ,
కౌముదీ ధవళీకృతము లౌ
భూమిజంబుల నొప్పు నుపవనసీమఁ గన్గొనవే.

అలకజాలాచ్ఛాదితంబై
తిలక రేఖోదంచితంబై
అలరు మామక వదన మండల విలసనము కనవే !

ప్రేలునాయత మల్లికా సుమ
మాలికోజ్జ్వల మద్గళమ్మున
లోల భవదీయేక్షణమ్ముల వ్రాల నీయగదే.

భూరి చిత్రాంచల సముజ్జ్వల
గౌర కౌశేయావృత శరీ
రోరు కాంతుల ప్రణయినీ, యిటు లేర చూడగదే.

లలన యని భ్రమ చెంది రస్మ
ల్లలితభంగిమ గాంచి పథమున
పలువు రో హృదయేశ్వరీ, ఈ చెలువముం గనవే!

అనవరత భవదీయ దృఢ భా
వనమునం బరివర్తితంబై
తనరు నీ ముఖమ్ములు నా యాననము గన్గొనవే.

లలిత వేషవిలోకనమ్మున
వలపు కలిగెను నాకె నాపై:
దళితమంజుల నీల నయనోత్పలములం గనవే.

ముదిత హృదయముతోడ నీ కా
ముదిని మధురారామ సంస్థితు
హృదయరాజ్ఞీ, గాఢరాగాస్పదుని గన్గొనవే!

## ౫౧

గణన సేయకుమీ ప్రధానము
గా మదాకృతి ప్రాణకాంతా,
ఎంచి నా గాఢానురాగము హృదయ మీయగదే.

ప్రియతమా, గణియింపబోకుము
వెలుగా నామధురవాక్కులు :
ఎంచి నా గాఢానురాగము హృదయ మీయగదే.

పరిగణింపకు మెంతమాత్రము
ప్రణయినీ, అస్మత్ప్రశస్తిని :
ఎంచి నా గాఢానురాగము హృదయ మీయగదే.

గణన సేయగ వలదు మద్గుణ
గణము మెంచుగ జీవితేశ్వరి !
ఎంచి నా గాఢానురాగము హృదయ మీయగదే !

అవ్యయంబును భవ్య మగు ప్రా
ణాధికా, ప్రణయ ప్రభావము :
ఎంచి నా గాఢానురాగము హృదయ మీయగదే !

## ౫౨

నిన్ను గొనిపోవంగ నిదె దృఢ
నిశ్చయమ్మున నేగు దెంచితి
వేగముగ ప్రాణప్రియా, యిలు వెడలి రాగదవే.

గాఢ నిద్రాముద్రితం బయి
కదల కున్నది భువన, మీ సుఖ
వేళ నిర్భయవృత్తి గేహము వెడలి రాగదవే.
భీతితో పని లేదు నీ కిక
ప్రియతమా, నీ రక్షణమ్మున
వీర కార్యము లాచరించెద వెడలి రాగదవే.

అంధకార భరమ్ము నించుక
అణచి తారలు మినుకు మిను కని
వెలుగు చున్నవి ప్రాణకాంతా, వెడలి రాగదవే.
సంశయింపకు ప్రియతమా, ని
శ్శబ్దగమనముతోడ బోదము
విరులపడకలమీదుగా, నిక వెడలి రాగదవే.

భయము లన్నియు బోవు నాభుజ
బంధనమ్మున నొక్క త్రుటిలో
వీరభావం బతిశయించును, వెడలి రాగదవే !

## ౫౩

వివిధ సారస్వత నదీ నద
విమలజలముల నోలలాడుచు
అనిశ మానందాధిగమమున అలరెదవు లక్ష్మీ!

చిత్రశిల్పకళావనాంతర
సీమలందు విహారలీలల
అనిశ మానందాధిగమమున అలరెదవు లక్ష్మీ!

దివ్యగాన తరంగ ముఖరిత
దేవ ధరణీ విహరణముల
అనిశ మానందాధిగమమున అలరెదవు లక్ష్మీ!

స్వర్గఖండమునందు మధుర
స్వప్నసంచారములలో నీ
వనిశ మానందాధిగమమున అలరెదవు లక్ష్మీ!

సర్గబంధము విధమునన్ రస
సంభృతంబై తనర జీవన
మనిశ మానందాధిగమమున అలరెదవు లక్ష్మీ!

## చతుర్థోచ్ఛ్వాసము

# శుభ స్వప్నము

## నాయకుడు

గాఢమధురము నీ స్వయంగ్రాహ మహాహా !
ఒసగు హృదయేశ్వరీ, మరియొక్కసారి !
మంజులంబైన నీ సుధామధుర వదన
బింబ మేది ప్రియా, ముద్దు పెట్టుకొందు.

తెల్లమొగ్గలు పూలు చిత్రించియున్న
శ్యామలదుకూలమును దాల్చినట్టి నీవు
వరలుచున్నావు నేత్రపర్వముగ నేడు
విరియ బూచిన మల్లెపందిరి విధాన.

మహితలావణ్యమున సుకుమార మగుచు
కాంచనాభ వెలుంగు నీ గాత్రలతిక
చూడజూడగ నెంతయు సొబగు మీరు
తప్త మైనకొలంది కుందనమువోలె.

దేవి, కుంకుమ తిలక దేదీప్యమాన
రమ్య కాంత భవత్ఫాలరంగ మొప్పు
నవ్య భాస్కరారుణ కిరణమ్ము సోక
పొలుపు మీరు అలవిదూర భూమి వోలె.

స్వచ్ఛ మృగనాభికా ఘనసార చూర్ణ
సురభిళంబయి తాంబూలశోణ మైన
తావకీనాస్య మీయగా దగదె మరల,
ఆరకున్నది ప్రేమ విహ్వలుని తృష్ణ !

ఒప్పుచున్నావు జన్మదినోత్సవంపు
వేళ ప్రాణప్రియా, రమ్యవిగ్రహంబు
బూను నస్మన్మనోరథ స్ఫూర్తితోడ:
బంధురం బైన దోర్లతా బంధ మిమ్ము!

### నాయిక

మేర మీరుచు నున్న దియ్యెడ
పారవశ్యము హృదయనాథా,
భూరి తావక వాక్సుధారస ధార చెవి సోకన్.

పొంగి పోవుచు నున్న దియ్యెడ
తుంగ భంగము గాఁగ నాహృ
ద్గంగ మీయనురాగ వార్నిధి సంగతిని నాథా!

ఉరలె నానందాశ్రువులు, వాక్
స్ఫురణ మణఁగెను, బాహుయుగళాం
తరమునందు వసింపనిం డిటె నిరత మాత్మేశా!

### నాయకుడు

త్రిదశవర్ష వయస్సున దేవి, యెపుడు
త్రిదశుల విధాన మిగుల వర్ధిల్లు మీవు
నిత్య యౌవన రూప నిర్నిద్ర బుద్ధి
విభవమున నూతనోత్సాహ విలసనమున.

నూపురంబులు మ్రోయ మనోహరముగ
కటకములు హృద్యరవమున ఘల్లు రనఁగ
శింజితం బొనరింప కాంచీకలాప
మరిగి హృదయేశ్వరీ, పీఠ మధివసింపు.

నవపరిమళ వివిధసూనములు దెచ్చి
ఆర్ద్రహృదయమ్ముతో మదీయాంగుళులను
గ్రుచ్చిన సుదీర్ఘ రమణీయ కుసుమమాల
లలితకంఠప్రదేశ మలంకరింతు.

అధికకోమల మగునీకరాంబుజాత
మేది, యొకసారి యిటు ప్రసారింప గదవె
ప్రియతమా, నీయనామిక( బెట్టువాడ
ఆయతం బైనరత్నాంగుళీయకంబు.

హర్షమున మత్కరోల్లిఖితాక్షరంబు
ధవళకౌశేయవస్త్రబద్ధంబు హేమ
రసలతాచిత్రితం బగు రమ్యకావ్య
మిదిగో, సంప్రీతిని పరిగ్రహింప గదవె!

నిరుపమ ప్రేమవార్ధి జన్మించినట్టి
రమ్యకృతిరత్నము సమాదరమ్ముతోడ
చేసి నా నంకితము నీకు – స్వీకరించి
హృదయమున దేవి, ధరియింపు మింపు మీర.

## నాయిక

పల్లవించును ప్రత్యహము నా
యుల్ల మభినవభంగి పీయూ
షోల్లల ద్భవదీయ భణితులు వల్లభా, వినుచోన్.

సదయమును గంభీర మగు మీ
హృదయమందలి యార్ద్రభావం
బాదవగలదే ప్రాణవల్లభ, ముదితలకు నైనన్!

గురువు భర్తయు నైన మీరలు
చరణదాసిని నన్ను నీ విధి
గరిమ నుపలక్షించుట మహాకరుణ నూచించున్.

### నాయకుడు

పలుక దగునె యిట్లు ప్రాణేశ్వరీ, యిద్ది
కరుణ కాదు సుమ్ము, గౌరవంబు.
కనికరంబు దీనజనముల యెడనె: నా
మతమునందు భార్య మాన్యురాలు.
పెద్ద మాట లేల ప్రియతమా, భవదీయ
పల్లవాభిరామ పాదయుగళి
మదీయ మస్తకాభరణం బయి
చుంబనార్హ మగును జుమ్ము నాకు!

### నాయిక

చాలు జాలును భాషణము లీ
లీల లజ్జావనత జేయుగ
బోలునే మీచరణ సేవకురాలి నాత్మేశా!
హెచ్చుప్రేమను నూత్నకావ్యం
బిచ్చితిరి: మీ కేవిధంబున
వచ్చు కావ్యతరంగ మాలిక లచ్చెరువు గొలుపన్!

### నాయకుడు

నిన్ను మొదటిసారి కన్నులారంగ నే
శుభముహూర్తమందు చూచినానొ

ఆక్షణమ్మునుండి ఆర్ద్రమై హృదయమ్ము
నేటివరకు కవిత నివ్వటిల్లు.

### నా యి క

ఆరుగా లోనికి బిడ్డ లిర్వురు
నరుగుదెంతురు క్షణములో, నా
చరణములకడనుండి లెండిక త్వరితముగ నాథా !

*　　　*

### కు మా రు డు

మంచిమంచిపూలు మనతోటలోనివి
వేయి కనులతోడ వెదకి వెదకి
చిదిమి పోసినాను చెల్లి చేతులలోని
పూలసెజ్జ నిండిపోవునట్లు.
గున్నపొగడ జేరి కూర్చుంటి మచ్చోట
నున్న చలువరాతి తిన్నెమీద
మాట లాడుకొనుచు మణికర్ణికయు నేను
సమ్మదమున నుత్సవమ్ము గూర్చి.
వేడ్కతోడ చెల్లి వివిధ పుష్పంబులు
చిత్రచిత్రగతుల జేర్చి మిగుల
నందమైన పుష్పహారంబు గ్రుచ్చె నీ
మెడను వేయుకోర్కె కడలుకొనగ.

అమ్మ, యిపుడు నీకు అర్పించుతలపున
పరిమళంబు గలుగు విరులు గూర్చి

ప్రీతితోడ నేను చేతనైన విధాన
చెండు కట్టినాను, స్వీకరింపు.

నాన్న ఉంచినట్టి నాణెంపు పుష్పహా
రముతోడ నొప్పు నమ్మకంఠ
దేశమందు నుంచు దీర్ఘదామమ్మును
చిన్ని చెల్లి, చిగురుచేతు లెత్తి.

## నాయిక

తండ్రి, వచ్చి అంకతలమున గూర్చుండి
కౌగిలించుకొమ్ము కంఠసీమ !
నన్ను కన్నతల్లి, నా యొడిలోన కూ
ర్చుండి ఈయఁగదవె ఒక్క ముద్దు !
శ్రమమూ చెందినావు జయదేవ, ఈనాడు
జనని కెంతొ సంతసమ్ము గూర్ప.
అమిత కోమలమ్ములైన నీ హస్తముల్
చాల నెర్రవారె పూలు కోయ.

చిట్టితల్లి, అమ్మ పుట్టిన రోజున
పండు గనుచు నీవు దండ గ్రుచ్చ
నప్పు డయ్యొ, ఎంత నొప్పు లెత్తెనో కదా
చిగురుటాకు లట్టి చిట్టి వ్రేళ్ళు !
జీవితేశ, యిపుడు చిన్ని బిడ్డల సమా
లింగనమ్ముచేత చెంగలించె
చిత్తమందు మిగుల శీతల భావంబు
అమృత రసవిలేప మైనయట్లు.

### కుమారి

మిగుల కోమలంపు మేను గావున నమ్మ
కూరుచుండ బెట్టుకొనగ లేవు.
అన్న యొక్కడుండు అమ్మ, నీ యొడిలోన,
నన్ను బోవ నిమ్ము నాన్నకడకు.

### నాయిక

నన్ను గన్నతల్లి, నాకు భారం బటే
చిట్టి నీ శరీర! మెట్టు లైన
మాతృరక్తికన్న మణికర్ణికకు తన
తండ్రిమీది ప్రేమ దశగుణమ్ము.

### కుమారి

ముద్దులొల్కు మంచిముత్యాలవలె నొప్పు
రమ్యమైన యక్షరాలతోడ
వ్రాయుచుందు నాన్న వచియించుచుండ ఆ
నందమునను మధుర సవ్యకృతులు.

చాల మధుర మైన సంస్కృత భాషను
నేర్చుకొందు మిగుల నియతితోడ.
శాస్త్రములను గూడ సాధించి విద్వాంసు
రాల నగుదు పెద్దయయిన వెనుక.

శ్రద్ధతోడ నేను చాల భాషల నభ్య
సింతు నాన్నగారి యంతికమున.
కవిత నేర్చి గొప్ప కావ్యముల్ నాన్నకు
అమ్మ కన్న కిత్తు నంకితములు.

### నాయకుడు

ఓసితల్లి, ఎట్టి యూహాలు నీ కింత
చిన్నతనమునందె యున్న వవుర!
నిన్ను కన్న లక్ష్మి పేర్పనే మనవచ్చు,
నీకు కలిగె జనని నిశిత బుద్ధి.

### కుమారి

నిన్ను లక్ష్మి యనుచు నిరతమ్ము ప్రీతితో
పేరు పెట్టి నాన్న పిలుచుచుండ
నాన్న నొక్కసారి నవ్వులాటకు నైన
పేరు పెట్టి అమ్మ, పిలువ వేమి?

### నాయిక

ఎట్టి సంశయంబె చిట్టితల్లి! నాన్న
పేరు పెట్టి నేను పిలువరాదు.
నాన్నగారి దివ్య నామాక్షరశ్రేణి
విలిఖితంబు హృదయ ఫలకమందు.

మంచి దొక్కమాట: మణికర్ణికా, నీవు
సర్వకాలములను జనకుస్త్రీల
ఓలలాడుచుందు వొక్క విద్యలలోన
పెండ్లియూహ విడిచిపెట్టి కూడ!

### నాయకుడు

కాదు కాదు: బిడ్డ గడియించి విద్యల
యందు పటిమ షోడశాబ్దములకు

వరుని యోగ్యుడైనవానిని చేపట్టి
పెండ్లియాడి చనును ప్రియుని వెంట.

### నాయిక

ఆవుర పిల్ల మందహాసమ్ము చేసెను,
మగనిమాట అంత మధుర మొక్కొ!

### నాయకుడు

ఎల్లకాల మతివ యెటు తల్లిదండ్రుల
సవిధమందు నుండజాలు చెప్పుమ!

### నాయిక

చాలుజాలు లెండు చాతుర్య మాత్రేల!
పుట్టినిల్లు విడిచి పెట్టలేక
బహుదినమ్ము లెన్ని బాధలు పడితినో
ఎట్లు మీరు విస్మరించినారు!

### నాయకుడు

మరవలేదు నేను మానినీ, నీ మనో
రంగమందు నాటి సంగరంబు.
ప్రబల మగుటపలన ప్రవిమల ప్రేమమ్మె
శ్లాఘ్యగతిని తుదకు జయము గాంచె.

### కుమారుడు

అరుగనిమ్ము చెల్లి నత్తవారింటికి
నిన్ను నేను విడువ నెన్న డమ్మ!

శ్రద్ధతోడ నీకు సంరక్షణము చేతు
ఆచరింతు పూజ లాదరమున.

చిత్రకళల నభ్యసించి చిత్రించెద
తనివి దీర బహువిధాల నేను
అమ్మ, మిగుల రమ్యమైన నీయాకృతి
సర్వలోక నేత్ర పర్వముగను.

సార్థకముగాగ జయదేవ నామమ్ము
పాడుచుందు నమ్మ, పద్యములను,
ప్రీతి కల్గ నీకు గీతగోవిందాది
కృతుల, వివిధ మధుర కీర్తనలను.

అమ్మ, నీకు హృద్యమైన హిందూస్థాన
భాషలోన యెపుడు పలుకుచుందు.
విశ్రమింప నీవు వివిధ కావ్యగ్రంథ
ములను జదివి నీకు ముదము గూర్తు.

## నాయిక

నాకు లోప మేమి నా తండ్రి జయదేవ,
ఉండ నీకు నిట్టి యూహ లిపుడె!
ఆదరించు భర్త, అనుగు బిడ్డలు కూడ
కలుగ నింక నేమి కావలయును!

చక్కనయ్య, నాదు సంసార వల్లికి
మొదటి ఫలము, యేది ముద్దు పెట్టు!
నీవు జనన మొంద నిశ్చయమ్ముగ నోయి
తండ్రి, జీవనమ్ము ధన్య మయ్యె!

### నాయకుడు

సరభసంబ వచ్చి జయదేవ, నాతండ్రి,
కౌగిలించుకొమ్ము గాఢముగను
చిన్ని నీ శరీర శీతలస్పర్శ నా
యంతరంగ మధికశాంతి నొంద!

భగ్న మయ్యె మున్ను బహుమనోరథములు
విముఖ విధివిధాన విలసనమున.
జనకు మీరి భాగ్యశాలివై తలపెట్టు
కార్యములను జయము గాంచు మోయి!

### కుమారుడు

అమ్మ, తోటలోని కాదుకో బోదును
చెల్లితోడ ఇంక సెలవు నాకు!

### కుమారి

అన్న వెంట ఇంక నారామమున కేగ
నా కనుజ్ఞ యిండు నాన్న గారు!

### నాయకుడు

కన్ను బొమలు కంఠ కర్ణముల్ నా పోల్కి
తక్కినట్టి రూపు తల్లిపోల్కి.
లక్ష్మి, కంటి వధిక లావణ్యమూర్తిని,
తల్లిచాలు సుతుడు ధన్యు డగును.

ఎంత మధుర మహహ, హృదయేశ్వరీ, నాకు
నీ వొసంగినట్టి నిబిడ బాహు

బంధనమ్ము ! రమ్ము ప్రమదమ్ముతోడ న
లంకరింపు మింక నంకతలము !

నాయిక

కౌగిలింతలోన గ్రేయకంబును
భూరి కరిన హేమ భూషణములు
గ్రుచ్చుకొన్న వేమొ కోమల మైన మీ
గాత్రమునకు ప్రాణకాంత, యిపుడు !

నాయకుడు

నీవు మామకీన నిబిడ సంశ్లేషమ్ము
నందు నిమిడి యుండునపుడు లక్ష్మి,
కేవలమ్ము సౌఖ్య దేవతయే విగ్ర
హమ్ము దాల్చి యొప్పునట్టు లుండు.

నీలమణుల బోలు నీ నయనమ్ము లీ
క్షింప నిమ్ము లక్ష్మి, చిరము నన్ను
విస్మరించి లోకవృత్తంబు కేవల
స్వర్గసుఖము గాంచ జాలియుందు.

మధుర గళముతోడ మనసోరంజనం
బౌనరుపంగ పాడుచుండ నీవు
విహరణంబు చేయు వివశమై గంధర్వ
భూమి మామకీన బుద్ధి లక్ష్మి !

వివిధ భాషలందు విలసిల్లు కావ్యముల్
విశదఫణితి నీవు విసుచుచుండు

సమయమందు లక్ష్మి, సంఫుల్ల మగు మదీ
యాంతరంగసీమ హర్షగరిమ.

గాఢపాక జటిల కావ్యపాఠనవేళ
ప్రతిభతోడ కఠినభాగములను
అన్వయింప నీవు హర్ష విహ్వలత ని
న్నెన్నిసార్లు కౌగిలించినానొ !

వ్రాయుచుండ నీవు, పఠియించు పుస్తక
భాగములను హస్త పల్లవంబు
ఎన్నిసార్లు నేను హృదయేశ్వరీ, ముద్దు
పెట్టుకొంటి మనసు పట్టలేక !

లక్ష్మి, తావకీన లలితాంకపాళిని
కూర్చి శిరము పెట్టుకొని పరుండి
నీ ముఖాంబుజంబు నిర్నిమేషమ్ముగా
జూచుచుంట యెంత సుఖము నాకు !

సాంద్రరక్తి నీవు సహధర్మచారిణి
వై మహా సుఖాబ్ధియందు నన్ను
అనిశ మిట్టు లోల లాడింపకున్నచో
ఎట్టి గతులు నాకు బట్టియుండు !

## నాయిక

ఎట్టి వింత మాట హృదయేశ ! నిమ్ము జే
పట్టు కతన నైతి భాగ్యవతిని !

పూర్వ జన్మరచిత పుణ్య వశమ్మున
నను పరిగ్రహించినారు నాథ !

మిమ్ము గాంచినంత మీ పదాక్రాంత లౌ
యువతు లెందరున్న నుజ్జగించి
జీవితేశ, నన్ను స్వీకరించుట తలం
పంగ నాయదృష్టఫలము కాదె !

అప్రయత్న సరణి నాత్మేశ, తారక
ముఖవిలోక నోరు సుఖము నాకు
సంఘటిలక మున్ను సాంద్ర నీహారంబె
ఆవరించియుండె నన్నికడల.

మిహిక విరిసిపోయె మీయాననాదిత్య
రోచి యొక్క నాడు తోచినంత.
తెలివి నొందె నాత్మదీధితితో మదీ
యాంతరంగసీమ యపుడు నాథ !

స్మేర మయ్యె హృదయ నీరేజ మాత్మేశ,
నాటినుండి నాకు నవవికాస
మహాంహమ్ము వృద్ధి నందంగ జొచ్చెను,
జీవనమున సౌఖ్య చిహ్న మమరె !

అణగి యుండనీక యారామసీమ నీ
చిన్ని కుసుమము విట్లు జీవితేశ,
అమితకృపను మీర లవతంసముగ దాల్ప
కలిగె దీని కధికగౌరవంబు !

## నాయకుడు

ప్రాణకాంత, నీకు పరమప్రియం బైన
గున్నపొగడక్రింది తిన్నెమీద
అనుగు బిడ్డ లుభయు లాసీనులై యాట
లాడుచున్నవార, లదిగో చూడు!

## పంచమోచ్ఛ్వాసము

# లోకయాత్ర

## ౧

### నాయకుడు

లోకవికసన మాత్ర వీక్షా
లోకమున ఘటియించు రాధా
వల్లభా, కైమోడ్పు భక్తుని వందనం బిదిగో!

తెల్లవారుచు ప్రొద్దు గ్రుంకుచు
దినము లెన్నో గడచి పోయెను
గాని నీకీ భక్తజనుపై కరుణ రాదాయె!

క్లేశరేఖా వ్యపగతములై
కేవలము సుఖ మొందగా దగు
వాసరమ్ములు గడచుచున్నవి వ్యర్థముగ నాథా!

యౌవనోత్తాలోర్ము లల్లన
అంత కంతకు నణగుచున్నవి
మంథరమ్ముగ దరియుచున్నది మరణ యామవతి.

తొలగిపోయె మనోరథమ్ములు
దూరముగ, నిక నొక్క కోర్కెయె
వేచుచున్నది మానసమ్మును విడువ కనిశమ్మున్.

వందనము గైమోడ్పు రాధా
వల్లభా, లోకైకనాథా!
దీను గారుణ్యార్ద్ర శీతల దృష్టి గన్గొనవే!

*　　*

సఖుడ, నిన్ను జూడ చాల సంతోషమ్ము
కలిగెనోయి! రత్నకంబళమ్ము
పైన గూరుచుండు - ప్రత్యూష వేళను
మిత్రదర్శనంబు మిగుల శుభము.

## ఆప్తుడు

ఏమి తలచుచుంటి వీ ప్రభాతమ్మున?
నీ ముఖమ్ము వెల్గు నిర్మలాభ
తేజరిలు నపూర్వ దివ్య రోచిస్సున
నీ విశాల శాంత నేత్రయుగళి.

## నాయకుడు

చూడు మోయి సఖుడ, సుందర విహగముల్
శాద్వలమ్ము మీద సంచరించు.
వకుళ శాఖమీద వాలి శిఖావళం
బదిగో, కూయుచున్న దాలకింపు.

ముద్దులొలుకు నదిగో మురిపెంపు దానిమ్మ
పూలు విద్రుమమ్ము పోలుపుతోడ,
పవనచాలనమున పన్నీరుపూవులు
రాలుచున్న వవిగో, నేలమీద.

వెలగపండ్ల గుములు వెలుగు నవోదిత
భానురశ్మి స్వర్ణఫలము లట్లు.
ఒప్పుచున్న దభినవోజ్జ్వలాకృతితోడ
జగతి యీ ప్రభాత సమయమందు.

ఎంత మోద మొదవు నిపుడు ప్రాణప్రియ
యైన లక్ష్మియే మదంతికమున
మెలగునేని ఆప్తమిత్రంబ, యెన్నడు
వచ్చునోయి, అట్టివాసరమ్ము!

ఆప్తుడు

అనుగుసఖుడ, ఆమె యనురాగవతి యని
ఒక్కరీతి బలుకుచుందు వెపుడు.
విడువజాల నంత విభ్రాంతి యొదవె నీ
కాదినుండి యని మదాశయంబు.

నాయకుడు

అవగతంబె నాకు నాయమ హృదయంబు,
వెర్రివాడ, ఆమె వినయశీల!

ఆప్తుడు

అంతప్రేమ కలది యైనచో నేటికి
నిన్ను జేరరాదు నేటివరకు?
కఠిన మగు గదోయి, కావ్యప్రపంచంబు
లోనివాని కెపుడు లోకయాత్ర!

*  *

నాయకుడు

ప్రవిమలానురాగ పటిమ లెక్కింపక
కష్టములను జయము గాంచు టుదకు.

౨

## వృద్ధురాలు

ఏమి యిట్టు లుంటి వీనాడు నాయనా ?
వదన మేల యింత వన్నె తరిగె ?
ముఖము గాంచినంత మూర్తీభవించిన
దుఃఖమో యనంగ దోచెదోయి !

జలకమాడి కేశ సంస్కార మొనరించి
తిలకరేఖ నుదుట దిద్ది తీర్చి
ధౌత వస్త్రములను ధరియించి, మెడలోన
మల్లికా ప్రసూన మాల దాల్చి –
సందెవేళ నెటకొ చనునాడ వంతలో
పండు కొంటి వేల పాన్పుమీద ?
నీ నిగూఢ భూరి నిరుపమ వ్యథను నీ
విమలవేష మెంతొ వృద్ధి చేసె.
పిల్ల నిత్తు రన్న పెడచెవి పెట్టెద
వేమి కారణంబొ యెరుక పడదు.
చెప్ప వారు లేక చెడిపోవు చున్నావు !
శీఘ్రముగను పెండ్లి చేసికొమ్ము.
ఒల్ల వైతి వెట్టియుద్యోగ మేనియు
భూమియెడల శ్రద్ధ పూన వెపుడు,
చదువుకొనియు ద్రవ్య సంపాదనము లేదు–
ఇట్టు లున్న నీకు నేమి సుఖము!

## నాయకుడు

చిన్ననాటినుండి చేసినకృషి యెల్ల
పూర్ణ మౌ సుఖానుభూతి కొరకు
చదువుకొన్న దెల్ల జ్ఞానోపలబ్ధికి
కాంచనమ్ము మీద కాంక్ష లేదు.

వ్యర్థజనుడ నేను వ్యావహారిక దృష్టి,
కావ్యలోకమందె కాపురమ్ము.
నడపువాడు లోకనాయకుఁ డున్నాడు,
లోకయాత్రయందు లోటు లేదు.

ఇన్ని యేండ్లు వచ్చె, నింక నేమి వివాహ!
మమరు నాకు విద్యలందె శాంతి.
దేహమును పవిత్ర దేవాలయమ్ముగా
ఎంచి నే నలంకరించుకొందు.

## వృద్ధురాలు

అంతమాత్ర మెరుగ ననుకొంటివా యేమి!
ముసలిదాన నయ్యు మోసపోను.
కన్నె యెవరో చాలకాలము క్రింద నీ
యార్ద్రమైన హృదయ మపహరించె.

ఒక్కనాడు మిగుల నుల్లాసమూర్తివై
పాడుచుందు వేవో పద్యములను.
మోము ముడిచి మౌనముద్రతో నొకనాడు
కూరుచుందు వింట గువ్వవోలె.

మరల నొక్కనాడు మంద స్మితమ్ముతో
ఏవొ చేయుచుందు వింటిలోన.
శూన్యదృష్టితోడ జూచెద వొకనాడు
కరయుగంబు జేర్చి గండపాళి.

ఒక్కనాడు తాల్తు వుంగరమ్ములు వ్రేళ్ళ,
కనకహారములను కంఠసీమ,
పరిమళింతు నోయి, పటవాసములతోడ
సాంద్ర సురభిగంధ చర్చతోడ.

పెద్దవారితోడ ప్రేమ వృత్తాంతంబు
చెప్ప నిచ్చపడరు చిన్నవారు.
ఎట్టులైన నొక్క యింటివాడవు కమ్ము,
అంతకంటె మాకు హర్ష మేది !

## నాయకుడు

తలుపు మూసి షామ్ము ధ్వని చేయుచుండగ,
దీపశిఖను జూడ నోప నేడు.
పండుకొనుటె మేలు పర్యంకతలమున,
అంధకార మొసగు నధికశాంతి.

*　　　*

కానరాకయుండు గాఢాంధకారాన
సకలలోక వస్తు సముదయమ్ము.
దేవి, నీ యఖండ దేదీప్య మూర్తి నా
యక్షియుగళి యెదుట నపుడు తోచు !

## 3

### నాయకుడు

చూచినారు కాదె జోషీ మహాశయా,
శాంతదృష్టి రెండు చక్రములను ?
జాతకుని కళత్ర సంతాన భావముల్
తెలుప వలయు తేట తెల్లముగను.

మూడు కాలములను ముకురంబువలె జూపు
జ్యోతిషమ్ము నెడల ప్రీతి మెండు.
మిగుల గౌరవమ్ము మీ మహారాష్ట్రుల
నంత పారదృశ్వ లనుచు మాకు.
తథ్య విషయమైన దైవజ్ఞు లప్రియ
మాడ నోడుచుందు రార్య, మీరు
మన్ముఖ ప్రియంపు మాటలు పలుకక
సత్యమే వచింప సంతసింతు.

### జోషి

ఈష దప్రియంబె భాషింపగా వలె:
శాస్త్ర దృష్టి బట్టి జాతకునకు
చాల యేండ్లవరకు సంసారసౌఖ్యంబు
కలుగు చిన్నె లేవి కానరావు.

పరిణయమ్ము జరుగు బహుళ ప్రయాసపై,
అంతవరకు మతికి శాంతి లేదు.
సౌఖ్య మొదవు, నవల సంతానము లభించు,
లోకయాత్రయందు లోటు లేదు.

# లోకయాత్ర

### నాయకుడు

ఉన్న దితని కొక్క యువతిపై మోహ
మామె యితని గృహిణి యగునొ కాదొ
సూక్ష్మదృష్టితోడ జోషీ మహాశయా,
ప్రశ్న చూచి ఫలము పలుకవలయు.

29402
17-9.37

### జోషి

అరసి చూడ నితని కాకన్యకు వివాహ
ఘటన ముందురీతి కాన రాదు.
కలవు ప్రబల విఘ్నకారణమ్ము, లితఁడు
అన్యయువతిఁ బెండ్లియాడ డెపుడు.

### నాయకుడు

యువతిమీద నితని కుండదా యనురక్తి ?
మరలు నొక్కొ ఆమె మానసంబె ?

### జోషి

ఆమె కితనిమీద ననురాగ ముండును
ఇతని కామెమీద నిచ్ఛ యుండు
పరిణయోత్సవమ్ము ప్రాప్తి మాత్రము లేదు.
ఆర్య, పోయివత్తు నాజ్ఞ యిండు.

* *

### హితుడు

ఇచట గూరుచుంటి వేకాకిగా సఖా,
మ్రానుపడినవాని మాడ్కి, నన్ను

తేరిచూడ వేమి? దీనాననమ్మునో
నేలవంక జూచె దేల నోయి!

ఏవి, యేవి, కన్ను లెఱ్ఱనారె గదోయి!
ఏడ్చుచుంటివో గా? యేమి బాధ?
తాకి చూడనిమ్ము, తాపజ్వరమ్ముచే
ఒడలు వేగిపోవుచున్న దయ్యొ!

నాయకుడు

అనుగు సఖుడ, యిప్పుడె ఆకస్మికవిరక్తి
జీవితమ్ము మీద నావరించె.

హితుడు

జామ్ముక్రింద నీవు చక్కగా నుంటివే,
ఏమి సంఘటిల్లె నింతలోన?

నాయకుడు

క్రొత్తగణకుడిటకు కొంతసేపటిక్రింద
నరుగుదేర ప్రశ్న లడిగినాను.

హితుడు

తెలిసె తెలిసెనోయి. దీనిరహస్యంబు-
అతడేదొ అప్రియమ్ము పలికె.

నాయకుడు

లక్ష్మి భార్యరీతి లభ్య కాదన్నాడు:
ఇంక బ్రతుకువలన నేమి ఫలము!

## హితుడు

చాలు, నింకనైన సఖుడ, జ్యోతిష్కుల
యెడల వెఱ్ఱి భక్తి విడువ వేమి ?
శాంత మూన కున్న జ్వరము హెచ్చును సుమీ,
పండుకొనుము కదలకుండ సఖుడ !
శీఘ్రముగనె నిన్ను జేరులే ప్రియురాలు.
విడువు మీ యధీరవృత్తి నింక.

## నాయకుడు

అక్కటకటా, లేశమాత్రము
హర్ష రేఖా విరహితములౌ
దుర్దినమ్ములి కెన్ని నాళ్ళకు తొలగి పోగలవో !
సంతతాధిక వివిధ బాధా
సాంద్ర మిహికాచ్ఛన్న మామక
హృదయ సద్మమునందు దోచదె ఏది కూడ ప్రభూ !
భగ్నమై విఫలమ్ములౌటను
ప్రతిపదమ్ము మనోరథమ్ములు
భూరితరముగ బుద్ధి కుంఠీభూత మయ్యెగదా !
ఏ విధమ్ముగ గడచుచున్నవొ
యీ భయంకర దుర్దినమ్ములు
అరసి చూచిన యప్పుడు నాకే అచ్చెరువు గొలుపున్.

ఆశ లెల్ల నిరాశలై యడు
గంటి పోవునో జీవసారము !
ఉన్నతిం గను టెన్న డేనియు ఉన్నదో లేదో !

ఆవరించిన నిబిడతమ నీ
హారమండల మధ్యవర్తిని
వీని నెన్నడు తెరపిలో బడవేసెదో దేవా !

## షష్ఠోచ్ఛ్వాసము

# దేవాలయము

## సఖుడు

ఎంతకాలము గడచె నీకడ
నింతయుల్లాసమ్ము కనుగొని!
నేత్రపర్వం బయ్యె గద నీ నేటిరూపమునన్.

ముద్దు లొల్కుచు నున్నయది నీ
ముఖసరోజాతమ్ము సఖుడా,
దీర్ఘ కుంకుమ తిలక రేఖా దీప్తిమంతంబై.

తనరుచున్న దపూర్వ శోభను
తావక గ్రీవమ్ము లోల
న్మంజుతపనీ యోరు హారామలినకాంతులతో.

ఒప్పుచున్నా వద్భుతమ్ముగ
నుజ్జ్వలాకృతితోడ, నేదో
సంఘటిల్లెను వింత తెలుపుము సఖుడ, విపులముగన్.

## నాయకుడు

తిరిగి వచ్చితి నిపుడె లక్ష్మీ
దేవిదర్శన హర్ష పులకిత
మానసుడనై అనుగు సఖుడా, మందిరమ్మునకున్.

ఇప్పటికి నా లోచనమ్ముల
యెదుట మెలగుచు నున్న దోహో
ప్రేయసీ వదనాంబుజాత స్మిత రూపంబే!

అహాహా, నా కర్ణ ద్వయమ్మున
అవిరతమ్ముగ మ్రోగుచున్నది
కూర్మి లక్ష్మీదేవి మంజుల కోకిల స్వరమే.

అనుపదమ్ము తరంగిత మ్మగు
నంగకమ్ములయందు లక్ష్మీ
స్వచ్ఛ కౌశేయాంచల మరుత్ స్పర్శ సౌఖ్యంబే.

అంత తాపము తొలగి పోయిన
దన్ని గడియల కొలది కాలము
నేడు నా ప్రియురాలి శుభ సాన్నిధ్యలాభముచే.

కదలి పోయితి నోయి, తొలి యే
కాదశీతిథి యగుట నుదయమె
సలుపగా లక్ష్మీనృసింహస్వామి దర్శనమున్.

కలిసి వైష్ణవ మిత్రమండలి
గాఢభక్తిని సేవ చేసితి
త్రిజగదారాధ్యుండు లక్ష్మీదేవి రమణునకున్.

జనని లక్ష్మీదేవి వదనా
బ్జంబు నవలోకింప మదిలో
పొడమె నా ప్రియురాలు లక్ష్మీ ఫుల్లముఖ కాంతుల్.

నేత్రయుగళమునందు గిర్రున
నీరు తిరుగగ కేలు మోడ్చితి
నపుడు యావల్లోకమాతకు నప్రయత్నముగన్.

కామితార్థ ప్రదవు తల్లీ,
కన్య లక్ష్మీదేవి నిమ్మా
యార్తజనునకు నంచు వేడితి నంతరంగమునన్.

బాష్పవారిని దుడిచి దక్షిణ
పార్శ్వమును వీక్షించు నప్పటి
కేమి యాశ్చర్యమ్ము! లక్ష్మియె యెదుట గానబడెన్.

స్వజన పరివృతయై నృసింహ
స్వామి సందర్శనము సేయగ
నరుగుదెంచిన దోయి, ప్రేయసి యాలయంబునకు.

చెంగటం గల మంటపమ్మును
జేరి యామె నిషణ్ణ యయ్యెను
పార్శ్వవర్తిను లైన యిరువురు పజ్జ గూర్చుండన్.

అపుడు నిలిచితి నోయి, నా ప్రియ
రాలి శాంత మనోజ్ఞ రూపము
తనివి దీరగ జూచుతలపున స్తంభపవిత్రమునన్.

ఆహాహా వికసన మొందె నోయీ,
అపుడు నా కనుదోయి లక్ష్మీ
తిలకపాటల ఫాల మండల దీప్తి జాలమునన్.

నాట్య మాడిన దోయి, మామక
నయన యుగళం బపుడు లక్ష్మీ
కర్ణపూరోద్దీప్త మంజుల గండ భాగములన్.

చిరము నేత్రద్వయి విహారము
చేయ సాగిన దోయి, లక్ష్మీ
కలిత కాంచనహార విలసత్కంఠ దేశమునన్.

గాఢ రాగోద్రిక్త మతినై
కన్నుగవతో ముద్దులాడితి
కటక కంకణ రుచిర లక్ష్మీ కర సరోజములన్.

ఏమి చెప్పుదు సఖుడ, నా
హృదయేశ్వరీ మృదు పాదయుగళికి
సాటి వచ్చునో రావో యించుక స్థల జలేజములే.

తన్మయంబై మోము కాక్షి
ద్వయము బంగరుబొమ్మ తొడిగిన
పట్టురైకను విడువ దాయెను ప్రాణమిత్రంబా!

కలిసి పోయిన వవల నాలుగు
కన్ను లద్భుత రాగలహరిని:
ఆమె చూడ్కులు వాలిపోయిన వప్రయత్నముగన్.

మరల నల్లన కాంచె మన్ముఖ
మండలమ్మును చకిత దృక్కుల
పైట సవరించుచును ప్రేయసి పరనిమేషమునన్.

తెలుప నేర గదోయి, లక్ష్మీ
దేవి లోచనరోచి పలుకుల!
కేవల మ్మా నేత్రయుగళికి క్రీతదాసుండన్.

సారె సారెకు నన్ను జూడగ
సాగె లక్ష్మీదేవి ప్రీతిని
స్వజన మేమి గ్రహింపకుండని సరళనేత్రములన్.

చూచుచుండగ నేను ప్రేయసి
సోయగంబును నిర్భరమ్ముగ
పట్టువడితి తదీయ జననీ ప్రౌఢ దృక్కులలో.

భంగ మొదవిన దోయి, అస్మత్
ప్రమదమున కా మంటపమ్మును
వీడి వా రాలయములోనికి వెడలి పోవునెడన్.

అవల మాంద్యము తొలగి పో ద్వా
రాంతరమ్మున మందగమనము
తోడ నేగితి నోయి, లోనికి తొట్రుపా టొదవన్.

కర్ణగోచర మైన కతమున
ఘంటికారావమ్ము లక్ష్మీ
దేవి కరములు మోడ్చి నాదెస తిరిగి చూచినది.

దిట్టతనము వహించి ప్రేయసి
దిక్కు చూచుచు నుంటి నోయీ,
పరిగణింపక లేశ మాయమ పార్శ్వవర్తినులన్.

ఆమె శిరమున విష్ణుపాదము
లర్చకుం డిడువేళ లక్ష్మీ
దేవి కరములు మోడ్చి నాదెస తిరిగి చూచినది.

ఆముహూర్తమునందు నుద్వా
హమ్ము మాకు రహస్యలీలను
జరిగినట్లే నిశ్చయించితి స్వామి సన్నిధిలో.

హర్ష విహ్వల మామకీనా
స్యమ్ము నవలోకించుచుండిరి
ఆమె యనుజన్మయును మాతయు నద్భుతేక్షణలై.

మరల నాహృదయేశ్వరీ ముఖ
మండలమ్మును గాంచు చయ్యెడ
అలసగమనముతోడ వెలుపలి కరిగినాను సఖా !

కదలిపోవు జనప్రవాహము
గాంచు చల్లన ధ్వజస్తంభము
నికట భూమిని నిలిచియుంటిని నిండుహృదయముతో.

శ్రవణ గోచర మయ్యె కర్ణ
జ్వరము పోవగ నింతలోపల
కూర్మిలక్ష్మీదేవి మంజుల కోకిల స్వరమే.

అంతలో నా రెల్ల నచటికి
నలసగతి నరుదెంచి సఖుడా,
తలలు వాలిచి పోవసాగిరి స్తంభ సవిధమునన్.

వెనుక నడచుచున్న ప్రేయసి
వినమితాస్యముతోడ నాపై
బరపె నోయి, మనోజ్ఞదీర్ఘాపాంగ వీక్షణమునన్.

ఆముహూర్తమునందు నెట్లో
అనిల వశమునజేసి పయ్యెద
తొలగిపోవగ నామె కించుక తొట్రుపాటొందెన్.

పాణికమలముతోడ ప్రేయసి
పైట సవరించెడి నిమేషము
లోన చేలాంచలము పవనోల్లోల మయ్యె సఖా!

కొంగు గాడుపు తగిలి నంతనె
కోరకితమై పోయె గాత్రము
తన్మయత్వం బొదవె హర్షోత్కర్ష రభసమునన్.

ఇది పవిత్రంబైనవాసర!
మీ మహోత్సవదినము జన్మము
మధ్యమున నా కేవిధమ్మున మరపు వచ్చు సఖా!

### సఖుడు

భాగ్యవంతుడ వోయి ! ఆయమ
ప్రౌఢహృదయాంతర్గతం బయి
నెగడుచున్నది భక్తి నీయెడ నిరుపమానముగా.

కాని మీ యీనాటి కార్య
క్రమముచేత సమాగమమ్మున
కంతరాయం బొదవు నేమో అరసి చూడదగున్.

### నాయకుడు

అంతరాయం బొదవనీ, విమ
లానురాగము విజయ మొందదె
భక్తవత్సలు డైన రాధా ప్రాణనాథు కృపన్ !

## సప్తమోచ్ఛ్వాసము

# సందేశము

అవగతం బయ్యె నారహస్యమ్ము నీకు
చెల్లెలా, యెన్ని నాళ్లో దాచిన యుదంత
మిట్టె నాతోట నేడు పల్కించినావు:
అవుర నీబుద్ధి విభవ మే మనగవచ్చు!

నాకు తోబుట్టు వట్టిదానవు, గభీర
హృదయ వుపకారపారీణ వీ వటంచు
సిగ్గు విడనాడి నేడు వచించినాను
మదనురాగ విధానపు మర్మ మెల్ల.

సంశయము లేని గాటంపు జనవుతోడ
అడుగుచున్నాను వరము నిన్నాప్తురాల,
ఆమె యంతికమునకు నీ వరిగి నేడ
నిపుణముగ ప్రేమ చౌత్యంబు నెరపవలయు.

నేతు పార్శ్వమునందు విస్తీర్ణ కాయ
మాన రమ్య శాఖావళీ మహిత మగుచు
ఉన్నతం బైన వటవృక్ష మొకటి కలదు:
ప్రాఙ్ముఖమ్ముగ జూడు మప్పట్టునుండి.

వివిధ భూమీజ మండలావృత మనోజ్ఞ
సౌధ శిఖరమ్ము లోచన సరణి దోచు
శ్యామలోజ్జ్వల పర్ణ సంఛన్న మైన
వికసిత సితాంబుజాతంబు వికసనమున.

కొంతదూరము పోవుచో గోచరించు
వామభాగమునందు నావరణరూప

వితత భిత్తిక యిష్టికా విరచితంబు
శోణకౌశేయ మేఖలా సుషమతోడ.

అవల దక్షిణ ముఖముగా నక్షియుగ్మ
రోచన మ్మగు చంద్రికరూపమునను
నీల పాషాణఫలక వినిర్మితోరు
పట్టభంగ పరంపరా ప్రభలు నీకు.

ఆతతం బైన తోరణ మధిగమించి
అజిరభాగము వెంట నీ వరుగునపుడు
సంభ్రమమ్మున పుష్పవర్షమ్ము గురియు
పవన కంపిత పున్నాగపాదపంబు.

సవ్యముగ కొన్ని యడుగులు చన్న వెనుక
తావకాగమ నోదితా దరముతోడ
చామరము వేయు సహకారభూమిజంబు
సాంధ్య పవమాన సంచల చ్ఛాఖికలను.

ఉన్నతం బైన మొగసాల యొప్పు నచట
వేత్ర దారు పటాసన వితతి తోడ
లంబమాన ప్రదీప గోళములతోడ
అవృతి స్తబ్ధ చిత్ర పటాళితోడ.

పురుషు లెల్ల వాహ్యాళికి బోయి యుందు,
ఎదురు పడి రేని పనికత్తె లెవ్వరేని
ఓసరిల్లుదు రాదర యుక్తితోడ,
శాంతగతి నంగణము వెంట జనగవచ్చు.

అవల ప్రాచీముఖమ్ముగా నరుగు మమ్మ !
ప్రణయినీ కరకోమల స్పర్శచేత

పులకితం బయి అహారహ పుష్పి గాంచు
వకుల భూమీరుహము కానవచ్చు నీకు.

అపుడు స్వాగత మను మదీయానురాగ
భాజనం బైన వకుళ భూమీజశాఖ
లలితముగ గుల్కు మత్త కలాపి కాంత
శ్రవణ సుభగమ్ముగా కవల్లు షడ్జమునను.

కడచి యంగణ రమ్యభాగమ్ము కొనను
చెల్లెలా, జామిచెట్టు కాంచెదవు సుమ్ము.
తరువుపై నున్న శుకము నీదర్శనమున
రక్తకంఠమ్ముతో త్రివారమ్ము పలుకు.

పార్శ్వమందు నారోహణ పంక్తి యమరు
భామినీ భ్రూమనోజ్ఞ రూపమ్ముతోడ
స్నిగ్ధ చంద్రాశ్మ ఫలక వినిర్మితంబు
సప్తపరిమిత సోపాన సంయుతంబు.

అచటి రమణీయ కక్ష్యయం దామె యుండు
సంశయము లేదు: నీ వేగు సమయమునను
కోయుచుండును ప్రియురాలు కుసుమములను
చాపి నిజహస్తముల్ గవాక్షమ్మునుండి.

అట్లు కాదేని మృదుల పటాసనమున
వాలియుండి మదీయకావ్యమ్ము కేల
బట్టుకొని యామె యుద్రిక్తభావ యగుచు
చదువుచుండును కాకలీ స్వరముతోడ.

కానిచో నామె సోరణగండ్ల దరిని
ధవళ మోజ్వల పర్యంక తలముమీద

పండుకొని యుండి నాచిత్రపటమువంక
జూచుచుండును నిష్పందలోచనముల.

ఆమె యొకవేళ రమ్యవేత్రాసనమున
గూరుచుండి సూచికలతో కూర్మిమీద
నాగరాక్షరములను మన్నామధేయ
మల్లుచుండును కౌశేయ కాంచలమున.

ఇట్లు కాకున్న వీణ వాయించుచుండు
కంకణరవమ్ము గీతిలో గలిసిపోవ
కర్బుర మనోజ్ఞమగు రత్నకంబళమున
స్నిగ్ధ హృదయాంబుజాత ఆసీన యగుచు.

కరతలాబ్జ సమర్పిత గండభాగ
అర్ధ మీలిత నయనయునై యనేక
విధముల నన్నుగూర్చి భావించుచుండ
బోలు జాల విషణ్ణయై పూర్ణహృదయ.

మందయానముతోడ దన్మందిరంబు
జేరి సోపాన పాళికా శ్రేణి వెంట
నరుగు లోనికి – నిను గాంచినంత నామె
పలుకరించు పురాతన పరిచయమున.

జీవితేశ్వరి నిను సుఖాసీనఁ జేసి
ఆదరముతోడ భాషించు నవసరమున
నాయుదంతంబు మిగుల విన్నాణముగను
ప్రియ మధుర రీతిలో దలపెట్టు మమ్మ !
ప్రీతితోడ దరత్రప పెనగొనంగ
ఆమె నీభాషణంబుల నాలకించు.

నీ సుధారస నిష్యంది నిస్స్వనమున
తెలుపు మాకెను ప్రణయ సందేశ మిట్లు.

జీవితేశ్వరి, యేల జాలము
చేయుచుంటివో తెలియ దయ్యో !
వివిధ చింతలతోడ నామతి వికలమై పోయెన్.

ఈర్ష్యచే నామీద నీతో
నెవ్వరేని నిరాపనిందలు
సృష్టి చేసి అనేకరీతుల చెప్పరేదు గదా ?
హేయభావము నీకు నాపై
నెట్టులేని జనింప జేయగ
ఖలులు నీతో నెన్నియేనియు కల్ల లాడరుగా ?

నిష్కళంకవు సరళహృదయవు
నీవు ప్రేయసి, నిశ్చయమ్ముగ
ఎల్లరును నీలాటివా రని యెంచబోకు సుమీ !

అన్యవాక్కుల నెంతమాత్ర
మ్మాలకింపక ధీరవృత్తిని
నన్ను ప్రేమను జూతువనియే నమ్మి యున్నాడన్.

ఎల్లవేళల నీవు ప్రియతమ,
హృదయ నాథునిగా దలంతువు
నన్ను నిశ్చలబుద్ధితో నని నమ్మి యున్నాడన్.

కొంతకాలమునుండి లోచన
కువలయమ్ములు లక్ష్మి, తావక
వదన కోచి ర్విరహితములై వాడిపోయినవి !

ఐన నేటికి చూపు లేక ప్రియు
రాల, హృదయము లమలరాగ
ప్రబల సూత్రముతోడ దృఢముగ బద్ధమై యుండన్!

కాలయాపన మగుటను ని
ష్కారణమ్ముగ, గుండె తరిగెడి
భూరి ఘోర నిరాశ యెడనెడ పొడముచుండు గదా!

నీ స్వరూపము నాయెడందను
నిండి యుండుటజేసి లక్ష్మి,
అన్యయువతికి తావు లేదీ యంతరంగమునన్.

ప్రియతమా, నే నిరుపమాన
ప్రేమపూర్ణ విలోచనమ్ముల
ఎదురు చూచుచు నుందు నీకై యెల్లవేళలను.

సాహసమ్మును మామకీన
స్థైర్యగుణము గ్రహించియును నీ
వింక నేటికి జంకు చుంటివో యెరుగకున్నాడన్.

పారద్రోలు మధీరవృత్తిని
ప్రాణకాంతా, ధైర్య మూనుము
వీరసతి వయ్యెదవు గేహము వెడలి యరుదేరన్.

కదలి రా ప్రియురాల, నీయా
గమనకాలమునందు యుష్మ
త్సరణి కవరోధమ్ము చేయంగజాల రెవ్వారల్.

రమ్ము మాణిక్యంపు బొమ్మా,
రమ్ము నాబంగారు చిలుకా,
రమ్ము ర మ్మోరాజహంసీ, రమ్ము శీఘ్రముగన్.

కూర్మితో సౌఖ్యమ్ము నీ కొన
గూర్ప నేను మెలంగుచుండగ
ఏవిధంబుగ నుందువో నీ వెంచి చూడగదే.

ప్రణయినీ, నీ కనుర నస్త
ద్బాహు వుపధానమ్ముగా నీ
వెట్టి స్వప్నము లపుడు కాంతువో యెంచి చూడగదే.

మ్లాన మెరుగని కుసుమగుచ్ఛము
మాడ్కి నిరతము నాథుమస్తక
మండనమ్మై వెలయుదువు సుకుమారభావమునన్.

సాహచర్యముచేత ప్రతిభా
శాలినీ, కవితామృతము నీ
విమలవాక్కున లీలమై నావిర్భవించు జుమీ !

గాన కవితా శిల్ప సులలిత
కళలలో నొప్పారి యస్త
న్నవ్య గేహము కేవలమ్మానంద ధామ మగున్.

విశ్వగాయక మౌళి కృష్ణుని
వేణు వటు మన జీవనమ్ములు
దివ్యగాన తరంగములలో తేలియాడు జుమీ !

అన్నివేళల నాదరించుచు
అఖిల విధముల మేలు సేయుచు
నుగుల నను ప్రేమించుచుండెడి మిత్రు లున్నారు.

అందు నస్మత్ప్రాణ సము లగు
నాప్తు లెందరో కలరు, వారలు
కవులు, నీ కంకితము లిత్తురు ఖండ కావ్యములన్.

అమల హృదయముతోడ నాసుఖ
మభిలషించెడి స్నిగ్ధ శిల్పులు
మధురముగ జిత్రింతు నీ ముఖ మంజు రూపమ్మున్.

సరస సారస్వతము లక్ష్మి,
సఖులచే ననివారితమ్ముగ
నిన్ను గూర్చి యనేక రీతుల నివ్వటిల్లు జామీ!

రమ్ము మాణిక్యంపు బొమ్మా,
రమ్ము నా బంగారు చిలుకా,
రమ్ము రమ్మో రాజహంసీ, రమ్ము శీఘ్రముగన్.
ఎల్లవేళల నీదురాకకు
నెదురు చూచుచు యుగము లట్టులు
కఠినవైఖరి వాసరమ్ములు గడపు చున్నాడన్!

## అష్టమోచ్ఛ్వాసము

# సమాగమము

౧

అప్రయత్నమ్ముగా లభ్యమైన యస్మ
దీయ సమ్మేళనము భవదీయ లజ్జ
లీన మగునేని, యుద్రిక్త మానసమ్ము
శాంతి గను టెట్టులో ప్రియకాంత, చెపుమ !

అధిక సుకృతవశాన సమాగమమ్ము
పుష్యమాస ప్రభాతము పుణ్యవేళ
సంఘటిల్లెను బహిరంగ సౌధమందు :
పలుక వేటికి దేవి, సంభ్రమము వీడి !

అన్య లోకస్థితమ్ముగా నరుగుడెంతు
రేమొ ప్రాణప్రియా, ఒక యింత యనుమ
పెదవులు కదల్పి, ఉన్నది ప్రేమ మనెడి
సలలి తోక్తులు మత్కర్ణ జాహమందు.

ఎగిరి పోవుచు నున్నవి ఈ యమూల్య
భంగు రాల్పక్షణమ్ములు ! పలుక వేమి !
భవ దసంబద్ధ మౌనమ్ము బాధ పెట్టు
చాల హృదయేశ్వరీ, ఈ విలోల చిత్తు !

కోపము వహింపబోకు, నీ కోమలతను
మధుర సంస్పర్శవశమున మామకీన
వపువు వ్యాయామ సంతత వ్యధిత, మిపుడు
కోరకిత మయ్యె, ఆయ్యెను కుసుమితంబు !

౨

చీకటులు వాలుచున్న ప్రాచీన సౌధ
పార్శ్వ కక్ష్యను ప్రియతమా, భాసిలెదవు
మంజుల శిరోరుహావళీ మధ్యమందు
తనరు నూతన హేమావతంస మట్లు.

పరులు లేరని తలతు నీ భవనమందు-
బాహ్యలోకము మరచి, సంభ్రమము విడిచి
శీఘ్రముగ మద్భుజాంతర సీమ జేరి
జీవితేశ్వరి, నిర్వృతి చెంద గలవు.

అద్దిరా యెంత భాగ్యము! ముద్దరాల
నేను ఛేదింపగలను నీమౌనముద్ర-
అధర సుధ జాలువారు క్షణార్ధమందె
ప్రియతమా, గాఢ చుంబన పీడిత మయి.

యంత్ర నిష్పీడిత లతాంత మట్లు నీవు
చెలియంప, మహోక్రీడ భాగాన నలిగి నపుడు
ఎగిరి పోయినదా లేద యింతకు మును
ఆవరించిన వివిధ భయాదికమ్ము!

మంచి, దిక పోదమా ప్రియా, మనగృహమ్ము
ప్రస్తుత నూతన వస్తు సంపదలతోడ
సంభృతం బయి వాసక సజ్జికవలె
కాచుకొని యుండు నస్మదాగమనమునకు.

పాదముల వ్రాలె చేటికి ప్రాణకాంత!
సేవ్య సేవికా బుద్ధి త్యజింప గదవె!

రమ్ము పోవుద మీ ముహూర్తమున, నీవు
యామినీ వేళ గృహలక్ష్మి వగుదువు సుమీ !
ప్రియులకు వియోగ మిట్లు కల్పించి యెవడు
వికృత కంఠాన అరుచెను విఘ్నమూర్తి ?
వైళమే జీవితేశ్వరీ, వచ్చెవాడ
నిన్ను గృహలక్ష్మిగా గొను నిష్ఠఁగోడ !

3

చిత్ర మయ్యె ! మహాశివరాత్రి పుణ్య
కాలమందు భవల్లేఖ కరగత మయి
ప్రమద మొనగూర్చి యుంచుక బాధకూడ
సలిపినది ప్రేయసీ, నఖక్షతము వోలె.

దాటివత్తున చెప్పుము కవాటవాటి
డెగవలె సౌధ కుట్టిమ భాగమునకు !
వలదొకో ! ఆయస శలాక వంచి కొంత
ప్రియతమా, ఒక్కముద్దైన పెట్టుకొందు.

ప్రథమ వీక్షణమందె నాపైన నీకు
చెప్పశక్యము కాని విచిత్రరక్తి
ఉదయ మొంది ప్రవృద్ధమై యున్న దనియు
కాలయాపన మేల నిష్కారణముగ ?

అర్పణము చేసినా నంటి వా క్షణాన
నీహృదయ జీవితమ్ములు నిండురక్తి.
ఎప్పుడు శరీరమును సమర్పింపగలనో
తెలియదన్నావు : హేతువు తెలియరాదు.

ఏ ముహూర్తాన నను జీవితేశ్వరునిగ
నీవు ప్రియతమ, భావించినావో యపుడె
అఖిల బంధ పరిత్యాగ మాచరించి
ప్రీతి సర్వస్వమును సమర్పించినట్లె.
నీజనము మున్గియున్నారు నిద్రలోన
రాజమార్గంబు నిర్జన రమ్యము గద.
జీవితేశ్వరి, ధైర్యము చేసి యిపుడె
తరలి రారాదె గృహిణీపదమ్ము నంద ?

౮

వచ్చియున్నాడ నుత్తరద్వార దేశ
సవిధమునకు సంకేతానుసారముగను.
బంధనము వీడి బాహ్య ప్రపంచ రమ్య
రంగభూమికి నావెంట రమ్ము దేవి !

చిత్రవర్ణ కర్ణాట కౌశేయకమ్ము
దాలిచి యదృష్ట దేవతవోలె నిపుడు
జీవితేశ్వరి, అనుసరించెదవు నన్ను
ఇహ సుఖమ్ముల నోలలాడించుకొరకు.

మంచిమాటలతో నీదౌ వంచనమ్ము
చేసితి నటంచు పల్కెదు ! జీవితేశ్వ
రీ, స్వయముగానె యిలు విసర్జించినావు
నన్ను పాలింప, నిలుపుము నమ్మకమ్ము.

తరువుమాటున నున్న వితర్దికపయి
విశ్రమింతువ యించుక ? అశ్రమముగ

ఆశ్వేశకటాన చనవచ్చు నస్మదీయ
సదనమునకు విభావరీ సమయమందె.

ఊరుతలమున ప్రియా, కూరుచుండగదవె!
నీకు నే వల్లభుండనే– నిజము, సరియె,
నీవు ప్రాణేశ్వరివె కదా– నిజము, శుభము!
శంక విడువవె ప్రియతమా, ఇంకనైన?

ఇంక వొక కొన్నినాళ్లు పుట్టింటిలోన
గడపి వత్తువ నాయంతికమునకు ప్రియ?
నేను స్వేచ్ఛారతుండను, నీవు కూడ
సంతసమ్మున స్వేచ్ఛగా సాగిపొమ్ము.
దంపతుల మైత్రి మని విస్మరింపవు కద?
నీ వియోగమ్ము భరియింపనేర ననుము
తెలియదు గద? నీవు త్వరలోనె తిరుగ వచ్చు
మాట సత్యమె కద? పొమ్ము మంగళమ్ము!

౫

నాకు దోచుచు నుండును నడుమ నడుమ–
దేవి దూర నిషణ్ణక స్థిత, మదీయ
వదన రోచి ర్విలోకన వ్యగ్ర యయ్యు
ప్రతివిలోకన హ్రీభర భ్రాంత యగుట.

నాకు దోచుచునుండును నడుమ నడుమ–
దేవి నిశ్శబ్దముగ నరుదెంచి నాదు
స్నిగ్ధగండ స్థలాలపై సిగ్గుతోడ
అలతిముద్దుల విడి వెన్క కరిగినట్లు.

నాకు దోచుచునుండును నడుమ నడుమ-
దేవి యరుదెంచి పశ్చాత్ప్రదేశతలము
నుండి, నిజహస్త నీరేజ యుగళి నాదు
నయనములు మూసి మెల్లగా జనినయట్లు.

నాకు దోచుచునుండును నడుమ నడుమ-
మెల్ల మెల్లన నావీపుమీద వ్రాలి
కోమల కరాల గాఢోప గూహనమ్ము
చేసి ప్రేయసి నను గ్రుచ్చి వేసినట్లు.

నాకు దోచుచునుండును నడుమ నడుమ-
నాకకల్లోలినీ సుఖస్నాతుడ నయి
నందనారామ వీథులయందు నేను
అమృత కలశమ్ముతో నడయాడునట్లు!

సమాప్తము

# వకుళమాలిక

**అంకితము**

శ్రీ దేవులపల్లి కృష్ణ శాస్త్రికి

# వకుళ మాలిక

## ౧

ఎంత చక్కని వెలుతు, రెంత చక్కని వెలుతు!
రెంత చల్లని గాలి, యెంత చల్లని గాలి!
ఎంత కాలం బాయె ఈ సౌఖ్యమును గాంచి!
మై మరచి పోవలయు మంద మారుతములో
చొక్కి పోవలె నేడు సూర్య కిరణాలలో
పండు వెన్నెలలోన పరవశము కావలయు!

ఈ పేటికా ద్వార మెవరు తెరచినవారు?
కానిపించదు స్వామి కరము పోలిక నేడు!
ఈ కరస్పర్శ నే నెరిగినది కాదు మును!
నా స్వామి యరుదెంచినా డేమొ యనుకొం
ఎంత చక్కనివాడో, ఎంత చల్లని వాడో!
ఎవ్వరో మీరు నా కెరుగ రాకున్నారు,
తీసివేయకుడు నన్ దీసివేయకు డయ్య!
నా స్వామి కోసమై నన్నుండనిం డిచట!

ఎంత చక్కని చేయి, ఎంత చల్లని చేయి!
చిగురు టాకును బోలు చేయి నా నాథునిది!
అతని హస్తము సోకి నంతనే నా మేన
అంకురించును పులక లానంద గరిమాన!

వాడిపోయిన జీర్ణ వకుళమాలగ నెంచి
తీసివేయకుడు నన్ దీసివేయకు డయ్య!

మీరు నా నాథునకు మిత్రమట్టులు తోచు
చున్న నీ పేటికను తెరచు టేలాగు ?
ఎంచబోకుడు నన్ను నెండుపూదండగా :
ప్రాణమున్నది నిందు ప్రాణమున్నది నాకు !
వింతచూపులతోడ వీక్షింతు రేమిటికి -
ప్రసవదామమ్మునకు ప్రాణముండగ రాదా ?

ప్రాణముండుటె కాదు, ప్రమదమో దుఃఖమో
కలుగుచుండును నాకు కారణమ్మునుబట్టి.
బాల్య యౌవన జరా ప్రముఖ భేదము లెల్ల
సక్రమమ్ముగ నాకు సంక్రమించిన వయ్యె !
ఐన నెడనెడ స్వామి యమృతహస్తము సోక
ఉదయ మొందును యౌవనోద్రేక మెదలోన
ఆనంద తుందిలం బగు నంతరంగంబు
శీర్ణదేహముమీద చెలగు లావణ్యంబు !

నా స్వామి యేలాటి నవనీతహృదయుండొ-
పుష్పమాలగ నన్ను జూడలే దెన్నండు,
ఆప్తురాలివిధాన నాదరించెడువాడు,
స్వీయ సుఖదుఃఖాలు చెప్పుచుండెడివాడు.

కడచె రెండబ్దాలు, కాల మిం కెన్నాళ్లో !
నాస్వామికోసమై నశియించి పోకుండ
జీవించియున్నాను శీర్ణదేహముతోడ !
ఏను పోయిన నాత డెంత వెత చెందునో !

పుష్పమాలిక గాను పుట్టి యుండనయేని
పూబోణిగా నేను పుట్ట గల్గితినేని

అతనినే వరియించి ఆత్మవల్లభునిగా
కౌగిలింతు తదీయకంఠమే నేవేళ !

౨

అతి మనోహరమైన దయ్యా, నా జన్మంబు!
ఇందిరా దేవిచే నీ శరీరము కలిగె.
ఎంత చక్కని చుక్క ఇందిరా లలితాంగి !
ఎంత కోమలహస్త మిందిరా సుందరిది !

చైతన్య మొదవంగ సంభ్రమమ్మున నేను
నలుదెసల్ కనుగొంటి నల్లకల్వల బోలు
నయనాలతో నామె నను విలోకించుచును
కోమలాంగుళులతో గ్రుచ్చుచుండెను పూలు.
ఎంత చక్కని కన్ను లిందిరా సుందరివి !
సారె సారెకు నాకె సమ్మోహము జనింప,
నాస్వామి యాకన్నె నయన యుగళము గాంచి
ఆనంద పరవశుం డగుట చిత్రము కాదు.

అనురాగ సూచి యా నరుణ సూత్రము వెంట
కుసుమముల్ మెల్లగా గ్రుచ్చుచుండెడి వేళ
గీత మాలాపించె కిన్నరీ కంఠాన
విజన ప్రదేశాన వేదిపై లలితాంగి.

చల్ల నౌ సాయాహ్న మో నాథా
చక్క నౌ మార్గాన ఓ నాథా

నా మోము వీక్షించు చో నాధా
వడచుచుండగ మీర లో నాధా
చెప్ప శక్యము కాక ఓ నాధా
స్నిగ్ధభావము కలిగ ఓ నాధా
బహువిధంబుల దాని నో నాధా
పరికించి చూచినా నో నాధా
తరచి తరచిన కొలది నో నాధా
తత్పరత్వమె హెచ్చె నో నాధా
నాటినుండియు నాకు ఓ నాధా
నవ జీవనము కలిగె ఓ నాధా
చెక్కిటను చెయి చేర్చి ఓ నాధా
చింతింతు మిముగూర్చి ఓ నాధా
నా కిప్పు డీలోక మో నాధా
నవ్యకాంతుల దోచు నో నాధా
సంసార సాగరం బో నాధా
స్వర్గంగవలె నున్న దో నాధా
మీచరిత్రలు వినుట కో నాధా
మిగుల కౌతుక మొదవు నో నాధా
విరత మాకాశాన ఓ నాధా
నిర్మింతు సౌధమ్ము లో నాధా
ఆడువారల ప్రేమ ఓ నాధా
అంతస్సులో నుండు నో నాధా
దైవతము మీకన్న ఓ నాధా
దాసురాలికి నెవ్వ రో నాధా
మీ పాదదాసినై ఓ నాధా

మెలగు వెన్నెళ్ళలో ఓ నాథా
ఆనంద సరసిలో ఓ నాథా
అవగాహ మెన్నడో ఓ నాథా

పల్లవారుణ మైన పాణియుగ్మముతోడ
పట్టుకొని ఇందిరా బాల నను ముద్దాడి
రక్తకౌశేయాంబరమ్ము పరచిన చిన్ని
యందాల పూసెజ్జయందు పదిలము చేసె.

కడచుచున్నకొలంది గడియ యొక్కొక్కటే
అంత కంతకు గంధ మతిశయించుచు నుండ
అంతరంగమునందు ఆమోదభరితనై
చల్లగా సాగితిని సౌరభము గది నిండ.

పన్నెండు గడియ లీపగిది సాగినయంత
ఏతెంచి గదిలోని కిందిరా లలితాంగి
పట్టుకొని పూసెజ్జ పదిలమ్ముగా కేల
దరిసి వాతాయన స్థలము, నుపవేశించె.

ధౌత కౌశేయంబు ధరియించినది యామె
కౌసుంభరాగముల కంచుకము తొడిగినది.
పడుచుండ నొడలిపై పండువెన్నెల రుచుల్
దేవకన్యక వోలె తేజరిల సాగినది.
కర్ణపూరద్యుతుల్ గండయుగ్మము మీద
నవమోహనమ్ముగా నాట్య మాడుచునుండ,
తపనీయ హారముల్ స్తనమండలమ్ముపై
కమనీయ లాస్యంబు కావించుచుండగా,
పాటల ద్యుతులతో ఫాల దేశమునందు

తిలకబిందువు సముద్దీపించుచుండగా,
దుగ్ధాబ్ధిలోనుండి తోతెంచు నిందిరా
దేవి పోలిక నామె తేజరిల్లగ జొచ్చె!

అతి విశాలం బైన యా జాలకమునందు
ఆసీనయై యామె ఆరామవాటిపై
నిజవీక్షణమ్ములన్ నిగిడించుచుండగా
బంగారుబొమ్మనే పరికింప సాగితిని.
నల్లకల్వలబోలు నయనాలు నాపైకి
త్రిప్పి ఇందిర నన్ను తేరిచూచి యొకింత,
చిరునవ్వు మోముపై చిందులాడుచునుండ
లాలింప దొడగినది లలితగీతమ్ముతో.

వచ్చునే శాయె/నావల్లభుం డిచటికే,
వచ్చి ప్రేమను వేగమే, మాలికా,
గ్రుచ్చి కాగిట జేర్చునే.

ఎంత చక్కనివాడో హృదయాధినాథుండు
కాంచ గలిగిన యంతనే, మాలికా,
కనులకరవే తీరునే.

చిరునవ్వు మలయు నా జీవితేశునిమోము
పండువెన్నెల కాయునే, మాలికా,
నిండుపున్నమ బోలునే.

అమృతతుల్యము లైన యతనివాక్కులు విన్న
ఆనందముప్పొంగునే, మాలికా,
అవశత్వమే కల్గునే.

నానాథుసన్నిధానమునందు నిలువంగ
అన్నిచింతలు వీడునే, మాలికా,
ఆనందమే నిండునే.

నాకోసమై యతడు నవయుచున్నా డెంతో
అలసింపుట కూడదే, మాలికా,
అంగీకరింపవలెనే.

ప్రాణేశ్వరుని గాఢపరిరంభణమ్ములో
విస్మరింపనె తనువునే, మాలికా,
విశ్వాన కలిసిపోనే !

అని లేచి వీక్షించి ఆరామవాటికన్,
నానాథు డేతెంచినాడు పోదము రమ్ము,
విభుడు నాకోసమై వేచియున్నా డదిగో !
అనుచు నుపవనిలోని కరిగె సంభ్రమముతో.

ఎంత చక్కని నడక ఇందిరా సుందరిది !
ఆందోలనమ్ముతో అడు గడుగునకు నామె
పాలిండ్లపై నున్న పట్టు రైకను దాకి
తేలిపోవుచునుంటి దేవతామార్గాన !

3

విందు వెన్నెలలోన నిలిచియున్నా డతడు !
ఏతెంచుచుండగా నెదురుగా ప్రియురాలు
అగ్రమ్మునకు నేగి ఆలింగనము చేయు
భావమ్ముతో దీర్ఘ బాహుయుగళము చాపె.

ఎట్టుండునో యనుచు నెంచుచుండెడి నేను
నయన పర్వమ్ముగా నాథు వీక్షించితిని :
అతి విచిత్రం బైన యాకారమున నతఁడు
దివ్య దీధితి తోడ స్త్రీమూర్తి వలె నుండె !
దీర్ఘకుంకుమ రేఖ తీర్చియున్న ముఖంబు
నడుమ పాపటి చాలి నల్లని శిరోజములు
కనకహారము వ్రేలు కంఠప్రదేశంబు
అంగుళీయాలతో నలరారు హస్తాలు
పాలనురుగుల రుచుల పట్టుత్తరీయంబు
కౌముదీ కమనీయ కౌశేయ కంచుకము
కామినీ మానసాకర్ష కాద్భుత మైన
పురుషాకృతిని గాంచి పొంగిపోతిని నేను !

అంగుళీసంజ్ఞతో నావలకు గొనిపోయి
హృదయేశు మెల్లగా ఇందిరా లలితాంగి
సాంద్ర వకుళావనీజ చ్ఛాయ బ్రాపించి
విభునికంఠాన నన్ వేయగా పైకెత్తి,
నతమస్తకుండైన నాథు గ్రీవమునందు
నిపుణమ్ముగా నుంచి, నిర్భరప్రేమతో
హృదయనాథుని గౌగిలించుకొన్నది బిగ
బంగారురుచి మీరు బాహువల్లరులతో !

నిజబాహుదండాల నిబిడమ్ముగా నామె
నాలింగనము చేయ నాత డుద్రేకాన,
పడుచువారల గాఢ పరిరంభణమ్ములో
నలిగిపోవుదు నంచు నాకు భీతి జనించె !

పట్టురైకయూ నామెపాలిండ్లు చల్లగా
దయనీయగతినుండి తప్పించినవి నన్ను !
కాంతకాంతిని గాంచి కౌతుకమ్ము విడ లేక
పడుచుజంటవిధంబు పరికింప సాగితిని.

వివశభావముతోడ విభుని పేరురముపై
శిరసు వాల్చిన దామె : సిగలోని పూదండ
పరిమళమ్ముముఖాన ప్రసరించుచుండగా
మూర్ధమ్ము మూర్కొనియె ముగ్ధుడై యాతండు.
మోము పైకెత్తి యా ముద్దుగుమ్మాత్మీయ
విభునియాననసీమ వీక్షింప నాతండు
ప్రణయవిహ్వలు డౌచు పవడంపుమోవితో
జవరాలికెమ్మోవి సరభసమ్ముగ నొక్కె.

మాట యేమియు లేక మహనీయ సుఖములో
తన్మయమ్ముగ కొంతతడ వుండి యామీద
అన్యోన్యముగ చెక్కుటద్దాలు ముద్దుగొని
రతివేలగతితోడ ఆ ప్రియుల్ తమకాన.
ఎట్టులో తుదకు ఇందిరా, ఇందిరా,
అని యాతడింపుగా నామె సంబోధించి
బాహుబంధము మరల బాధమ్ము కావింప
ప్రాణేశ్వరా యనుచు పలికె మెల్లగ నామె.

ఇందిరా, నిన్ను నే నిష్టదేవతవోలె
భావించుచున్నాను భక్తితో నిరతమ్ము.
నీ మనోహర పాద నీరేజయుగళంబు

అర్చింతు ఇందిరా, అంతరంగమునందు.
నా జీవితేశ్వరీ, నా ముక్తి కామినీ !

నీ తోడి యెడబాటు నిమిషకాలం బైన
భరియింపగా జాల ప్రాణేశ్వరీ, యింక !
ఎంతకాలము దాక ఏకాకిగా జీవ
యాత్ర సలుపగ వలెనో అన తీయంగదే !
నా జీవితేశ్వరీ, నా ముక్తి కామినీ !

మీ మందిరముచుట్టు మిగుల నుత్కంఠతో
తీర్థ యాత్రలు చేసి దేవి, నే బడలితిని !
నీ పాద పద్మాల నిటలమ్ము సోకంగ
వాలిపోవ ననుజ్ఞ వాంఛించుచున్నాను
నా జీవితేశ్వరీ, నా ముక్తి కామినీ !

అని జాలి యుట్టిపడు నంబకంబులతోడ
వీక్షింప ప్రియురాలి విమలాస్య మాతండు,
చిరునవ్వుతో నాథుస్నిగ్ధ గండద్వయము
ముద్దాడి ముద్దాడి ముద్దరాలు వచించె:

అనిశము నాకొరకు మీర
లనుభవించుచున్న బాధ
అవగతంబె నాకు, కాని
తాళుడు నాథా, నాకోసము
తాళుడు నాథా !

ఈ యమూల్య మైనహృదయ
మిట్టి వ్యర్థురాలిమీద

ఎట్టు నిలిపినారో కాని
తాళుడు నాథా, నాకోసము
తాళుడు నాథా!

శీఘ్రము మీపాదపద్మ
సేవ చేయవలయు ననెడి
చింత వేగిరించు, కాని
తాళుడు నాథా, నాకోసము
తాళుడు నాథా!

కౌగిలింప కొక్కసారి
కన్నతల్లి ననుదినమ్ము
కాల మెపుడు గడప లేదు—
తాళుడు నాథా, నాకోసము
తాళుడు నాథా!

బంధనాలు వీడిపోవ
బాధ లెల్ల తొలగిపోవ
ప్రమదంబున వత్తు నేను—
తాళుడు నాథా, నాకోసము
తాళుడు నాథా!

మీ కీ విరులమీద మిగుల ప్రీతి యటంచు
గ్రహించి దామమ్ము కంఠాన వేసితిని.
వకుళాలమీద మీకలననే ప్రాణేశ,
కలిగె నాకునుగూడ గాఢానురాగమ్ము.
వేగమ్ముగా పొగడవిరిదండ చెడకుండు,
ఐన పదిలమ్ముగా నరయుమండుడు దీని.

వకుళమాలిక యెంతో వాడిపోవకముందె
అర్ధాంగి నౌదు మీ కనివార్యముగ నాథ!
అని ఇందిరా దేవి అంసభాగముమీద
లజ్జతో వాలి తన లలితాననం బెత్తి
అరకంట వీక్షింప హర్షవిహ్వలు డౌచు
ముద్దాడి ప్రియురాలి ముద్దునెమ్మో మతడు,
నిజముగా నిజముగా నిజముగా ప్రియతమా!
అగుదువా అగుదువా అర్ధాంగి వగుదువా!
నమ్మ లేకున్నాను నాయదృష్టం బనుచు
గ్రుచ్చి కౌగిట జేర్చుకొన్నాడు ప్రేయసిని.

జలజలని రాలె నాసమయాన వారిపై
పొగడశాఖలనుండి పుష్పాలు వానగా.
పర్ణముల్ చలియింప పండువెన్నెలనిగ్గు
వాలె సొంపుగ వారి వదనబింబాలపై.

అపు డనిర్వాచ్య మౌ నానందమున మునిగి
నిశ్శబ్దముగ నట్టె నిలిచి యుండగ వారు,
కాంతునీ మృదుకంఠ గళిత మౌ శబ్దంబు
కర్ణగోచర మయ్యె గదినుండి మెల్లగా.

ఉత్కర్ణులై చూచి రుభయు లాపార్శ్వంబు—
ప్రాణవల్లభునితో పలికె నాయువ యిట్లు:
ఆ జాలకములోని యామె నా సోదరి,
గాఢానురాగంబు కలది నాపై నెపుడు,
మీ రెరుంగక యుండ మిమ్ము వీక్షించినది.
చాల చక్కనివారు సజ్జనుల్ మీ రన్న

భావమ్ము కలుగగా పరిణయమ్మునకునై
ఉత్సాహ మేవేళ నొసగుచున్నది నాకు.

పూజ్యురాలికి మనఃపూర్వకం బైన నా
వందనం బర్పింపవలయు ప్రాణప్రియా !
అని పల్కు నత, డిందిరాంబ మంచిద యనుచు
సెలవు వేడెను నాథు చిరునవ్వు మోముతో.

నిను విడిచి యేరీతి నిల్వనేర్తును ప్రియా !
గడపుచున్నా నెట్లొ క్షణ మొక్కయుగముగా !
తోచుచున్నది మహాదుస్సహమ్ముగ నాకు
ఏకాకిజీవితము హృదయాధి దేవతా !

అని జాలిగా బల్కు నాతేశు సుద్దాడి
ఊరడించి, సుధామయోక్తులం గడు వేడి
విడిపించుకొని యెట్లొ విభునిదోర్బంధంబు
కదలినది తుద కంచ గమనమ్ముతో కన్నె.

చేయూచు చను గడుగునకు సింహావలోకనము
చనుచుండగా నామె సాంద్రచంద్రికలోన
పాల మున్నీటిలోపల విహారము చేయు
పద్మాలయా దేవి పగిది దోచెను నాకు !

అదియె తుదిచూపాయె ! అవల నామెను నేను
కనుగొనెడిభాగ్యంబు కలుగనే లేదాయె !
ఆమె నడచిన త్రోవ నాలోకనము చేయు
చట్టె నిలువంబడియె నచటనే నాస్వామి.
చూడ సాగితి నాథుసోయగము నే నపుడు—

మ్లాన మయ్యెను వదనమండలం బొక యింత.
వీక్షించి సౌధమ్ము విడిచి నిఃశ్వాసమ్ము
కదలె నంతట మందగమనమ్ముతో స్వామి.

## ౪

పండు వెన్నెలలోన బహుసౌధములు గాంచి
దాటు చెన్నెన్నియో దారిలో సేతువుల్
పయనించి పయనించి బహుమార్గములవెంట
అరుదెంచినార మీహర్మ్యమ్మునకు మేము.

చనుదెంచి నాథుండు సౌధమ్ము లోపలికి
పట్టుత్తరీయంబు భద్రమ్ముగా దీసి
విద్యుద్దాలోకాన వీవనం గదలించి
నిలువుటద్దము ముందు నిలువంబడినవాడు.

అప్రయత్నమ్ముగా ఆస్య ప్రదేశాన
చిరునవ్వు వీచికల్ చెంగలించుచునుండ
చెదరి పోయిన నీల చికురముల్ సవరించు
కొన్నవా డందాల చిన్నిదువ్వెనతోడ.

మెడనుండి నను దీసి మేజాపయి న్నిల్పి
చక్కందనాల యీ చందుగా కొనివచ్చి
పసపుపచ్చని పట్టుబట్ట పరచినయంత
శయనమ్ము నా కిందు సజ్జీకృతం బయ్యె.

అవల నాథుడు నన్ను నంజలిం గీలించి
విప్పుగన్నులతోడ వీక్షించి వీక్షించి

ముద్దాడి పవడంపుమోవితో ప్రీతిమై
మెల్లగా జేర్చె నీమేలిపేటికలోన.

౫

ఒకరేయి నాస్వామి యుత్సాహమున వచ్చి
మెరుపుదీపముక్రింది మేల్మిపవద్యపై
ఆసీనుడై ఒక్క యంగుళీయము దీసి
తన కనిష్ఠికనుండి, యనియె నాతో నిట్లు:

అంగుళీయకము చ్చె బాల
అనురక్తి తోపుష్పమాల!
పూదోటలో ముద్దుపొగడ భూజము క్రింద
చలువ రాతిన్నెపై చక్కగా గూర్చుండి
అంగుళీ...

తలిరాకు కెనయైన తన యనామికనుండి
ఉంగరమును దీసి యుంచె నావ్రేలిపై
అంగుళీ...

తారకాకాంతిలో ధగధగ ద్యుతులతో
మెరయు పాడి వజ్రాల మేల్మియుంగర మొకటి
అంగుళీ...

ఉంగరమును బెట్టి యొడిలోన గూర్చుండి
కౌగిలించినది నాకమనీయ కంఠమ్ము
అంగుళీ...

కనులు మూసినవేళ కనులు తెరచినవేళ
మీ మనోహర మూర్తి మెలగు నన్నది కన్నె
అంగుళీ...

దూరమ్ముగా నున్న దుర్దినమ్ములలోన
ఎట్లు జీవింతు నే హృదయేశ్వరా యనియె
అంగుళీ...

సంయోగచిహ్న మీస్వర్ణాంగుళీయంబు
ఈ వ్రేలినుండి మీ రెపుడు విడువకు డనియె
అంగుళీ...

చాలకున్నది నాకు సాహసము ప్రాణేశ!
అయిన మీదాననే యగుదు వేగమె యనియె
అంగుళీ...

అని కనిష్ఠకకు నా యంగుళీయము తొడిగి
సారెసారెకు దాని సమ్మదంబున త్రిప్పి
విద్యుదాలోకాన వీక్షించి వీక్షించి
ముద్రించి దానిపై ముద్దు దీర్ఘమ్ముగా
చివర కాముద్రికను చిగురుటాకునుబోలు
తన వ్రేలియెడనుంచి తప్పించి యిట్టు లనె:
ఈ వ్రేలిసాంగత్య మెడబాయకుండ
ననిశమ్ము ధరియింపు డంగుళీయకము
నని ఇందిరా దేవి ఆన తిచ్చినది.

అనుసరింపగ జాల నామె యానతిని–
పరిణయ మగుదాక పరు లుంగరమ్ము
నా వ్రేలిపై గాంచ న్యాయమ్ము కాదు.

నీవు పేటికలోన నివసింప జాల
వెల్లవేళలయందు నేకాంతముగను,
ఉండు తోడుగ నీకు ఉంగరం బిందు.

సతత పరస్పర సంసర్గ వశత
సంక్రమించును గాక స్వర్ణాభ నీకు,
తావి యబ్బును గాక తపనీయమునకు.

అని ముద్దు ముద్దుగా నరచేత లాలించి
నా యంతికమునందు నాథు డుంచెను దావి.

## ౬

నన్ను మెడలో దాల్చి నానాథు డొకనాడు
ముద్దాడి ముద్దాడి ముకురమ్మున న్నిజ
ప్రతిబింబమును గాంచి ప్రమదంబుతో దంత
పంక్తి కాంతుల నీన పలికె నాతో నిట్లు :

ఎట్టకేలకు వచ్చె నీమాధవునకు
మాలికా, మాలికా, మంచిదినాలు !
ఈనాడు మొదలుగా నేడవనాడు
ఏతెంచు మనయింటి కిందిరా దేవి.

ఆమెసందేహమ్ము లపనీత మయ్యె
అనురాగభరముచే, అత్యవిశ్వాస
ముదయింపగా నామె యుత్కంఠతోడ
గృహిణీత్వమునకు నంగీకరించినది.

సప్తాహకాలము జరుగుచుండంగ
మంగళధ్వనులతో మార్మ్రోగ గలదు
చక్కందనాల యీసౌధరాజంబు
ఆనంద మెల్లెడ నలముకొనంగ.

మాలికా, మాలికా, మంచిదినాలు
ఎట్టకేలకు వచ్చె నీమాధవునకు.
అననుభూతం బైన యాశ్రమసౌఖ్య
మచిరకాలములో నలవడుగాక !

౨

కడచె సప్తాహము కనిపెట్టుకొని యుంటి
చూచుచుత్కంఠతో సుముహూర్తసమయంబు.
నాథుండు రాలేదు నను మరచెనో యేమొ
మంగళప్రమదాన మగ్నుడై యనుకొంటి.
ఏ మయ్యెనో యనుచు నెంచుచుండంగనే
గడచిపోయెను మాసకాలము: నాస్వామి
చనుదెంచి యొకనాడు చందుకా ద్వారంబు
తెరచి యల్లన నన్ను తేరిచూచె నొకింత.

అచటి నిషద్యపై నాసీనుడై స్వామి
నను కేల గిలించి నయనయుగము నిల్పి
యుండగా బొటబొటని యుష్ణ బాష్ప కణాలు
నాలు గైదో రాలె నా శరీరముమీద.

ఒడలు కంపింప నే నులికిపడి వీక్షించి,
ఏల నాథున కొదవె నీవిచారం బనుచు
భావించుచుండగా బాష్పముల్ దుడిచికొని
ఎలుగు రాపడ నాత డిట్టు లనె వింతగా:

ఏమి చేతు ! ఆమెమనసు
ఏలొ కాని మారిపోయె
వివశపరప దాయె నేను
వేవిధాల వేడికొన్న
మాలికా, మాలికా !

గతమాసమునందు నిండు
గంగావాహిని పోలిక
ప్రవహించెడి హృదయం బీ
పట్టున హిమఖండ మయ్యె
మాలికా, మాలికా !

మున్ను వివశ యగుచు తానె
ముందుగ నను గౌగిలించు
కొను లతాంగి యీ రాతిరి
కొంత దూరమందు నిలిచె
మాలికా, మాలికా !

ఇంతకు మును ప్రేమ వశత
ఇంట నన్ను స్తుతియించెడి
మానిని కొన్నాళ్ళనుండి
మౌనముద్ర దాల్చె నంట
మాలికా, మాలికా !

భావము లే దంట తనకు
పరిణయమ్ముపై నిప్పుడు.
ఇంతటి పరివర్తనమున
కేమి కతమొ తెలియరాదు
మాలికా, మాలికా !

మా సమాగమము జరుగ
మరల వీలు లే దన్నది–
తెలియలేదు కారణ మీ
దిట్టతనము పూనుటకై
మాలికా, మాలికా !

నన్ను జూచినంతలోనె
నవనీతమువలె కరగెడి
బాలహృదయ మింతలోనె
పాషాణం బయిపోయెను
మాలికా, మాలికా !

పూర్ణముగా పరిపాకము
పొందని యాముద్దరాలి
త్వరపెట్టుచునుంట గొప్ప
తప్పేమో తెలియదాయె
మాలికా, మాలికా !

నిశ్చలత్వమందు నాకు
నిండు గౌరవంబు, కాని
గడియ గడియ చెందు మార్పు

గ్రహియింపం జాల నేను
మాలికా, మాలికా!

స్త్రీ హృదయము చంచలమని
చెప్పుదు రనుభవ వేత్తలు.
బ్రహ్మచారి సరళ మతికి
బాధ యొకటి మిగిలి యుండు
మాలికా, మాలికా!

ఆ ప్రేమ వసంతమ్మున
కీ విరాగ శిశిరమ్మున
కెంత తారతమ్య మకట!
ఏమి వింత లోకం బిది!
మాలికా, మాలికా!

నిష్కల్మష హృదయముతో
విందుగ ప్రేమించినాను
గ్రహియింపక పోవునె యీ
కన్నియ యెన్నటి కైనను మాలికా!

అని విడిచి నిట్టూరు పట్టె నానాథుండు
చెక్కిటం జెయి చేర్చి చింతాభరాక్రాంత
వదనంబుతో గొంతవడికి మెల్లన లేచి
పిదప జేర్చెను నన్ను పేటికాశయ్యపై.

స్వామివాక్కులవలన చాల ముగ్ధ దోచె
ఇందిరా లలితాంగి! ఏదో వైవిధ్యంబు
పాప; మాయామమనసు బాధింపగా బోలు-
అదియె కాకున్నచో నట్లు వర్తించునా!

వెడఁ గైననే కాని విడువజాలదు నాథు !
కొంతకాలము గడవ కుదుట బడి మానసము
ద్విగుణీకృతం బైనవిమలానురక్తితో
స్వామిపాదాలపై వ్రాలు నని తలచితిని.

౨

బహుదినమ్ములు దాటె: పడియుండ పేటిలో
శైథిల్య మొక్కింత సంక్రమించెను నాకు.
బాలభానుప్రభా ప్రసరణమ్మునకునై
మందానిలమ్ముకై మది జనించెను కోర్కి.

ఏ మయ్యెనో అల్ల యిందిరా లలితాంగి,
ఇంతకాలము నాథు డెచ్చోట నున్నాడొ
కాలమ్ము వ్యథలలో గడుపుచున్నాడేమొ
అని కలంత జనించె సంతరంగమునందు.

ఏ నెరుంగుదు నాత డెల్లవేళలయందు
భావించు నని నిజ ప్రాణేశ్వరిం గూర్చి:
అర్ధాంగి కాదేని యామె శత్రుమ్ముగా
అనుభవించును మనోవ్యథ నిగూఢమ్ముగా.

ఒక్క వాసరమునం దుదయకాలమునందు
చందువా కొక్కింత చలనంబు కలిగినది.
చల్లగా దెరచి నాస్వామి పేటికమూత
నేత్రాంబుజంబుల న్నిల్పె నాపై ప్రీతి.

అల్లనల్లన నన్ను నరచేత నుంచికొని
తామ్రారుణము లైన తన యోష్ఠములతోడ
ముద్దాడ నాతండు మొలక లెత్తెను మేన
ఆనందపారవశ్యంబుచే నావేళ.

అవల నాథుడు నన్ను ఆదిత్యకాంతిలో
ఒక్కింతతడ వుంచి యొడలిమీది పరాగ
మూది పేటిక బూని యుత్సాహియై లోని
కరుదెంచి మృదువుగా నాలాపనము చేసె:

అధిక కష్టము మీద మాలికా
ఆమె నీక్షించితిని ,,
కుశల మడిగిన యంత ,,
కోపమ్ము చాలరేగ ,,
బహువిధంబుల నేను ,,
బతిమాలుకొన్నాను ,,
కొంతతడవున కామె ,,
కోపమ్ము విడిచినది ,,
అంత నా ప్రియురాలు ,,
అభిముఖమ్ముగ నిల్చి ,,
జారిపోయెడి వేణి ,,
సవరించుకొని వ్రేళ్ళ ,,
నయనముల్ పై కెత్తి ,,
నన్ను వీక్షించినది ,,
చల్ల నా చూపుతో ,,
శాంతి యొదవెను కొంత ,,
అవల దోషాలామె ,,

ఆరోపణము చేసె మాలికా
అంతరంగమునందు ,,
అధిక వేదన కలిగ ,,
తోచినది యెవ్వరో ,,
దుర్బోధ చేసె గని ,,
నిఖిలమ్ము వివరింప ,,
నిజ మామె గ్రహియించె ,,
సుముఖి యగుచుండగా ,,
చూచి యిట్లన్నాను ,,

నీ ముద్దువ్రేలిపై నిరుపమమ్ముగ వెలుగు
అంగుళీయక మిమ్ము ప్రియురాలా !
నీ యురోభాగమున నిస్తులమ్ముగ వేలు
కనకహారము నిమ్ము ప్రియురాలా !
తామ్రారుణంబైన తావకీన కరమ్ము
నాచేత నుంచుమో ప్రియురాలా !
నిర్మలాగాధ మౌ నీప్రేమసరసిలో
నను తేలియాడనీ ప్రియురాలా !

ఆలింగనము చేయు మాలికా
ఆసక్తి పొడమినది ,,
ఆ ప్రదేశమునందు ,,
అవకాశమే లేదు ,,
అనురాగ దృష్టితో ,,
ఆమె నను వీక్షించి ,,
హస్తాగ్రమందుండి ,,
అంగుళీయము తీసి ,,

కంఠదేశమునుండి మాలికా
కనకహారము దీసి ,,
ప్రేమతో నాచేత ,,
పెట్టబోయెడు వేళ ,,
అచ్చోటి కెవ్వరో ,,
అరుగుదెంచిన వారు ,,
ఉలికిపాటున నామె ,,
ఉపసంహరించినది ,,
త్వరలోన వత్తు నని ,,
తరలె నచ్చటినుండి ,,

ఈవిధంబున స్వామి ఇందిరోదంతము
కర్ణపేయము చేయ కల్యాణసమయము
ఆసన్న మయ్యె నని ఆనంద మొందితిని,
శుభకార్యమున కెదురు చూడగా సాగితిని.

౬

మరల నాథుడు కొన్ని మాసములు నావంక
చూడకుండుట జేసి శుభ కార్య సూచనల్
తొలగిపోయిన వనుచు దుఃఖించి దుఃఖించి
మాంద్యముతో నేను మందసమ్మున నుంటి.
అరుదెంచి యొక్క నాడాకస్మికముగా
నాథుండు మెల్లగా నను కేల గీలించి
తల యూచి యేమేమొ తలపోసి తలపోసి
చిరునవ్వు మోముతో చెప్పె నీ రీతిగా:

వార్త చేరగనె ప్రియురాలు
వచ్చె నెదురుగా ,,
వ్రీడావతియై ,,
వీక్షించెను నను ,,
కుశలం బడుగగ ,,
కూర్చో మన్నది ,,
మాటల ధోరణి ,,
మార్చి వేసినది ,,
మారితి నే మన ,,
మౌనము దాల్చెను ,,

దిగులు పడినా నపుడు మాలికా
తెలివి కోల్పోయి నే ,,
ఎట్టు కేలకు నేను ,,
ఇటు లంటి నామెతో ,,

తప్పు చేసితి నేని దయ యుంచి తెలుపుమా
నింద లెవ రేనియును నీతోడ జెప్పిరా
ప్రియురాలా, ప్రియురాలా !

తోచెనా నాలోన దోష మెట్టిది యైన
ప్రేమలో నేమైన భేదమ్ము పొడమెనా
ప్రియురాలా, ప్రియురాలా !

అని నేను మాలికా, అన్నివిధాల
ఎంతయో వేడితి, ఇందిరా దేవి
భావాన లేదాయె పరివర్తనమ్ము.

అనురాగ మిందిరా, అంతరించినద
ప్రత్యుత్తరము లేదు ప్రణయ లేఖలకు
అన, నేలచూపులతో నామె యి ట్లనియె :

ఏమి యింత వాక్యములు
హృదయేశా, మీయందే
దోషము లేశ మైన గాని
తోచలేదు నిక్కముగ.

ప్రత్యుత్తర మేను వేరె
పంప నేల? నిరతము నా
యంతరంగమందు నాథ,
అనురాగము నిండియుండ?

ప్రేమ నగర కీ రాహా కఠిన హై!
ప్రేయసికయి నే, నేయది యయినన్
సంతోషముతో సలుపగ నేర్తున్
ప్రేమ నగర కీ...

ఇష్టము లగు నా కట్టి బాధలును
ఆయమసుఖమే నాయది కాదా
ప్రేమ నగర కీ...

ఆర్ద్రహృదయురా లాయమ యెపుడో
దయ కలుగగ నను ధన్యుని జేయున్
ప్రేమ నగర కీ రాహా కఠిన హై.

## ౧౦

పెరవారి చెవులలో ప్రేమ వృత్తాంతంబు
వేయ సరసము కాదు, విభుడు మీ మిత్రంబు
చెప్పి యుండగ నోపు స్వీయ ప్రణయగాథ.
కాని వాచాలతన్ క్షమియింపరా మీరు !

ఆమె స్వామికి లభ్య యగుట కలలో వార్త !
అతడామెను మరచు టన్న కలలో వార్త !
స్వీకరించునయేని విభు నొక్కచో ముందు
ఇక్కట్లపాల్ చేయు ఇందిరా లలితాంగి !

చాల కాలం బాయె స్వామిహస్తము సోకి !
నన్ను నిం కొకసారి నాథుండు ముద్దాడి
గదియించుకొన్నచో కంఠ ప్రదేశాన
ప్రమదంబుతో నేను ప్రాణాలు విడుతునే !

పుష్పమాలికగానె పుట్టియుండన యేని
పూబోణిగా నేను పుట్టగలిగితి నేని
అతనినే వరియించి ఆత్మవల్లభునిగా
కౌగిలింతు తదీయ కంఠమే నేవేళ !

సమాప్తము

# సా ధ కు డు

అంకితము

శ్రీ అడివి బాపి రాజుకు

# ఆ శా వా న్

## అ న్వీ క్ష

ఇట్లు వాపోయెదు వేటికోయీ కుమార,
ప్రాణసఖి ప్రాణసఖి యంచు పలవరించి?
ఇంక నైనను శాంతి వహింపు మోయి!
నీవు రోదించినను గూడ నిష్ఫలమ్మె.

## సా ధ కు డు

ఏమి చేయుదు తల్లి, ఈ హృదయము నిబిడ
ఘోర దుఃఖ తుషాగ్నిలో కుములి కుములి
తాళ జాలక యీ నివిక్త స్థలాన
ఏడ్చుచున్నాను కూర్చుండి యేకతముగ.

భూరి దుఃఖతరంగముల్ పొంగి పొరలి
క్రమ్ముకొని వచ్చుచున్నవి గట్టు దాటి.
ఎవ్వ డున్నాడు నాకన్న నిపుడు దుఃఖ
భాజనుం డన్య దేతత్ప్రపంచమందు!

## అ న్వీ క్ష

తగునె నీకు కుమార, ఈ దైన్య వృత్తి!
ధీరతం దాల్చి యెటో నిరోధింపవలయు
దుఃఖ వీచీ పరంపర: తొలగి చనును
శోకమున గుండె బరువని నాకు తెలియు.

అయిన, తొలిసు బూని నీ యశ్రు సిక్త
గండ భాగమ్ములను బాష్పకణ సమేత
లోచనముల దుడిచి విలోలకేశ
జాలముల్ సవరించి నా చాయ జూడు.

బాధ పడినంత మాత్రాన ఫలము కలదె!
ఇంచుకైనను నీవు యోచింప కకట,
అశ్రు చూపెద వేమిటి కందనట్టి
మ్రానిపండు భుజింప! — అమాయికుడవు!

సా ధ కు డు

మానసాబ్ధి నింత మథనమ్ము జరుగంగ
ఉద్భవింప కమృత ముండు టెట్లు?
పడిన బాధ యెల్ల ఫలితమ్ము లేకుండ
పోవు టెట్లు తల్లి, బోధ పడదు.

అ పే క్ష

వెఱ్ఱివాడవు! కోరిక విడువ లేక
ప్రాణసఖికోస మింతగా బాధపడెదు!
అశ్రుమోచన వృత్తాంత మామె చెవిని
జేరనే యున్నదేనియు చిన్నవాడ!

సా ధ కు డు

భావ వీచికాళి పయనించి ఆయమ—
కర్ణగోచరమ్ము కాక పోదు.
నిఖిల జగమునందు నిష్ఫలమ్మయి చను
కార్య మేది కూడ కాన రాదు.

### ఆ న్వీ క్ష

సత్యమే యగు నియ్యది శాస్త్రదృష్టి-
నీ విలాపమ్ముచే నామె నిష్ఠురహృది
కరగు చిహ్నె లవంబేని కానవచ్చు
చున్నదా నీకు, వచియింపు మోకుమార!

### సా ధ కు డు

చర్మచక్షువులకు స్పష్టవిధమ్మున
కానరాదు చిహ్నె: కాని తల్లి,
కఠినహృదయురాలు కా దామె యని మదీ
యాంతరంగ సీమయందు దోచు.

### ఆ న్వీ క్ష

మంచిమాట! నీవు మరచిన ట్లున్నావు
ముఖ్యవిషయ మొకటి మొదటినుండి.
నీవు నామె కున్న నిరుపమాంతరమును
ఇప్పు డొక్కసారి యెంచి చూడు.

### సా ధ కు డు

ఆమె మహోన్నత హిమవ
ద్భూమీధర శృంగమందు బుట్టి నితాంత
శ్రీ మెరసెడి భాగీరథి-
సామాన్యుడ మంగళాద్రి సానువుమీదన్.
చిరతర భూరి తపఃఫల
పరిపాకంబునను బడయుభాగ్యం బొదవున్
తరుణీమణి నని యంతర
మెరిగియె ధ్యానింతు జీవితేశ్వరిని సదా.

## అన్వీక్ష

ఇంతకన్న నీకు నింకెట్టి ధ్యేయంబు
కానబడదొ? ఇట్లు కాలహానన
మేల చేయువాడ? యికనైన ఆ చింత
మాని సుఖముతోడ మనుము తండ్రి !

## సాధకుడు

ధ్యేయం బీ జన్మములో
ఆయువు మొక్కటియె కాక అన్యముగా నా
కేయది స్ఫురియింపదు, త
దీయోపాసనయె నిర్వృతిం గృపసేయున్.

కాలహానంబు చేయుట
యేలా గనవచ్చు జీవితేశ్వరి నెదలో
ఆలంబన మూర్తిగ నే
నాలోకనసుఖము నొందు ననవరతంబున్ !

## అన్వీక్ష

వెర్రివాడ! ఇంత విగతత్రపుండవై
మగువ నొకతె నిట్లు పొగడ నేల!
స్వస్వరూప మేదొ స్మరియింపకున్నావు
విడిచిపెట్టినావు విధుల నెల్ల.

నవ్వుచున్నవారు నలుగురు నిను గాంచి:
లోకభయముకూడ నీకు లేద!
చెడుదు వీవు తుదకు చెవి బెట్ట కక్కటా
హేతువాద లేశమేని తండ్రి !

## సా ధ కు డు

తల్లీ, నిజముగా త్యజియించినాను
సిగ్గన్న యూహయే: జీవితేశ్వరిని
నేను స్మరించిన నిముసమ్ము లోన
ఉన్నత భావమ్ము లుదయించుచుండు.

లోక భయమ్ముతో నా కేల తల్లి!
అంద రన్ని విధాల నను దుంత్రు, నేనో
నిశ్చల బుద్ధితో నిరతమ్ము నామె
దలపోతు విఘ్నలను త్యజియించివేసి.

హేతు వాదమ్ముచే నేమి ఫలమ్ము!
వ్యావహారిక దృష్టి వచ్చి బాధింప
అపనయించును దాని నంతరంగంబు:
శాంతి లే కున్న దీసంగరంబందు.

## అ న్వే ష

లే దిక లాభము నీతో
వాదించిన కొలది నాకు వాగ్వ్యథ! అయ్యో
పోదా నీ గాఢ భ్రమ?
లే దోయి సుఖంబు నీకు లేశం బయినన్!

## సా ధ కు డు

దుఃఖభూయిష్ఠమై తోచు లోకాన
సత్యముగా గాఢ సౌఖ్యమ్ము కలదె?
తారతమ్యమ్మును దాల్చి దుఃఖంబె
సుఖముపోలికను తోచుచునుండు జగతి.

నాదుఃఖభారమేనాటికి తొలగు !
ఏమి చేయుదు ! జీవితేశ్వరి మనసు
కరగెడి మార్గంబు కానరాదాయె :
ఏమి చేయుదు ప్రియా, ఏమి చేయుదును !

కవివరుండనయేని గాఢానురక్తి
బహువిధంబుల కావ్యబంధంబునందు
వర్ణించి వర్ణించి వల్గువాక్కులను
కరగించియుందు నీ గట్టిమనస్సు.

గాయకుండనయేని గాఢానురాగ
పరిపూర్ణ గీతికా పదసముచ్చయము
కర్ణామృతమ్ముగా గానమ్ము చేసి
కరగించియుందు నీ గట్టిమనస్సు.

శిల్పినైతినయేని సిద్ధహస్తమున
గాఢరాగ వ్యంజకమ్ము లౌ గతులు
కన్నులపండువు గాగ చిత్రించి
కరగించియుందు నీ గట్టిమనస్సు !

కవివరుండను కాను, కాను గాయకుడ,
కాను శిల్పిని, ప్రజ్ఞ కలవాడ కాను!
ఉన్న యోగ్యత ప్రియా ఒక్కటే నాకు-
అనురాగ పరిపూరి తాంతరంగంబె.

ఏకాకినైన నా కెవ్వరున్నారు
నీకన్న ప్రియతమా, నిఖిలలోకమున !
నను కటాక్షింపవే నా జీవదాత్రి !
నను స్వీకరింపవే నా ప్రాణకాంత !

# శిలా ప్రతిమ

## శిలా ప్రతిమ

బహు దినాల నుండి పరికించుచున్నాను—
వింత గొలుపు నీదు విధము మిగుల.
పవలు రేలు నీవు ప్రాణప్రియా యంచు
పాడుచుందు వేల పడతి గూర్చి?

ప్రతి దినమ్ము కూడ నుతియించు చున్నావు
కఠిన శిలలు జాలి కరగునట్లు.
నిజ సుధార్ద్రదృష్టి నిలిపి నీపై నామె
యెన్నడేని కనికరించె నొక్కొ?

## సాధకుడు

స్నిగ్ధ హృదయాబ్జ మైన నా జీవితేశ్వ
రీ కృపాలోకనము ప్రసరించు వరకు
భ్రమర రూపముతో నామె శ్రవణపాళి
పాట పాడుచు వేడుదు ప్రత్యహమ్ము.

## శిలా ప్రతిమ

కఠిన హృదయురాలు కాదేని ఆకన్నె
మౌన మింత కాల మూను టేల!
నిష్కళంక మైన నీ ప్రేమలహరిలో
కరగిపోవ దేమి కన్నె మనసు!

### సాధకుడు

స్నిగ్ధ హృదయాబ్జ మైన నా జీవితేశ్వ
రీ కృపాలోకనము ప్రసరింపవలెను
సుమపరాగమ్మునై యామె సుందరాంఘ్రి
పంకజముల నంటి సేవింతు ప్రత్యహమ్ము.

### శిలా ప్రతిమ

కుశలబుద్ధి వయ్యు కొంచెమేనియు తత్త్వ
మరయ కున్నవాడ వక్కట!
ఎట్లు బ్రతుకువాడ వీ వింత జగములో
వర్తమాన సకల వర్తనమున?

### సాధకుడు

ఈ విచిత్ర జగమ్ములో నేను నాదు
ఓ ప్రమా దేవి! ప్రేయసి యొకతె చాలు
సర్వలోకము లబ్ధమౌనటనె దోచు
ప్రియ హృదయాబ్జమందు వ్యాపించియుండ.

### శిలా ప్రతిమ

ప్రతి దినమ్ము నీవు ప్రమ విగ్రహమ్మును
కన్నులార జూచుచున్నవాడ,
వయిన నిన్ను భ్రమయె ఆవరించిన దేమి
సాంద్ర ఐహికమోహ సకలబుద్ధి!

### సాధకుడు

గాఢ విశ్వాస మొక్కటే కలదు తల్లి,
నన్ను ప్రేయసి కరుణ నేనాటికైన

స్వీకరింపక పోదని, చెప్పజాల
తక్కు గలవి సమీక్షించి తర్కదృష్టి.

శిలా ప్రతిమ

వెఱ్ఱిమాట! గాఢ విశ్వాస మున్నంత
మాత్రముననె యేమి మంచి యొదవు?
వివిధ విషయములను విమర్శింపకున్నచో
నిజము తెలియు టెట్లు నీకు తండ్రి!

సాధకుడు

నిజము ప్రియురాలు మాత్రము- నిఖిలలోక
మెట్లు చరియించుచున్న నా కేమి చింత!
పూర్వ మెరుగను ననుభవ పూర్వకముగ
తల్లి, నా ప్రేయసీ మనోధర్మ మెల్ల.

శిలా ప్రతిమ

అయ్యొ, యేమి వెఱ్ఱి! అన్యథా భావింప
కుండు వేని యడుగు దొక్కమాట:
దేని వలన నీవు దేవతగా నెంచు
చుండు వామె నెప్పుడో కుమార!

సాధకుడు

ఆమె మానవ యువతియే యగుట నిజము:
కాని, ఆయమ పల్కులు కర్ణగోచ
రమ్ము లైనంత నాకు నిర్జర మనోజ్ఞ
మధుర సంగీత నాదము మాడ్కి దోచు.

ఆమె మానవ యువతియే యగుట నిజము:
కాని, ఆయమ రూపమ్ము కానవచ్చి
నంతనే నాకు సర్వ లోకైక నయన
హారి సౌందర్య దేవతయట్లు తోచు.

ఆమె మానవ యువతియే యగుట నిజము:
కాని, ఆయమ మెత్తని మేను సోకి
నంతనే నాకు పారవశ్యమ్ము కలిగి
అద్వితీయ మహానంద మట్లు తోచు.

### శిలాప్రతిమ

చాలు జాలు నోయి! సామాన్యురాలిపై
నిట్టి దృష్టి యుంట యేమి సొగసు?
ఇంక మీద నెప్పు డిటు మాటలాడకు,
ప్రాజ్ఞు లెల్ల నిన్ను పరిహసింత్రు.

### సాధకుడు

అఖిలము సహింపగలదు గాఢానురాగ,
మట్టియెడ లజ్జయును దుస్సహమ్ము కాదు.
ప్రాజ్ఞులకు నేను పరిహాసపాత్ర మెప్పు
డగుదు, నప్పుడె నాదోష మన్నమాట.

### శిలాప్రతిమ

శుభము కలుగ నీకు నభిమతం బగునేని
సర్వశీ మానసుండవ, సత్వరమ్మె
ఉజ్జగింపవలయు నూహములో కూడ
నామె కన్యయించునట్టి దెల్ల.

## సాధకుడు

ఆర్ద్రహృదయమ్ముతో ప్రియురాలు నాకు
తొలుత నొసగిన రమ్యవస్తువుల నెల్ల
మరణకాలమునందు సమ్మదముతోడ
ఎడదపై జేర్చి ప్రాణముల్ విడుతుగాక!

నిఖిల సౌందర్య సముదాయ నిలయమైన
ప్రణయినీ రమ్యముఖ చిత్రపటమువంక
మరణకాలమునందు సమ్మదముతోడ
వీక్షణము నిల్పి ప్రాణముల్ విడుతుగాక!

అఖిల మధురాతిమధుర నామాతిశాయి
యైన ప్రియురాలి నామధేయమ్ము నేను
మరణకాలమునందు సమ్మదముతోడ
తడబడక పల్కి ప్రాణముల్ విడుతుగాక!

## శిలాప్రతిమ

నాకు జాలి కల్గినది గాని నీమీద
కరగ జేసి యామె కరకుమనసు ?
కాని లెమ్ము: బుద్ధి కర్మానుసారిణి,
కొంతవడికి నిజము గోచరించు.

*　　　*

## సాధకుడు

అహరహోపాస్య దైవత మైన చంద్ర
కాంత పాషాణ నిర్మిత కమ్రమూర్తి

ఈ ప్రమా దేవియే ద్రవియించె గాని
నీకు మాత్రము ప్రియురాల, కెనరు లేదు !

అన్యభావము లన్నిటి నవల ద్రోసి
చిత్త సద్మమునం బ్రవేశించి దేవి,
నిన్ను ధ్యానించు చున్నాను నిరత మేను :
నీకు మాత్రము నామీద కెనరు లేదు !

ప్రవిమల ప్రేమరస సుధాపాన మత్త
వివశహృదయుండనై లజ్జ విడచి, నిన్ను
స్తవము చేయుచునుందు నక్తందివమ్ము :
నీకు మాత్రము నామీద కెనరు లేదు !

దైవ వశమున నీ సన్నిధాన లాభ
మొదవగా దేవి, గర్వము నుజ్జగించి
పాదముల మీద వ్రాలితి ప్రణయ పరత :
నీకు మాత్రము నామీద కెనరు లేదు!

# వా తా య న ము

౧

“ఆవలి మేడను జూచుచున్నా
డనిమిషం బగు కూస్యదృక్కులం
మిత్రమా, ఆ వింతపురుషుని మీర లెరుగుదురా!”

“మాటలాడితి నతనితో నొక
మారు మున్నె: చాల సరసుడు
బాధపడుచున్నాడు పాపము ప్రేమకు లోనగుచున్.”

“అతడు వీక్షణములను నిలిపిన
హర్మ్యమం దొకవనిత యున్నది–
ఆమె మోడలను వలపుచే నతడట్లు వర్తించున్.

“కొన్ని మాసములకు ముందను
కొన్నవారలు పురజనంబులు
సుందరాంబకు మాధవునకును శుభముహూర్త మని.

“చెప్పుకొన్నా రవల నేదో
చిక్కుచే కల్యాణ మాగిన,
దింక లాభము పట్టిదే యని యిరుగు పొరుగు జనుల్.

“బుద్ధిమంతుడె కాని యతనికి
బోధపడ దీ లోకవృత్తము:
పాప, యిట్టి యమాయికులకే బాధ ఘటియిల్లున్.

"ఎట్టి ధీమంతుండు కాని
ఎందులకు కొఱగాడు సఖుడా,
వామలోచన మోహసంకుల వాగురం బడుచోన్.

"కలియ డెవ్వరితోడ, కలిసిన
కావ్యధోరణి బ్రసంగించును–
కారణము కానోపు మెలగుట కవిసమూహముతో.

"కాంచితివి గద యతని బ్రాతః
కాలమున వాతాయనమ్మున–
ఎంత రాతిరివేళ జూచిన నిట్టె కానబడున్."

"అంతరాయము కలుగుచోఁ గ
ల్యాణ మావల సంఘటిల్లుట
అసంభావ్యము! కాని పెండ్లిం డసంఖ్యాకంబుల్.

"నాకు వింతగ నుండు మిత్రమ,
నవీనులలో ప్రేమ కోసము
చెడుదు మన్నా రెందరెందరో చిత్త విత్తములన్!'

౨

"చూడు బావా, మేడ కిటికీ
చువ్వ లానుకు కూరుచున్నా,
డప్పుడు సుందరి నిత్తు రన్నది అతనికే కాదా?"

"అప్పు డనుకొన్నారు కాని
అవల సందర్భములు మారెను
వీరి కింక వివాహ మయ్యెడి విధము లేదోయి!

"కారణమ్ములలోన మన శా
ఖా ప్రియత్వము ప్రబల మైనది :
మర్కటమ్ముల కుండ దగినది మానవుల కేలో ?

"ఈ వివాహమునెడల పెద్దల
కిచ్చ యేమాత్రమ్ము లే దని
మాకు దెలియును కాని బయటికిమాత్ర మే మనము.

"అన్నివిధముల యోగ్యు డత డని
అంద గందురు— యథార్థమే
తగదు సుందరి అతని కని నే దలతు నిక్కముగా.

"అతనిభావం బీమె దేవత
యనియె ! పాపము, నవీనులలో
చాలమందికి తాము వలచినదాన దేవతయే !

"పెద్దవారికి దెలియకుండనె
పెండ్లి యాడెడి సాహసమ్మున
మరద లోకరయెడ బయలుదేరగ మాన్పితిని నేనే."

"నీవె బావా అడ్డుపడినది
నిజముగా ! నే నమ్మజాలను !
ఆర్ద్రహృదయుడ వైన నీవే అట్లు చేసితివా !

"పరిణయంబే యైనచో సుఖ
పడెడివారల కంతరాయం
బెంత బాధాకరము బావా, యెంచి చూచితివా?"

"బాధ యుండుట సహజమే ప్ర
ప్రథమ మందు, క్రమక్రమమ్ముగ
పడుచు వారలు విస్మరింతురు పడిన కష్టములన్.

భ్రాంతి విడువగ జాల కాతడు
బాధపడుచున్నాడు, నిజముగ
సుందరాంబను పెండ్లియాడిన సుఖపడుట కల్ల !

“మరదలేమో అతని యెడ గల
మమత విడిచిన, దింక నాతడు
మనసు మరి కొన్నాళ్ళ కైనను మార్చుకో గలడు.

“ప్రేమ వల్లను సుఖము కలదా ?
పెద్దవారికి విరుద్ధముగా
స్వయంవరములు బ్రాహ్మణులలో జయము కాంచినవా?”

3

“అదుగో కిటికీవెనుక ప్రక్కను !
ఆయనే మనయింటి కప్పుడు
పెండ్లివిందుకు వచ్చె కాదా పెద్దతమ్మునితో!”

“అతనివైపే చూడబోకుము !
అడుగు వేయవె ముందు పిల్లా !
సంశయింతురు మనల లోకులు జాగుచేసితిమా.

“జ్ఞప్తి యున్నది నాకు పిల్లా,
చాలసారులు తిరిగి యటు నిటు
చివర కటా తాంబూల మాయనచేత బెట్టితివి.

“నీకు బాగున్నాడు, మరి నీ
నేస్తురాలికి సుందరాంబకు
నచ్చలేదట యెందుచేదనో నాకు జెప్పవటే?”

"మొదట ఆయన పేరు చెప్పిన
మరిచి పోవుచు నుండె సుందరి,
ఒడలు తెలియని వెర్రి వలపున ఊగి పోయెడిది.

"అంద కత్తియ కాక పోయిన
అంతో యింతో పాట పాడుచు
తేట లూరగ హంస లాగున తిరుగుచుండెడిది.

"ఏమి మాయలు చేసినారో
ఏమి తల కెక్కించినారో
పోరి పెద్దలు మార్చినా రటో బుద్ధి సుందరికి.

"ప్రేమ యున్నను నిక్కటమ్ముగ
పిచ్చి దానికి పట్టుకొన్నది
దురభిమాన పిశాచ మేదో దుర్దురాగ్రములో.

"పెద్దమేడకు వెల్ల కనుగొని
పిల్లదాని వివాహమే అని
అప్పుడను కొన్నారు చుట్టా లగ్రహారములో."

"ప్రేమమాటయె సత్య మగుచో
పెద్దవారికి నచ్చలే దని
మారిపోవునె సుందరాంబకు మన స్సంతటిలో?

"అంతచక్కని మంచివానికి
ఆంధ్రదేశమునందు తగినది
కన్నె కరవా నిజముగానే కావలనియున్న?

"నాకు పెండ్లియె కాకపోయిన
నమ్ము వదినా, పోయి ఆయన
పాదయుగ్మముమీద పడి నే భార్య నయిపోదున్!

"వలపులో మిగులునది బాధయె
వాస్తవముగా! మంచివారికి
ఫలము తగినది రాదు వదినా, పాడులోకములో!"

# అశరీర వాణి

## సాధకుడు

ఎవరు తల్లీ, నీవు ? చూచిన
ఏమొ భయమును విస్మయమ్మును
కలుగుచున్నవి : స్వప్న మేదో కాంచుచున్నానా !

ఎదురుగా నున్నపుడు తోచిన
దేక ముఖమే, కాని యించుక
కదలినప్పుడు చతుర్ముఖములు కానబడు నేమి ?

ఎల్లరూపము లెట్లో నీయం
దిమిడి యున్నను, ప్రధానముగా
స్త్రీత్వమే పొడకట్టు, ఎవరో తెలుపగదవమ్మా !

## అశరీర వాణి

జలముపోలిక వాయువిధమున
సంచరించుట నాస్వభావము :
ఎందు న న్నశరీరవాణిగ నెల్లలోకమ్ము.

## సాధకుడు

నాకు చంచలపదార్థముపై
నమ్మకము లేదెప్పు, డిచటికి
అరుగుదెంచిన హేతు వేమో అడుగుచున్నాను.

### అశరీర వాణి

నీ ప్రతిజ్ఞను నమ్మజాలను !
నీకు విశ్వాసము లేదా
లోకమున సర్వాతి చంచల లోలనేత్రయెడన్ ?

### సాధకుడు

గూఢ మగు నామనసు నీ కెటు
గోచరించిన ? ద కాలములో
ఇట్లు దర్శన మీయ వచ్చితి వేమి లాభంబో !

### అశరీర వాణి

అంతో యింతో తత్త్వవేత్తవు :
అవిదితంబా నాస్వరూపము ?
నాకు తెలియని దేమి యుండును నాల్గుదిక్కులలో ?

నిజముగా నీహితము కోరియె
నేను వచ్చితి– విశ్వసింపుము:
అస్మదుక్తులు కటువు లగుగా కాలకింపవలెన్.

తత్త్వ వేత్తకు తరుణి మీదను
తమక ముండుట వెర్రి కాదా ?
అందుచే పరిహాస పాత్రము వైతి వయ్యయ్యో !

### సాధకుడు

నడువయస్సును గడచు వారికి
నచ్చ నేరదు ప్రేమవృత్తము.
పరిహాసింతురు గాక లోకులు బాధ నా కేలా ?

అశరీర వాణి

నీవు వలచిన వామలోచన
నీకు తగినదె యని పురంబున
ఒకరిచే ననిపింతు వేనియు నూర కుండుదును.

వట్టి భ్రమ కాకున్న రంభో
ర్వశుల మండలిలోన చేరునె
పిచ్చివాడా, నీవు వలచిన పిల్ల లవ మైనన్?

తడబడక మాటాడ జాలని
దాని వాక్కులు దివ్య యువతీ
మధుర గానం బందు, వెంత యమాయికుడ వయ్యో!

వీణె సారించుటయు కొంచెము,
విద్య యించుక యున్నదానిని
సకల లలిత కలా చతురగ స్తవము చేయుదువే!

సాధకుడు

అన్య లెటు గ్రహియింప గలుగుదు
రామెలావణ్య ప్రభావము!
చూడవలె నానేత్రములతో శుద్ధమానసులై.

అన్య లే మనుకొన్న నా ప్రియు
రాలుమాత్రము సకల విద్యా
సారభూతగ నాకు దోచుట సముచితంబె కదా?

అశరీర వాణి

వలపు తలమున్కలుగ నుండెడి
వాని కయథార్థంబె సుఖదము:
కాచఖండము వజ్రదీధితి గ్రాలు నాతనికి.

## సాధకుడు

నీకు విశ్వాసమ్ము లేదా
నిర్మల ప్రేమమ్ము నా దని ?
అన్నిసారులు వలపు వల పని అందు వేవమ్మా !

## అశరీర వాణి

అందుకే జనియించుచున్నది
అధికసంతాపమ్ము ! యువతికి
నిర్మల ప్రేమమ్ము లేదే నీకువలె తండ్రీ !
క్రుచ్చుచున్న కొలంది పరిమళ
కుసుమములు వాసించు సూత్రము :
వాస్తవమ్ముగ జన్మచే నది పట్టి దారంబే.
ఆమె తెరగు గ్రహింప నేరక
ఆశపడుచున్నావు పాపము !
విడిచిపెట్టు మయోగ్యురాలిని వేగముగ తండ్రీ !

## సాధకుడు

ఎంత బాధించితివి తల్లీ !
ఇంక నే వినజాల ! ప్రేయసి
సర్వవిధముల నాకు పూజాస్థానమే సుమ్మీ !...
నిజముగానే లేకపోనీ
నీకు రూపము, కళలు, గుణములు_
సడల దెన్నడు నాకు విశ్వాసమ్ము ప్రియురాలా !

# మృగతృష్ణ

### యువ

వెడలి నారట పురికి వెనుక సప్తాహమ్ము—
మా అత్త దూరాన మార్గములో మిమ్ము
కను గొన్న దంట : మీ కడకు నన్నంపినది.

### సాధకుడు

విడువలే దీ సీమ : వింతగా నున్నదే !
అయిన నే మీయత్త కగపడుట యుక్తమే.

### యువ

ఆమెపై మీ కింక ననురాగ మున్నట్లు
వ్రాయుచున్నా రంట నారమ్ము వారమ్ము
అన్ని లేఖలు కూడ అతి మనోహరముగా—

### సాధకుడు

మాటలాడుదు నేమొ మనసు కెక్కెడు రీతి,
పత్రికా రచనలో ప్రజ్ఞ లేనే లేదు—
కలము పట్టుట మహా కష్టముగా నుండు.
అయిన, నీ కెటు తెలియు నందులో విషయాలు ?

### యువ

ఏమి తోచక పిలిచి యేకాంతముగ నామె
కమ్మలం జూపి నను కర్తవ్య మడిగినది.

### సాధకుడు

ఆప్తుల కైనను దెలుపక అతిగుప్తముగ నే నా
పత్రిక లంపితి నామెకు ప్రార్థనా పూర్వకముగ.
అప్పుడనే నీవు మాకు: అయినను మీయుత్త మగుల
పవిత్రముగ నుంచ దగిన పత్రిక లెటు చూపె నోయి ?

### యువ

అట్లు చేసిన దామె యాందోళనములోన
క్షమియింపవలె రహస్యము గ్రహించిన నన్ను !

### సాధకుడు

అనురాగము హృదయములో నధికముగా నున్నయువతి
కా దెన్నడు ప్రియునిపట్ల కర్తవ్య విమూఢబుద్ధి.
ఉన్నయపుడె భావాంతర మువిదకు హృదయాందోళన,
మయినను నీ వే మంటివో ఆకర్ణింపం గోరెద.

### యువ

పెరచింత లేకుండ పెండ్లియాడుట మేలు,
కాలయాపనవలన ఘటియిల్లను శుభమ్ము
సంశయమ్ములు వీడి సత్వరమ్ముగ ప్రియుని
యంతికమ్మునకు నీ వరుగు మని పలికితిని.

### సాధకుడు

ఎంత మంచివాడ వోయి ! ఏ మన్నది సుందరాంబ ?
ఇంక నామె యాందోళన కే మున్నది యవకాశము ?

యువ

నిశ్చయించే కాని నే నెంత చెప్పినను
మాయత్త కేలనో మనసు తిరుగనె లేదు.
చివర కన్నది యామె చిరునవ్వు మోముతో—
వలదు కల్యాణమ్ము, వలదు సౌఖ్యము నాకు,
విద్యలో కాలమ్ము వినియోగపడు గాక.

సాధకుడు

వృద్ధులచే కాదని నట్టి విపరీతం బిది, వారల
భయము వలన నీమె యిట్లు పలికి యుండు నని తలంతు.
పెద్దలు మరచెదరు నిజప్రేమ వృత్త మంత లోనె
తరుణ జనుల యనురాగము తగ దని బోధింతు రకట !

యువ

వారి బోధనమ్ము లేదు, వారి భయము కూడ లేదు,
మారి పోయి నట్లు తోచు మా యత్తయె సహజముగా.

సాధకుడు

కొంత కాలమునకు మున్ను కౌతుకముతో కౌగిలించి
సుధామధుర వాక్కుల నను జొక్కించుచు నుండెడిదే !

యువ

హృదయములో మార్పా యిది? ఎన్నడు నీ కాయనపై
అనురాగము లేనె లేద అని యడిగితి నపు డామెను.
చిరున వ్వోష్ఠములపై చిందులాడ మందముగా,
జాజావారగా గండస్థలి యీషల్లజ్జచేత,

నేలవంక జూచు చామె– "నిండుమానసమ్ముతోడ
ప్రేమించినమాట నిజమె పెండ్లియాడ దలచుకొంటి.
ఆయన నావల్లభు డని అంతరంగమందు 'ముదము
పొందుచుంటి గాఢముగా పూర్వమొక్క కొన్నినాళ్ళు."
అని యొకింత గాంభీర్యం బాననంబునందు దోప,
స్థితి గతులను బట్టి యిపుడు తిరిగిపోయె బుద్ధి యనియె.

### సాధకుడు

తిరిగిపోయిన మనసు త్రిప్పవచ్చును మరల
అనురాగ మున్నచో నంతర్వ్యలీనమై.

### యువ

అన్యుల దురోద్బోధవలననైన, స్వతః సిద్ధముగా
నైనను మీయెడ గలిగిన దామెకు దురభిప్రాయము.

### సాధకుడు

శివ శివా, ఇం కేమి చేయజాలుదు నేను,
భార్యగా నేతరుణి భావించుచున్నానో
ఆమెకే నామీద నాదరము లేకున్న!
అవకాశమే యున్న నామెసందేహాలు
తొలగింపగల నొక్క త్రుటిలోనె యని యెంతు.

### యువ

ఆదరమ్ము కలదు గాని అనురాగము లే దన్నది
అంతరంగమందు నున్న దని యే నాయాశయంబు.

### సాధకుడు

చాలు నింక! ఆయామతో సమాగమమువలన ఫలము
కలుగుచిన్న లేవి లేవు– కావున విరమింపవచ్చు.

### యువ

ఈ రేయి యొకమిత్రునింట మీ కుభయులకు
సన్నివేశమునకై చాల యత్నించితిని:
అంగీకరింప లే, దామె కేదో భీతి–

### సాధకుడు

ప్రణయపూర్ణమానసుండు పరమసాధువర్తనుండు
భయము గొలుపుచున్న యపుడు పలుకరించి ఫలం బేమి!
వనిత గాని కవిత గాని వలచి తానె వచ్చు గదా.
వలదు మాకు సమాగమము– వ్యర్థ యత్న మేల నోయి!

### యువ

మీ లేఖ లన్నియున్ మిగుల హృదయంగమము,
లేకన్నె యైన మి మ్మిట్టె చేరగ వచ్చు.
కాని యామె మనస్సు కరగలే దెందులకొ!
నాయాశ– మరికొన్ని నాళ్ళ కాయమ మారి
స్వయముగా వచ్చు మీసన్నిధానాన కని.

### సాధకుడు

బాధతోడ నేను పంపు ప్రణయలేఖ సక్రమముగ
అందుకొనుచు నుండు టేల అనురాగము లేని యువతి?

త్రోసివేసి యుండునేని తొలికమ్మయె మరల నాకు,
గతము సర్వ మేదో వింత కలపోలిక నెంచి యుందు.
తెలుప వచ్చు గదా తానె తిరిగి పోయినట్లు మనసు ?
ఎందు కీ యవజ్ఞ నాకు ? ఇది సరసముగా నున్నద ?

యువ

వివరించినాను మీ విధ మంతయుం గూడ
విని యామె నిట్టూర్పు విడిచి యల్లన ననియె:
గతము గత మని చెప్ప, కష్టముగా నుండు—
అయిన నన్ మరచుచో ఆయనకు సుఖ మనుము.

సాధకుడు

ప్రేమ సరణి మారి పోయె, పెండ్లియాడ ననుచు నాకు
ఎపుడో తెలిపి యుండునేని ఇంత బాధ పడక యుందు.

యువ

పెండ్లి మాటలు విడిచి పెట్టు మని చెప్పె నట,
మనసు మనసున లేక మాటలాడిన దిట్లు.
అయిన, మీ రామెపై ఆశ విడుపం దగదు
చనుదెంతు మరల మీ సన్నిధికి—సెల వింక !

సాధకుడు

అంతయు మారిన దన్నది, అనురాగము లే దన్నది.
ఎట్టి విషమఫలము ! నాది ఎంత వ్యర్థవర్తనంబు !
ఆహా, యిన్నాళ్ళనుండి అనుసరించుచున్నది నే
మరుమరీచికయె ! ఎంత మతి మాలిన వర్తనంబు !

తెలియక మృగతృష్ణలోన తీయనిసలిలము కల దని
బాధ లెన్నియైన నోర్చి ప్రయాణమ్ము చేసినాను.

నామనస్సు పరీక్షింప నటన చేసియుండు నొకో ?
మహాప్రీతి కలగి నన్ను మరచిపో న్నున్న దేమి ?

ఆమెనిండుహృదయ మితని కవగత మేరీతి నగును ?
చివరసారి ప్రయత్నమ్ము చేసితీరవలయు గదా.

నిజముగా ప్రేమ కలది నిష్ఠురముగ మాటలాడు.
పడయవలయు నామెపాణి ప్రార్థనాబలముచేత !

# అదృష్ట దేవత

### సాధకుడు

అర్ధరాత్రమునం దిట్టు లవతరించి
తేట యీ బ్రహ్మచారి కుటీరమందు?
తెలియదో యేమొ నీకు నే స్త్రీవిరోధి,
నింతు లెవ్వరు రాగూడ దిచటి కమ్మ!

### అదృష్ట దేవత

నేను నీకొరకే వచ్చినాను సుమ్మీ!
స్త్రీ విరోధివై యైనచో నీవు మమ్ము
పరిహసింతువో, కాకున్న పరిభవింతు
వో, యటులు గాక వధియింతువో కుమార!

### సాధకుడు

స్త్రీల కుచితసపర్యలు చేయలేను,
ఏను స్త్రీకి సమాధాన మీయలేను—
కరకువాడని యెంచక కనికరమున
వేగమున నీకుటీరమ్ము వెడలిపొమ్ము.

### అదృష్ట దేవత

కావు సహజమ్ముగా నీవు కరకువాడ,
విట్లు భావించుచుండుట కేమి కతము?
నిజముగా మొరకుడవేని నేను వచ్చి
నపుడు లేచితి వెందుల కాదరమున?

అమలినము లైన నీకపోలములమీద
స్పష్టముగ దోచు కన్నీటిచార లేల ?
అళివినీలము లైన నీయలక లేల
చిక్కుపడి యున్న వాననసీమయందు ?

సాధకుడు

ఎంత బాధించుచున్నావో యెరుగ వకట !
ఏ నిపుడు దుఃఖతటినిలో నీది యీది
తీరమును జేరనుండ నేతెంచినావు
విఘ్నదేవత మూర్తిభవించినట్లు ?

అదృష్ట దేవత

తత్త్వవేత్తవె కాని యీతరుణమందు
దుఃఖవివశుడవై యిట్లు దూర దగునె ?
తెలుపుదువయేని నీవంత తెరగు కొంత
దాని దొలగించివేయ యత్నమ్ము చేతు.

సాధకుడు

బహుకాలమునుండి నేను ప్రాణేశ్వరిగా సేవతెను
భావించుచు నున్నాడనో పరిభవించె నామె నన్ను.

పరిభవించుటొకటె కాక పరీవాదములను గూడ
ఆరోపణ చేసె నెవ్వొ అన్యాయముగా తల్లీ !

ప్రాణము లీనాడు నాకు భారముగా నున్న వమ్మ!
పగిలె నమృతభాండ, మింక బ్రదికి యున్న ఫలం బేమి !

### అదృష్ట దేవత

బాధపడవు పరీవాద పరిభవాది
కములచే నెన్న, డిపుడు వైక్లబ్య మేల?
వింతగా నున్న దత్యల్ప విషయములకె
యింత సంక్షోభ మొందెద వేల తండ్రి!

### సాధకుడు

అత్యల్పము లనకు తల్లి! ఆమెకటాక్షము కొరకే
ఇంత కాల మనుదినమ్ము ఎదురుచూచు చున్నవాడ.
వచ్చు నెల్ల లాభమ్ములు వదలుకొన్నవాడ, సకల
విధులు – వెర్రినాడ నగుచు – విడిచినాడ నామెకొరకె.
ప్రాణేశ్వరికోసము నే పడనిబాధ లే మున్నవి?
ప్రణయమునకు ప్రతిఫలమ్ము పరిణమించె నీతీరున!

### అదృష్ట దేవత

నిష్కారణమ్ముగా నీ విన్నినాళ్ళు
బహువిధంబుల బాధ పడినావు, కాని
యత్నించినావొకో ఆకర్ణ్ణమనసు
గ్రహియింప సవ్యమ్ముగా నొక్కసారి?

### సాధకుడు

విశదముగా వ్రాసియున్న విడిచిపెట్టి యాశ యెట్లొ
బాధపడక శాంతముగా బ్రతుకుచుండువాడ గదా?
మానసముద్ర వీడి యామె మార్గమ్ముకూడ విడిచి
తుదకు వ్రాయనొకో యిట్లు దురహంకారవశమ్మున!

అదృష్ట దేవత

ఓర్చుకో దగును నీ కోరు లాచరించు
నహితంబు—పూర్వమం దాయమ నిన్ను
ప్రాణవల్లభునిగా భావించి యుంట
పాడిరయే విస్మరింపగ బాధలోన ?
తెలిసియో తెలియకో స్థిరబుద్ధి లేకొ,
వెర్రిది కావున విరసంబుగానె
వ్రాసి యుండును గాక: వాత్సల్య మూని
క్షమియించు నీవంటి సాధువర్తనుడు.

సాధకుడు

ఆమె నాకు చేసినట్టి అన్యాయము సామాన్యమె ?
క్షమార్హంబె చెప్పు తల్లి, నరేతర వర్తనమ్ము ?

అదృష్ట దేవత

అనుభవించుచునుండు నాత్మీయ కర్మ
ఫల సంచయమ్మును ప్రాణి సంఘంబు.
గలితానురాగ యా కన్నియ వ్రాత
వలన నీ వింతగా వ్యథ చెంద నేల ?

సాధకుడు

సత్యమే: భవదీయ సద్వాక్యములకు
చిత్తశాంతి యొకింత చేకూరె తల్లి !
కఠినభావము నాకు కలుగుట తగదు :
ఎవరికర్మము వారిదే యథార్థముగ.

అదృష్ట దేవత

నీకు నే నగపడు నిముసమ్ము వరకు
క్రుద్ధుడవై యేమొ కుప్ప వోసితివి.

సాధకుడు

ఇంతకాలమునుండి యీచోట నున్న
స్త్రీలచిత్రపటాలు చించివైచితిని
దుష్టుల కెంతయు దూరమం దుంట
శుభ మన్న పెద్దల సూక్తిని బట్టి.

అదృష్ట దేవత

మరి యేమిటికి రూపు మాప కీలాగు
విడిచిపెట్టితి వయ్య, విగ్రహాంబులను
కుడ్యభాగముమీది కొన్నిపటాలు ?
ఆడుబొమ్మలె కదా అన్నియుఁగూడ ?

సాధకుడు

శోభించు ప్రతిమలు చిత్రపటాలు
స్త్రీరూపములె యయ్యు దేవతాకృతులు.

అదృష్ట దేవత

స్త్రీవిరోధి నటంచు చెప్పియున్నావు,
తావకీనోపాస్య దైవతం బెవరు ?

సాధకుడు

సామాన్యవనితల చందంబు వేరు,
సకల లోకారాధ్య జగదంబ వేరు.

* *

కావున స్త్రీలపై గాఢవిరక్తి
జనియింప, జగదంబ సాన్నిధ్యమందు
శపథమ్ము చేసెడి జతన మాగినది
అనుకోని నీ హఠా దాగమనాన.

అదృష్ట దేవత

జీవితములో నదృష్టము చెప్పి రాదు :
తొలగిపోవుటచే నేటితోడ పీడ
కానవచ్చితి నోయి, నీకన్నగవరు.
నీకు శివరాత్రియే సుమ్ము నేటిరాత్రి.
నీవు శ్రీజగదంబ సాన్నిధ్యమందు
పట్టబోవుచు ఆగిన ప్రతిన యిపుడు
పూనవచ్చుగదోయి! నీ పూన్కికిచట
విఘ్నకారులు లేరని విశ్వసింపు.

సాధకుడు

(చేతులు జోడించి)

ఇయ్యది మొదలుగా నింక నెన్నండు
స్త్రీయూహ రానీయ చిత్తమునందు!

అదృష్ట దేవత

నీ వెంత కాదన్న నిశ్శ్రేయసమ్ము
స్త్రీ నుపాసింపక సిద్ధింప దోయి!

సమాప్తము

# వ్రత భంగము

అంకితము

శ్రీ కూచిభొట్ల ప్రభాకర శాస్త్రికి

# వ్రతభంగము

౧

అప్రయత్నమ్ముగా నగ్రహారమ్ములో
ఈప్రభాతంబునం దేను వీక్షించితిన్
నీప్రియన్ మిత్రమా, నిస్తులస్వచ్ఛ చే
లప్రభా ముగ్ధ లీలావతీ రత్నమున్.

ఆననాబ్జమ్ముపై హాసరేఖావళుల్
కానరా వేమి ? నీకన్ను లుత్ఫుల్లతా
హీనమై యుండగా నేటి ? కీపాటికిన్
మానమున్ వీడ వేమాత్రమున్ మిత్రమా ?

సందియం బౌను నీచంద, మర్పింపవే
వందనంబుల్ ప్రియావార్త నాలించియున్ ?
సుందరాస్యమ్ముపై శోభ లల్లంతలో
చెందెనే మ్లానిమన్ చిత్రచిత్రమ్ముగా !

సోకుచో వీనులన్ సుందరీ శబ్దమే
వీకమై తోడనే వెఱ్ఱివై పోదువ
స్తోకవేగమ్ముతో : తోచదే మోదపున్
రేకయే నేటి నీరీతిలో మిత్రమా !

అప్రియం బైనచో నామె నామంబె నీ
కీ ప్రసంగంబు నే నిపయిం జేయనో
యీ, ప్రమాదంబుచే నేని నీ సన్నిధిన్ !
విప్రయోగ వ్యథావేత్త నే మిత్రమా !

౨

ఫాలభాగమున భస్మకణంబుల్
చాల దీర్చితివి సాంద్రముగానే!
మేలి కుంకుమము మెత్తితి వోహో,
అలయాగతుడ వంచు దలంతున్.

ఇప్పరంబునకు నెప్పుడు రాకో?
చెప్ప వేటికి విశేషము లేవో?
ఒప్పవోయి వినయోక్తుల నెచ్చో
నప్పు దెచ్చితి వహో, నవసాధూ!

మంచి, దేయువతి మానసవీధిన్
సంచరించు నలసాలస భంగిన్?
వంచనం బుడిపి వాస్తవమే యొ
క్కించుకంత వచియింపగ దోయీ!

సుందరీ వదనచుంబన గాథా
నందతుందిల మనస్కుడ వోహో!
కందళించు నవికస్వర వామా
బృందమం దెటులు ప్రీతి మునీశా!

"మేల మాడెదవు నిక్కలి అంబా!
చాలు జాలు నిక! సత్యముగా నా
వాలు కన్నుగవ వాలుట లే దే
లోలలోచనల లుబ్ధముఖాలన్."

## 3

"శ్రవణోత్సుక వార్తను సత్వరమే
చెవి వేసెడి వేడుక జేరితి నీ
సవిధంబు : పరీక్ష ప్రశస్తజయం
బు వధూనికి నిన్ననె పొందె సుమీ !"

"ఏదియో శుభవార్తని యెంచితి, నే
నిదియా యెరిగింపగ నింత త్వరన్
ఉదయంబె వృథా శ్రమ మొందుచు నీ
సదనంబును జేరితె సాఘు, సఖా !"

"అనురూపము గాక మహోన్నతమై
వినవచ్చెను నాకర్ణులు! విప్రియమా
అనుగుంజెలి నూత్నజయంబు సఖా !
మునుగం దగు గాదె ప్రమోదములో !"

"అనుగుంజెలి యైనను హర్షమె యై
నను లేదని యెంచుము నాకు సఖా!
మన నిప్పుడు ప్రేమనిమగ్నతలో
తను విస్మృతి గాంచదు తథ్యముగా."

"పరివర్తన మొందెను పాపము, నీ
పరమోన్నత రాగము బాధలలో !
వరవర్ణినిమీదను వ్యావృతమై
ఇర నొందెనె కోప మహీనముగా?"

"గత భావము లన్నియు కాలములో
చ్యుతి నొందుటచేతను సోదర, వి

స్మృతి యొక్కటె నిల్చెను చిత్తములో :
సతతమ్ము శమస్థితి స్థాయి సుమీ!"

౪

"సద్యోలబ్ధిన్ సుందరీశ్యామ బాలా
విద్యాశాలన్ శోడనే స్వీకరించెన్
ఉద్యోగంబున్ దూర మౌనుత్తరాదిన్:
ఆద్యం బేత న్సంగళం బందు నెంతున్."

"అహా! చిత్రం బైనవృత్తాంతమే: నా
యూహాతీతం బామెయుద్యోగ మోయీ!
ఏహేతు ప్రాబల్యమో యిట్లు శోసెన్
సాహాయ్యంబై సేవికాస్థానమందున్!"

"దోషం బేమీ ఉత్తమోద్యోగ మౌచో?
యోషారత్నం బింటిలోనుండి భూషా
వేషాలంకారంబులో వేగుకంటెన్
భాషావిద్యాబోధలో ప్రజ్ఞ గాంచున్."

"ఖ్యాతిం గాంచం గాదు, ద్రవ్యమ్ముకై కా
దేతద్వృత్తిం బూనె నీయింతి: చూడన్
స్వాతంత్ర్యేచ్ఛాజాత మౌపర్తనంబే!
ఏతీరైనన్ నాకు నింకేల నోయీ!"

# వ్రతభంగము

౫

"స్వాగతము, స్వాగతము! చాల నెలలైన
మాగడప ద్రొక్కుటయు మానితివె! ఇన్నా
ళ్ళేగతిని వర్తిలెదో? ఎవ్వియొ విశేషాల్
వేగముగ దెల్పవలె వేడుక శమింపన్."

"మాపురినె కాపురము: మందముగ కాల
క్షేప మగుచున్నయది: సిగ్గగును చెప్పన్
నీ పయిని నాపయిని నింద నొకదానిన్
మోపిరి వివాహ మని ముగ్ధజను లంబా!"

"ఇందులకె మానితివ యిచ్చటికి రాకన్?
మందమతు లౌజనులమాట లొక లెక్కా?
చెందకుము సందియము, చెప్పుము నిజమ్మున్
సుందరిని ప్రేముడిని జూచెదవె యింకన్?"

"ఇందిరను– సుందరిని హృజ్జలజ పీఠం
బందు నెలకొల్పి మధురార్చనలు నే దై
నం దినముగా సలిపినాడ సుమి గాఢా
నందమున ము, న్నవల నష్ట మయిపోయెన్."

"నిండుగనె యొక్కపుడు నీకు ననురాగం
బుండునెడ నష్ట మగు టొప్పుకొన నప్పా!
కొండొక నిదానమున గుప్తముగ లోలో
మెండుకొని శాంతముగ మేలుకొని యుండున్."

"సత్య మగు నీపలుకు శాస్త్రగతి నంబా!
నిత్యమును కాముకులు నిండుమతి నుండన్

స్తుత్య మగు : ఇందిరకు సుంత యయినన్ దాం
పత్య శుభచింతనము భావమున లేదే.

"ఆపయిని నాపయిని నామె కధికంబై
కోపము మనమ్మునను గుంభితము, దానిం
బాపుటకు నే పగు నుపాయములు వ్యర్థం,
బాపె యనురాగరస మంతయు హరించెన్."

"కా దిపుడు సుందరికి గాఢ మనురాగం,
బాదరముతోడ నిను నర్చన గదించున్."

"కా, దచటి కేగిన నికారము ఘటిల్లున్:
ఖేదమును నిందుటపకీర్తియు ఫలంబుల్."

౬

"లే దట కోపము లేశము సైతం
బాదగమే యట అత్తకు మీపై.
వాదున మారిన వారని మీరే
యేదియొ జంకు గ్రసించిన దామెన్.

"చిత్తములోని విశేషములం గిం
చిత్తును దాపక చెప్పెను నాతో
అత్త: నిజంబుగ నాదరపాత్రం,
బిత్తరి కాంచిన దెద్దియొ మార్పున్.

"మర్మము లేక అమాయిక మౌ మీ
యర్తిలిగూరిచి అత్త వచించెన్

నిర్మల మంచును నిశ్చల మంచున్
ధర్మపథంబును దాటని దంచున్."
"విన్నది పూర్వము వెఱ్ఱిది నాపై
నెన్నియొ నాదుల, నీ వచనాలన్
కన్నమనస్సున గారవ మేదో
యున్నటు లించుక యూహ జనించున్"
"అరుగుదెంచి మహాసభ, కావలన్
దరిసి యాయన నాగ్రహ మొంటిమై
సరస జేరి ప్రసంగము చేయుచో
సరస మానెది సల్పగ తెల్పుమా !—
"అనుచు వేడగ అత్త, నిజమ్ముగా
కనగ వచ్చిన కాలమునందు నీ
వొనరుపం దగు యుక్త సపర్య లా
యనకు, మానకు మంచు వచించితిన్."

౭

"అరుగుచో నీ వింక నబ్ధితీరమున
ఇందిరా సుందరీ మందిరమ్మునకు,
పూర్వవిధానమ్ము పోనాడి యామె
ఆదరమ్మున నీకు నాతిథ్య మిచ్చు."
"నను క్షమింతువరయేని నా కామెయెడల
లేదు విశ్వాసమ్ము లేశమ్ము కూడ !

నీ వాక్కాలం బట్టి నే బోవు నెడల
ఘటియిల్లు నాత్మ నికారంబె అంబ!"
"మారిపోయిన దామె మన సిటీవలనె:
నీయెడ నామెకు నిండు గౌరవము
కల దిపు డని నేను గ్రహియించినాను:
నా మాట మిత్రమా, నమ్మగా నగును."
"ఏ ప్రదేశమ్మున నేగిన నాకు
గౌరవహాని యే కాలాన లేదు.
ఇందిరాసుందరి కేలనో కాని
ఆదర మున్నట్టు లగపడ లేదు."
"మానద్వయాను క్రింద మానదనాన
ఇందిర యున్నప్పు డింగితమ్మేను
గ్రహియించినా నోయి! గౌరవ ప్రేమ
భావాలు కలవు విస్పష్టమ్ముగానె."
"అనురాగవతియేని అంత మానమ్ము
ధరియించి యుంటదు తాత్పర్యమేమొ?
శ్రవణగోచర మైన వార్తలం బట్టి
వర్తించు సుందరి వైరివిధాన!"
"ఉద్యోగవృత్తిలో నుండుటంజేసి
స్వాతంత్ర్య మొకయింత సంక్రమింపంగ
వెరపు క్రమమ్ముగా విడనాడి ముగ్ధ
నిజదృష్టి నీయెడ నిలిపిన దిపుడు."
"అంగీకరింపదే అంతరంగమ్ము
అనురాగవతి యామె యని లేశ మైన!

ప్రాతగాథలు శ్రవ్య ఫల మేమి ?– అయిన
ఇందిరయాకార మెట్లున్న దిపుడు ?"

"శోభాయమానమే సుందరరూపు,
కుసుమమ్మువలె నామె కోమలాకృతియె.
అరుగుచో నీవు తదావాసమునకు
నిండుమనమ్మునో నిను స్వీకరించు."

## ౨

"ఆప్తవాక్య ప్రభావమ్మున
అభినవమ్ముగ నొక మనోవ్యథ
నాల్గురోజులనుండి నిత్యము, నన్ను వేధించున్.

"నిర్ణయింపగ లేక యుష్మ
న్నికటమున కరుదెంచినాడను
తెలిసికొన దైవజ్ఞముఖమున నిష్టఫలితంబుల్."

"తలతు గోచార ప్రకారము
తరుణి విషయిక మైన ప్రశ్నగ :
తెలుపగలరా ఆమె యిట కేతెన్కనం గలదో ?"

"ఇచటి కీశాన్యమ్ము, కన్నియ
ఇతఃపూర్వము నాకు పరిచిత.
పంపదగునా వనిత కియ్యెడ పత్రికను సఖుడా ?"

"ఇపుడు శుభసమయమ్మె, నష్టం
బేమి యుండదు లేఖ నంపిన–
కాలయాపన మాత్ర మించుక కానబడును సుధీ !"

## ౬

అస్మదీయాప్తురా లైన అంబతోడ
అప్రతర్కితముగ మాటలాడు పిదప
నాల్గవ దినాన వ్రాయు చున్నాను నీకు
ముందు వెను కాడి యీ లేఖ ఇందిరాంబ!

నిన్ను వీక్షించు టాదిగా నేటివరకు
హృదయ పరివర్తనమ్ము లే దెపుడు నాకు.
విడని నీ మౌనముద్రచే వెరగు చెంది
లేఖనము, దర్శనమ్ము చాలించినాను.

కారణం బేమొ తెలియదు గాని యిపుడు
నీకు నాయెడ నొక్కింత నెనరు కలిగె
ననెడి శుభవార్తవలన ధైర్యము జనింప
కమ్మ పంపుటకై సమకట్టినాను.

హాక్కునం గాని అస్మత్ప్రవర్తనమున
గాని, పత్రికా రచనలో గాని మున్ను
హృదయము చివుక్కు మను నట్టి దేది యున్న
పక్షమున, నన్ను క్షమియింప ప్రార్థనమ్ము.

మరల నేటికి వెనుకటి మార్గ మన్న
భావ మున్నను, నూతన బంధ భీతి
గాటముగ నున్న, పరిణయ కాంక్ష విగత
మైన, ఈ లేఖ వెనుకకు నంపవలయు.

చివరిసారము నిన్ను నాశీర్వదించి
వెనుక ఘటనల నన్నిటి విస్మరించి

ఆస లన్నియు విడిచి సమాశ్రయింతు
సహజ మౌన, మేకాంత వాసమ్ము మరల.

౧౦

"స్వాగతమ్ము ! నూత్నవర్షమ్ము మిత్రమా,
సుఖద మగును గాక !– సుందరాంబ
వచ్చి పోయె రెండు వారముల్ తెలియునా !
నీవు రానె లేదు నెల గడచిన.

"మొదటిసారి వచ్చి ముగ్ధ యోగక్షేమ
మరసి పోయె గాని అడుగ లేదు
నిన్నుగూర్చి: కాని నిన్నె ప్రశ్నించె
సిగ్గు విడిచి నీ విశేషములను."

"పంపినాను సుమ్మి పక్షద్వయము క్రింద
ఆమెపేర లేఖ: అందు నీవు
అస్మదాప్తురాల వనియును, భాషించి
నాడ ననియు వ్రాసినాడ అంబ !"

"చెప్పవేమి ! అందుచేతనె ఇందిరా
సుందరాంబ నన్ను జూడ వచ్చె
ఆమెహృదయ మార్ద్రమగుటచే నీయెడ
నిలిపె దృష్టి: కాని నిండుకుండ !"

౧౧

నీవు ప్రియతమ, అంబికా నిలయమునకు
వచ్చితివి రెండుమార్లను వార్త వింటి.
సాదరమ్ముగ నా విశేషముల గూడ
అడిగి పురమున కరిగితి వనియు వింటి.

ఇపుడు ధైర్యముచే వివాహేచ్ఛ కలిగి
సుందరీ, నాయెడ నీవు సుముఖురాల
వైతి వన్న విశ్వాసాన హర్షవివశ
మానసుండను వ్రాయుచున్నాను లేఖ.

నిండు మనసున నిరతమ్ము నిన్ను నేను
ధర్మపత్ని విధమ్మున దలచువాడ.
అంతరాయము తొలగిపో నమరు గాక
మనకు దాంపత్యసౌఖ్య మమందగతిని.

అర్ధరాత్రి సమీపాన అరుగుచెంతు
నిశ్చయమ్ముగ రేపు నీనికటమునకు.
శుభముహూర్తము కావున సుజను నెవని
నైన బంపుదు శకటికా స్థానమునకు.
జీవితేశ్వరి, కల్యాణ చిత్రకమ్ము
తోడ, కాటుక కన్నులతోడ, పసపు
పాదములతోడ, దేహళీపార్శ్వమందు
కానబడవలె మంగళాకారమునను.

## ౧౨

"త్వరచేత పత్రికను వ్రాసితివే
తరుణీహృదస్థ మగు తథ్య మెదో
పరికింపకుండగనె: భావ్య మొకో
పురి కేగ నాయువతిపొందునకై?"

"అరుదెంతు నీకడకు నద్దమ రా
తిరి వేళ సిద్ధముగ దేహాళికిన్
సరసన్ ప్రతీక్షణము సల్పు మనో
హరదివ్యరూపమున నంటి సుమీ."

"సుఖ మేమియుం గనవు సుందరి స
మ్ముఖమందు నిల్చునెడ ముగ్ధుడ, యీ
సఖివాక్యముల్ వినిన జాగృతితో,
నిఖిలమ్ము చక్కబడు నిక్కముగా.

## ౧౩

మన సమాగమ మమర నీయక
మరల నవరోధమ్ము కల్పన
చేసినారు ప్రియా, నిలింపులు చిత్ర చిత్రముగా!

ఆప్తురాలి వచస్సు మీరక
ఆగిపోతి భవత్సమక్షము
చేరకుండనె, ఎట్టి కర్మమొ చెప్పలేను ప్రియా!

నా స్వతంత్రత యందు నాకే
నమ్మక మ్మడుగంటి పోయెను !
ఏమి చేయ సమంజసంబో యింకమీద ప్రియా !

నీకు నాయెడ భర్తృభావము
నిభృత మగుచో నిందు మనసున
పంప నాహ్వానమ్ము నీవే భార్య వౌను ప్రియా !

ఎపుడు నిను దర్శింప వత్తునొ
ఏమి చేయుదునో యెరుంగను.
నాదు హృదయం బెపుడు నీ దని నమ్మవలయు ప్రియా!

౧౪

మిగుల హృద్య మార్య, మీ యుపన్యాసమ్ము,
సంతసించినారు సభ్యు లెల్ల.
అరుగుదేరవలయు నస్మద్గృహమ్మున
కందుకొనగ మీర లతిథి పూజ.

"సభకు వచ్చినట్టి జాడ కనంబడ,
దీపురాన నున్న దిందిరాంబ,
మీరు వచ్చి చూచినారో కో యామెను ?
కాక పోద మామెకడకు మనమె ?"

"పోయి చూడ లేదు, పో బుద్ధియును లేదు,
ఆమె యిచట నున్నయట్లు తెలియు,

ఇందిరాంబ దిప్పు డెట్టి యాకారంబొ
నాకు దెలియ దన్న నమ్మవలయు."

"తెల్ల జాఁపందుతీరు దేహచ్ఛాయ,
జవ్వనంపు మిసిమి నివ్వటిల్లు.
పాఠశాలలో నుపాధ్యాయగా నున్న,
దనతిదూర మిచటి కామెగృహము.

"పరిచయమ్ము లేదు ప్రత్యక్షముగ మాకు:
కాని స్నిగ్ధుఁ డొకఁడు కలఁడు నాకు,
ఈత డామెగూర్చి యెడనెడ నాతోడ
సబహుమానమౌ ప్రశంస చేయు.

"కాని యొకటి వింతగా గానవచ్చును:
మీకు బంధు వయ్యు, మి మ్మెరిగియు
నింద చేయు మిమ్ము: నిజము నే దెలిపిన
విశ్వసింప లేదు వెర్రివాడు!"

౧౫

వ్రాయదు లేఖయు వార్తయు నంపదు
ఈక్షణమ్ము వర కిందిర యేలనో!
ఆమెం జూడగ నరుగుట యుక్తము
కాదో అగునో గ్రహింపలేనే.

ఉత్సాహంబే యున్నది యగుచో
ఆహ్వానము నా కనుపక యుండునె!

అభిమానంబో అలసభావమో
వ్రీడాభరమో విశదము కాదే.

అరిగిన గౌరవహాని ఘటిల్లున?
ఆదరింపకయె అవమానించున?
వాటిలె మున్నె వ్రతభంగం, బీ
నాడధికమ్ముగ నష్టం బొదవునె?
అభిమానముతో నవసర మేటికి!
చనుచో దెలియును సత్యం బెదియో.

## ౧౬

"నేను రావచ్చునా నిభృత కక్ష్యకు? సరే,
సంతసం బొపటాసనమునన్ వాలెదను.
నాల్గు నాళ్ళాయె నీ నగరాని కరుదెంచి,
ఇచ్చోటు విడి పోదు నీ నాడో మరునాడో.

పయనమ్మునకు ముందు భవదీయ కుశలమ్ము
నరయు భావమ్ముతో నరుగు దెంచిన వాడ.
ఏమి, కృశియించినా విందిరా, యింతగా
అల యశోకమ్ము క్రింది అచలాత్మజ విధాన!

ఉండలేక సుఖాన ఉద్యోగ మేమిటికి?
గృహలక్ష్మివలె నుండ కీ వృత్తి యెందులకు?"
"స్వీకరించినది దీని జీవనోపాధిగా......
పూర్వ లావణ్యంబు పోయిన ట్లయినావె!"

నీ వియోగముచేత నే నిట్టు లయినాను :
నీ పోషణములోన నెలదినా లున్నచో
సుందరీ, పెరుగనా శుక్ల చంద్రు విధాన !
నీ ధ్యానమే నాకు విగతమ్ము బల మిచ్చు,
ఎదురు చూచుచునుందు నేవేళ నీ కొరకు !”

“నాకు పెండిలి వలదు – నన్ను శాంతమ్ముగా
బ్రదుకనిం, డన్నియుం బరిహరించినదాన !”

“ఏటి మాటలు ప్రియా ! ఇన్నాళ్ళు నీకునై
వెత చెందు వానినే వేధించు చున్నావు !”

“స్వార్థమ్ము త్యజియించి సకలమ్ము విడనాడి
బాధపడుచున్నారు భాగ్య హీనను గూర్చి !”

“ఒక్కపరి ప్రియతమా, నీ
చెక్కిలి ముద్దాడి, నిన్ను జేర్చుకొనంగా
మక్కువ జనించినది నా
యక్కున, ఆసీన వగుమి అంకతలమునన్.”

“గత కాలములలో గలిసిన గాథల-
సౌఖ్యం బబ్బా, స్మరణకు దెత్తురె !”

“అందిమ్ము ప్రియతమా, మక
రందమ్మును కాచపాత్ర రంజిలుదానిన్
సందేహింపక నీ కసు
గందని యాధరమ్ము మధువుకణములు కలియన్.

“నీ నయనజ్యోతి మదీ
యాననమున వ్రాల, త్వద్భుజాంతరసీమన్

నే నణగి విస్మృతిం గని
ప్రాణంబులు విడుచుకన్న భాగ్యము కలదే!''

''చాలును జాలును! సడలింపుం డిక
భుజబంధంబును, పోవనిండు నను!—''

''నిరతము నీ ప్రతిబింబము నేత్రోత్సవ మొనరింపగ
ప్రాణప్రియ, నీ ఛాయాపటము నాకు నొసగవలయు.

''శోణతిలక బిందు కళా సుందర వదనారవింద,
ముజ్జ్వల తాటంకయుగళ, మున్నత వక్షోజ ద్వయి—''

''చాలు జాలు మీవర్ణన! ఛాయాపట మిటు లెం డిక
భయము నాకు: ప్రకటింతురు పత్రికలో ప్రతిబింబము.''

''భవదురోజ సంస్పర్శను పవిత్ర మా అష్టాపద
హారము వేయంగదె నా యరుత నొక్కసారి ప్రియా!

''నిఖిలాంధ్రమునందు ప్రియా, నీనామము గణన కెక్క
ఉజ్జ్వల తారకవై నీ వొప్పవలయు నని కోరిక!''

''మీరు మహాపూరుషులై మిగుల కీర్తి భాస్వరులై
సత్కార్యము లొనరించిన చక్షురుత్సవమ్ము నాకు!

''మరచిపోండు న న్నింతట, మంగళమ్ము కలుగు మీకు
క్షమియింపుడు తప్పు లున్న!... కౌగిటిలో నలిగిపోతి!''

''ఏమి వినుమ మాపరీక్ష! ఇట్టు లన్న, నిట్టు లున్న
ఇహలీలా వ్యాపారం బెటు సాగును మనకు ప్రియా!

''బాగుగ యోజించి చూడు, పరస్పరాశ్లేషణమ్ము
సంఘటిలని మనుగడ యే చాయ నుండు ప్రాణప్రియ!

"సమ్మేళన మగును గాక సత్వరంబ శాశ్వతముగ !
ప్రాణదాత్రి, కష్టమయిన ప్రకృతమందు సెలవునాకు."

## ౧౭

"నీముఖము స్వేద మగు నీరజమువోలెన్
కోమలముగా కనులకుం బొలిచె వింతై !
ఆమెకడ కీవరిగినట్లు స్ఫుట మయ్యెన్
నామదికి : తెల్పు, చనినావ, చనలేదా ?"

"ఆననము చూడగనె యంతయు గ్రహించె
న్నిపుణమానసము : నిక్కమె, తదీయ
స్థానమున కేగితి వితర్కమున అంబా !
కాని ప్రియ చూచినది గారవముతోనే.

"శంక లేకయె నిషణ్ణ యయ్యె నా
యంకమం దరిగినంతనే చెలీ !
శంక వీడి పలుసారు లిచ్చె నా
పంకజాక్షి భుజబంధనంబులన్ !

"ఆదరించి పలు కాడె, పోవగా
ఖేద మంతయు, నకృత్రిమమ్ముగా
మోదవార్ధిని మున్గిపోయితిన్
ఆ దినం బుదయ మంతయున్ సఖీ !"

## ౧౮

సెలవు గైకొన్నదాది నీ నిలయమందు
నేత్రయుగళి త్యజించెను నిండునిద్ర.
పక్ష్మము లోకింత యేమరుపాటులోన
మూత వడునేని తెరపు నీమూర్తి యప్పుడె !

స్వాప్నికస్థితి పైకొన క్షణాలనాన
తోచు నీమూర్తి మంజులద్యుతులతోడ
నిత్యనూతనముగను, కనీనికలను
భ్రమరకీటవిధమ్ము సంప్రాప్తమగును !

నా తనువు జలదరించును నడుమ నడుమ
స్మరణసరణిని చంచలా జనముతోడ
రాజిల భవత్స్వధా మధురాయమాన
బాహులతికా ససంభ్రమ బంధనములు !

జాలువారుచు నున్న దాక్షిణ్య నూత్న
మధురిమోద్గార ధుర్యమై మామకీన
వాక్ప్రసారము, క్రోలుటవలన నేమొ
ఒక్కుమ్మొగి తావకీనాధరోష్ఠ సుధను !

నేను పొదగయాతీర్థ నికటముననొ
మానస సరోవరోపాంత మండలమున
నో వసించుచున్నాను దేవి, నీదు
సతత చింతన నర్ధపక్ష్మమునుండి.

మీరు కావలయును మహాపూరుషు లని
మించు ననురక్తి నాశీర్వదించినావు :

ఎట్టు లున్నత పదవి లభించు నాకు
యుష్మదీయావలంబునం బొదవదేని !

## ౧౯

ఆర్యా, తాము వ్రాయు లేఖ అందిన దినాడె: వాంఛ,
లాశ లెల్ల విసర్జింప నభ్యర్థించెద మిమ్ముల.
వెనుకటి సంఘటన లన్ని విస్మరించి, గతం గత
మ్మని తలంచి, నాకు మనల నాందోళన కూర్పవలదు.
ప్రార్థించెదు దాన మిమ్ము, పత్రిక లిక పంపవలదు.
ఒంటరిగా శాంతముగా నుండ నిండు ! — సుందరాంబ.

## ౨౦

చిత్రమైన నీపత్రిక చేరె నాకు 'బదరికలో'
ఈ నడుమనె, కాని యిట్లు లేటికి లిఖియించినావో ?
పత్రిక స్పష్టార్థముగా పరిగ్రహింపు మందువ నను ?
కాక దీని నన్యార్థముగా గ్రహింపు మని కోరెదో ?
పరులతోడ నెన్నడేని ప్రసంగంబు సంభవింప
పలుకుచుందు నిన్నుగూర్చి బహుమాన పురస్సరముగ.
నీవుమాత్ర మెందులకో నిజము కప్పి కొందరితో
ప్రాయికముగ నిందలె నాపైన మోపుచుందు వంట.

నిండురక్తితోడ నేను నిన్నారాధించుచుండ
అనురాగము లేదు నాకు ఆయనపై నందు వంట.

సమ్ముఖమ్మునందు నన్ను సమాదరించి బహువిధాల,
సరళేతర వాక్యమ్ములు సాహసించి వ్రాసినావు.

దాంపత్యము మీద నీకు తాత్పర్యము పోయినదా
నాయెడ నీ యనురాగమె నష్టంబయి పోయినదా

నీ వర్తనమందు దోచు నిభృత గాఢ మధురిమమ్ము,
వాక్కులోన వ్రాతలోన ద్యోతితమ్ము కాదేటికో !

భయము వీడి తెల్పుము నిజ భావము విస్పష్టమ్ముగ.
సత్యము గ్రహింతు నేని శాంతమానసుండ నగుదు.

కలవయేని యనురాగము గౌరవమ్ము నా యెడలను
వేధింపక నన్ను నిజము విశదము చేయంగవలయు.

శీఘ్రముగా రానున్నది శివరాత్రి మహాపర్వము
ఆ నాటికి తెలియవలయు అంతిమ వాక్యమ్ము నాకు.

వీడవేని మౌనముద్ర విరసముగా వ్రాయుదేని
చెల్లిపోవు మన బంధము శివరాత్రికి నిశ్చయముగ !

## ౨౧

అంబ, పంపినాడ నతివిపరీత మౌ
సుందరాంబలేఖ, చూడుమమ్మ !
ఉండునొక్కొ యాపదున్మాద మీమెకు ?
అంతరార్థ మేది యైన కలదొ ?

అంకతలముమీద ఆసీన యైనది,
ముద్దు లిచ్చె నెన్నొ ముద్దరాలు,
ఒసగె ప్రీతితోడ నుపగూహనములు,
తుదకు వ్రాసె నిట్టి దొడ్డలేఖ!

పది దినాల నాడు పట్టణమ్మున కేగి
ఆమెసదనమునకు నరుగ నైతి
అవల నన్ను గూర్చి యాస్మదీయాప్తుల
కడకు బోయి యామె అడిగె నండి.

తెలిసికొనగ లేక తికమక పడుచున్న
వాడ నంబ! ఆమె స్వర్ణహార
మరుతనుండి తీసి యస్మద్గళమ్మున
వేయబోయి మరల విరతి జెందె.

వేడికోలుమీద వెదకి ఛాయాపటం
బొకటి తెచ్చి నాకు నొసగె నామె.
కాని కొంతవడికి క్రమ్మర నద్దాని
నడిగి పుచ్చుకొనియె నక్కజముగ.

అలసి, పంపినాడ నంతిమలేఖను
ఆమెపేర నంబ, అవధి యుంచి
చెప్పు సత్య మనుచు: శివరాత్రి గడచెను
కాని యామె విడదు మౌనముద్ర.

ఏటి కింక నని యహీన విరక్తి చే
ప్రతిన యొకవిధాన పట్టినాను.
తెలుపుచున్న నాడ తొలుత నీవలననే
ఒందియుంట నిందునుత్సుకతను.

## ౨౨

"రా వచ్చున నే లోనికి ? రాక పాదగయాక్షేత్ర
సీమనుండి యీ యుదయమె, క్షేమ మని తలంతు నంబ!
"యువతులు లేవగ నేలా ! ఉపవిష్టుడ నగుదు రత్న
కంబళమ్ముమీద : నేటి కవిసభ కరుదెంచినాను."
"సాయంత్రము నేను కవుల సమావేశమునకు వత్తు.
సుందరి, నీవును రావలె చూడవచ్చు కవయితలను."
"ఇచటికి దయచేసినారె ఎపుడో ఈ మహాశయులు !"
"మరలివత్తు,మీరుభయులు మాటలాడుకొనుచుండుడు."

## ౨౩

"పజ్జనె కూర్చున్నదాని బలుకరింప రింతతడవు
పాదగయా క్షేత్రమందు ప్రతిన పట్టినా రొక్కొ !
"ఈయుదయమె విజయవాటి కేగుదెంచినాను, మాకు
ప్రకృతమందు విశ్రాంతియె : పరిషత్తుకు కాదు రాక."
"శివరాత్రికి నయినను నీ చెంతనుండి బదులఁ రామి
బయలు వెడలిపోయినాను ప్రతిన పట్టుపూనికతో.
"కుండములో స్నాన మాడి కుక్కుటేశ్వరాలయంబు
ప్రవేశించి, శివస్తోత్ర పఠన మాచరించినాను.
"గంట కొట్టి ప్రతిన పూన గా ముందరి కరిగినాను.
త్రోసి వేసె నన్ను జన స్తోమము దరి జేరనీక.

"జతన మెంత యొనరించిన సాఫల్యము నొంద నైతి.
స్వామికి ఏత త్ప్రతిజ్ఞ సమ్మతమ్ము కా దేమో !"
"ఇంతటి సామాన్యురాలి నేటికి నను దేవతగా
నెంచుచుంద్రు వ్రాయుచుందు రే మున్నది నాకు మహిమ?"
"నిజముగ సామాన్య వేమొ ! నీ కడ నే మహిమగలదొ
తలచినపుడు నిన్ను దేవతా గణంబు స్మృతికి వచ్చు...
"ఒడిలోనికి రమ్ము ప్రియా ! ఒక్కసారి యీది ముద్దు !"
"నన్ను తాక వల దికపై, నాకు వివాహమ్ము వలదు."

## ౨౪

"నిజము చెప్పు విశాఖపురమున
నీవు సుందరి గలిసినప్పుడు
ముగ్ధమతివై తత్పదమ్ములు ముద్దు గొన్నావా ?"
"నిజమె: ఆమె అశోకపాదప
నిమ్నభాగమునందు నుండెడి
సీతపోలిక దోచ, ఆవిధి జేసినా నంబా !"

"భంగపడినా వేల ఛాయా
పటముకొరకై వేడి యామెను ?"
"అడిగినాడ ఒసంగునేమో యన్న విభ్రాంతిన్."

"ఎవ్వ రెవ్వరో తనకు నీపై
నెవ్వియో కల్పించి చెప్పగ
విశ్వసింపుము నీవు సుందరి విడిచినా వటగా ?"

"కాదు కా, దెన్నాళ్ళ కాయమ-
గాఢమౌనము సడలకుండుట
జేసి నిస్పృహావలన శాంతిని జెందినా నంబా !"

"బంధువర్గారోపణమ్మున
ప్రబల మైన విరుద్ధభావము
తాను నీయెడ చాల కాలము తాల్చియుండె నటే ?

"నీవు సుందరమూర్తి వనియును
నిఖిలసద్గుణ గణోపేతుడ
వనియు, నిజముగ దైవసముడవె యనియు ననె మొన్నన్."

బహువిధంబుల నిందల న్నా
ప్రాణములు హరియించుచుండెను
వెనుక, దురభిప్రాయ మిప్పుడు విడిచెనా చెపుమా?"

"నీకు పనివే లుండ నేనియు
నిశ్చయమ్ముగ ఫలించు కోరిక
అక్రమమ్ముగ నే సఖుండా, అచిర కాలములో."

౨౫

"సుందరీ, ఒకమాట, నిలువుము :
చూడకుండనె వెడలినావే !
పయనవేళ నొసంగిపోవా
బాహు బంధమ్మున్ ?"

"ఉండు డించుక దూరముగ నా
యొడలిపై వేయకుడు చేతులు."
"ఏమి విపరీతమ్ము ప్రియతమ,
ఇట్లు పలికెదవు!

చని విశాఖపురమ్మునకు నీ
స్వస్థతాదిక వార్త వ్రాయుము
మరల సంఘటియిల్లువరకును
మనసమాగమము."

"వ్రాయజాలను! మీరు నాపై
వాంఛ విడుమట మేలు నిజముగ.
చేసికొనుడు వివాహ మన్య
స్త్రీని వలసినచో."

"నీకు మతి పోయినది సుందరి!
నిజముగా పెండ్లాడు మనియే
చిత్తశుద్ధిగ బోధ చేయుదె? –
చెడుదు వా మీదన్!"

"భవచ్చిత్తము! నాకు దెలియదు!"
"బాగు! మనఃఖ్యమైన అంబకు
చెప్పిపోదువు గాని యిపుడే
చివరి నిర్ణయమున్."

## ౨౬

మరల నిప్పుడు నాల్గు మాసాలు మొదలుగా
నన్ను మిగుల వేచు చున్నదాన
వెడద నరకబాధ పడలేను సుందరీ,
చివరమాట యేదో చెప్పి పొమ్ము.

ఆప్త జనుడు నీకు నల్లుండు యోగ్యుడు,
అంబ యుభయులకును నాప్తురాలు,
వీరి యెదుట నీవు విడనాడి జంకును
చివరమాట యేదో చెప్పి పొమ్ము.

నీకు ప్రేమ లేద నిజముగా నామీద?
కాక పెండ్లిమీద కాంక్ష లేద?
పడగజాల బాధ, ప్రాణాలు కడబట్టె!
చివరమాట యేదో చెప్పి పొమ్ము.

"ఏమొ చెప్పజాల నేమియు నీనాడు:
పరిణయమ్ము కలదు ప్రకృతమందు."
"పాము చావకుండ, బడితె విరుగక యుండ
బదులు చెప్ప నేమి ఫలము చెపుమ."

"ఏమొ నాకు దెలియ దేమియు, అయినను
మీరు నన్ను మరవ మిగుల శుభము."
"ఏమి పలికినావొ యెరుక యున్నదె నీకు?
పరిగణించి చూడు భావిఫలము!

"అంబ, యెప్పు డింతె ఆడువారలతీరు
ప్రేమ జూపుకొలది బిర్ర బిగిసి

వేచి వేచి ప్రియుని వీతరక్తుని జేసి
కోలుపోవుచుంద్రు కూడ తుదకు.

“తలపకు మయోగ్యత్వా సమర్థతలవలన
నిట్టు లున్నా డితం డని! ఎరుగ వేమొ
తలయుచో పచ్చి వక్షాన వ్రాలునట్టి
సుందరుల్ లేకపో రని సుందరాంబ !

“పలుక వేటికి సుందరీ, పలుక వేల ?
మాటలాడవ ? మూడవ మారు నిన్ను
అడుగుచున్నాను : తెలియునా అవల నేమి
యగునో ? మంచిది, మాటాడ వన్నమాట !...

“నను మరచిపొందు మీ రని నావు నీవు
చాలసారులు దర్పవశాన గాని,
వైదగ్ధ్యమున గాని !– ఇకమీద మరచిపోదు
నీవిధేయుండ నగుటచే నిక్కువముగ !

“సుందరీ, దుర్బలత్వాన జొత్తునేని
నీగృహమ్మును, బయటికి నెట్టివేసి
పురుషుగా గారవింపగ బోకు నన్ను !
చెప్పి పోవుచున్నాను చివరమాట !”

“సెలవు లేదు నాకు నిలువగా నిచ్చోట :
అరుగుచున్నదాన ఆర్య, యిపుడె.”
“ఆర్యవరకు వచ్చె! ఆనంద మయినది !
నాకు జెప్ప నేల, నీ కవండ !”

## ౨౭

స్వాగతము ! నీకు విక్రమవత్సరంబు
శుభముల నొసంగు గాక ! ఈ సుప్రభాత
సమయమున వచ్చె దేప్రదేశమ్మునుండి ?
వేగ మభ్యంజనమునకు వెడలి రమ్ము.

అందె క్రమముగ నీవు నా కంపినట్టి
సుమధురోక్తుల పత్రిక సోదరుండు
చూచి పఠియింప మే మెల్ల చొక్కినాము
హర్షమున ! వందనంబుల నందుకొనుము!

ఈ విచిత్రము వింటివా ? ఇందిరాంబ
నీపయిన జూపె మొన మొన్న నిండుప్రేమ.
నవ్వెదవు, విశ్వసింపవా నాపలుకులు ?
అట్లు చూచెదవేమి ? సత్యమ్ము సుమ్ము !

నాటిరాతిరి నీ యుపన్యాసమునకు
కడు భయంపడి, తన బావకడకు బోయి
ఘటనముం దెల్పి, అనురాగ గౌరవములు
కలవు నీయెడ తన కని పలికె నంట.

## ౨౮

అగును నిజమె, మరద లానాటిరాత్రి నా
యంతికమున కపుడె యరుగుదెంచి

కలతెరంగు దెలిపె గద్గదకంఠయై
భీతిసంభ్రమాలు పెనగొనంగ.
మనసు చంచలమ్ము మాసుందరికి ! మున్ను
మీరు లేఖ లంపువార లంట.

అట్లు చేయగూడ దని చెప్ప నను గోరె,
జంకువలన చెప్పజాలనైతి.

వింత కాక యేమి ? వెనుకకు తోడనే
పంపునేవి తాను ప్రథమలేఖ
ఆవల మీరు వ్రాయ రాద్య, రహస్యంబు
పరుల కామె తెలుప పాడి కాదు.

ఉన్నమాట నిజమె, ఒకయింత నిర్లక్ష్య
భావ, మహాముకూడ ప్రౌఢ యగుట
మారిపోయి, యిపుడు మరదలు మీమీద
మమత గొన్న దన్నమాట నిజము.

మే మెరుంగ మొకొ మీయోగ్యతను ? వేర
వేడ నేల ఆర్య, విడువు డింక
సంశయమ్ము: నేను జతనము చేసెద
పరిణయమ్ముకొరకు- భయము వలదు.

౨౬

సుందరీ, నీచర్య చూడ జూడంగ
కడు విపరీతమ్ముగా దోచుచుండు,

చిత్తచాంచల్యమో, సిగ్గో, భయంబో
కాకున్న యెడ నహంకారమో యేమొ.

నీ కనురాగంబు నిజముగా నున్న
సరసముగా బల్క జాల వెందులకు?
నేను మాటాడంగ నిష్ఠురోక్తులనె
బదులు చెప్పెద వేల ప్రాకృతవోలె?

చనువేళ ఆరేయి సామాన్యుతోడ
అనునట్లు నే పోదు అగ్య, అన్నావు
పాఠశాలాయోగ్యపద్ధతి ముగ్ధ,
నిస్సంశయమ్ముగా నీ కలవడియె.

కాలయాపన మేల కావింతు? వింక
పరిణయ మెప్పు డని ప్రశ్నించినపుడు
ప్రకృతము కా దని బదులు చెప్పితివి-
న్యాయాధికారియే నయము నీ కన్న.
అభిమానమును లజ్జ అంతరించినవె?
పోయి వృత్తాంతంబు పురుషునితోడ
చీ, యేవిధమ్ముగా చెప్పుకొన్నావు!
మధ్యవర్తులమీద మమత యెందులకు?

నిర్మలత్వము లేదు నీప్రేమయందు
నిశ్చలత్వము లేదు నీవర్తనమున.
అంబకు, మీబావ కైన నాదరము
నిజముగా సుందరీ, నీయెడ లేదు.

ఏమి పల్కిన లోక, మే నొక్కరుండ
ననురాగభావాన అభిమాన మెట్లో

విడువలేకున్నాను, వెతలపాల్ చేసి
నను బాధ పెట్టుచున్నను నీవు ముగ్ధ !
కడసారి చెప్పెద కష్టమాగాక
ఉజ్జగించుట శుభం బౌకకొన్ని నీవు :
కల్యాణమే నీకు కాంక్షితంబేని,
భర్తగా న న్నీవు భావింతువేని,

స్వాతంత్ర్యభావమ్ము చంపుకోవలయు
వేగ ముద్యోగమ్ము విడనాడ వలయు.
ఆరి యా నహంకార తరువును నీవు
కూకటి వేరుతో కోయంగవలయు.

ఇటు సేయు నిల్లాలి నెలమి నాథుండు
తన గృహలక్ష్మిగా, తనదైవతముగ
సర్వవేళలయందు సాదరమ్ముగను
పూజసేయును భావపుష్పాలతోడ.

## 30

"నాకు వీలు దొరకక నాల్గవనాడు మా
సుందరాంబతోడ చొరవ చేసి
పరిణయమ్ము గూర్చి భాషింపగా : ఆమె –
బుద్ధి మరల మారిపోయె నార్య !"
"కాని సుందరాంబ గతమాసమున వివా
హోన్ముఖమ్ముగానె యుండెను గద ?

మాస మాసమునకు మారి పోవునె యామె -
బుద్ధి పక్షయుగము పోలిక నార్య !
"భవతు ! పోవనిందు ! భగవతికృప లేని
జతన మేల యింక సలుపవలయు !
అందజేసి యామె కస్మన్నమస్కృతి
పంపు మనుడు సకల పత్రికలను."
"ఆర్య! యెట్లు తెలియు ఆలేఖ లున్నట్లు ?
ఏల మీకు ఉన్నవేళ నైన ?"

## ౩౧

భాగధేయమున ప్రతికూలముగా
అంతరించినది అనురాగాధ్వము !
నిన్ననె తెలిసెను నీతుది నిర్ణయ
మిక శేషించిన దేకవాంఛితము.

పంపవలయు నా పత్రిక లన్నియు :
అవధరింపు మిదె అంతిమవాక్యము.
సాధువర్తనుని సందర్భమున
కలుగవు నీకే కష్ట నష్టములు.
నీకు జగజ్జననీ కృపచేతను
కల్యాణం బగు గావుత సుందరి !

## ౩౨

"అత్తకు మీరు లిఖించిన
యుత్తరముం జూపి యనియె : ఒల్లంజాలన్
చిత్తము మారుటచే, కిం
చిత్తయినను తద్వివాహ సిద్ధాంతంబున్."
"ఆ యమ కింకను లేఖలు
వ్రాయుదు నని తలపలేదు స్వప్నమునందున్ !
పోయెను నీ కభిమానము !
చేయకు మికనైన నిట్టి చేష్టలు బాబా !"
"నూతనముగ నే నంపిన
వ్రాతగ దలపోసినావు ! వాస్తవముగ నా
ప్రీతానురాగ పేరిట
నే తెరగున వ్రాతు కమ్మ నికపై నంబా !"

## ౩౩

మరు మరీచికా విధాన మతిభ్రమము గొలిపె గాని
పరిణామమునందు ప్రేమ ఫల మొసంగ దాయె శివా!
నిష్కల్మష రక్తి శోధ నిండుగ ప్రేమించినాను.
తెలిసికొనం జాల నామె తికమక పెట్టంగ, శివా !
ప్రతిభంగం బయ్యె నింత పరకు ప్రమాదమ్ముచేత
అపరాధము క్షమియింపగ నర్హుండవు నీవె శివా !

భవితవ్యముచేత నాకు
భావికాలమందు గలుగు
నఖిలంబున కిది మొదలుగ
నవలంబన మీరె శివా!

సంపూర్ణము

# ర త్నా క ర ము

## అంకితము

శ్రీ వజ్ఝ బాబు రావుకు

## పూర్వ భాగము

(సంధ్యాసమయము. అలంకరించి యున్నగదిలో తల్పముమీద భ్రమర పండుకొని యుండును. ఆమెసఖి శాంత ప్రక్కన నిలిచి యున్నది.)

శాంత

ఏల వినిపించదకో వీ యాత్రజనవాక్కు ?
నీకోసమై మేను సెగలుపొరలెత్తిసే !
ఓ చెలీ, ఓ చెలీ, ఊర్పుతావులె కాని
పలుకుతేనియ చినుకు చినుక వేసే చెవుల ?

ఓసఖీ, ఓసఖీ, ఊరకే నావైపు
శూన్యదృక్కులతోడ చూచుచున్నావేమె !
వింతవర్తనముచే వెర్రియేమో యన్న
శంక మామతులలో జనియించుచున్నదే !

ఓ చెలీ, ఓ చెలీ, ఒకకొంత తడవేలా
నవ్వితివి జాలిగా నామోము వీక్షించి.

నిర్నిమేషమ్ముగా నింగి నవలోకించి
మరికొంత తడవునకు మందస్మితాస్యవై
ఓసఖీ, ఓసఖీ, ఒత్తిగిలి యొకవైపు
గాత్రవల్లిక స్వయంగ్రాహమ్ము చేసితివి !
నెచ్చెలీ, నెచ్చెలీ, నీ గభీర స్వాంత
రత్నాకరమ్ములో రాజుచున్నది కీలి.

మౌనముద్రిక వీడి, మర్మము విడనాడి
నీవ్యథం దెలుపవా నెచ్చెలీ, నెచ్చెలీ !
పలుకవా పలుకవా, పాటలాధరదీప్తి
నంతర్హితము సేయ నగునె యాస్యములో ?
నీ లోలకప్రభా నిచయమ్ము నెచ్చెలీ,
చెక్కిళ్ళలోయలో చిక్కువడ్డది సుమీ.
నాసఖీ, నాసఖీ, నగుమోము నెలవంక
కాలధారాధరాక్రాంతమ్ము కానేల ?
ఆదిత్యభగవాను డస్తమించుట జేసి
ముకుళించెనా నీదు ముద్దుకనుదామరల్ ?

చూడవే చూడవే శోభామయం బైన
ఉద్యాన వనవాటి నోచెలీ, ఓ చెలీ !
మరకతోన్నతపీఠి మల్లె యారోహించి
ఓలగం బున్నదే యుద్యానసీమలో.
చూడవే చూడవే, శోణకుబ్జాకంబు
కంటకాంబకములన్ గాచుచున్నది వనిని.

జాలమార్గము వెంట చల్లగా మెల్లగా
మలయుచున్నది సఖీ, మంద పవమానంబు.

విడువవే, విడువవే, విడువవే తల్పంబు,
విరిసెజ్జపై చెలీ, విశ్రమింతువు గాని.
ఒంటిగా గూర్చుంద ముపవనమ్మున మనము :
నీ మనసులో బాధ నిమ్మళించును కొంత.
ప్రియసఖీ, ప్రియసఖీ బిగువు విడువవె యింక,
భాగించుకొందు నీ బాధ యేదో గాని.

పలుకవా పలుకవా, ప్రాణాధికవు నిన్ను
వినిగింప కికనైన వెడలిపోదును గదే!
కనుదోయి దెరచి నన్ గనుగొని పశ్చాన
నిష్క్రమించెదు దాన నెచ్చెలీ నెచ్చెలీ!

## భ్రమర

(లేచి, తల్పముపై గూరుచుండి)
వీడి చనబోకు మీవేళ నను ప్రియసఖీ!
తాళ జాలక తలపుతరంగ గమి తాకులకు
వెతల పాలైన యీ వివశ దుర్బలహృదయ
వీడి...

మనసులోని సముద్రమథనమ్ము ప్రియసఖీ,
తెలుపు పెటులో నాకు తెలియకున్నది గదే
వీడి...

అనురాగవతి యైన అమ్మ కీవరలోనె
కొలదిగా నామీద కోపరేఖలు కలవు
వీడి...

క్షోభించి క్షోభించి క్షుద్రజీవితముపై
అంతంత మాత్రమే అసక్తి మిగిలినది
వీడి...

## శాంత

(తర్జని నోటిపై నుంచుకొని)
అశుభవాక్కులు నోట అనుచితము రానిచ్చు
టైన వెగటేల చెప్పుమా,
ఓ చెలీ, అపుడె జీవనలీలపై?

ఆరోగ్యవతివి నీ వాహ్లాదము త్యజించి
బ్రతుకుపై రోసినావే
ఓ చెలీ, ప్రథమ యౌవనమునందే !

కావ్య నాటక కథాగ్రంథజాలము తెరవ
కనిశము పర్యంకమే
ఓ చెలీ, ఆశ్రయించెద వేటికే !

మనసులో దిగులుచే మథనపడు తీరితి
ఊరకే కృశియింతువా ఓ చెలీ,
ఉచిత మేమో చూడవా !

గుప్తి యేటికి ? నీకు గూర్ప్రదానను గదా
నవసిపోవగ నేటికే, ఓ చెలీ,
నాకు వివరింపరాదే !

## భ్రమర

(దీనముగా చూచుము)

నీవే నాకు, నీవే నాకు
నావవు దుఃఖనదిని గడప... నీవే...

చింతాక్రాంత చిత్తమునందు
సడలిపోయెను సహజ పటిమ... నీవే...

తేకువ యెట్లో తెచ్చుకొనుమ
తెలుపుదు మనసు తెరగు చెలీ ... నీవే...

ఆదిని నాకు అభయహస్త
మొసగ వలయు ఓరిమితోడ ... నీవే...

అలుక పూనవలదు నాపై :
చెలీ, అపుడు చెప్పగల్గుదు... నీవే...

హేయభావ మెంతమాత్రము
చెలీ, నాపై కలుగ రాదు... నీవే...

హేయభావ మెంతమాత్రము
చెలీ, నాపై కలుగ రాదు... నీవే...

## శాంత

(భ్రమరను కౌగిలించికొని ముద్దాడి)

నన్నిపుడైనను నమ్మవె ప్రియసఖి :
ఏటి పలుకు లివి : హేయభావమా
ఎన్నడు గానీ ఏగతి గలుగును... న...

నీకయి చెలియా, నే నెది యైనను
నిండు మనసుతో నెరవేర్తునుగా... న...

ఏది హితము నీ, కేయది సుఖదము
శ్రమ మని యెంచక సమకూర్తునుగా... న...

తనువులు రెండుగ కనపడుచున్నను
అంతరంగముల నద్వయరూపమె... న...

## భ్రమర

అమ్మ భ్రమ్మర నన్ను అత్తవారింటికే
పొ మ్మనుచు పలుమారు పోరు పెట్టుచునున్న
దేమి చేయుదు సఖీ, ఏది మార్గము నాకు?

నా నుదిటిపై శాంతి నలువ వ్రాయనె లేదు !
దీర్ఘ జీవితము నే తెరగునం గడపుదును !
ఏమి...

అమ్మ కిప్పుడు లోక మన్న భయమే కాని
పుత్రికా హృదయంబు పొగిలిపోవుట యెరుగ
దేమి...

అనురాగ రహిత మైనట్టి కాపురము నే
చేయ లే నని చాల చెప్పి యేడ్చితి నెంతొ
ఏమి...

అర్ద్రిమానస యయ్యు, అధునికహృదయాల
అనురాగ విధ మేమొ అమ్మ యెరుగనె యెరుగ
దేమి...

అచటి కేగుటకన్న ఆత్మహత్యయె మేలు !
పడలేను, పడలేను బాధ లీపయి సఖీ !
ఏమి...

శాంత

పోవలదు లే అచటి కింక – అమ్మ
పోర దీపయి విడువు శంక.

ప్రసవకోమల మైనయెడద – నీది
బాధపెట్టిన మొదలె చెడద ?... పోవలదు...

యమయాతనలు మరల వలదు — నీకు
అమ్మసన్నిధి శాంతి కలదు — ఆమె

వేరుగా భావింపబోదు—మదిని
వెత నీవు పెట్టుకోరాదు... పోవలదు...

ఉల్లాసకర మైన వింట—చెలియా,
ఉన్న వెనోన్—నేను జంట... పోవలదు...

## భ్రమర

(ఈష దుత్సాహముతో)

అవును సఖీ, అవును సఖీ, అమృత తుల్యవాణి సఖీ,
కాని నీవు జీవితమున కష్టమెరుగ లేవు సఖీ... అవును...

అనుకూలుం డైన భర్త
ఆదరించుచుండ నిన్ను
ఎటులు విదిత మగును నీకు
ఈ హృదయజ్వాల సఖీ... అవును...

జీవన మరుభూమిలోన
చింతతోడ రగిలి రగిలి
శోషణమై కాంతుగాని
సుఖ ప్రపలు కానబడునా ?... అవును...

ప్రకృత స్థితియందు బహుల
బాధ పడుచు నుంటె కాని
ఇచటగూడ శాంతి లేదు :
ఏమి చేయ దగును సఖీ !... అవును...

## శాంత

గతముకన్న నీకు భావి కాలము త్రిగుణమ్ము కదా ?
జీవయాత్ర యేవిధాన చేయగలవు ప్రాణసఖీ !

పుట్టినింట నైన శాంతి పొందజాల వేని చెలీ,
ఎచట సుఖము కలుగు నీకు? ఎవరు కూర్చువారు కలరు?
నీయావస్థ గాంచుకొలది నిండుదుఃఖ ముదయ మొందు,
సౌఖ్య మొందు మార్గ మేది జన్మములో ప్రాణసఖీ!

భ్ర మ ర

అట్టిత్రోవ దొరకునేని అవరోధము చూపవుకద?
శాంతి గాంతునేని సఖీ, సమ్మతంబె కదా నీకు నీ
అమ్మతోడ జెప్పవు కద? అకల నన్ను నిరుత్సాహ
పంకమందు ద్రోయవు కద ప్రాణసఖీ, ప్రాణసఖీ!

కా ం త

చెలియా, నీ వింతగా చెప్పగా వలెనా:
అమ్మకు నీవార్త అవంతయేని
కర్ణగోచర మేమి కావలె లేసి!
గుప్తముగా నుంతు క్రొత్త వృత్తాంత,
మెరిగింతు నిజముగా హిత మేదో నీకు,
చూచి సంతోషింతు సుఖ మబ్బునేని.

భ్ర మ ర

చూచినా నొకనాడు శుభముహూర్తమునందు
రమణీయ మహానూత్న రత్నాకరం బొకటి:
గాంభీర్యధామమ్ము, కాని భయదము కాదు,
లావణ్యనిధి యయ్యు లవణార్ణవము కాదు.
అమృతకలశమె, కాని హాలాహలము లేదు.
పవనాహతకి తుంగభంగముల్ రేగవే!

అస్పర్శచేత నే నఖిలచింతలు వాసి
ఆనందమూర్తినై అమృతంపు దీవినై
రత్న ప్రభల వెల్గి రమణీయరూపాన
రత్నాకరమ్మునై రంజిల్లుదును సఖీ !

## శాంత

కాంచియుందువు చెలీ, గౌతమీ ద్వార
రమ్యదేశమునందు రత్నాకరమ్ము.
అరుగుదెంచిన దాని అచ్చోటినుండి
నెచ్చెలీ, నెచ్చెలీ, నీలోనిమార్పు
అంత కంతకు నాకు అవగతం బయ్యె.
మరుగుచేసితి వొక్క మాసకాలమ్ము
నిబ్బరమ్ముగ చెలీ, నీరహస్యమ్ము !

ప్రణయ వృత్తాంతంబు ప్రథమమ్మునుండి
విడువకుండ క్రమమ్ము వివరింప గదవె !

## భ్రమర

ఆ ప్రభాతము వేళ ఓ శాంతా
అభిజనుల సౌధాన ,,
కుట్టిమము వేదిపై ,,
కూర్చుంటి వదినతో ,,

ఆయింటి భామినుల కో శాంతా
ఆప్తురాలట వదిన ఓ ,,
కుశల మడిగిన పిదప ఓ శాంతా
గోష్ఠి చేసిరి వారు ,,

నే పరధ్యానముగ ఓ శాంతా
నింగి కాంచుచు నుంటి ,,
చూచుచుండగ నట్లు ,,
సూర్యకాంతులు పడిన వో శాంతా
మస్తకమ్మును త్రిప్పి ఓ ,,
మరల కన్నులు విప్ప ,,
ఆవిర్భవించినది ,,
అభినవాకారమ్ము ,,

శాంత

( బుజము తట్టి నవ్వుచు )

అంత యభినవ మైన ఆకార మొకొ్క
దిగ్భ్రమ పుట్టించు దివ్యతేజంబొ !
పురనివాసమునం దపూర్వ మైనట్టి
మోహనాకృతి గాంచి ముగ్ధ వైనావొ !
( తేరిపార జూచును )

భ్రమర

(ముసి ముసి నవ్వుతో)

అట్టాలకమునుండి ఓ శాంతా
ఆ పురుష విగ్రహము ,,
వాల్చి నిజశిరమ్ము ,,
వంపు సోపానములు ,,
దిగుచుండు సమయాన ,,
తిలకించినా నమ్మ ,,

చివర సోపానమ్ము ఓ శాంతా
చేరినంతనె నన్ను ,,
విప్పుకన్నులతోడ ,,
వీక్షించె ఆమూర్తి ,,

### శాంత

ప్రథమ వీక్షణమందె యాతడు
భ్రమర కీటం బైన న్యాయము
చెప్పుచున్నవి జాజువారిన చెక్కిళులు చెలియా !

### భ్రమర

తెలియకుండగ నాకె అయ్యెడ
దేహ మెట్లో లేచి నిలిచెను
వేదికాస్థలినుండి నెచ్చెలి, వేగిరం పడుచు.

అవల నాతడు మెట్లదరిగా
అవనతాననుడగుచు కుట్టిమ
మార్గమున నరుదేరసాగెను మందగమనమునన్.

నిబ్బరము లేదేమొ, లజ్జయొ,
నిండుదృక్కులు నిలుపజాలక
చూచితిని కడగంట నాతని శుభ్రవదనంబున్.

నాలు గడుగులు వేసి యాతడు
నన్ను గనుగొని వెడద కన్నుల,
శిరము వాలిచి పోవసాగెను శీఘ్ర గమనమునన్.

శాంత

(ఉత్సాహముతో)

అవును సకియా, ఆ త్రిలోచను
డగును గాక, ద్వితీయనామము
నిలవగలుగునె కాంచకుండగ నీముఖాబ్జంబునన్ !

భ్రమర

అదియె వల్లభు నామధేయము :
అక్షణంబున నాకనుంగవ
కలిసిపోయిన దట్లో ఆయన కలువ కన్నులలో.

నాసమీపద్వార సరణిని
నడచి లోనికి బోవు నదనున
పరపె నాపై నతడు దీర్ఘాపాంగ వీక్షణమున్.

సకియ, క్రమ్మర వజ్రలేప
స్థగిత వేదికమీద నుపవే
శించితిని జనియింప నంజడి చిత్తకుంజములో.

శాంత

( వక్రముగా జూచి చిరునవ్వుతో )

నిన్ను జూడగ మరల నేదో
నెపముపై నరుదెంచినాడా ?
అన్యథా యెటు లగును చెలి, నీ
వయస్కాంతమవు.

### భ్రమర

తిరుగ రాలే దతడు చెలియా,
ధీరచిత్తుని భాతి దోచెను,
యువతిఁ గనుగొనినంత మాత్రన ఒడలు మరచునొకో!

కట్టుకొని యున్నాఁడు సకియా,
పట్టుకమ్మల దుకూలమ్మును
విడిచి చెంగులు, నిండునడకను వింత లీనంగా.

తాల్చియున్నాఁ డర్ధ బాహుల
ధవళ కూర్పాసమ్ము చెలియా,
తొంగి చూచుచునుండ వక్షోద్యుతులు కుతుకమునన్.

ఆమనోహర దీర్ఘ బాహువు
లందు లతికాశోభ కూడునొ
కూడదో, మరి నాకుమాత్రము గోచరించినదే.

### శాంత

బాగు బాగో ప్రియసఖీ, ఆ
బాహులతికలు నీ తనూలత
నల్లిబిల్లిగ నల్లుకొనుటే అచిర కాలములో!

(భ్రమర సిగ్గుతో లేచి, వాతాయనమున
గూరుచుండి, ఉపవని నుపలక్షించును)

ఏది, ఇంచుక తిరుగు భ్రమరా,
ఈ కఠోర హిమాంశు రుచిలో
తేజరిలుచున్నావు గిరిజాదేవి చందమునన్.

ఆ త్రిలోచనమూర్తి నీనయ
నా వృత్తోర్మిల దేలియాడుచు
చెలియా, నీపదపట్టభంగ శ్రేణి జేరునులే !

భ్రమర

(గంభీర వదనముతో)

అంత సులభం బైన దని తలపంగరాదు.
అది కాక ప్రియసఖీ, ఆపదద్వయి జేరి
జీవితము సఫలమ్ము చేసికోవలె నేను.

గ్రహియించితివో లేదో కాని నావల్లభుడు
చూడగా చూడగా సులభసాధ్యుడు కాడు.
ఉత్తమాన్వయమునం దుద్భవించినవాడు
సుగుణాలలో తనూశోభ కలిగినవాడు-

శాంత

అంత గుణవంతుండు కావున
ఆ త్రిలోచన మత్తగజపతి
భ్రమరికా కుచకలశవారీ బద్ధు డయి పోవున్ !

భ్రమర

(నవ్వి తల వంచుకొని)

ఆనాడు మొదలుగా అన్యోన్య వీక్షణము
పక్షకాలము దాక ప్రాప్తించనే లేదు.
గమనించి యొకనాడు కంఠస్వరము నేను
దూరమ్మునందుండి తొంగి చూచితి ప్రియుని.

నిర్విశేషమ్ముగా నిలిచె నాపై కనులు,
శ్యామమ్ముగా నుండె గండఫలక ద్వయము.
చెదరి యున్నది కేశజాలమ్ము విడి విడిగ
పాప, మాతడు బాధపడుచున్నటులు తోచె.

## శాంత

చెప్పనేటికి నింక వేరుగ
చెలియా, నీపై రక్తి చేతనె
మౌనముగ కృశియించినాడా మానవోత్తముడు !

## భ్రమర

కాదు కాదే, కొంతకాలమ్మునకు గాని
అంకురింపనె లేదె అనురక్తి నాథునకు.
ప్రశ్నించినాడంట ప్రథమ పర్యాయంబు
నే నెవ్వరని వధూనిక గాంచి యొకనాడు.

మాటమాటల నడుమ మరల నావృత్తాంత
మడిగినాడట చెలీ, ఆ మీద నొకసారి.
మరియొక్కసారి యీమందభాగ్య భవిష్య
దాశాదులనుగూర్చి అడిగినాడట చెలీ !

పోవుచున్నార మీపురినుండి త్వరలోనె
అని వధూనిక తెలుప ఆననమ్మున కళల్
తరిగిపోయిన వంట తక్షణమ్మే సఖీ !

### శాంత

( మృదువుగా చపేటిక వేసి )

సంశయాత్మకురాలు, ఆతని
స్వాంత మతివేలమ్ముగా నీ
లలితరూప విలాసవాగుర లగ్నమైపోయెన్.

### భ్రమర

కుదుట పడినది మనసు, కోర్కె లీరిక లెత్తె
సాహసోద్దీప్తిమై సారెసారెకు నేనె
నిర్భరమ్ముగ నాడు నిండుచూపులతోడ
కనుగొంటి హృదయేశు కనులకరవే తీర!

ఆదిలో వల్లభుం డాలోల నేత్రాల
వీక్షించె నెచ్చెలీ, ఈషత్త్రపారేఖ.
వెడదకన్నులతోడ వీక్షించె నావలను,
ఆననమ్మున మందహాసాంకురము తోచె.

అవివాహితుడు ప్రియుండన్న వృత్తాంతంబు
కర్ణజ్వరము పోవగా దెల్పినది వదిన.

### శాంత

తావకాకర్ణాంత లోచన
ధాళధళ్యముచేత నాతని
వజ్రపంజర సన్నిభం బగు స్వాంత మానాడే-
కరగి క్రమముగ పూవుదేనియ
కరణి సారళ్యంబు మధురిమ
సంక్రమింపగ త్వన్ముఖమ్ముగ జాలువారెనులే !

## భ్రమర

జాలువారిన మాట సత్యమౌను: తదాది
వల్లభుం డనుదినము వచ్చుచుండెడివాడు
వీక్షణోత్సుకత నావీధి మందపునడల.

సకియరో, ఒకనాటి సంజె చీకటివేళ
ద్వారభూమి నొకింత దాటిపోయినవాడు
నను గాంచి వెను దిరిగి నాలు గడుగులు వేసె.

ధైర్యమ్ము పూని నే ద్వారసీమను జేర
అడిగె నాసేమమ్ము నమృత వాక్కులతోడ.

పట్టణమ్మును విడిచి పయనించు సమయమ్ము
దరియుచుండగ, నాకు తత్తరము జనించె.
ఉత్కంఠతో వేచి యుంటి దేహళిమీద
వల్లభాగమనంబు వాంఛించి యొకనాడు.

నా యదృష్టవశాన నాటి రాతిరివేళ
దీపావళీ కాంతి దృగ్గోచరం బైన
నాథుండు మెల్లగా నాసమీపము జేరు
క్షణమునందే యెట్లొ గడపవెనుకకు బోయి
నిర్నిమేషమ్ముగా నిలువంబడితి నేను.

నామోము వీక్షించి నాథు డించుక యాగి
సరణినే మృదువుగా సాగి పోవుచునుండె.

గుండె దడదడ గొట్టుకొనుచున్న నెట్టులో
తెమలించుకొని గొంతు, తెచ్చికోల్ ధైర్యాన
మందమ్ముగా, రేపు మా ప్రయాణం బంటి.

నాథుండు తోడనే నను జేరి చల్లగా
అప్పుడే పోదువా అయ్యొ అని నిట్టూర్చి
మన సమాగమ మెప్పుడు మరల అని ప్రశ్నించె.

శాంత

మంచిమాట : ముందు నీవు మాటలాడ కుండువేని
వెడలిపోవునాడె యాతడు : వియోగంబు తప్పనిదె !

భ్రమర

తెరపు వడియె నో రటులో దేవికరుణ ! కాని తగిన
బదులు పలుక జాలనైతి ప్రాణేశ్వరుతోడ చెలీ !
ఏమొ తెలియ దంటి : పాప మింత మొగము చేసికొన్న
నాథు డనియె మందముగా నలుదిక్కులు చూచి యిట్లు :
"ఇంతటితో సరియేనా ? ఎన్నెన్నో ఆశ లున్న,
వంగణమ్ములోనికి నే నరుదెంతున మాటాడగ ?"
వదనయాలికి డయినంతనె వల దంటిని లోని కతని,
పాప మెంత మనసులోన బాధ పడెనో హృదయేశుడు !
"అటు లగునెడ నీ సేమ మప్పుడపుడు వ్రాయుదువా ?
పంపుదువా నీ ఛాయా పటము చూచుకొనుచునుందు !"
మౌనము వహియించితి నీ మాటల కే మనుకొనెనో
హృదయేశుడు ప్రాణసఖీ ! ఎంత మందబుద్ధి నయితి !
ఇంతలోన కంఠరవం బేతేరగ, ప్రియుడు నన్ను
విడువలేక విడువలేక వెడలి పోవ సాగె సఖీ !

అనుపదమ్ము వెను దిరుగుచు ఆకర్ణాంతవిశాలము
లగు లోచనములు నాపై అనురాగముతో బరపెను.

నిలిచి ద్వారదేశమందె నిర్నిమేష నయనమ్ముల
జూచుచుంటి ప్రాణేశుని చూపుమేరదాక సఖీ !

దివ్యపురుషుభంగి దోచె దీపికావళీ విరాజ
మానమూర్తి హృదయేశుడు మార్గములో ప్రాణసఖీ !

పండుకొంటి లోని కరిగి పర్యంకముపై, నూతన
వేదనతో ఆయామిని వేగిపోయె ప్రాణసఖీ !

తెలియ లేదు ప్రియునివార్త, తీర్చలేదు ప్రియునికోర్కె
తోచదాయె ఉచితక్రియ, దురదృష్టము, దురదృష్టము !

## శాంత

అయినదానికి నింత ఆయాసపడ నేల ?
చక్కపడులే, ముందు శాంతించు ప్రియసఖీ !

## భ్రమర

నాప్రవర్తనవలన నాథుండు ననుగూర్చి
గ్రామీణగా నెంచునా ప్రియసఖీ,
కఠినహృదయగ నెంచునా ?

నేటివరకును నేను నిష్క్రియమ్ముగ నుంట
విసిగి వేసరి యుండునా ! ప్రియసఖీ,
విస్మరించున నాథుడు ?

శాంత

గ్రహియించినాడు నీగాఢానురాగమ్ము,
మౌన మంగీకార మాపనమ్ముగ నెంచి
ఉత్సుకుండై వేచి యున్నాడు నీ కొరకు.
చపలచిత్తుడు కాడు, శాంతస్వభావుండు,
మరవ డెన్నడు: నీకె మారునేమో మనసు.

భ్రమర

(ఆవేశముతో)

ఏటిమాట ప్రాణసఖీ! ఎట్లు మరతు హృదయనాథు!
మారునేని మానసంబు మనుగడయే లేదు నాకు!
ఆత్మార్పణకయి యెంతో ఆతురపడు చున్నదాన,
వైరిభయము మాత్ర మొకటి విడువకున్న దేమి చేతు?
నాయందే గుణగణంబు నాథున కాకర్షకంబు!
సడలకుండు టెట్లు ప్రేమ శాశ్వతముగ ప్రియునిహృదిని?

శాంత

ధీరహృదయగంభీర రక్తిమ తెలియ దీవల, కగాఢమ్ముగ
వేరు తన్నినమహావృక్షము విధమునన్ సకియా!
పాలపొంగువిధాన నాతడు పైకి నుబుకుట లేదు గానీ
విడువజాలడు నిన్ను చెలియా, వేయిజన్మలకున్!

భ్రమర

యాదృచ్ఛికమ్ముగా నరుగుదెంచి మదీయ
శకటాశ్వరోహణ క్షణములో వల్లభుడు
కాంచినాడే నన్ను గంభీరవదనుడై.

మా వధూనిక యున్న, మంద మందాక్షముగ
పోవుచున్నా నంటి — పూర్ణానురాగమ్ము
తొలుకాడు నేత్రాలతో ప్రియుడు నను గాంచి
శిరము పంకించి యెదో చెప్పబోయెను గాని
బంగారునోట ఏపలుకు రానే లేదు !

వన్నె తరిగిన జాలి వదనమ్ముతో నాథు
డడుగు ముందుకు వేసె — అశ్వమ్ము సాగినది :
వీక్షణస్రజముతో వీక్షించి యొకమారు
అల్ల నల్లన నాథు డంతర్హితుం డయ్యె.

శాంత

ఇంతకన్న నిదర్శనం బిక
నేమి కావలె నోసి, నీప్రియు
గాఢరాగ వ్యంజకమ్ముగ కంప మెందుల కే !

ఆత్మవిశ్వాసమ్ము కోల్పడి
నట్టు లున్నా వోసి యబలా,
భవ దమోఘ మహోగ్ర రూప ప్రాభవము మరచి !

అంతరం బను చింత యుండునె
అమలినం బగు ప్రేమలహరికి
కులము, సంపద, లోకవృత్తము కూడ తాళవు పో !

ఆ మహాగ్ని జ్వాలలో బడి
అన్నియును ద్రవియించి చెలియా,
దివ్యనూతన రూపరేఖల దేజరిల్లు గదే !

### భ్రమర

అర్పించుకొందు, నన్ననుకంపతో మీరు
స్వీకరింపగ వలయు జీవితేశా ! యనుచు
పంపుదును లేఖ యన, పదకర్త యైనట్టి
ప్రాణనాథునకు నాపలుకులో మాధుర్య
మెట్లు చాలును సఖీ, ఏమి చేయుదు నిపుడు !

### శాంత

(ఆలోచనా పూర్వకముగా)

మరల నీ వాపురికి జని నీ
మనోహరుని జూచి రా దగు
నొక్కసారి : వహింపవలె నే ఓర్మి యందాకన్.

ఆ త్రిలోచనమూర్తి నీనయ
నామృతోర్ముల దేలియాడుచు
చెలియ, నీపదపద్మయుగంగ శ్రేణి జేరును లే !

ప్రమదమున నీ ప్రాణనాథుని
బాహులతికలు నీతనూలత
నల్లిబిల్లిగ నల్లుకొనులే అచిరకాలములో !

(భ్రమర మందహాసముతో తల వాల్చును.
ఉభయులును గాఢముగా కౌగిలించుకొందురు)

# ఉత్తర భాగము

(సాయం సమయము. భవన ప్రగ్రీవములో
నిషణ్ణకములమీద ఇద్దరుపవేశించి యుందురు)

## ధూర్జటి

నిజమె సఖా, ప్రేమ యుభయ నిష్ఠమైన దగును సఖా!
అవల నేమి సంఘటిల్లె నాలకింపవలతు సఖా!

## త్రిలోచనుడు

మరుదినమ్ము ప్రాణేశ్వరి మాగృహాంగణమ్ము జేరి
భామినీజనమ్ముతోడ భాషించుచునుండ గంటి.

ద్వారసీమ నిలుచు నన్ను వామలోచనములతోడ
నిపుణముగా నడుము నడుమ నిండురక్తి జూడ జొచ్చె.

ఎంత వింత కాంతు లీను హృదయేశ్వరి కన్నుదోయి!
ఒక కటాక్షమునకె నేను ఉప్పరమున కెగసిపోదు.

వీడుకోలువేళ సెలవు వేడి చనెడితలపుతోడ
కాలయాపనమ్ము చేయ గడగె నోయి ప్రాణప్రియ!

ఏమొ పలుకబోయె గాని యెదుట ముదిత లుండుకతన
జాలి గొలుపు వదనముతో సారించిన దోయి దృష్టి.

గాటముగా నపుడు ప్రియను కౌగిలించుకొనెడి తమక
ముదయించెను : మెల్లన నిట్టూరుపులో లోని కేగి,

సంభ్రమమ్ము పూర్ణముగా శాంతించినపిదప మరల
దరిసినాడ నోయి సఖా, ద్వారబంధ నికటభూమి.

చల్లగా మదీయనయన చకోరమ్ము లానసాగ
సఖీపూర్ణవికచవదన చంద్రికాజాల మపుడు.
పైటుచెరగులోన మరగు పరచి తెచ్చినట్లు తోచె
ప్రాణప్రియ తన ఛాయా పటము నాకు నొసగ సఖా!
అవకాశమె లేకపోయె అందుకొనగ ప్రాణేశ్వరి
హస్తజలజ యుగమునుండి ఆ యనర్ఘ బహుమానము.
చివర కటులో హృదయేశ్వరి 'సెలవు పోయివత్తు' ననగ
మందహాస వదనుడనై మంచిది శుభ మంటి సఖా!

ధూర్జటి

అవల సఖా, నీప్రేయసి అభిజనమ్ము ప్రాపించుచు
ప్రణయలేఖ వ్రాసినదా? పంపినదా చిత్రపటము?

త్రిలోచనుడు

లేదు సఖా, నాకు తెలియ లేదు సఖా, ప్రాణేశ్వరి
వార్త లేమికూడ సఖా! వాడిపోయినాను సఖా!
బహుళపక్షమైనపిదప ప్రాణసఖీముఖ సుధాంశు
మండలమ్ము తోచె నొక్కమారు హఠాత్సంభవముగ.
నన్నుగాంచి విప్ఫారిన నయనాంబురుహమ్ములతో
చేసె నమృతసేచనమ్ము చిగురు దొడుగ నెడద సఖా!
ఆ విలోకన క్షణమ్మునందు సఖా, ప్రాణేశ్వరి
భ్రూవల్లులు ధనురాకృతి బూనిన వతిచిత్రముగా.
చిత్రరత్నకంబలాపీన మైన భ్రమరికా
లలితముఖాంభోరుహమ్ము లజ్జచే వాలిపోయె.

ఆమె యంతికమున కే నల్ల నల్ల పోవుచున్
పల్కరింపగా మధుర భాషణములతో ప్రియన్—
'ఏమి ప్రియా, నీకునై ఎదురు చూచుచున్నాను
దినము దినము, వార్తయే తెలియనే తెలియలేదు.
'కుశలమా ? ఇచట నీవు కొన్ని దినము లుందువా ?
మనము రహస్యముగా, మాటలాడు కొందమా ?'
'వీలు కాన రా దిచట, వెడలి పోవుచున్నాను
శీఘ్రముగా మాయూరు—చెప్పలేను క్షేమ మని—'
అన్న దోయి ప్రియురాలు— అంతలో నెవరో యచటి
కరగుదేర, మగలినా నన్య కన్యలో పలుకు.

పోవుచుండ బంగారు బొమ్మ నడుమ నడుమ నా
వదన మీక్షించుచుండె వాలుచూడ్కి సారించి.

మరల నే బలుకరింప మందహాస చంద్రికా
మంజులాననము వాల్చి మారు పలుక లే దోయి !

నాలు గై దడుగు లేను నడువగా వెనుకదిక్కు
వినంబడెను తలు పోర వేసినట్లు మందముగ.

## ధూర్జటి

పరులు చూతురేమొ యనెడి భయముచేత నీ ప్రేయసి
ఆ విధాన వర్తించిన, దనురాగము లేక కాదు.

## త్రిలోచనుడు

అవును సఖా, నిజమె సఖా, ఆర్ద్రహృదయురాలు సఖా,
శాంతమూర్తి ప్రాణేశ్వరి జాగరూకురాలు సఖా !

అపుడు నేను కాసుకన్ను నణచుకొనుచు పురోవర్తి
కక్ష్యలోన ప్రవేశించి కవాటమ్ము తెరచి యుంచి-

శయ్యమీద బవ్వళించి, శాంతముగా జూచుచుంటి
ప్రాణేశ్వరి యున్న వైపు బాహుయుగళి మల్లెవేసి.

కడచి యుండలోపు రెండు గడియ లావిధాన, భ్రమర
తుదకు ద్వారమోర చేసి తొంగిచూచె నోయి సఖా!

ప్రాణేశ్వరిం గాంచు ప్రథమ క్షణమునందు
నాట్యమ్ము చేసినది నయనద్వయ మొకింత,
తెలియకుండనె లేచితిని శయ్యపైనుండి.

వంగపండు మెరుంగు వన్నె కౌశేయంబు
ధరియించి నీలాలతళుకు రైకను తొడిగి
కంఠప్రదేశాన కనకహారశ్రేణి
వింత జిలుగులతోడ వ్రేలాడుచుండగా
దరహాస చంద్రికా ధవళితాస్యముతోడ
చూచె నోయి సుపర్వ సుందరీ సంకాశ!

నిటల భాగముమీది నీల కుంకుమ తిలక
బిందు పబ్జమ్ముపై భృంగమట్లు చెలంగె.

అప్రయత్నమ్ముగా అయిదా రడుగు లేసి
దీర్ఘబాహులు చాపితిని ప్రియాతనువుకై.

వజ్రలోలక యుగ్మ వల్గనమ్మున చెలియ
నిద్దంపు చెక్కిళ్ళ నిబిడీకృతం బైన
మెరుగు జిగజిగ కమల్ మిరుమిట్లు గొల్పినది.

అంత కంతకు తదీయాంతకమునకు నే
జేరుచుండగ భ్రమగ సిగ్గుచూపులతోడ
మస్తకమ్మును వాల్చి మరలె పార్శ్వమ్మునకు.

ఏమి చెప్పుదు సఖా, ఇంద్రనీల ప్రభల
వేణికా జాలమ్ము వింతవింతగ గూర్చి
చుట్టుకొన్నది కుందసూన స్రజము చెలియ.

దేవలోకమునుండి దిగిన కామినివోలె
కాంతు లీనిన దోయి గదిలోన ప్రియురాలు !

పృథు వైనదోయి నా ప్రియురాలి కనుదోయి!
బిగు వైనదోయి నా ప్రియురాలి చనుదోయి !

( ధూర్జటి చప్పట్లు చరచును )

ప్రాణేశ్వరి యటో పయనము వేళన్
అరుగుదెంచి నాయంతికమునకున్
చేతులు జోడించినది పోదు నని.

అంగుళీయకము నాలోకించుచు
అంటిని సఖుడా ఆందోళనలో :
ఈ హృదయము తీ రెరిగినదే కద,
నీ కిదె నిక్కపు నెల వని యెంచుము.

మూగచూపుతో ముద్దుగుమ్మ చనె :
మాటిమాటికిని మంగళవిగ్రహ
మూదయించును నాయూహాలయమున !

### ధూర్జటి

కొనియాడ వేమి తద్గుణగణమ్మును సఖా,
స్తుతియించుచున్నావు సుందరాకారంబె,
పరకీయ యామె యని భావింపకున్నావు-
అరుదేర నామె నీ కప్రతిష్ఠ ఘటిల్లు.
బంధువర్గము కల్గు బ్రాహ్మణుండవు నీవు
ధర్మప్రకారమ్ము తగుకన్నె పెండ్లాడి
వాంఛింప కాత్మీయ వంశాభివృద్ధి యీ
వక్రమార్గమునందు వర్తింతువా సఖా!

### త్రిలోచనుడు

(ఆలోచించి)

నీవాక్యమ్ములు నిజమే యయినను
వరించు వనితను వర్జించుటయా!
భావికాలమున బంగరుబొమ్మకు
లేశము సౌఖ్యము లేనే లేదా!

### ధూర్జటి

పరకీయకునై బాధపడుదువా
నిజహిత మేమో నిర్వహింపవా?

### త్రిలోచనుడు

ఆమెకు నాపై ననురాగము లే
దని గ్రహించుచో నపుడు శమింతును.

### ధూర్జటి

(మందహాసము చేసి)

తాను వలచినది త్రైలోక్యేందిర
తాను మునిగినది దైవతనిమ్నగ !

ఈ ప్రేమలు నే నెరిగినవే గద,
ఇవి శాశ్వత మని యెన్నడు నమ్మను.

బాధ యయిన నీ భ్రమరిక నెటులో
మరచిపోవుటయె మంగళ మగు సఖ !

### త్రిలోచనుడు

మరచు టెట్టులు దివ్య మంగళాకారంబు
సౌందర్య సారంపు సముదాయ సదనంబు
త్రిజగతీలావణ్య తీర్థ ప్రదేశమ్ము
అత్యంత పరిపూర్ణ యౌవనామృతపాత్ర
మఖిలరోచిః పుంజ హారిమణిదర్పణము
ప్రద్యుమ్న శాణిత ప్రసవనారాచమ్ము-

### ధూర్జటి

పదకర్త వైన నీ ప్రజ్ఞ విశదం బాయె,
ఉద్రేకము త్యజించి ఉజ్జగింపుము యువతి.
అనురాగ మనురాగ మని తపించెద వేల ?
ఆధునిక బాధలకు నదియె మూలం బోయి !

## త్రిలోచనుడు

(కొంతతడ వాలోచించి)

శాంతం శివ మద్వైతమ్ : సత్యముగా నీ జతనము
ఎన్నటికిని చేయ నోయి ఈమె సహాగమనము కొరకు.

అనురాగము లేనిపట్ల అనదవోలె కుమిలి కుమిలి
తపియించెడివాడ ననుదు తలప బోకు ప్రాణసఖా !

సకల ముజ్జగించి భ్రమగ సాహసించి వచ్చునేని
స్వీకరింప దగునో తగదో చెప్పవోయి ప్రాణసఖా !

## ధూర్జటి

సంఘటిల్లున యేని సత్యమ్ముగా అట్టి
ఉత్పాతమే, అప్పుడు యోజింపవచ్చునే.

## త్రిలోచనుడు

పడగల్గుదు నే బాధలు సఖుడా,
భరింపజాలను పరపీడనమును.
భ్రమరకు తూష్ణీంభావము కలిగిన
అవివేకిని కా నంగలార్చుటకు !

రక్తి లేనియెడ నసికుం డగు వా
డూగులాడునో కా యువతి కోసమై.

## ధూర్జటి

నీ ప్రతిజ్ఞపయి నిలిచి యుందు వని
భావించెద నిక పరమహార్షమున.

( ంతలో గంట వినబడును. త్రిలోచనుడు మెట్లు దిగి లేఖ అందుకొని వచ్చి, చదువుకొని ధూర్జటి చేతి కిచ్చెను. అతడు బిగ్గరగా లేఖ చదువును.)

"జగతిలో నాకన్న సంశయాపన్న
ఈనాడు మెలగునే యెవ్వతె యైన!

పరిణయావస్థయే ఘోరాకరంబు
ప్రకృత స్థితియు గూఢ భయదరూపంబు.
అంధకారమునందు అల్లాడుచుండ
కానంబడియె దీపకళి కార్చి నాకు.

హృదయంబు ద్రవియింప నిచ్చగించితిని
అద్దాని దీప్తినే అనుసరింపంగ.

తలపోసి తలపోసి ధైర్యమ్ము పూను
వేళను సమముగా వీవగా జొచ్చె
సంశయానిల, మంత సాధ్వసం బొదవె.

అత్తవారింటికే నరుగుట కల్ల!
ప్రియుని జేరగ నేదో భీతి జనించు.

నవనీత హృదయుండు నా మనోహరుడు
నా ప్రవర్తనమున నపయునో యేమొ.

వాలితి తత్పాద వనజయుగ్మమున
అబలను కరుణతో నాశీర్వదింప.

ఆ పాదపద్మాలె అవలంబనమ్ము
లగుగాక యీ దీనురాలి కెల్లపుడు."

* *

నీ వన్నట్టులు నిక్కముగానే
యోగ్యురాలె యీ యువతీరత్నము.

ఉభయులకును శ్రమ మొదవకుండగనె
తెలివితోడ విడదీసెను గ్రంథిని.

ఏ మందువు నీ విప్పు డీతరుణిని ?
స్థైర్యము కల్గిన సరసమతివి సఖ !

## త్రిలోచనుడు

స్ఫటికం బీహృదయం బని సఖుడా, నీ కవగతమే.
సవిధవస్తువర్ణం బిట జాయమాన మగుచునుండు.

ఈ చాతుర్మాస్య వ్రత మెంత సుఖద మైన దోయి !
భావలోక విహారణమున పరిపూర్ణత గాంచినాను.

జీవన గ్రీష్మర్తువులో శీతలంపు సుధాప్రపను
దరిసినట్టి మధురస్మృతి తరంగితం బగుచు నుండు.

నేను వలచినట్టి చెలికి నిత్యమంగళమ్ము ! నాకు
సాంబ శివానుగ్రహమున శాంతి శ్శాంతి శ్శాంతిః !

## సమాప్తము

# ఆవేదన

అంకితము

శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రికి

# ఆ వే ద న

## ౧

చాలకాలము క్రిందట మూల విడిచి
యేలనో కాని దానిపై నించుకేని
లక్ష్య మనుమాట లేకున్న లలిత వీణ
నిపుడు బయటికి దీసితి నిచ్ఛ వొడమ.

దులప వలయును రాలిన ధూళి యెల్ల
పట్టుకొనియున్న నలుపు బోగొట్టవలయు
వంపు మెట్లన్నియును సవరింపవలయు
చెదరు తంత్రుల మరి సరి చేయవలయు.

పలుకునో మనోహరముగా, పల్కదేమొ,
తెగునో చిక్కదలించుచో తీగ లెల్ల,
సంస్కరించుటలో వీణ సడలు నేమొ
ఏమి కానున్నదో యింక నెరుక లేదు !

## ౨

ఉన్నత భూధరంబు పయినుండి
  క్రమముగ జాలువారి య
భ్యున్నతి గాంచి, ప్రావృష
  సముల్బణతం బ్రవహించు వాహినుల్
ఖిన్నత జెందవే మిగుల గ్రీష్మ
  సుదుస్సహ సూర్యరశ్మికిన్ ?

శీతల చంద్రికా మధురసేచనచే
  భువనంబు సమ్మదో
పేతము సేయ శారద నవీన
  వినిర్మలశోభ వెల్గు నా
శీతకరుండు దైన్యమును జెందక
  యుండునె వానకారునన్ ?

తీయని యామ్ర భూరుహాతతిం
  గల పల్లవపాళి మెక్కి యా
ప్యాయముగా, వసంత సమ
  యాద్భుత గానసుధా ప్రవర్షి యౌ
కోయిల యెట్లు పాడగలుగున్
  శిశిరమ్మున రమ్యకంఠమై ?

స్వీయరుచి ప్రభావమున జీకటి
  నాదిని బారద్రోలి, ప్రా
లేయము రూపు మాపి యువలీలగ
  నున్నతి గాంచు భానుడుం
బాయక యుండునే విమలభావ
  మనారత దుర్దినమ్మునన్ ?

## 3

మెలకువ చప్పునం గలిగె, మెల్లన
  కన్నులు విచ్చి కాలముం

దెలియఁగ జాలమార్గమున దృష్టి
నిగిడ్చితి, మందమారుతం
బలమెను నాశరీరమున, ఆకసమందు
హిమాంశుబింబమున్
వెలుగుచునుండె, నీడములు నీరవ
వైఖరి నుండె నయ్యెడన్.

కల దిక తెల్లవారుటకు కాలము,
నిద్దుర వోదు నంచు నే
దలచి గవాక్షపార్శ్వమున తల్పము
మీదను వెన్ను వాల్చితిన్ :
తెలియదు నేను మై మరచి నిద్దుర
గాంచితి నెంతదాకనో,
మెలకువ వచ్చునప్పటికి మింట
గనంబడె సూర్యు డుగ్రతన్ !

కని రవిదీప్తతిన్ మరల కన్నులు
మూసితి పాలుమాలికన్
విని విహగఘోషములు వెంటనె
వస్త్రము గప్పుకొంటి మీ
దను, ప్రియురాలు నన్ బహు
విధంబుల లేపిన లేవ నైతి, నా
యనుగుసఖుల్ మృదూక్తులను
హాస్యము చేయఁగ సాగి రంతయున్.

చివరకు గొంత సేపటికి చేలము
ద్రోసి మహాలసమ్ముగా

ప్రవిశద రాజమార్గమును
పక్షములం గదలించుచుం గనన్
నవనవ గానమాధురి జనంబులు
పోవుచునుండి, రెంతయున్
భువనము నాత్మ తేజమున బొల్చెను,
మందుడ నే నొకండనే!

౪

భూమిం దాకుచు మూర్ఛమాన
మగు నా పూగుత్తి యుద్వృత్తితో
నామోదించును నాట్యపూర్వకముగా
నాయాతవాతంబునన్.

శాంతిం గాంచు నిదాఘభాస్కర ఖర
జ్వాలా ప్రతాపంబునన్
క్లాంతిం జెందిన యాజగంబమల
నక్షత్రేశు నభ్యున్నతిన్.

శోషం జెంది వికాసహీన మగు
నాక్షోణీ తలం బెల్ల సం
తోషం బొందు పరిమళాన్వితముగా
తోయ ప్రవర్షంబునన్.

ఉల్లాసంబు రవంత లేక జడమై
యున్నట్టి చిత్తంబు సం
ఫుల్లం బై మృదునాట్య మాడు ప్రియ
మిత్రుం డల్ల నేతెంచినన్.

౫

దూరంబైనను భూతలంబునకు
నెంతో మేఘమార్గంబు వాః
పూరంబుం దరుణంబునం దసిత
జీమూతంబు వర్షింపదే ?
ఆరూఢస్థితి శుక్లపక్షరజనిన్
మార్గంబు కల్పింపదే
తారానాథుడు మేదినీ స్థలికి
జ్యోత్స్నాసాంద్ర పాండుప్రభన్ ?

శ్రీరమ్యోపల విగ్రహంబు స్మృతి
విశేషం బెటుల్ కాంచెదున్ ?
సారోదార సుకావ్య మచ్ఛమతి
విస్రంసంబు నెట్లొందు ? గం
భీరానందము గొల్పురాగ మెటు
జ్ఞప్తిం బాయు ? ఏరీతి హృ
ద్దూరీభూతు డగున్ సఖుండు
మిగులన్ దూరస్థలిం జేరినన్ ?

ఆరోపించి నిజాగ్రముల్ వెసను
కాలాభ్రావళుల్ గర్జతో
ధారాపాతముగా స్రవించి విరతిం
దాల్పన్ మహీధ్రంబు లెం
తో రమ్యంబుగ నుండు పూర్వమలిన
స్తోమాపనోదంబునన్ :

ధీరుల్ కష్టము లొంది యుందు రటులే
తేజోవిశేషంబుగన్.

## ౬

ఇప్పుడె దాటిపోయినది యిర్వది
యారవ మైలు రాయియుం
జప్పున జీవితాధ్వమున ! సంభ్రమ
మొందుచు నుంటి నేలనో.

క్రొత్తగ నుండె మార్గ మొక కొంత
యనిర్వచనీయ వైఖరిన్,
మెత్తగ నుండె కొంతవడి, మిక్కిలి
కర్కశ మయ్యె నాపయిన్.

దాటితి గొన్ని వంతెనలు దాటితి
గొన్ని జలప్రవాహముల్
దాటితి రాల గుట్టలను దారికి
నడ్డము వచ్చుచుండగన్.

దూరమునందు చూడగనె స్థూల
విషాణ మహావృక్షములన్
దారిని వీడి యేగితి నతంద్రత
ధీరవిలోకనమ్ములన్.

ఆరవ నీయమాన శకటావలి
కొంతయు నోసరిల్లితిన్

భారవహుల్ కనంబడిన బాటను
వీడితి వారికోసమై.

శంటిని శాద్వలంబులను కంటక
వృక్ష లతాది సంతతిన్
పంటపొలాలు బీడులను బాడువ
భూముల నెన్నొ కాంచితిన్.

ఎందరొ నాకు గానబడి రిక్కడ
నక్కడ వింత మానిసుల్,
చెందితి మోద ఖేదములు, చేసెద
నెట్లొ ప్రయాణ మీపయిన్.

౭

ప్రీతి న్నాడు సుధాసమాన మగు
కాఫీ గ్రోలి ప్రత్యగ్ర సం
భూతోత్సాహముతోడ లేచితి
షికార్ పోవం బ్రభాతంబునన్.

సద్దేమాత్రము చేయకుండు మృదు
రక్షల్ దాల్చి పాదంబులన్
అద్దంబట్టులు నిద్దమై విశదమా
నధ్వంబు బ్రాపించితిన్.

చేతోమోద మెలర్ప మారుతము
వీచెన్ మందమందంబుగన్.

వాతాందోళిత పర్ణనిస్స్వనితముల్
వ్యాపించె నల్వంకలన్.
బాలార్కారుణదీప్తి భూతలముపై
బర్వెన్, విహంగౌఘముల్
ఆలాపింప దొడంగె మోహనముగా
నవ్యక్తరాగంబులన్.

కొమ్మల్ కొమ్మలు దాకి దట్టముగ
న్యగ్రోధావనీజంబు లే
కమ్మై పచ్చని కాయమానము వలెన్
గాన్పించె ద్రోవం జనన్.

ఆనందంబున గొంతసేపు చనగా
నామార్గమధ్యంబునన్
కాన న్వచ్చిరి వ్యాధబాలకులు
వీకన్ ధ్యానముల్ సేయుచున్.

ఆరావంబుల కేమి హేతు వని నే
నచ్చోటు ప్రాపింపగా
క్రూరాకారులు మట్టుపెట్టి యొక
చిక్రోడమ్ము నొక్కుమ్మడిన్.

పోవం జొచ్చితి సాగి, కూసె
విహంగంబుల్ శ్రావ్యనాదంబులన్,
పూవుల్ రాలెను, గాలి వీచె, అయినం
బోయెన్ ముదం బంతయున్.

౪

కాలాభ్రంబున జంచలా లత
 లనంగా నుత్తమాంగంబునం
దాలోకించితి నీవయస్సునకె
 ఆహా శుక్లకేశంబులన్ !

చూడ న్నిన్ననో మొన్నొ పుట్టినటు
 తోచుం గాని లెక్కింపగా
నేడుల్ దాటిన విర్వదారు త్రుటిలో
 నెంతో విచిత్రంబుగన్.

తారుణ్యోజ్జ్వల మంజులాధ్వమున
 నే ధావద్గతిం బోవనే
దూరం బేనియు, నింతలో పలితముల్
 తోచెం గదే వింతగా.

చేయ న్నేరక చేత నాపనులు
 నిశ్చేష్టుండనై యుండగా
ఆయు స్సార, అదృష్టమార్గ మయి
 నిత్యక్షీణతం గాంచెడిన్.

## ౬

# మిత్రస్మృతి

అమిత ధనసంచయమ్ము వ్యయమ్ము చేసి
చాల వత్సరములకు పాశ్చాత్య వాస్తు
శాస్త్రపద్ధతి గట్టిన సౌధవరము
కటకటా, కూలిపోయె భూకంపమునకు !

చేత నైన దోహదములు చేసి చేసి
మమతతో బెంచుచున్నట్టి మావిమోక
ఉన్నతిం గాంచి తుదకు ఫలోన్ముఖ మయి
అశనిపాతంబుచే గూలె నక్కటకట !

వివిధ మధురఫలమ్ములు పెట్టి పెట్టి
శ్రద్ధ బల్కులు నేర్పుచు సాకుచున్న
శారిక నిజోక్తు లెడలించు సమయమునకు
అకట, మార్జాల ముఖమున నంత మొందె !

*

## రు ధి రో ద్గా రి

గుండె లవియును దుఃఖమున నా
ఖండలాస్త్రము తాకినట్టులు
క్రూర రుధిరోద్గారి వర్షము పేరు చెవి సోకన్.

పిన్నతనమున బెంచి నన్నెటో
పెద్దవానిని జేసి, కరుణా
భరణ యని నుతి గొన్న నా సోదరను మ్రింగితివే!

నా విలోచన పూర్ణచంద్రుని
నాదు హృదయానంద వర్ధను
చిన్నిముద్దుల కొమరు గబళించితివె ఘోరముగన్!

మామకీన నిశాంత లక్ష్మిని
మామకాధిక హృదయదేవత
జీవనపు సర్వస్వకలశము ద్రావి వేసితివే!

ఏమిటికి నీ మందభాగ్యుని
ఎత్తుకొని పోవైతి వయ్యో!
ఘోర దుఃఖ విరంతరాగ్నిని గుమిలిపొమ్మనియా!

## అ జ్ఞా త మి త్ర ము

ఊహకు మీరిపోయిన వహో
భవదీయ విచిత్రవర్తనల్!

సాహసవృత్తి మమ్ము విడజాలితి
    వెంతటివాడ వద్దిరా !
వేడుక పిచ్చలింప నొకవేళ
    నఖండిత భారతావనీ
గాఢవిలోకనాభిరతి గ్రచ్చర
    నేగితి వొక్కొ తమ్ముడా!

ఈహ మహాపగం దొడరి
    యీదుమనుండ జలాంగనా స్వయం
గ్రాహ నిబద్ధ దివ్యతమ
    గాత్రుడవై వసియింతె నీటిలో !

చేరిన నిన్ను బట్టుకొని చెల్వున
    నిల్పిరొ కిన్నరాంగనల్
స్వైర విహార లీలలను చారు
    హిమాచల కందరంబులన్.

హేల చెలంగ నిన్ను నెలయించెనె
    కస్తురికా మృగంబు నే-
పాల వనాంతరంబులకు
    బాఢపరిమళ సన్నికర్షణన్!

ప్రాయమునన్ విరక్తిని బ్రపంచ
    సుఖంబుల నుజ్జగించి కా
షాయము దాల్చి యల్లన ప్రచారము
    చేయుదె ద్రావిడావనిన్!

ఎక్కడ నుంటివో తెలియ దేమియు
    జీవముతోడ నుంటివో

నిక్కము దెల్ప జాలు మహనీయులు
కానగరారు తమ్ముడా !

కుడ్యవిభాసివై చెలువు గుల్కు
భవత్ప్రతిబింబ దీధితుల్
జాడ్యము నొందుటన్ మదిని సంశయ
మేచుచు నున్న దెంతయున్.

కన్నులపండువై మిగుల గ్రాలెడు
తావక నాట్యసంపదల్
ఖిన్నత నొంద వాడినవి కేవలమున్
సఖినేత్ర దీధితుల్.

పూర్ణముగా విలీన మయిపోయిన
వన్య సురాస్వదమ్ములై
కర్ణరసాయనమ్ములు నఖండ
భవన్మృదు నర్మభాషణల్.

తేనియతేట యైన భవదీయ
మనోజ్ఞకవిత్వ వాహినీ
గాన వియోగదాహమున
గ్రాగుచునున్నవి యంతరంగముల్.

కానగ వచ్చి స్వప్నముల కమ్ర
భవ ద్వదనారవింద మ
మ్లానముగా ముదం బొసగుచున్నది
కొన్నిదినాలనుండియున్.

# ఆ వ ర్త ము

ఎంత కాలము గడచిపోయిన !
దింతవరకును బాహుబలమున
సంతరించుచు నుంటి, దీనికి నంత మెన్నటికో !

ఓపజాలని భానుమండల
తాపమున వసివాడె దేహము,
ఆపగాజల శైత్యభరమున వేపథువు పుట్టెన్.

అక్కటా, యేవైపు చూచిన
నొక్క నావయు గానరాదే
ఎక్కటిగ నావర్త గతిలో చిక్కిపోయితినే.

చర్రు మని పడి లాగుచున్నది
గిర్రు గిర్రున ద్రిప్పుచున్నది
మొర్ర యిడగా బుద్ధి పుట్టును : వెర్రినై పోతిన్

వ్రాలిపోయిన దపరసాగర
నీలజలముల భాను బింబము
కాలు చేతులు దుర్బలము లయి డీలు పడజొచ్చెన్.

అక్కటా, ప్రాణమ్ము లింతట
దక్కు టెట్టులొ తోచ దాయెను,
పిక్కటిల్లెను సంజ-చీకటి దిక్కు లెల్లెడలన్.

కన్ను లున్నను ధరణి కన రా
కున్న, దెంతయు చంచలించుచు
నున్న దకటా మనసు, కృష్ణా, నన్ను గావగదే!

ఏటి కీ విభ్రాంతి యియ్యెడ ?
నీట జొచ్చితి స్వైరబుద్ధిని,
నీటిలోపల మునిగి పోయిన లోటు కలదొకో.

ఆడుదాని విధాన నను గా
పాడు మని యాదేవదేవుని
వేడ దగునే ధీరచిత్తుడు కీడు మూడుతరిన్ !

ఆమహామహు కరుణ వెలయుట
కేమి సాధన చేసి యుంటిని
నీమముగ నే నింతవర కని హ్రీ మెలంగు గదా !

ఔర, ఈ యావర్త మెంతయు
ఘోరతరముగ ఘుర్ఘురించుచు
దారుణం బగు మృత్యుదేవత నోరువలె దోచున్.

భీతి యేటికి నాకు ? పోయెద
వీత రాగద్వేషబుద్ధిని,
ఈ తనుత్యాగమ్ము కెవ్వరు కాతరిల్లెదరు !

అవయవమ్ములు క్లాంతి నొందగ
వివశ మగుచున్నది శరీరము,
కవియ కుండిన బుద్ధిమాంద్యము మివుల హర్షింతున్.

మాటి మాటికి మెలగుచున్నది
గాటముగ నా మానసమ్మున
సాటి గానని నీదు నామం బేటికో కృష్ణా !

యాదవేశ్వర, తావకామల
పాద సంగత పూత యామునా
హ్రాదినీజల మైనచో నిది మోద మొందుదునే.

శంక లన్నియు వీడిపోయిన,
వింక సంతరణంబు మానెద,
పంకజాక్షుని దివ్యరూపం బంకితం బగుటన్.

కాలమేఘుచ్ఛన్న నభమున
నీలజలముల నిఖిల దిక్కుల
నీ లలితరూపమ్మె కృష్ణా, క్రాలుచున్న దహా!

సదమలామృత ధామ మగు నీ
పదకుశేశయ యుగళి జేరగ
ముదముతో నే నింక మునుగుచు నిదిగొ యరుదెంతున్!

## శ్రీపాద ప్రశస్తి

ధరణీ మండలిలోన దివ్యతమ
 సౌందర్య ప్రభాలాలస
త్వరితాన్వేషణ లీనమానసుడనై
 తన్వీముఖాలోకనా
దర విభ్రాంతిని సంచరించితిని :
 రాధానాథ పాదద్వయీ
స్ఫురదుద్దీప్తికి తుల్య వైభవము
 నెచ్చో కాననైతిం గదా !

హృదయాందోళన శాంతికై వివిధ
 సాహిత్య ప్రభూతాటవీ

పదవీ మండల సంతత భ్రమణమున్
వ్యర్థంబ కావించితిన్.
పొదలున్ శాంతము రాధికారమణు
సంపూర్ణ ప్రభావిస్ఫుర
త్పదపద్మంబుల సంస్మరింప మదిలో
ప్రత్యగ్రభావమ్మునన్.

తిరుగన్ లాభము శూన్యమే హృదయ
వృత్తి క్షీణతాసక్తమై
సరసీతీరములన్ నదీతటములన్
సాంద్రద్రుమశ్రేణులన్
ధరణీధ్రంబుల నిర్జన స్థలులః
రాధానాథ పాదద్వయీ
స్ఫురణం బొల్చు మనుండు తన్మయత
నిస్తంద్రప్రమోదంబునన్.

పరికింపంగ సమస్త లౌకికసుఖ
వ్యాపార లీలా పరం
పరలో గాఢసుఖానుభూతికలనా
భావంబు లేదెన్నః డా
కరుణాంభోనిధి రాధకాధవు
జగత్కల్యాణ ధామస్ఫుర
చ్చరణాంభోజములన్ స్మరింపగ
మహాసంతోష ముప్పొంగెడిన్.

భరితం బయ్యె భవత్కథా రససుధా
పాన ప్రమోదంబుతో,

చరియించున్ మతి సర్వతోముఖముగా
శాఖామృగప్రక్రియన్.
నిరతంబున్ భవదీయ పాద విలస
న్నీరేజ యుగ్మంబుపై
స్థిర సంయుక్తి వసింప జేయగదవే
శ్రీ రాధికావల్లభా !

## ఆర్తిహరుడు

హృదయ శాంతికై నిర్జనభూమికి
నేగితి సంధ్యా వేళన్,
అలసభావమున నుపవేశించితి
నచ్చటి సేతువు మీదన్.
పార్శ్వమునం దశ్వత్థ మహీజము
భాసిలె వీవన పగిదిన్
మారుత చాలిత తత్పర్ణంబులు
మంజు స్వనితము చేసెన్.

ఆ ప్రదేశమున నిష్కంపమ్ముగ
నాసీనుడనై యుండన్
సమసిపోయినవి క్రమక్రమమ్ముగ
సంధ్యా విద్రుమదీప్తుల్.
ఆవరించినవి పలుచని చీకటు
లవనీభాగం బెల్లన్ :

ఆకాశంబున నిలిపి వీక్షణము
    లట్లే కదలక యుంటిన్.

అప్రయత్నముగ జ్ఞప్తికి వచ్చిన
    వప్పుడు జీవిత చర్యల్
బాల్యం బాదిగ నాటివరకును
    బలవత్కార్యము లెల్లన్.
తోచిన వయ్యెడ నొక్కొక్కటిగా
    దుర్నివార్య గతితోడన్
పడిన కష్టములు పొందిన బాధలు
    భగ్నమనోరథ పంక్తుల్.

పొంగి పొరలినది దుఃఖతరంగిణి
    భూరితరార్భటితోడన్ :
నిలుపం జాలక రోదించితి నే
    నిశ్శబ్దంబుగ దేవా !
అంతకాలమును ఘనీభవించిన
    ఆర్తిభరం బగుకతనన్
ధారాపాతముగా స్రవియించెను
    తరుగక బాష్పకణంబుల్.

పవనాహతిచే బోధిమహీరుహ
    పర్ణము లల్లలనాడన్
చకితవిలోచనయుగళి వాలినది
    చలదళంబుపయి దేవా !
అశ్వత్థమును వృక్షములం దే
    నను నీ గీతా వాక్కుల్

తోడనె స్ఫురణకు వచ్చిన, వంతట
దుఃఖం బాగెను నాథా !

సుకృతి కవీంద్రుడు శ్రీమ ల్లీలా
శుకముఖనిర్గళితం బౌ
శ్రీమత్కర్ణామృత వాక్కుల నిను
చేసితి స్తోత్రము దేవా !

సమసిపోవగను దుఃఖము క్రమముగ
శాంతి మెలంగెను హృదిలో
చాలతడవు నిను భక్తిభరమ్మున
స్తవము చేసితిని నాథా !

సేతువ వోహో దుస్తరసంసృతి
సింధువు కీవే దేవా !
నిశ్చయమ్ముగా ఆర్తిహారుండవు
నీ వొక్కడవే నాథా !

నీ సుధామధుర నామకీర్తనము
నిరతము సల్పెడివారల్
ఆర్తిహారా, దుఃఖార్ణవ పారగు
లగు టబ్బురమే దేవా !

## ఉపలాలనము

అనిశము వృథా ప్రయాసము నందె జేటి
కకట, కామినికై హృదయంబ నీవు !
స్త్రీ వ్యథా కంద మని నీకు తెలియ దొక్కొ ?
ఆశ్రయింపుము కృష్ణ పాదాంబుజములు.

హృదయమా, ఇంత యారాట మేల నీకు
అయ్యయో, కాంచనంబుకై అనవరతము
అదియు లోహవిశేషమం చవిదితంబె ?
ఆశ్రయింపుము కృష్ణ పాదాంబుజములు.

బహువిధంబుల నేటికి బాధ పడెదు
వివిధ విద్యలకై అయ్యొ వెర్రిమనస !
కేవలము విద్య లన్నియు క్లేశమునకె :
ఆశ్రయింపుము కృష్ణ పాదాంబుజములు.

హృదయమా, యింత యుత్కంఠ యేల నీకు
ఐహిక సుఖోపలబ్ధికై, అక్కటకట !
సుఖము నశ్వర మనియెడి సూక్తి వినవె ?
ఆశ్రయింపుము కృష్ణ పాదాంబుజములు.

ఏల కామిని, కాంచనం బేల నీకు,
విద్య లేటికి, సుఖ మేల, విడువు మెల్ల !
అతడు సర్వసంత్రాణ పరాయణుండు :
ఆశ్రయింపుము కృష్ణ పాదాంబుజములు.

# ప్ర ప న్ను డు

కానవచ్చుట లేదు మార్గము నాకు
ఊహ జనియింప దేమి చేయుటకుగూడ.
అణచుకో జాల నీ మనోవ్యథల నింక,
ఏమి చేతు ప్రభూ, సెలవిమ్ము నాకు.

ఆవరించెను నన్ను గాఢాంధకార
మన్యశరణము లేదు నా కార్తిహరణ,
దివ్యదీధితి పటల దేదీప్యమాన
మహిత భవదీయ పాదయుగ్మము కన్న.

దేవ, నీయిచ్ఛ యెట్టిదో తెలియరాదు !
బుద్ధివైభవ మేను సంపూర్ణరీతి
వదలి నీమీద గాఢవిశ్వాసముననె
మసలుచున్నాడ నెటో లోకమధ్యమందు.

శిథిలమై పోయె నాథ, నిశ్శేషముగను
దాసజనునకు నిపుడు స్వతంత్రబుద్ధి.
యంత్ర సదృశుని తావకేచ్ఛానుసార
సరణి నడపింపుమో ప్రభూ, సత్పథమున.

## చిత్రకుబ్జ

ఎన్ని మార్గముల నిరంతర
మెంత సాధన చేయుచున్నను
పోవకున్నది వక్రగమనము బుద్ధియందుండి.

కుబ్జ నీ వొకమారు ప్రీతిని
గ్రుచ్చి కౌగిట జేర్చినంతనె
వదలిపోయిన దంట ఆయమ వక్రిమము కృష్ణా !

ఎల్లవేళలయందు నీకై
యెదురు చూచుచున్న దెపు, డీ
చిత్రకుబ్జను నీకవుంగిట జేర్తువో కృష్ణా !

## సుతస్మృత

శాంతయామినివేళ కాచ
స్వచ్ఛవర్తుల దీపికోజ్జ్వల
సదన భాగములోన చొచ్చితి సఖుని వెనువెంటన్.

భిత్తికలపై పటము లొప్పెను
ప్రియ సుహృత్కర కమల చాలిత
తూలికాంకిత వివిధరూప ద్యుతివితానముతో.

నలుకెలంకుల మందిరమున
నయన పర్వము గాగ శోభిలె
ప్రస్ఫుత నూత్నవిలాస వస్తుప్రతతి సంపదలన్.

ముద్దు మొగమున వాలి నల్లని
ముంగురులు నటియించుచుండగ
అతని కొమరుడు నన్ను డాసెను అడుగు లిడుకొనుచున్.

రమ్ము కృష్ణా, రమ్ము రమ్మని
రయముతో నా చిన్ని బాలుని
చంక నిడుకొని ముద్దులాడితి స్వాంత మలరంగన్.

తాత తాతా యనుచు బిడ్డడు
తనకరమ్ముల మద్గళమ్మును
కౌగిలింపగ నాశరీరము గగుర్పాటొందెన్.

హర్షవశమున జాలువారిన
వశ్రుబిందువు, లాక్షణంబున
బాలకృష్ణుని క్రోడగతు డగుభంగి గన్పట్టెన్.
అపుడు జ్ఞప్తికి వచ్చె పూర్వం
బస్తమించిన నా కుమారుడు :
ఉష్ణబాష్పకణ ప్రవాహం బురలె కనుదోయిన్.
హృదయదాహము రేగుచున్నను
ఎట్టులో దిగమ్రింగి, అయ్యెడ
సరభసంబుగ ముద్దులాడితి సఖుని తనుజాతున్.

అయ్యొ కొడుకా, నీవు దివమున
కరుగువేళను నా యెడందను
రవులుకొల్పిన చిచ్చు నేటికి రాజుచున్నదిరా !
ఆప్తమిత్రుల శిశువులం గని
హర్ష మొందుచు నుండుటేనా,
సొంతబిడ్డల నెత్తుకొనియెడ సుఖము లే దొకో !

## ద్వాత్రింశత్

కాలమహాపగా విపుల
  గర్భమునం బడిపోయె నేటితో
లీల మదీయ జీవన జలేజము
  ముప్పదిరెండు రేకు, లీ
చాలుననే సమగ్రముగ సారస
  పత్రము లొక్కటొక్కటే
రాలి విలీనమై మరలిరావు
  మహాప్రభు శాసనమ్మునన్.

ఆరయ గానరా వకట, హర్షము
  గొల్పుట కేని మన్మహో
దారకృతుల్ ! స్మరించి పరితాప
  శిఖిం గుములంగ నేనియున్
దారుణ కార్యముల్ మదికి దట్టవు,
  జీవన పూర్వభాగమం
దూరక దాటిపోయిన వహో యిటు
  ముప్పదిరెండు వర్షముల్ !

ఎక్కువ లేవు నే ననుభవించిన
  లౌకిక సౌఖ్య సంపదల్,
మొక్కలు వోయి దుఃఖముల మూర్ఛిత
  మయ్యెను బుద్ధి, ఎన్నియో
గ్రుక్కలు జ్ఞానభాండమున గ్రోలగ
  నైతిని మందబుద్ధి ! నీ

యక్కర మాలినట్టి బ్రతు కయ్యెయు,
యెందులకో మహాప్రభూ !

ఇక్కడనుండి నేను త్యజియించితి
నాథ, సమస్త ధర్మముల్,
నిక్కపుభక్తి సేవలము నీపద
యుగ్మము నాశ్రయించితిన్.
మక్కువతోడ నాహృదయ
మధ్యమునన్ వసియించి సంతతం
బెక్కరణిన్ నియోగముల నిత్తువొ
అట్లు లొనర్చెదన్ ప్రభూ !

## శి వ రా త్రి

విమల దీధితుల దిశాముఖమ్ములు
వెల్గుచున్న వోహో
కమల భవాండము చూచుచుండగనె
కలక దేరె నెంతో.
నీలగళుం డీపూత దివసమున
నిఖిలలోక శశ్వ
త్పాలన కొరకై హాలాహాలమును
భక్షణ చేసెను కాదే.

ఎంత కృపానిధి సర్వవంద్యుడో
ఈశ్వరుండు భళిరా !

సంతోషమున విషము గళమున
స్తంభీభూతము చేసెన్.
ఏ నీదినమున నగణిత పుణ్యం
బేమి చేసినానో
దీనుని శీతలదృష్టి గాంచితివి
దేవ దేవ, శంభో !

క్షాళిత మయ్యెను మాలిన్యం బీ
క్షణములోన భవదీ
యాలోకామృత వృష్టివశమ్మున
నార్తజనుని మీదన్.
ఈమహిమోజ్జ్వల పూతదినమునం
దీశ, కృప న్నను నీ
ధామమ్మునకే చేర్చికొన్నచో
ధన్యుడ నౌదును నాథా !

సకలలోకముల శైవమహత్త్వము
జయము గాంచు బహుధా
సుకృతమునన్ కైవల్య మెల్లరును
చూరగొంద్రు గాతన్ !
ఎంత యుదాత్తం బెంత మనోజ్ఞం
బీశ్వరరూపం బోహో !
ఎంత మనోజ్ఞం బెంతయఘహారం
బీశ్వరనామం బాహా !

జయ మృత్యుంజయ జయ మదనాంతక
జయ జయ త్రిపుర హరా !

జయ గంగాధర జయ గౌరీప్రియ
జయ ఖండేందు ధరా!
జయ జయ హర హర జయ జయ శివ శివ
జయ జయ జయ జయ ఈశా!
జయ జయ జయ జయ శంభో శంకర
జయ జయ జయ జయ సాంబా!
నమః పార్వతీ పతయే!

## వి న తి

వాసరముల్ మహాకఠిన వైఖరి
బుచ్చుచు నున్నవాడు నీ
దాసజనుండు తావకపదద్వయ
సంస్మరణైక చిత్తుడై
ఈసరి కేనియుం గృప జనింపమి
కేమిటి కారణంబు? నే
జేసిన దోసముం దెలియజేయగదే
కరుణార్ద్రబుద్ధివై.

నిన్నెపుడున్ స్మరించుచు ననిర్వచ
నీయ నిరంతర వ్యథా
ఖిన్నతతోడ నే హృదయగేహమునన్
లిఖియించుచుందు భా
వోన్నత తూలికాగ్రమున నుజ్జ్వల
తావకరమ్యరూపమున్—

మన్నన సేయరాదె నను మంజుల
　　శీతల వీక్షణంబులన్ !

అయ్యయొ, దుస్సహమ్ముగ నహర్నిశమున్
　　హృదయాంబు జాతమున్
వ్రయ్యలు సేయుచుండు ననివార్య
　　గతిన్ బహుళార్తి శస్త్రికల్ !
చయ్యన నీ కృపామృత రస
　　ప్రసరంబు లభింపకున్న చో
నెయ్యది జీవనౌషధము లీ
　　హృదయంబున కంబుజేక్షణా !

ఈదగ శక్తి చాల దిక నీ
　　బహుళార్తి తరంగ సంకుల
హ్రాదినిలోన, కానబడ దావలి
　　తీరపుచిన్నె లేమియున్
ఖేదము వాయ శీఘ్రముగ కేలను
　　మత్కరమున్ గ్రహించి ల
క్ష్మీ దయితా, కృపాకలిత
　　చిత్తముతో నికనైన బ్రోవవే !

## వాంఛలు

అహాహా అనంత విపులాశల జిక్కి చిక్కి
బహుకాల మీయెడద బాధలు చెందె నాథా !

సహియింపలేక కడు సాధన చేసి ఆశా
గహనాంతరంబు విడగల్గితి నేటి కట్లో.

ఇపు డీమనస్సునకు నెంతయు శాంతి యుష్మత్
కృపచేత సంఘటిలె: దీనుని చిత్తవృత్తుల్
విపరీత మార్గములవెంట బరిభ్రమింప
కెపుడున్ భవచ్చరితమే స్పృశియించు దేవా !

సకలంబు నీచరణ సన్నిధియందు నాథా,
ప్రకటమ్ముగా విడిచి బాధ్యత ద్రోసిపుచ్చన్
అకలంక మయ్యె మన, సాశలు వీడె, వాంఛా
త్రికమాత్ర మెన్నటికి దేవ, తొలంగకుండున్.

కానైతి గాయకుడ, కర్మవశంబునన్ వాక్
స్థానంబు మందునకు తావల మయ్యె, నైనన్
నే నెల్లవేళలను నిండు మనంబుతోడన్
నీ నామవర్ణములనే జపియింతు నాథా !

పాలించు దేవించు నుపాసన చేయుచున్ వా
ఙ్మాలిన్య మయ్యె, అణుమాత్రము వీడ, దైనన్
గాలించి శబ్దములు కావ్యము లల్లుదు నీ
లీలా కథామృత విలీనమనంబుతోడన్.

నా కెన్నగా దగిన నైపుణి చిత్రవిద్యన్
స్తోకంబు, కాని మృదు తూలికతో లిఖింతున్
లోకైక నాయక, విలోకన పర్వ మైన
నీ కమ్ర మంగళ వినీల శరీరశోభన్.

సమాప్తము

# కా వ్యా వ లి

## ప్రథమ కదంబము

అంకితము

శ్రీ ఆమంచర్ల శేషాచలపతి రావుకు

# దివ్యలోచనములు

౧

## ధనుర్దాసు

దేవా, తావక మేదురార్ద్రకరుణా
  దీవ్యత్కటాక్షప్రభా
శ్రీవిద్యోతితు డౌచు భాగ్యమును
  గాంచెన్ దాసు డీప్రార్థనన్
కావేరీ పరిపూత శీతలమహా
  కల్లోలినీస్పర్శ శో
భావంతం బయి పొల్చు నాపురధరా
  భాగంబు చందంబునన్.

ఈనా డే నొనరించి నట్టి సుకృతం
  బెంతో యహీనంబు కా
దేనిన్ యుష్మదపాంగ వీక్షణమహా
  స్సేలా ప్రవర్తిల్లు నీ
దీనాంఘ్రి ప్రభవాఢ్యమాధవునిపై
  దేవా, కృపాపూర్ణమై?
ఆనందోద్గతి బిచ్చలించినది
  రోమాంచంబు దేహంబునన్!

మీసందర్శన నవ్యభాగ్యమున
  స్వామీ ధన్యతం గాంచితిన్
వానిం బొందెను నిశ్చయంబుగ
  భవ ద్వాల్లభ్యసంలబ్ధి నీ

దాసుం ! డా నిఖిలైకనాయకుని
సందర్శించిన ట్లయ్యె మీ
శ్రీసాన్నిధ్యమునందు నిల్వగనె
యక్షీణప్రమోదంబునన్ !

స్వామీ, తావక పాదపంకజ రజ
స్సంసక్తిచే నొప్పెడున్
నామూర్ధం బుదయార్క మండల దళ
న్నవ్యప్రభా రంజిత
శ్రీమంతం బగు నంజనాచలమటల్
సేవా సమారాధనో
ద్దామప్రౌఢిమ నాకు లభ్య మవుతన్
ద్వత్సన్నిధానంబునన్ !

ఈదాసాధముమీద నేల పడెనో
యీనాడు జ్ఞానప్రభా
శ్రీదం బైన భవత్కటాక్షము కృపా
సింధూ, వచింపంగదే !
మోదస్ఫూర్తి సమాచరింతు త్రుటిలో
మూర్ధంబుపై నిల్పి త్వ
త్పాదాంభోజముల న్నియోగముల
నీదాసానుదాసుం డిదే !

## భగవ ద్రామానుజులు

కనుగొన నిన్ను సంతసము
కల్గిన దెంతయు నేడు మాకు, నీ

వినయ మకృత్రిమోద్గతిని
    వెల్లడి యయ్యెను, భక్తిభావమో
ఘన మధుర ప్రకారమున
    గానగ వచ్చెను, నీ ప్రవర్తనం
బనుపమభంగి నొప్పెను మ.
    దాశిషముం గొను మో కుమారకా!

జననము దానవంశమున
    సంఘటియిల్లిన లోపమేమి ? ఆ
ననమున సౌమ్యదీప్తి కనంబడు
    చున్నది, భాషణంబులం
దొనరె నకల్మషారభటి,
    యోగ్యత యున్నది పెక్కు రీతులన్,
ఘన మగు లోప మొక్కటియు
    కానగవచ్చెను మాకు నీకడన్.

నది నవగాహనాదిక మొనర్చి
    మఠాగమనాభిలాష నీ
యుదయమునందు మేము చను
    చుండెడి వేళను శిష్యపంక్తితో,
ఎదురుగ వచ్చినావు మదిరేక్షణ
    కొక్కతె కాతపత్రముం
బదిలముగా ధరించి యిరు
    పార్శ్వములం జనుచున్ స్ఖలద్గతిన్.

తరుణివిలోచనద్వయిని
    దప్పక నిల్పితి వీక్షణంబులన్,

సరసనె పోవువారలదెసం
　గనుగోవు, లవంబు సైతమే
నరసినయట్లు లేదు పథ
　మందలి వింతలు నైన, కామినీ
పరవశబుద్ధితో జనెడిభంగి
　గనంబడినావు బాసుడా!

పొలతుకమీద నీకు పరి
　పూర్ణముగా ననురాగ ముండనీ—
చెలియకు దగ్వ్యథంబున నశేష
　జనంబుల మ్రోల సేవలం
జలుపుము, లజ్జ బోవిడిచి
　సంచరలం దగునయ్య? ప్రేముడిన్
నిలుపగ బోలు రమ్యముగ
　నిండుమనస్సున గాఢవృత్తితో.

ధ సు రా సు

స్వామి, భవత్పదద్వయము
　సాక్షిగ బల్కెద విశ్వసింపుడీ!
భామినిమీది మాతృమయ భావము
　వెల్లడిసేయు బుద్ధి నా
కేమియు లేదు, లజ్జ త్యజియించెడి
　కోరిక లేదు, ధూర్తతం
గామినికిన్ సపర్యలను గా
　వొనరించుట దేశికాగ్రణీ!

కావర మూని కాదు పథగాముల
    జాడక యుంట, వింతలో
యేవియు బట్ట, వాకువలయేక్షణ
    దివ్య విలోచన ద్యుతి
శ్రీ వనివాడు భాస్కరరుచి
    ప్రసరంబున నన్నభీతి నో
దేవర, యామెనుండి నిజదృష్టి
    మరల్పగ నైతి నయ్యెడన్.

ఆమెను జెప్పుపట్ల మదిరాక్షి
    యటంచు వచించినార లో
స్వామి, విధేయ తాసజను
    సాహసమున్ క్షమియింపగా వలెన్ !
అమహిళాలలామ విపులాయత
    నేత్రము లుత్పలప్రభా
ధామము గాక వేరొకవిధంబుగ
    దోచునె నాకు కేళికా !

మానసహారులై మధుర మంజుల
    నూతనకాంతి నొప్పిల
క్ష్మీ నిలయంబులై వెలయు చిత్రగతిం
    బ్రియురాలినేత్రముల్,
ధ్యానుట దుర్భరం బగు ప్రభూ,
    తమదాసుడు మేన ప్రాణముల్
మ్లానము లయ్యెనేని యణుమాత్రము
    తన్నయనోత్పలద్యుతుల్ !

## భగవద్రామానుజులు

తెలియగవచ్చె మాకు భవదీయ
విధానము సర్వ మిప్పుడే:
చెలియవిలోచనద్వయికి
జేయుమనుంటివి సేవ — మంచిదే,
కలికి మనోజ్ఞ నేత్రములకన్న
మనోజ్ఞమగు మహోద్యుతుల్
గొలిపెడి వేత్రయుగ్మునకున్
నిరతంబు సపర్య సేయుదే ?

## ధనుర్దాసు

ఎక్కడగూడ నా కువలయేక్షణ
కన్నులకాంతికన్న సొం
పెక్కిన యంబకద్యుతుల నెన్నడు
జూడగ లేదు ! మిక్కిలిం
జొక్కపు నేత్రయుగ్మను
జూపుదురేని మహానుభావ, నే
నిక్కపు భక్తిభావమున నిత్యము
దాస్యము చేయకుందునే ?

## భగవద్రామానుజులు

ఆనందంబు ఘటిల్లె మా కిపుడు
వత్సా, నీరచోద్ధోరణిన్ !
నీ నిష్కల్మషవృత్తి శిష్యహృదయో
న్మేషం బొనర్చుం గదా !

కానం బోవుద మెల్లరుం గదలుడీ,
కల్యాణకాంతిచ్ఛటా
స్థానంబై విలసిల్లు దివ్య నయన
ద్వంద్వంబు, శీఘ్రంబుగన్ !

౨

## భగవ ద్రామానుజులు

పరమా కారణ జాయమాన కరుణా
పాంగ ప్రసారంబునన్ —
భరితాజ్ఞాన దురంత సంతసమమున్
భంజించుచున్, విష్టప
స్థిరసంరక్షణభార మూనిన మహా
శ్రీరంగనాథా, భవ
చ్చరణాబ్జంబుల కే నొనర్చెద
నమస్కారంబు భక్తప్రియా !

అవలోకింపుము వత్స, అల్లవె రమా
హ్లాదాను సంధాన వై
భవముల్, ధిక్కృతభానుమండల
రుచుల్, బ్రహ్మాండసందీపక
చ్ఛవులున్, భక్తిభర ప్రపన్న
జనతా సంరక్షణ ప్రాభవో
త్సవముల్, రంగశయానదివ్య
కరుణా సంఫుల్లనేత్రాబ్జముల్ !

## ధనుర్దాసు

అహాహా, యెంత మనోహరంబులు
త్వదీయ ప్రస్ఫురన్నేత్రముల్ !
మిహిరప్రస్ఫుట చండమండల
సమున్మేష ప్రభల్ కల్గియుం
దుహినాంశుద్యుతి శీతలమ్ము లయి
సంతోషం బొసంగెన్ : భవ
న్మహిమం బొప్పు మహాద్భుతమ్ముగను
శ్రీమద్రంగ ధామ ప్రభూ !
అవలోకింపగనైతి నేటివర
కాహా దుర్విపాకంబునన్
భువనోజ్జీవన భూరిశీతల కృపా
పూర్ణప్రభావస్ఫుర
ద్భవ దక్షిద్వితయంబు ! దేశికదయా
ప్రస్యంది వాఙ్మాధురిన్
నవసౌభాగ్యము కల్గె నక్కజముగా
నాకో జగన్నాయకా !

స్థిరతాత్పర్యము లోడ కన్గొనిన చో
దేవా, భవన్నేత్రముల్,
తిరుగ న్నేర్చునె బుద్ధి యన్యనయనో
ద్రిక్తప్రమోదంబునన్ ?
పరమప్రీతిని భృంగ మాసవసుధా
పానాభిలాషన్ దళ
త్సరసీజంబుల వ్రాలు గాని యితర
క్ష్మాజంబులం జేరునే !

## శిష్యురాలు

౧

### శిష్యుడు

ఆలయములోని కలివల యాగమము
సమ్మతింపరు రూపగోస్వామి వారు.
వారియానతి జవదాట వలను పడదు–
లేదు నాలోప ముందు తల్లీ, క్షమించు !

### మీరాబాయి

ఆడువారలు కృష్ణదేవుని
జూడ గూడదో? యెచటనే నీ
జాడ గానగ లేదు, మీకడ నేడు కనుగొంటిన్.
కరుణ యుంచుక పూని నాపై
మరల వారికి విన్నవింపుము
చరణసేవ యొనర్పనుండగ మరలి పోజాలన్.

### శిష్యుడు

నీ ముఖాబ్జవిలోకన నిమిషమందె
పొడమె తల్లి, నమస్కారబుద్ధి నాకు.
తోచినది కూడ నీముఖద్యుతులవలన
అద్వితీయ మహాభక్తురాల వనుచు.

చండశాసను లస్మదాచార్యు లమ్మ !
కామినీ కాంచనంబులు కంట బడిన

తొలఁగి పోవనిచో మోక్షదూరు లగుదు
రెల్ల పూరుషు లని సెల విచ్చినారు.
జనని, గ్రహించి యస్మదాచార్యదేవు
శ్రీముఖోద్గతవాక్యంబు స్థిర మటంచు
తరలి వేంచేయు మింకొక తావునకును-
స్వీకరింపుము మన్నమస్కృతిని దయను !

## మీ రా బా యి

విన్నవింపుము స్వామివారికి
మన్నమస్కృతి పూర్వకంబుగ
చిన్ని నావిజ్ఞాపనం బోయన్న యీరీతిన్ :

భరతవర్షవిభూషణం బై
వరలు బృందావన క్షేత్రము !
సరసిజాక్షుడె నాతలంపున పురుషు డిచ్చోటన్.

పెక్కు రున్నా రితరు లిక్కడ
నిక్కువంబే, కాని యందరు
మిక్కుటం బగు కృష్ణరక్తిని జొక్కి యుండుటచే-

చెల్ల దేమియు భిన్నభావం
బెల్లరును గోపాలు మృదుపద
పల్లవద్వయసేవ సల్పెడి వల్లవాంగనలే !

## శి ష్యు డు

నీపవిత్ర జిహ్వాగ్ర వినిర్గత మగు
భాషిత సుధారసార్ద్ర సంస్పర్శనమున

మార్జితం బయ్యె నజ్ఞాత మలినవృత్తి !
స్వామికడ విన్నవింతు నీవాక్యసరణి.

౨

## శ్రీ రూప గోస్వామి

బిడ్డ, నిన్ను జూడ ప్రీతి కల్గెను నాకు—
అధివసింపు మిదె కుశాసనంబు.
శుద్ధమానసంబు సూచించుచున్నది
నిర్మలాభ వెల్గు నీముఖంబు.

నీవు చెప్పి పంపు నిస్తులవాక్యమ్ము
లాలకింప నన్నెకహర్ష మొదవె.
భక్తిభరిత మగును భవదీయహృదయంబు,
నీవు ధన్య వమ్మ, నిశ్చయముగ !

పురుషు లైన నేమి పూబోణులవిధాన
పంకజాతనయను పాదసన్ని
ధానమందు భక్తి దమయాత్మ లర్పింప
కుందు రేని ముక్తి యొదవు టెట్లు ?

ఎచటినుండి బిడ్డ, యేతెంచుచున్నావు ?
ఎచటి కేగుదాన విచటనుండి ?
నామధేయ మేమి? నావల్ల నీ కేమి
ఫలము కలుగగలదొ తెలుపు మమ్మ !

## మీ రా బా యి

స్వామి, వచ్చితి రాజపుత్రుల
భూమినుండి, పవిత్రబృందా
ధామమున నశ్రాంతవాసము కామితము తండ్రీ !

దాసి మీరాబాయి : యిచ్చట
వాసమున కంగీకరింపుడు.
వాసరమ్ములు గడపుదానను మీ సపర్యలలో.

స్వామి, వీనుల గ్రోలుదును మీ
శ్రీముఖోద్గత దివ్యవాణిని
ఈమహాక్షేత్రమున కృష్ణప్రేమ నివసింతున్.

## శ్రీ రూప గోస్వామి

నేడు సుదిన మమ్మ, నిన్ను గాంచుట జేసి !
భక్తజనములందు ప్రథిత వీవు.
సిద్ధురాలి కేను జెప్పెడి దే ముండు ?
నిలువవచ్చు నిచట నీవు తల్లి !

## మీ రా బా యి

ధన్యురాలను దొరక శ్రీ చై
తన్య దేవ మహాప్రభూత్తమ
మాన్యశిష్యుని పాదసేవన, మన్య మిం కేలా !

గురుచరణం మమ శరణమ్!

## ప్ర భు తీ ర్థ ము

### శ ం క రు డు

మహిత వాసవమణి కుట్టిమమ్ము బోలు
సాగరముతోడ నొప్పుభూసౌధమునకు
కౌముదీ ప్లావితం బైన గగనసీమ
తనరుచున్నది ధవళవితాన కాంతి.

విమల వకానీవిభావరీసమయశోభ
నేలనో కాని కన్గొన నిచ్చగింప
కానసము నాలిచి నిమీలితాక్షు లగుచు
పలుకకున్నారు శ్రీ మహాప్రభువు వారు!

### రామానంద రాయలు

దేవ, ప్రసరింప జేయుడు దృష్టి యిటులు:
పొంగి పోవుచున్నది పూర్ణచంద్ర
కిరణజాలమ్ము తాకున కెరలి నిగుల
ఆతతం బైననీలరత్నాకరంబు—

రాధికాదేవి కబరీభరమ్మునుండి
జారుచుండెడి కుసుమసంస్పర్శవలన
పరమహర్షముతో గగుర్పాటు గాంచు
శ్యామసుందరు లలితదేహమ్ము వోలె.

### శ్రీ చైతన్య మహాప్రభువు

(కన్నులు తెరచి)

ఏడి నా శ్యామసుందరు డేడి యేడి!
మాయముండగ నెచటికో నురిగినాడు.

ఇచటనే నిల్చియున్నా డింతలోనె
ఆశ్చెరువు తోప నేకడ కరిగినాడు!

ఏమి చిత్రము సఖులార! ఇపుడె యతని
నీ ప్రదేశమ్మునందె వీక్షింప గంటి.
అంతలోనె యంతర్ధాన మయ్యె నయ్యొ
వంచకాగ్రణి గోపికా వల్లభుండు!

(ఇటు నటు చూచి)

కాన రావేమి కృష్ణ, ఈ కన్నుదోయి
ఏమి పాపము చేసినదో మనోజ్ఞ
దివ్యభవదీయ రూపదీప్తి లభింప
దక్కటా!— రమ్ము నా హృదయాధినాథ!

నిన్ను గనజాలకున్న నే నిమిషమైన
తాళజాలను కృష్ణ, ఈ తనువునుండి
ప్రాణములు లేచిపోవు! కృపాప్రపూర్ణ
మానసమ్మున దరి జేరుమా రయమ్ము!

వినయపూర్వకముగ నిన్ను వేడుచున్న
దోయి రాధిక! రమ్ము నేత్రోత్సవముగ.

(కొంచె మూరకుండి)

శీఘ్రగతితోడ నేల వేంచేయ కుంటి
వోయి! అక్కట యేమి చేయుదును కృష్ణ!
ప్రాణసఖులార, ధూర్తగోపాలకుండు
అతిరయమ్మున నెచ్చటి కరిగినాడొ
తెలిసికొని సత్వరమ నివేదింపరేని
ఇంక మీతోడ నెపుడు భాషింప నేను!

## గోవింద దాసు

(మహాప్రభు పాదముల మీద వాలి)

మీ చరణ దాస వర్గము మీద నిట్టు
లాగ్రహింపగ నేల మహానుభావ !
కింకర జనమ్ముపై మీరు కినుక పూని
పలుకకుండిన నెట్టులు బ్రదుకగలము !

## రామానంద రాయలు

ప్రభువరున కాగ్రహము లేదు : భయము వీడి
లెమ్ము గోవింద, ఇయ్యది లీల సుమ్ము.
స్వామి యియ్యెడ తన్మయత్వమ్ము లోన
పల్కె శ్రీరాధికాదేవి భావనమున.

## శ్రీ మహా ప్రభువు

(ప్రక్కకు చూచి)

కేకి పింఛావతంసుడై కృష్ణు డడుగో
నన్ను గాంచి శిరః కంపనమ్ము చేసె !

(ఉత్కంఠతో)

ఇదిగో పరుగిడి వచ్చి నాహృదయనాథ,
చేరుదానను నీసమాశ్లేషమందు !

(ముందరికి పోబోవును)

## శంకరుడు

మారుతాహతి నుత్కంపమాన శిఖర
కలిత మైనట్టి తాళవృక్షమ్ము గాని

బర్హిబర్హావతంస గోపాల మూర్తి
కాదు కాదు మహాప్రభూ, కనుగొనుండు.

### శ్రీ మహా ప్రభువు
(చంద్రునివంక జూచి)

శ్యామసుందర, ఏమి యన్యాయ మోయి!
యోగ్యముగ లేదె నీకు నాయూరుతలము?
ప్రేయసిని రాధ నిట్లు పరిత్యజించి
పవ్వళించితి వేటికి పాలకడలి?

### శంకరుడు

కాదు కా దది క్షీరసాగరము కాదు,
పరిణతం బైన చంద్రబింబమ్ము కాని,
నడుమ నున్నది శ్యామసుందరుడు కాదు
సాంద్ర మైనట్టి మేదినీచ్ఛాయ కాని.

### శ్రీ మహా ప్రభువు

అయ్యయో, చూడు డెంత దయావిహీను
డో హిమాంశుడు! గగనమునుండి యిట్లు
కౌముదీ రూపకం బైన కారుచిచ్చు
నొక్కటేరీతి వర్షించుచున్నవాడు!

(బాధతో)
తాళజాలను కృష్ణ, యీతాపమునకు
దీనురాలిని మిగుల బాధింతు వేమి?
శీఘ్రముగ నేగుదెంచి యాశ్లేష మిచ్చి
అపనయింపుము దేహదాహమ్ము నాథ!

(జాలిగా)

ఎంత బతిమాలుకొన్న రావేమి కృష్ణ!
రాధ చేసిన ప్రబలాపరాధ మేమి!
ఎంత నీకయి నేను తపించుచున్న
పలుక వేటికి అయ్యయో ప్రాణనాథ!

అక్కటా, సత్వరంబ మీరైన బయలు
వెడలి చెలులార, కృష్ణుని వెదకి తెండు.
ప్రాణనాయకు దో రాధబంధమందె
స్వస్థ సయ్యెద- అన్యత్ర శాంతి లేదు!
మిమ్మునైనను చెలులార, నమ్మరాదు.
కఠినహృదయులు! ఇకనైన కదల రేమి!
ప్రాణములు పోవుపిమ్మట పరుగువారి
తీసికొని వత్తురొక్కొ అ మోసగాని?

(రోషము తో)

పట్టువడునేని ధూర్త గోపాలు నిపుడు
నలిపివేయనె ఆలింగనమ్మునందు!
కఠిన దంతక్షతమ్ములు కఠిన నఖర
ఘాతములు చేయకుందునే గాత్రమందు!

(కన్నులు మూసికొని)

ఆగ్రహింపకు మోయి యీ యబలపైన!
బాధలో నాథ, ఏమేమొ పలికినాను.
కరుణ వహియించి వేగమ కౌగలించి
అతితరం బైన తాపము నార్పు మోయి!

(ముందరికి పడబోగా దాసులు పట్టుకొన్నారు.
మహాప్రభువు కనులు తెరచి ఆనందముతో)

అడుగో నా శ్యామసుందరు డడుగో అడుగో
వచ్చుచున్నాడు నా ప్రాణవల్లభుండు.
హస్తములు చాచి నీ ప్రియురాలిఁ గృష్ణ,
చేర్చికొమ్ము భుజాంతర సీమయందు!

(తటాలున సముద్రమున పడినాడు)

## రామానంద రాయలు

(కలవరముతో)

వేగముగ పట్టుకొమ్ము గోవింద దాస!
శంకరా, లెమ్ము లేలెమ్ము సత్వరముగ.
పట్టు తప్పించుకొని మహాప్రబల ధాటి
నురికినాడు మహాప్రభు వుదధిలోన.

(శిష్యులు లేవదీయగా ఆనందముతో)

## శ్రీ మహాప్రభువు

ఎంత తాపాపనోదకం బెంత శీత
లమ్ము నా ప్రాణనాయకు లలితగాత్ర,
మెంత మధురమ్ము నా హృదయేశు గాఢ
భంగురోరః స్థలీ సమాలింగనమ్ము!

## రామానంద రాయలు

ప్రవిమలం బైన శ్రీ మహాప్రభువరేణ్యు
గాత్రసంస్పర్శచేత సాగర జలంబు

విమలమధురము పరమపవిత్ర మయ్యె !
ఈ ప్రదేశము తీర్థమౌ నింకమీద.

## గోవింద దాసు

(సముద్రోదకము నోట బోసికొని)

భక్తకల్పద్రుమం బైన ప్రభు శరీర
మధుర సంస్పర్శవశమున మారిపోయె
నహహా, స్వాభావికం బైన యబ్ధిగుణము:
ఇక్షు మధురమ్ముగా నున్న దిచటి నీరు !

## శిష్యులు

(ఉచ్చైఃస్వరముతో)

జయము సద్గురు మౌళికి జయము జయము
జయము జయము నవద్వీప చంద్రమునకు
జయము శ్రీ గౌరగోవింద చక్రవర్తి !
కధికజయము మహాప్రభు ననుచరులకు !

శ్రీ మహాప్రభు చరణయో రతి రస్తు !

# దీపారాధన

## కుంభమేరు దుర్గము:

### ఝాలా రాజకుమారి

ఇటు సంఘటిల్లు నని యెంచనె లేదు, నేడీ
కుటిలాత్మకుండు నను కోటకు జేర్చె నయ్యో!
ఇటనుండి ముక్తి లభించుట యెట్లొ! నన్నో
నిటలాక్ష, వేగ కరుణింపు మనాథనాథా!

పరు లేవిధంబునను పాదము పెట్టలేరీ
ధరణీధరాగ్ర రచితం బగు దుర్గరేఖాం
తరసీమ! నాకిపుడు దారిని జూపగా నో
గిరిపుత్రికారమణ, కేవల మీవె దేవా!

హృదయేశు గూడి సుఖియించెద నంచు లోలో
ముద మొందుచుండ కను మూసెడునంతలో నీ
యుదయుండు మాకు నకటా యెడబాటు గూర్చెన్!
తుద కేమి కాగలదొ తోచుట లేదు దేవా!

భయ మెత్తుచున్నది! నృపాలుని యూహ మేమో!
వయ సెంతయో చనినవానికి కాంత యేలా!
నయవృత్తి బోవిడిచి, నన్నొకవేళ కేళీ
ప్రియుడై విలాసినిగ బెగ్గిలజేయు నేమో!

పరిణీత గా నొసెడి భావముతోడ దన్నున్
వరియింపు మంచు బలవంతము చేయు నేమో

ధరణీధవుం! డకట, ధైర్యము జారిపోయెన్!
తరుణీవిలాపమున ధార్ష్ట్యము తగ్గునేమో!

అనుకంప లేక యిత డారడి పెట్టుచో నే
తనువుం దొరంగుటయె ధర్మము: కాని నాథుం
డనయమ్ము నాకయి మహావ్యథ చెందు నయ్యో!
వనితాత్వ మెందులకు వచ్చెను నాకు దేవా!

సదయుండె కానియెడ క్ష్మాపతి కుంభ రాణా
కదు రేరి రాకొమరు లీభువి నన్ను బ్రోవన్!
హృదయేశ, యె ట్లయిన నే నిరతంబు యుష్మ
త్పదపంకజద్వయము భక్తిని సంస్మరింతున్!

కుంభ రాణా

(ప్రవేశించి)

ఆళీ సమూహావృతవై మధుపాన గోష్ఠిన్
కేళీమనోహర నికేతనసీమ సంతో
షాలాపముల్ సలుప, కన్యమనస్కవై యి
ట్లేలా మదీయ నయనేందిర వర్తిలంగన్!

గాసిల్లు నీ విమలగాత్రము లేవ నేలా?
నీ సన్నిధానమున నిల్చినవాడు యుష్మ
ద్దాసుండు గాని వసుధారమణుండు కాడో
వాసంతికా కుసుమ భాసుర పేశలాంగి!

చేసన్న కన్గొనుచు శీఘ్రమ నీ యనుజ్ఞన్
దాపిజనంబు తల దాల్చెనె? సౌఖ్యమేనా

ప్రాసాదమందు ? తెలుపంగదె వేడికొందున్-
నీ సంశయం బుడిగి నిక్కము రాజపుత్రీ !

నీ వాజ్ఞ యిచ్చునెడ నిష్ఠురకార్య మైనన్
మేవాడభూపతి నిమేషమునన్ ద్వదీయ
సేవాపరత్వమున జేయును సుమ్ము దేవీ !
వేవేగ దెల్పగదవే భవదాశయంబున్ !

వ్రీడాభరంబునను విహ్వలచిత్త వైతో ?
నీ డింతసేపటికి విస్మృతి దక్కి నన్నుం
జూడంగ వచ్చె విరసుం డని యెంచినావో ?
నే డాయ వచ్చితిని నిర్భర మైన ప్రేమన్ !

న న్నన్యగా దలప న్యాయము కాదు బాలా !
మన్నింపగా దగును మానిని, జాగుసేతన్ !
ఎన్నండు కౌగిట ధరింతును ని న్నటంచు
ను న్నాడ నేను కడు నుత్సుకతన్ లతాంగీ !

ఏలా ముఖమ్ము పయి కెత్తక యేకనిష్ఠన్
నేలం గనుంగొనెదు నీరజపత్రనేత్రా !
చాలున్ ద్యజించి యిక సంశయబుద్ధి బాలా !
ఆలోకనమ్మున కృతార్థుని జేయ వేలా !

ని న్నింత వేడినను నిర్దయురాల, నన్నున్
మన్నింప వేమిటికి మౌనము వీడి ! పోనీ
క న్నెత్తి యొక్క త్రుటికాలము గాని చూడ
కున్నావు- సిగ్గో, భయమో, మరి విభ్రమంబో !

లంబాలకా, యిపుడు లజ్జ దొరంగవేని
సంబాధితం బగును సాంద్ర భుజోపగూహ
నంబందు భూరికఠినంబుగ నీయురంబు !
బింబాధరంబు పరిపీడిత మౌను జుమ్మీ !

**రాజ కుమారి**

( గద్గదికతో )

తగునే యిటుల్ పలుక ధార్మికు లయ్యు దేవా !
జగమందు ధర్మము ప్రచారము చేయువారే
మగువం గనుంగొనిన మాత్రమునన్ స్వకీయ
మగు నిగ్రహంబు విడనాడుట వింత కాదా !

**కుంభ రాణా**

తాపమ్ము వాసెను సుధామధురమ్ము లైన
నీపల్కు లీచెవుల నిల్వగ మంజువాణీ !
ఆపాదమస్త పులకావృతదేహ మోహో
చూపట్టు కుట్మలితశోభి కదంబమట్టుల్.
నా కేమి వింతయు కనంబడ దేదు సుమ్మీ
లోకైక సుందరి, త్రిలోచను డైన నిన్నా
లోకించుపక్షమున లోలమనస్కు డౌను.
నే కౌగి లీయగదవే శుభభారనమ్రా !

**రాజ కుమారి**

అకటా, కటూక్తు లిటు లాడగ జెల్లునే కా
ముకులట్లు పెద్దలతిమోహముతోడ ? మీరల్

సకలావనీరమణ చక్రమహాధిపుల్ నే
వకురాలితో సరసవాక్యాలు యుక్తమా నే?

కుంభ రాణా

నీ విట్టు లెంచ దగునే హృదయేశ్వరీ, నీ
సేవాపరాయణుడ, సేవ్యుడ గాను దేవీ,
నావాక్య లీయెడనె నమ్ము ప్రసన్నురాలు
కావేని నీచరణకంజము లంటువాడన్!

రాజ కుమారి

వల దిట్టిపట్టు ప్రభువర్య, నవంతయు న్నా
పలు కాలకింపరు కృపానిధు లయ్యు నయ్యో!
తలిదండ్రులం గొలుచు దానిని మీరు దేవా,
బలిమిన్ హరించితిరి, భావ్యమె యిట్టి చేష్టల్?

కుంభ రాణా

ఆరోగ్యశక్తి తత్పరులమై నిరతంబు వీర
మర్యాదలం దరచు మమ్ముల దూర నౌనే?
శౌర్యోన్నతుల్ మిగుల శ్లాఘన చేయునట్టి
కార్యంబె చేసితిమి, కాదు మరొండు ముగ్ధా!
దోషం బటంచు నను దూరగ వచ్చు నన్య
యోషన్ హరించుటెడ యోగ్యులు: కాని కన్యా
భూషామణీ, యిపుడు భోగ్యవె నీవు, మాతో
భాషింప లేవు నయపద్ధతి సూక్ష్మబుద్ధిన్.

రాజ కుమారి

అసమానశూరులు మహాకవులున్ విపశ్చి
ద్దసికాగ్రణుల్ వయసు దాటినవారు దేవా,

అసమంజసం బనక ఆస వహింప నేలా
కసుగంద నట్టి యొక కన్నె మిమున్ వరింపన్ ?

కుంభ రాణా

ఆహా, లతాంగి పరిహాసము చాలు ! అస్మ
ద్దేహంబునన్ వళులు చేరవు, కేశరాశి
కేహానియుం గలుగ, దేమి కొరంత లేదే
బాహా బలంబునను: ప్రాయము పోయె నొక్కొ !
నీ మీద నోతరుణీ, నిర్భర నిష్కలంక
ప్రేమమ్ముచేత నిను బెండిలియాడు కోర్కి
నా మానసమ్మున ఘనమ్ముగ నిల్చె, గానన్
భామా, ఒసంగు భుజబంధన సమ్మదంబున్.

రాజ కుమారి

బహుపూజ్యురా లయిన పట్టపుదేవి యుండన్
మహీవల్లభా, యితరమానిని నామె యెట్టుల్
సహియించు ? దేవర విచారణ చేసినారో
బహు భార్య లుండు నెడ బాటిలు బాధ లెల్లన్ ?

కుంభ రాణా

ఆ సంశయంబు విడనాడుము రాజపుత్రీ,
కాసంత యేనియును గౌరవహాని నీకుం
బ్రాసాదమం దెపుడు పాటిల : దింత యేలా
నా సార్వభౌమ పద నాయకురాల వీవే.

రాజ కుమారి

అరయంగ నే తగుదునా తమదండ నుండన్ !
కరుణార్ద్ర మానసులు కావున దేవ, నన్నుం

త్వరితంబుగా జనక ధామము జేర్ప యుష్మ
చ్చరణాంబుజంబులకు సాగిలి మ్రొక్కుదానన్.

కుంభ రాణా

దుర్వార మత్ప్రథిత దోర్బల నిర్జితం బౌ
సర్వంసహాస్థలికి చయ్యన రాణి జేతున్
సర్వంబు నీ చరణసన్నిధి నుంతు, నింక
గర్వంబు వీడి నను కామిని యేలుకొమ్మా!

రాజకుమారి

వరనాయకా, వలదు నాకివి యేవి, మిమ్మున్
వరియింపజాల- అవివాహితవృత్తి నుందున్!
త్వరితమ్ముగా జనక ధామము జేర్ప యుష్మ
చ్చరణాంబుజంబులకు సాగిలి మ్రొక్కుదానన్.

కుంభ రాణా

ఆలోచనారహిత మర్థవిహీన మౌ నీ
యాలాపధోరణికి నచ్చెరు వొందుచుంటిన్
బాలా, పదింబదిగ పల్కగ నేల, నిన్ను
నైళంబ యిచ్చోట వివాహము చేసికొందున్.

రాజకుమారి

ఉభయాభినివిష్ట మయి యున్నదె ప్రేమ, మీరల్
విభవాభిరాములును వీరవతంసు లయ్యున్
ప్రభువర్య, దీన యగు బాలను వేచ నానే?
అభయం బొసంగి సదయమ్ముగ బంపు డింకన్.

**కుంభ రాణా**

ఏహేతువో తెలియ దింతవిరక్తికి న్నే
నూహింప లేక వెత నొందుచు నున్నవాడన్.

**రాజ కుమారి**

తెలియంగ లేరె జయదేవుని కావ్యగీతి
కలకున్ మనోజ్ఞ 'రసికప్రియ' నామ వృత్తిన్
వెలయించి నట్టి బహువిశ్రుతభావకుల్ నా
తలపోత ? మీకు విశదంబుగ తెల్ప నేలా !

**కుంభ రాణా**

ఊహింపజాలను గుణోన్నతచిత్త, నీపై
మోహాతిరేకమున ముగ్ధుడ నౌటచేతన్.

**రాజ కుమారి**

ఎదిరించుచుంటి నని యెంచగ బోకుడీ, నా
హృదయంబు వేరొకరి కిచ్చితి మున్నె దేవా !

**కుంభ రాణా**

పెక్కుల్ వచించితిని ప్రేమను, నీమతంబున్
నిక్కంబుగా నెరుగ నేరక రాజపుత్రీ.

**రాజ కుమారి**

విదితంబు చేసితిని ప్రీడ దొరంగి యస్మత్
హృదయంబు : పంపవలె నింతట నన్ను దేవా.

**కుంభ రాణా**

చిక్కు య్యో ! ఇక్కడకు జేర్చితి నిన్ను నాకై,
యకార్యమున్ సలుప హీనత నాకు బాలా.

నీ క్షేమమీయుం గలుగనేరదు సుమ్ము లోపం
బో కన్యకా, యిచట నుండు సుఖమ్ముతోడన్.
ఏకారణం బయిన నేర్పడి బుద్ధి మారన్
చేకొమ్ము నన్ను సరసీజ దళాయతాక్షీ !

(ని ష్క్ర మ ణ ము)

రా జ కు మా రి

భయ మెట్లొ తీరినది ప్రస్తుత 'మేకలింగు'
దయచేత ! రా జోకవిధంబుగ యోగ్యుడైనన్
భయదోగ్ర దుర్గమున బంధిత నైతి, నయ్యో !
ప్రియు డెంత నాకొరకు బెగ్గిలు చున్నవాడో !

శుకమట్లు పంజరము జొచ్చితి ప్రాణనాథా !
ఇక నెంతకాలమున కీచెర వీడి నే మీ
నికటంబు చేరుదునొ ! నెవ్వగ బ్రహ్మదేవుం
డకటా దయారహితుడై లిఖియించె నేమో !

అనిశంబు నాదు హృదయాలయమందు నాథా,
అనురాగ దీపశిఖ ఆరక ప్రజ్వరిల్లున్ !
కనుగొంచు, నాయెడద కాంతు నెఱుంగు నట్టుల్
పెనుదీప మగ్రమున పెట్టుదు రాత్రివేళన్.

(దీ ప ము వె లి గి ం చి)

మదిలో నిరంతరము "మందర" దుర్గపాలు
పదపద్మముల్ నిలిపి భక్తిని పూజ చేతున్ !
బ్రదికించుకొండు తమ భార్య నటంచు తెల్పం
గదె దీపికా, హృదయకాంతున కట్టులైనన్ !

# ప్రతాప కుమారి

## హావిూర సింగు

అచ్చెరు వయ్యె! మీనగరమందు
వివాహ మహోత్సవాంక మే
యెచ్చట గానరాదు జలజేక్షణ!
మీ పరివారవర్గమో
ముచ్చట లేక యున్నయది:
మోసముపోలిక గోచరించెడున్!
చెచ్చెర సత్యముం దెలియ
జేయగదే భువనైక సుందరీ!

ఆయత మైన ఖడ్గ మిదె
హస్తమునందు, మహాపరాక్రమ
శ్రీయుతు లైన సైనికులు
చేరువ కావలియున్నవా రదే.
ఏయెడ దాచెనో పట
కుటీరమునన్ నిజసైనికావలిన్
న్యాయము వీడి నీజనకు
డంబురుహోజ్జ్వల చారులోచనా!

ఇం కొకమాట ని న్నడుగ
నెంతయు సిగ్గు జనించుచున్న దో
పంకరుహాయతేక్షణా, భవ
త్కటి మండల రమ్యమేఖలా

లంకరణమ్మునన్ నిపుణ
లగ్నములై చురకత్తు లున్నచో
అంకిలి వీడి మేఖలిక
నావల నుంచుము రాజపుత్రికా!

మాయలలో మహామహుడు
మాళవదేవనృపాలు! డందుచే
ఈయెడ జాగరూకత వహింపక
తప్పని దయ్యె! నిన్ను మీ
నాయన రాజ్యరక్షకయి నా
కుపహారముగా నొసంగెనా?
నీయనురాగమే యిచట
నెక్కెనె నా సరసీరుహేక్షణా!

పెండిలి యాటచే నెటులొ ప్రీతి
నటించుము భర్త్రగేహమం
దుండెద నింద యేటి కని యోర్పు
వహింపకు రాజపుత్రికా!

**ప్రతాప కుమారి**

మీ నామమ్మును విన్న దాదిగ
మదిన్ మీపాదపద్మద్వయీ
ధ్యానంబే యొనరించుచున్నయది
యీ దాసి ప్రవీరాగ్రణీ!

**హమీర సింగు**

ఖండిత వాక్యముల్ పలికి
కష్టము గూర్చితి నీకు భ్రాంతిమై!

నిండుమనమ్ముతో నిపుడు
నిన్ను వరించినవాడ ప్రేయసీ !
బంగరు బొమ్మ, నీ లలిత
బాహు లతా దృఢబంధ నాశ్రితుఁడై
సంగర కర్కశుం డయిన సైనికు
డువ్విళులూరు నెంతయున్ !

## ప్రతాప కుమారి

మీ నిష్కల్మష వాక్యముల్ వినగ
నా మే నెల్ల కంపించెడున్ !
నే నిక్కమ్ముగ నిల్వనేర తమ
సాన్నిధ్యమ్మునం దో ప్రభూ !

## హమీర సింగు

మంగళ దేవతా, ముఖము
మ్లానిమ చెందగనీక బంధురా
లింగన మిమ్ము, దుర్లభ నిలింప
సుఖాంబుధి నోలలాడెదన్ !

వింతగ నీముఖాంబుజము
విన్నదనంబు వహింప నేల ? క
ర్ణాంత విశాలనేత్రముల
నశ్రువు లూరగ నేల ? సాధ్వసా
క్రాంత మనోజ్ఞఫాలమున
ఘర్మకణంబులు నిల్వ నేల ? నీ
వింతవికారముం గనగ నేల ?
వచింపు త్రిలోక సుందరీ !

ప్రతాప కుమారి

ఆకర్ణింతుర యేని మాన మహితా
  మగ్రేసరా, మత్కథన్
మీకోపాగ్ర కృశానుకీలలను
  భస్మీభూతనై పోవుదున్ !

హమీర సింగు

నిక్కపుప్రేమ గాటముగ నీయెడ
  నుండగ నాకు, నేటి కో
చక్కనిచుక్క ! యింత భయ
  సంభ్రమ గాద్గదిక ప్రసక్తి ? నా
యక్కున జేర్చుకొంటి గద !
  అన్యవిచారములం ద్యజింపుమా !
ఎక్కడి కట్లు పోయెదు ? క్షమింపుము
  యోధుని కర్కశత్వమున్.

ప్రతాప కుమారి

మీ కీర్తిధ్వజమందు నిల్చినది యీ
  మిథ్యా వివాహమ్ముచే
ఆకల్పాంతము దుర్భరం బయిన
  నీలాంకంబు వీరాగ్రణీ !

హమీర సింగు

నీమాటల్ మనముం గలంచినవి
  ఓ నీరేజపత్రేక్షణా !
ఏమాడ్కిన్ ఘటియిల్లు దుర్యశము
  నా కేతద్వివాహమ్మునన్ ?

## ప్రతాప కుమారి

పౌరుషమందు గణ్యతను
  ప్రాభవమం దసమాన మైన దీ
ధారుణి బప్పరాట్కులము:
  తద్వరవంశమునన్ జనించుటన్
మీరు మహాకులీనులును
  మిక్కిలిపూజ్యులు: కాని నేటితో
గౌరవహాని సంఘటిలె
  కైకొనుటన్ నను ధర్మపత్నిగాన్.
నాయనగారు సౌమ్యముగ
  నన్ను నొసంగుటలోన మీ కయో
మాయ మహానిగూఢ! మిది
  మంగళదేవత కాదు! శుభ్ర వశా
మీయాశమున్ హరించుటకు
  మేదినిమీద మనోహరాంగనా
కాయముతోడ సంభవము
  గాంచిన పెద్దపిశాచ మో ప్రభూ!
కావున మండలాగ్రమున
  కాయము జీల్చి కవోష్ణరక్త ధా
రావభృథంబునం బున
  రనావిలమై నిజకీర్తిచంద్రికల్
దేవ, వెలుంగగా నిఖిల
  దిక్తటులందు సమాచరింపుడీ
భూవరధర్మ, మత్యధికపుణ్యము
  నాకు లభించు రూఢిగా!

### హమీర సింగు

ఏమాత్రమ్ము భయమ్ము లే, దిక
నిజం బేమో నిరూపించి ని
స్సీమానందము నాకు గూర్చదగదే
శీఘ్రంబ ప్రాణేశ్వరీ !

### ప్రతాప కుమారి

ఊహము నాకు లేనపుడు
యోధకుమారునితోడ జేసి రు
ద్వాహము తల్లిదండ్రులు
వివాహము మాత్రము కాకపూర్వమే
ఆహవభూమియందు నత
డంతము నొందెను పోరు సల్పుచున్:
సాహసమున్ వహించి కల సత్యము
పల్కితి ప్రాణవల్లభా !

### హమీర సింగు

పాదద్వంద్వము వీడి లేవగదవే
ప్రాణప్రియా ! ఇంక నీ
ఖేదమ్మున్ విడనాడి నాభుజముపై
గ్రీవమ్ము గీల్కొల్పవే !
ఏదీ నాప్రియకాంతకున్ సదృశురా
లేత న్మహాంభోధి మ
ర్యాదాలంకృత ధారుణీతలమునం
దంభోజపత్రేక్షణా !

# పలిత కేశము

(మిథిలా నగరమున రాచనగరిలో కక్ష్య)

## మఖాదేవ ప్రభువు

పాటలీపుత్రమ్మువారలు
పంపినారు మహామనోహర
వివిధపరిమాణాకృతుల్ గల విమలదర్పణముల్.

వచ్చియున్నవి వింధ్యభూధర
వన మద స్తంబేరమమ్ముల
దివ్యదంతవినిర్మితము లౌ తెల్లదువ్వెనలున్.

రమ్య కోసల దేశ వివిధా
రామసీమలలో మనోజ్ఞ
ప్రసవసారమునుండి తీసిన ప్రథిత తైలంబుల్ -

పెట్టియున్నవి రమ్యచందన
పేటికాంతర్గత మనోహర
కాచపాత్రికలందు నెంతయు ఘ్రాణపర్వముగన్.

త్వరితముగ బోవలయు రాజ్ఞీ
దర్శనార్థం బో ఉపాలీ,
చతురిమమ్మున కేశసంస్కృతి సలుపు మీవేళన్.

పట్టుకొమ్మా కాంచనావృతి
బద్ధ నూతన వలయ ముకురము
సమ్ముఖంబున యవనబాలా, జాగరూకతతోన్.

స్తంభనికటమునుండి తెమ్మా
సత్వరంబుగ నో సుభద్రా,
పసుపుపచ్చని పట్టుదిండుల పాదపీఠంబున్.

కేశజాలము చెదరకుండగ
కేకిపింఛముతోడ విసరుము
మద్రచామరవాహినీ, యిటు మందమందముగన్.

పదవిలాస సమంచితం బై
భవ్యభావ తరంగితం బగు
పాట పాడంగదె విశాఖా, పంచమశ్రుతిలో.

విశాఖ

అఖిల భువనములం దకుంఠిత
మహా ప్రతాపముతో వెలింగెడు
పంచసాయకుఁ డొక్కఁడే నా పరమదైవతము !

సకలయోగీశ్వరుల కర్తై
సరుడు ఫాలవిలోచనుండే
స్మరుడు దూరమునందు నిలువగ సంచలన మొందెన్.

ప్రసవబాణము తనువుమీదను
పడకమున్నె శివుడు గిరిజా
వదనబింబముమీద ప్రేమను వాల్చె లోచనముల్.

బాణపాతంబైనచో ఆ
భర్గు డేమయి యుండువాడో !
శర్వతాత్మజ కప్పు డెంతటి ప్రమద మబ్బెడిదో.

నిజగళంబున హరుడు విషమును
నిలిపి మృత్యుంజయుం డయ్యెను:
అగ్నిదగ్ధుం డయ్యు బ్రదికిన యాత డెవ్వ డగున్ ?
నామతంబున, సాటి యెరుగని
నాయకుం డొక మనసిజుండే !
అతను డయ్యెను నడపు లోకము లాత్మపాలనలో.

అట్టి యుజ్జ్వల చండశాసను
నర్చనమ్ము నిరంతరమ్ముగ
విష సలుపం దగిన కాలము నిందుజవ్వనమే.

అహరహంబును వేచియుండును
యౌవనంబును గ్రుంగివేయగ
జరయు వ్యాధియు వ్యాఘ్రభంగిని చండవిస్ఫూర్తిన్.

ఏదినంబున వలీపలితము
లేర్పడుం దనుమస్తకంబుల
ఆదినంబున దొలగ మొదలిడు నతనుకృప కూడన్.

జవ్వనంబు హరించి పోవగ
సాగుకాలదిని వృద్ధి గాంచును
కామినులపై నక్కజంబుగ కాంక్ష పురుషులకున్.

పలిత మూర్ధ విలోకనమ్మున
ప్రాభవమ్మును ధనము విద్యను
పరిగణింపదు యువతి విముఖీ భావ సంగతయై.

విజయ మొందెదు గాక యౌవన
విభ్రమోత్కర్షమ్ము మన్మథ
నిబిడ కరుణా కటాక్షమ్మున నిఖిలలోకములన్.

విరత మానందాతిశయమే
నెగడు గావుత రూపసంపద
పంచబాణసమాను డగు మా ప్రభువతంసునకున్.

## మహాదేవుడు

ఎంత దివ్యం బహహా దేహం
బెంత దివ్యం బవుర యౌవన
మెంత దివ్యం బహహ తరుణీ హాసవిభ్రమము !

ఎంత చక్కనిపాట పాడితి,
విది రచించిన కవివరేణ్యుడు
మనపురంబున నున్నచో బహుమాన మంపుదునే.

## విశాఖ

చరణసేవకురాలి సద్య
స్సాహసంబు క్షమియింపవలయును !
పరకవి ప్రోక్తంబు కాదీ పాట ప్రభువర్యా !

కామసన్నిభు లైనదేవర
గాత్రసంపద్విలోకనమున
పాదసేవకురాలి ముఖమున బయలుపడె దేవా !

## మహాదేవుడు

అకుగతి నీలలితముఖమున
నవతరించిన గీతమా యిది !
హార మిదిగో వైతు రమ్మా అంతికమ్మునకున్.

విశాఖ

దీప్తి గాంచు నమూల్యహారము
దేవ, యుష్మత్కంఠసీమనె.
అంత మన్నన కీ తపస్విని అర్హురాలగునే?

మహాదేవుడు

ప్రాకృతమ్మున నేటివరకును
పడతి కనను చెప్ప నెరుగను.
కలిగె నర్హత నీకు ప్రభు వాక్యమ్ముచే బాలా!

ఉపాలి

దేవ, కంఠమునుండి హారము
తీయుచో నిద చిక్కువడినది
మూర్ధజావళి, సంస్కరించెద మొదటిచందమునన్.
కలిగె గమనవిలంబనం బీ
ఘటనలో నొకయింత దేవా.

మహాదేవుడు

పోనిలే కానిమ్ము వేగమ పూర్ణ మండనమున్.
నిలువు మోసి విశాఖ, నీదృఢ
నీల కుచబంధమ్ము మీదను
కాన వచ్చెను ధవళరేఖాకారమున నేదో.

విశాఖ

వాయువశమున ధవళతంతువు
వాలియుండగ నోపు దేవా.

## మహాదేవుడు

తీసి యిమ్మిటు పలితకేశము
తెరగునం దోచున్.

కంఠ దేశమునుండి హారము
గ్రక్కునం దొలగించువేళను
దాన లగ్నం బయ్యె నెట్లో ధవళ కేశంబు.

నలువదేడులు నిండె మొన్ననె,
నడువయస్సున నున్నవానికి
ఉత్తమాంగమునందు పలితం బుదయ మొందినదే!
గోచరించెను జరానూచన,
కొన్నినాళ్ళ కసంశయమ్ముగ
శిరము ధవళం బగు హిమాలయ శిఖరి చందమునన్.

## ఉపాలి

వేటకై చని మొన్న మొన్ననె
విపినభూమిని శూలముఖమున
వ్యాఘ్రహననము చేసియుంటిరి, వార్ధకంబ ప్రభూ!

## మహాదేవుడు

భోగలాలసు లైనవారికి
పోవు నోజము సత్వరమ్ముగ.
విషయసుఖముల నుండి పురుషుడు విరతి చెందదగున్.

జగము సర్వం బనిత్యంబే!
జనన మరణ ప్రవాహములో
కర్మబద్ధుం డగుచు జీవుడు క్రమముగా దిరుగున్.

సకల సంసారములో నే
జాడ గాంచిన మనఃక్షోభము
గాఢ వాంఛలు భూరిదుఃఖము కాన బడుచుండున్.

శాశ్వతం బగు వస్తు వీ సం
సార మధ్యమునందు గలదా?
చిత్త విక్షోభోపశమన స్థితియె చేకురదా?

స్వాంతమందు నిరంతరము జా
జ్వల్యమానము లైన కోర్కులు
శమము గాంచి ప్రశాంతి కల్గెడి సరణిరయే లేదా?

సకల కారుణి కాగ్రగణ్యుడు
శాక్యముని సింహుండు జనులకు
ఈ యనిత్యతయందు శాశ్వత మేదొ తెల్పె గదా.

పరమపూజ్యుం డైన బుద్ధ
ప్రభువు కన్గొని దుఃఖతత్త్వము
దివ్య మగు నిర్వాణ మార్గము తెలిపియుండె గదా.

దుఃఖసంవృత మఖిలలోకము,
దుఃఖమూలము తృష్ణ, దానిని
ద్రుంచి వేసిన దుఃఖజాలము తొలగిపోవు గదా.

అనుసరించిన యెడల ఆర్యా
ష్టాంగమార్గ ముపాసకాళికి
భూరి నిర్వాణాప్తి: ఇదియే బుద్ధ శాసనము.

మందబుద్ధుల మగుటచేతను
మరచిపోవుదు మా తథాగతు
నమల బోధసుధా స్వరూపాష్టాంగ మార్గంబున్.

ప్రకృతవేషం బింక మార్చెదః
పచ్చబట్టలు తెమ్ము పాలీ,
సత్వరంబుగ బిల్వ నంపుము స్థవిర ముద్గల్యాన్.

శరణు చొచ్చెద బుద్ధదేవుని
శరణు చొచ్చెద బౌద్ధధర్మము
శరణు చొచ్చెద బౌద్ధసంఘము
శాంతి నా కింకన్ !

నమో తస్స భగవతో అరహతో
సమ్మా సంబుద్ధస్స !

# ప్రభు వాక్యము

## ప్రథమ రంగము

( నీలాచల క్షేత్రమున మహామాత్య భవనమున )

రూపాంబిక... కాంచీరాజపుత్రి
పురుషోత్తమదేవుడు... ఉత్కళ దేశరాజు
మహామాత్యుడు... ప్రతీహారి... ప్రజలు.

### ప్ర తీ హా రి

జయము జయము మహామాత్య సత్తములకు! పాదదాసి
వినతి పూర్వకమ్ముగా నొనర్ప విజ్ఞాపన మరుగుదెంచె.

### మ హా మా త్యు డు

ఇపుడు వచ్చితి వేమి ? ఈతొట్రుపా టేమి ?
ఆకస్మికమ్ముగా అహిత ముదయించెనా ?

### ప్ర తీ హా రి

అనుకంప వహించి హఠా దాగమనము క్షమియింపుడు !
కాంచీ రాజకుమారిక గాఢశోక తప్తురాలు
దర్శనార్థ మరుగుదెంచి ద్వారముకడ నిలుచున్నది.
అనతి యగునేని లోని కామెను దోడ్కొని వత్తును.

### మ హా మా త్యు డు

ఈ మాట తొలుతనే ఏల చెప్పవు నీవు ?
కాంచీ కుమారి, రాగదవమ్మ లోపలికి.

( ఆమె లోనికి వచ్చి నమస్కరించి నిలుచును)

## ప్ర తీ హా రి

చేయక తప్పద పెండిలి శ్రీమ ద్రాజకుమారికి
ఈ నాడే ? కొంతకాల మెట్టులైన గడచుసెడల
ప్రభునకు కనికరము కలిగి పట్టుదలను విడుచు నేమెు.

## మ హా మా త్యు డు

ఉత్కలేశ్వరుడు తా నొసగి యానతి తొలుత
అన్యథా చేసెనా అవల నెన్నడు గాని ?
కనికర ముదయింప కారణం బీనాడు
కలిగెనా ఆకస్మికముగా నేడేని ?

## ప్ర తీ హా రి

కాలము గడచిన కొలదిని కరగ వచ్చు ప్రభుని మనసు.
దర్శన మొసగిన పిమ్మట దయాసైతము కలుగవచ్చు.
దయకును దండనమునకును ధరణీధవులు సమర్థులు.

## మ హా మా త్యు డు

పురుషోత్తమదేవ మహాభూమీపతి యద్వితీయ
చండశాసనుం, డానతి జనులకు సుగ్రీవాజ్ఞయె.
కాంచీనాయకులు తిరస్కారము చూపించినార
లస్మత్ప్రభువుకు, కావున ఆగ్రహించినాడు రేడు.

## రూ పాం బి క

ఒక మాట మాత్రాన నుత్కలేశ్వరు డింత
కాఠిన్య మూన దగునా

ఎంతైన
కార్య మిట్టిది కంటిమా !
మాట అన్నందుకే మారాజ్యము జయించి
సాధించి వచ్చె గాదా
ఇకనైన
శపథమ్ము విడువ రాదా !
మాతండ్రి తన నేమొ మాట అన్నా డనుచు
నను బట్టుకొని తెచ్చెనా !
ఇది మీరు
న్యాయ మనుకొన వచ్చునా !

## మహామాత్యుడు

ప్రభువు కఠినుడు కాడు, పరమ కారుణికుండు,
సరసుండు, శరణన్న శత్రువున్ క్షమియించు
చండశాసను డయ్యు శత్రుభీకరు డయ్యు.
మనుజనాయకు లెల్ల మాటపట్టింపుచే
ఎంత లెంతలో చేతు: రిది క్షత్రియులరీతి.

ఉత్తమ క్షత్రియుం డుత్కళేశ్వరుడు నీ
మీది ప్రేముడిచేత మీతండ్రి నర్థింప
తోడనే యతడు సంతోషపూర్వకముగా
నిను సమర్పించి పాణిగ్రహణోత్సవం
బొనరింప వలె ననుట యుక్త మౌనా కాద ?

నీ తండ్రి అటు చేయనేర కుత్కళనేత
క్షత్రియుండే యయ్యు సమ్మార్జకుం డనియు

తన కులము స్వచ్ఛ మని తనయ నీయ నటంచు
అవహేళనము చేయు టనుచితం బన వేమి?

### రూపాంబిక

సన్మార్గకుం డనుట చాలదోషమె కాన
అన్నదానికి ఫలిత మనుభవించెను కాద
మా తండ్రి!
జనకు మాటకు తనూజాత నిటు శిక్షింప
మీవంటి సజ్జనుల్ మెచ్చుకో దగినదా
సెల విండు!

### మహామాత్యుడు

పితరుల మాటకు బిడ్డలు బాధలు
పడుదురు తల్లీ, ప్రపంచకములో!
అందులకే మాయావనీ ధవు డనె
సన్మార్గకునకు జాయ వగుదు వని.
ఇది న్యాయం బని యెవ్వ రనరు, మరి
జనపతి మాత్రము చండశాసనుడు!

### రూపాంబిక

తనయెడ భక్తియు తాత్పర్యము గల
అబలమీదనా ఆగ్రహ మూనుట!
నిజముగ నాపై నెనరే యాదిని
ఉత్కళేశ్వరున కున్న పక్షమున
కైవస మగు కాంచీపురిలో
పెండ్లి యాడడా పేరిమితో నను?

### మహామాత్యుడు

ఉండెను తల్లీ, ఉత్కలేశునకు
నీపై ప్రేముడి నిండుగ నాడిని.
సౌందర్యంబును సద్గుణ వర్ణన
మాలకించి రేడనురక్తుం డయి
నిన్ను గూర్చియే నిరతము నాతో
సంభాషించెను చాల దినమ్ములు.

### రూపాంబిక

అంత ప్రేమ మంతలోనె అంతరించి పోయె నెట్లు!
అనురాగము కన్న నృపతి కభిమానము ముఖ్య మాయె!

### ప్రతీహారి

ప్రభుపాదంబులపై బడి ప్రార్థించిన లాభ మేమొ,
మనసు కరగదా రేనికి మానిని దైన్యమునకు!

### రూపాంబిక

కనికరమున నృపతి నన్ను కన్నియగా విడుమనేని
ఏకామ్రేశ్వరు గొలుచుచు ఈ జన్మము గడపుదాన!

### మహామాత్యుడు

త్వరలో అన్నాడు, కాని తప్పదు రాజాజ్ఞ తల్లి!
నీ వెరుగవు రేడెంతటి నిశ్చలుండొ మాటపట్ల!

### రూపాంబిక

కన్యగా జన్మము గడప వీలే లేద!
సన్మార్గజున కేను జాయ కావలయునా!

అక్కటకటా ! ఎంత అన్యాయ మన్యాయ,
మాతృహత్యకు గూడ అయుధము లేదాయె!
కంచి కామాక్షమ్మ కరుణించదా నన్ను !
ఏకామ్రనాథునకు ఏమి దయ కలుగదా !
కైలాస నాథునకు కారుణ్యమే లేద !
కాంచీకుమారి కీగతి పట్ట వలసినద !

## మ హా మా త్యు డు

ఏడ్వ కమ్మా ! ఇప్పు డేమి చేయుదు నేను ?
దుఃఖ మెరుగుదు : నాకు దుహితలున్నా రమ్మ.
ప్రభు వుంచినాడు నీ పరిణయము కావించు
ప్రబలబాధ్యతను నాపైన రాజకుమారి !

## రూ పాం బి క

ఈయాపద నుండి నన్ను ఎట్టులైన రక్షింపుడు !
తండ్రీ, ఈదీనురాలి తనయనుగా భావింపుడు !

ప్రణమిల్లితి తావకీన పాదాంభోరుహములపై!
అభయ మిచ్చువరకు తండ్రీ, అడుగులు విడువంజాలను !

బ్రాహ్మణ శేఖరు, లఖిల ప్రజలు మీకరగతములు :
కనికర ముదయించిన నను కాపాడుట సుకరం బగు.

ఆలోచించినచో నా యాపద తప్పించుటకై
మహామాత్యు లైన మీకు మార్గము దొరకక పోవునె !

దుర్గతి అదృష్టవశమున తొలగిపోవు నేని నేడు
అమరణము మీకృతజ్ఞురాలనుగా నుందు తండ్రీ !

రక్షింపుడు, రక్షింపుడు, రాజకుమారిక ఆయొా్య
సమ్రాజకునకు నేగతి జాయగ జీవింపగలదు !

మ హా మా త్యు డు

ఏడువ కమ్మా, ఏడువకు !
పెద్దభారమే పెట్టితి వమ్మా !
కానీ మాతము కాగల దేదో.

ఉర్వీపతి పురుషోత్తమ దేవుడు
కఠినమానసుడు కాడు కుమారీ !
ఆది ధైర్యంబున కాధారం బగు.

దుస్సాధమే మైన తోచుచున్నది యొకటి :
నీకు ద్వేషము లేదు నృపునియెడ నని యొంతు.
శీఘ్రకాలములోనె శ్రీమ జ్జగన్నాథు
కారుణ్యమున నీకు కల్యాణ మగు గాక !

## ద్వితీయ రంగము

శ్రీ పురుషోత్తమ దేవ మహారాజు, జగన్నాథ మందిర ప్రాంగణమును సమ్మార్జనితో ఊడ్చుచుండును.

మ హా మా త్యు డు

మహాప్రభూ, జయము, జయము !

పురుషోత్తమ దేవుడు

మహామాత్యా, వందనమ్ము !

మహామాత్యుడు

స్వామిసేవయందు ప్రభువు
చాల మగ్నులయినవారు.

పురుషోత్తమ దేవుడు

ఎల్లవారు సేవకులే ఈమహా ప్రభునిమ్రోల !
గౌడకో కళింగమునకో కాంచికో ఉత్కళమునకో
స్వల్పభాగములకు ప్రభులు చాలమంది కలరు, కాని
సకలలోకములకు ప్రభువు జగన్నాథదేవు డొకడె !

మహామాత్యుడు

తమకు గల్గుభావ మితర ధరణిపతుల కుండునేని
ఈ లోకము స్వర్గముగా ఎన్నండో మారియుండు !

పురుషోత్తమ దేవుడు

స్వామిసేవలోన ఎంత సౌఖ్య మున్న ! దీధరణీ
పాలనమ్మువలన నాకు ప్రతిదినమ్ము జగన్నాథ
దేవ కైంకర్యమునకు తెరపి లేదు మహామాత్య !

మహామాత్యుడు

నడచు ధర్మదేవత తన నాలుగు పాదాలతోడ
ఈ యుత్కలరాష్ట్రమందు ఏలికగా నుండ తమరు !

పురుషోత్తమ దేవుడు

పరశురామాది మహాబ్రాహ్మణవీరులు పూర్వము
పృథివి యెల్ల గెలిచి, మట్టిపెళ్ళవోలె, నిర్మములై
దాన మిచ్చి, ముదముతోడ తపమునకై వెడలినారు !

ఈ కలికాల ప్రభావ మేమి చెప్ప ! ఇంచుకంత
మహి నేలెడిరాజు లెంతో మదించి వర్తింతు రవుర !

మహామాత్యుడు

కావుననే రాజర్షులు కావలె ధరణీకాంతులు.

పురుషోత్తమ దేవుడు

ఏడాదికి నొక్క దినం బీ నీలాచలతీర్థ
ప్రభు జగన్నాథాలయ ప్రాంగణ పవిత్ర భూమిని
గొప్ప లుజ్జగించి అన్నికులములవా రఖిలమ్మును
జగన్నాథ మన్న మహా సరససూక్తి కనుగుణముగ
ప్రసాదంబు స్వీకరించి పవిత్రు లగుచున్నవారు !
ఎంత పూత వాసరంబు ! ఎంత శుభద వాసరంబు !

మహామాత్యుడు

శ్రీమజ్జగన్నాథ సేవానురక్తులౌ
దేవరవారికీ దివ్యప్రదేశాన
గొప్ప కానుక నొసగ గొని వచ్చియున్నాను.
భూసురాశీర్వాద పూర్వకమ్ముగ దేవ,
శ్రీసన్నిధానాన స్వీకరింతురు గాక !

పురుషోత్తమ దేవుడు

మా వృద్ధి గాంక్షించు మంత్రి వర్యులు, మీరు
బ్రాహ్మణోత్తములు, మీ పలుకు లాదరముతో
శిరసా వహించి నే స్వీకరించితి కాన్క !

మ హా మా త్యు డు

(సంజ్ఞచే సమీపించి వినత యగు రాజకుమారిని చూపి)

తమయెడ భక్తితాత్పర్యముల్ కలిగి
రాణికి నుచిత మా రమణీయ సకల
శుభలక్షణాలతో శోభిల్లు కన్య
నాదరింపుం డుత్కలావనీ రమణ!

పురుషోత్తమ దేవుడు

కనకంపుబొమ్మయే కానుక యనుచు
భావింప నైతిని ప్రమదంబు: కాని
ఇంచుక వివరింపు డెవ్వ రీకన్య.

మ హా మా త్యు డు

కాంచీకుమారి యీకన్యాలలామ,
మత్కలేశ్వర సేవ నోద్రిక్తహృదయ.

పురుషోత్తమ దేవుడు

వెనుకటి మా యాజ్ఞప్తికి విపరీతముగా మీరలు
చేయదలచినారు: మిగుల చిత్రముగా నున్న దార్య!
ఈమెను సమ్మార్జకునకు ఇచ్చి వివాహము చేయగ
వెనుక నాజ్ఞ యిచ్చినాము: విస్మరించినారో దాని!

మ హా మా త్యు డు

మహాప్రభూ, తమయానతి మరవగ నెవ్వారి తరము!
ప్రభువాక్య మక్షరశః పాలింపగ వచ్చినాను.
అధిపశ్రేష్ఠులు తప్పరు ఆడిన వాక్యం బెన్నడు.

పురుషోత్తమ దేవుడు

అధిపతి యిచ్చిన యానతి నన్యథా చేయరాదు.

మ హా మా త్యు డు

చిత్తము! కావున దేవర స్వీకరించి తీరవలయు
కాంచీ రాజకుమారిని కాపాడుకొన ప్రతిజ్ఞ.
స్వర్ణదండ మండిత మా సమ్మార్జనితో దేవర
స్వామి యూడిగంబుసేయు సమయము కాదా యియ్యది!

పురుషోత్తమ దేవుడు

(తెరిపార జూచి మందహాసముతో చేతులు శోధించి)

మహనీయము భూదేవామాత్యబుద్ధి కౌశలంబు!

మ హా మా త్యు డు

మహాప్రభువు సరసహృదియె మహనీయము మహనీయము!

పురుషోత్తమ దేవుడు

కాంచీ రాజకుమారిని గౌరవమ్ముతో సువర్ణ
పల్యంకిక గొనిపోవుడు ప్రాసాదమునకు వేగమె.

(హ ర్ష ధ్వ ను లు)

మ హా మా త్యు డు

శ్రీ పురుషోత్తమ దేవ
క్షితిపాలాగ్రణికి జయము!
జగన్నాథ మహాస్వామికి
జయము జయము జయము జయము!

# భామతి

## భామతి

కవిపరేణ్యులు మీ యశోగానములను
నవ్యపదబంధముల జేయునాడు గాని
అఖిలశాస్త్ర విశారదు లైనవారె
వేడి మీకడ జదివెడునాడు గాని,

మాన్యభావములో, బహుమతులతోడ
నరపతులు మిమ్ము దర్శించునాడు గాని
కలుగనే లేదు సంతోషగరిమ మాకు:
ఇప్పు డింత హర్షోత్కర్ష మేల నాథ?

## వాచస్పతి మిశ్రుడు

అర్ధఘటిక క్రింద నవనీతం బైనది
బ్రహ్మసూత్రములకు భాష్యవివృతి.
పరమపురుషు కృపను ప్రారిప్సితగ్రంథ
మంతరాయరహితమై చెలంగె.

ప్రణతి సూత్రకార బాదరాయణమౌని
చంద్రు దివ్యపాదజలజములకు;
చేతు వందనంబు శ్రీశంకరాచార్య
వర్యు దివ్యపాద వనజములకు;

అధిక భక్తితోడ వ్యాఖ్యానకర్త లౌ
యతులచరణములకు నతు లొనర్తు;

బ్రహ్మవాదులైన పండితోత్తములను
సమ్మదంబుతోడ సంస్తుతింతు.
బ్రహ్మవిద్యకన్న పరవిద్య యున్నదే
సకల దుఃఖతరణ సాధనంబు!
నేను వివృతి మిగుల నిష్పక్షబుద్ధితో
జేసినాను పరమశివునికృపను.

### భా మ తి

మీరు దర్శనవ్యాఖ్యలమీద మున్ను
విశదముగ వ్రాసినట్టి యా వివృతు లెల్ల
సంస్తుతింపరె తత్తదాచార్యవరులు
తమతమ మతానుసారముల్ తథ్య మనుచు.

### వా చ స్ప తి

విమలశాస్త్రదృష్టి విద్వజ్జనంబుల
వెలయజేయు బుద్ధి వివృతు లేను
ముప్పదేండ్లనాడు మొదలిడి యీనాటి
వరకు నేకనియతి వ్రాసినాడ.

అఖిలదర్శనంబు లవలోడనము చేయ
శాస్త్రహృదయలబ్ధి సంఘటిల్లె.
గ్రంథరచన చేయుకాంక్ష యీనాటితో
సఫల మయ్యె; కృతులు చాలు నింక.

విహితకృత్యములను విధివిధానమ్ముగా
సలుపుచున్నవాడ శ్రద్ధబూని.
శాంతితోడ నింక సకలమ్ము త్యజియించి
ప్రవ్రజింతు నేని పరమశుభము.

## భామతి

సకల మవగత వశామహాశయులు మీరు,
అజ్ఞురాలను నేను: సాహసము బూని
ధర్మ్యభాషణమున కిట్లు ప్రతివచనము
నిచ్చుచున్నందులకు క్షమియింప దగును.

విధివిధానమ్ముగా మీరు విహితకర్మ
లాచరించుచు నున్నట్టు లనుటచేత,
ఉండు గార్హస్థ్యవిధులలో నొక్క కొరత
చేసినా రని దృఢముగా చెప్పగలను.

గురుకుల పరిశ్రమమ్మున కొన్నియేండ్లు,
ప్రవచనమ్మున కొన్నియబ్దములు, గ్రంథ
రచనతోడను కొన్నివర్షములు గడచె:
కడలె మీ కాల మంతయు విద్యలోన.

శాస్త్రములయందు వ్యసనమ్ము సముచితమ్మె
కొంతవర; కైన నింతటిఘోర మెరుగ!
ప్రబలవిద్యాపిశాచి ప్రప్రథమమందె
అతితరమ్ముగ మిమ్ముల నాక్రమించె!
ఏమి భుజియించుచుందురో ఎరుకలేదు,
ఏమి ధరియించుచుందురో ఎరుక లేదు,
ఈ తపస్వినిగతి యేమొ ఎరుక లేదు,
ఏమి విద్యాప్రభావమో ఇది మహాత్మ!
కాల మంతయు విద్యల గడపినారు,
కలుగనే లేదు సంతానకాంక్ష మీకు.

భార్య యనుమతి లేకుండ ప్రవ్రజింప
దలచు టెట్టిది యనపత్య ధర్మవేత్త !

వాచస్పతి

బాష్పమోచనంబు బలహీనతాచిహ్న,
మింత జేల వనుచు నెంచనైతి.
ఈషణమ్ము విడువు మికనైన: సంతాన
ముదయ మొందకున్న కొదవ లేదు.

భామతి

చాలు లెండు, మీకు సంతాన వాంఛయే
లేదు మానసమున లేశమైన !
ఆడుదాని కుండ దంత వైరాగ్యంబు :
వంధ్య నన్నమాట వాస్తవంబు.

వాచస్పతి

పుత్రసంతాన కామంబు పొడమ లేదు
పూర్వ మెన్నండు; గతమును పోవనిమ్ము.
ఇప్పుడైన ప్రయోజన మేమి యుండు ?
ఉభయులకుగూడ యౌవన ముడిగిపోయె.

నీవు సహధర్మచారిణీ, నిశ్చయముగ
ఉత్తమ పతివ్రతవు : లెక్క కొక్కనాడు
గాని యించుక లోపమ్ము కలుగకుండ
శ్రద్ధతో నాకు శుశ్రూష సలిపినావు.
ధీరురాలవు, తక్కన స్త్రీల కట్లు
వస్తుసంతతిపై నీకు వాంఛ లేదు.

తగునె యింతటివెర్రి సంతతి యనంగ ?
కొడుకు లున్నంత మాత్రాన గొప్ప యేమి ?

భామతి

గొప్ప కాక యేమి! కొడుకులు జనియించి
మిగుల యోగ్యు లగుచు మెలగునపుడు
ఇంత దొడ్డసుతుల నే తల్లి కన్నదో
యనుచు లోకు లామె నభినుతింత్రు.

వాచస్పతి

యశమె భవదీయవాంఛిత మైనయెడల,
నిలుచు విశ్వజనీనమై నీప్రతిష్ఠ.
ఈదినమ్మున నే ముగియించు నట్టి
వివృతి నీపేర లోకాన వెలయ జేతు.

భామతి

నాకు కీర్తి వలదు ! నలువురి నోళ్లలో
బడగనీక నన్ను బ్రదుకనిండు !
ఒరులనోట బడక యుష్మత్పదాంబుజ
సేవ జేయుచున్న శ్రేయ మొదవు.

వాచస్పతి

నాకృతికి పూజ్య మైననీ నామధేయ
ముంచినాడను : లోకమం దొప్పు గాక
భామతి వ్యాఖ్య మత్రుని భాష్యపేర
సకల వేదాంతవాదులు సన్నుతింప!

# లోపాముద్ర

౧

ఏమి విపరీత మిది ! ఎంతతడ వైనన్
మోసము పయి కెత్తె లోకమార్గమును నాథా !
ఈ మెయిని వసానము వహించి వెనుచింత
న్మా మనమునం దిటులు నాట దగునొక్కొ !

౨

స్వామి, దయ రాదు ! తెమ సన్నిధని నే నీ
యామమును బుచ్చితి మహోత్సుకతతోడన్.
కామము వహించు నిజకాంత నెడసేయు
న్నేమ మగునేని కదా నిష్ఠురము నాథా !

౩

చేయుదును మీ చరణసేవ యొకనాడున్
బాయక భవత్స్వవిధభాగము మదీయ
ప్రాయమును బుచ్చితిని : భార్య ననురక్తన్
న్యాయ మగునే యిటులు నాథ, నిరసింపన్ !

౪

నామమున భార్య నయినాను, గణియింపన్
కామితము దీర బహుకాలము గతించెన్ !
ఏ మనగ వచ్చు కనునేని నిజకాంతా
క్షేమ సుఖముల్ తలపు సేయని మహాత్మున్ !

౫

భంగ మగు నిష్ఠ నిజపత్ని మృదుదేహా
లింగనము సేయునెడ! లేశ మయినన్ స్త్రీ
యాంగనల నిండుహృదయంబులను భేదిం
పంగ ఘటియిల్ల దట పాపము మహాత్మా!

౬

నేడు విడువం దగదె నిష్ఠురత నాపై,
ఆడు దని చిన్న దని యైన కృపతోడన్!
వ్రీడ విడనాడి కడు వెఱ్ఱి యయి యెంతో
వేడు కొనుకాంత గను విచ్చి కనరాదో!

౭

జవ్వనము పూర్ణముగ జారుటకు మున్నే
యివ్విధిని మీరు త్యజియించి యిహసౌఖ్య,
లెవ్వియొ తపస్సు లని యెల్లపుడు నన్నున్
దవ్వులనె నిల్పితిరి: ధర్మమె మహాత్మా!

౮

మీర లొనరించునవి మేము గ్రహియింప
న్నేరతుమె! మీ ఋషులు నిశ్చలమనస్కుల్.
క్రూర మగు గాక తమ కోరికయె యెట్లో
తీరిచికొనంగలుగు ధీరులు మునీంద్రా!

౯

ఏలనొ భవాదృశుల కీజగముపై ను
ద్వేలము విరక్తి యని విశ్రుతము, మాకో

చాలదు గ్రహించుటకు శక్తి లవమైనన్
వేలుపు జగమ్ముపయి వెర్రి మునిచంద్రా !

౧౦

ఒక్క విపరీత గుణ మున్నయది మీలో
నక్కజము గొల్ప! నిఖిలార్యులకు పుత్రుల్
పెక్కు రుదయించునెడ ప్రీతి యధికం, బా
దిక్కునను లేదు తమ దృష్టి మునిమాలీ !

౧౧

సంతసము, విప్పితిరి చక్షువులు నాథా !
స్వాంత మెటులో కరగుచాయ పాడకట్టెన్.
వింతగను నిల్పితిరి వీక్షణము పాదా
క్రాంత సతిపైన బహుకాలమున, కాహా !

౧౨

మోదతే నిజవిభో ర్వదనాబ్జం
వీక్ష్య మందహాసితం కులకాన్తా
ప్రాణనాథ పరిరంభణహర్షా
జ్జాయమాన పులకాంచిత దేహా !

సమాప్తము

# కా వ్యా వ ళి

## ద్వితీయ కదంబము

అంకితము

శ్రీ నూతక్కి రామశేషయ్యకు

## తరుణాప్తుడు

ఏలనో కాని నిన్ను వీక్షించినంత
ప్రాణములు లేచి వచ్చిన పగిది నుండు.

దీర్ఘ బుజా వగు భవదీయ దేహయష్టి
గను నిమేషమునందె నాతనువు పొంగు.

అలక సంఛాదిత త్వదీయాననంబు
గాంచినంతనె వదనవికాస మొదవు.

భావభరిత భవన్నేత్ర పంకజములు
దృష్టిసరణిని జేర నా దృక్కు లలరు.

కామినీరమ్య భవదీయ కంఠగళిత
భాష లాలింప కర్ణతాపమ్ము పోవు.

నీవు నాయెడ మెలగు నిర్నిద్ర విమల
రాగదీప్తికి గాఢహర్షము చెలంగు.

ఏల యీ ప్రీతి ? తెలియ దోయీ కుమార,
ప్రాక్తన భవమ్మునందలి బాంధవమ్మొ !

## సందర్శనము

నినుం గనిన యంతనే నిఖిలలోక గంభీరతా
మనోజ్ఞ మహితాంభరయే మదికి దోచు సీమంతినీ !
జనించు వెనువెంటనే చకితలోచనాంతోల్లస
ద్వినమ్రత ఘనమ్ముగా విమలభావ సంశ్లిష్టమై.

చిరమ్ముగ మెలంగు నాస్మృతి పథమ్మునన్ సమ్మద
ప్రరోహమధురమ్ముగా భవదమోఘ భూరిప్రభా
పరివృత శరీరమున్, పరమపాండు కౌశేయమున్
కరేణు వరయానమున్ కటక కంకణారావమున్.

ప్రభాత సరసీరుహ ప్రతిభట ప్రభాబంధుర
స్వభావ రమణీయ మౌ వదనబింబ మింప్రొద్దునన్
శుభాంగి, ఉదయింపగా సుదృఢమౌ మకాంతర్వ్యథా
విభావరి రయమ్మునన్ వడలె నేత్రమార్గమ్మునన్!

## భావ నాయిక

భావ నాయిక, నీవు సంబద్ధ వైతి
పతి మనోహర నామధేయమ్ముతోడ.
రూప మారోపితము నేత్రరోచకంబు;
తెలిసినది పచ్చి బంగారు తీగ వనుచు.

కాని యొక్కొకసారి యకాండముగనె
భాసిలెద వేల యతను సంపదలతోడ?
ప్రస్ఫుటం బైన రూప ప్రభావ మేల
భావనాయిక, శాంతిమై బరపరాదు?

బాల పోలిక నొకమారు, ప్రౌఢపోలె
నిం కొకప్పుడు తోచెద వేల తల్లి!
భవదపూర్వ విలాసతాండవములందు
తెలియకున్నది నీ నిజస్థితి లతాంగి!

ఎంతు నొకసారి నిను ముక్తికాంత యట్లు,
తోడనే యన్యరూపంబు తోచు నాకు.
నిన్ను కవితా కుమారిగా నెన్నుచుండు
నంతలోనె తిరోధాన వగుదు వీవు.

తెలిసికొనజాలను- రసాధిదేవత వొకో ?
అటులు కాక సాధకుని లక్ష్యమ్ము వొక్కొ ?
ఇది యెదియు గాక, నాయక హృదయ మంది
రాంతరాధిష్ఠిత మనోహరాంగి వొక్కొ ?

భావకుల కైన మిగుల విభ్రాంతి కలుగ,
రసికజనులకు నైన విభ్రమ మెసంగ,
భావనాయిక, స్వస్వరూపమ్ము గోచ
రింప కుండెడుగతి విహరించినావు.

నీవు నిస్సంశయమ్ముగా నిరుపమాన
రసనిధి, వపూర్వ లావణ్య రమ్యమూర్తి;
వస్తదీయ సమీక్షా పథాంతరస్థ
వనుటచే నీ స్వభావమ్ము సుగత మగును.

సాధకుడు సంభ్రమించెడి సరణి దోప
చిత్రభంగుల లాస్యమ్ము చేసినావు !
ఎట్టు లైనను భావ బాలేందు వదన,
ఏలకుండగ నుండ లే వింకమీద !

## ప్రభాతము

స్వర్ణవాహినిలోన స్నపిత మైన విధాన
ధరణీధరాగ్రముల్ తనరారు చున్నయవి.

అమూలచూడముగ అవనీరుహ శ్రేణి
పల్లవించినరీతి భాసిల్లు చున్నయది.

కౌసుంభ రాగాంశుకంబు తాల్చినయట్లు
వెల్గుచున్నది కృష్ణవేణీ మహాదేవి.

దివ్యదేహాలతో తేజరిలుచున్నారు
శాద్వలస్థలులపై సంచరించెడి జనుల్.

ఉత్సాహవివశమై ఉప్పరంబున బోవు
ఖగకులారావముల్ కర్ణోత్సవము సేయు.

మందమందమ్ముగా మలసి అంగములంటి
పవనాంకురావళుల్ పారవశ్యము గొల్పు.

ఇది విజయవాటికా, ఏదుఃఖములు లేక
ఆనందతుందిలం బగు స్వర్గవాటికా !

ఈ ప్రభాతము వేళ ఏవైపు కనుగొన్న
నవ్యసృష్టివిధాన నాకన్నులకు దోచు !

# PETRARCA !

**(FRANCESCO PETRARCA 1304_74 A.D)**

నీపేరు చెవి సోక నిండుహర్షము రేగి
పాటవమరించును మేను పెత్రార్కా !

నీసంభవమ్మునకు నిలయమైన "ఆరెజ్జొ"
ఎంత సుందరమోయి...

లలితాంగి యైన ఆ "లారా" మహామాన్య
ఎంత సుకృతము చేసె...

మన మిర్వురము గూడ మహిళ సత్కర్షమ్ము
ఘటియించినా మోయి...

మన కటాక్ష ప్రభా మండితాంగన లెల్ల
నిర్జరత్వము గనిరి ...

అన్నారు దైవజ్ఞు లాయుః ప్రమాణమ్ము
నాకు నీయంతే యని ...

శిరసు కోశముమీద చేత గ్రంథముతోడ
పోనెంతు నీలాగె ...

కలిసికొందము భావి కాలాన భాషిత
ప్రతిబంధకము లేక పెత్రార్కా !

## పంచ చత్వారింశత్

జీవిత నగాగ్ర భాగమ్ము జేరకోర్కి-
బయలు వెడలగ సోపానపాళి లేని
చిత్రమార్గము వెంట, వంచితుడ నైతి
తొలుత నాకు రహస్యమ్ము తెలియకుంట !

ఎట్టులో కలరూపు గ్రహించువరకు
గడచె పదుమూడు మజిలీలు : నడచుగతులు
మరచిపోతిని కాని నామానసమున
వేదనారూప నీహార మేదొ నిలిచె.

ఈయహార్ముఖ శుభవేళనే మదీయ
శాంత లోచనయుగళికి సరళమార్గ
మద్భుతావహమై తోచె నడుగులోన :
తెలిసినది క్రొత్తమలుపు నే తిరిగినట్లు.

నిమ్నదేశాలపై దృష్టి నిలుప, నిపుడు
సకలము సమానశాద్వల స్థలిగ దోచు ;
ఊర్ధ్వముఖ మైనయంతనే వ్యోమ చషక
మరుణ కమనీయకాంతి ప్రత్యక్ష మగును.

ఏప్రదేశము కనుగొన్న నిపుడు నాకు
తోచుచున్నది మంజుల ద్యుతులతోడ,
వల్గు నాదమ్ములే వినవచ్చుచున్న,
వభినవోత్సాహ మేదొ న న్నావరించె !

# తస్లీమ్

సలాం ఉస్తాద్ శాంతారాం జీ !
ఇలా వస్తా రెక్కడ నుంచి !
మియాఁ తాన్ సేన్ మీ దోస్తేగా ?

సరే కానీ శాంతా రాం జీ,
ఉన్నట్టుండి ఉస్తాద్ సాహబ్-
మన స్నేహం మారిం దటగా ?
వారంనుంచీ వరుసగా వారు
బహు చిత్రంగా పాడుతు ఉన్నార్.

అన్నిటికన్నా అద్భుతం ఐన
విషయం ఒకటి వీక్షించాను.
ఎప్పుడుకూడా ఎడమ చేత్తో
షాహన్ షాహకు సలాం చేసే
తాన్‌సేన్ వారు తస్లీం చేస్తార్ !
దీంట్లో మర్మం తెలుసా మీకు ?
"అవును హాజరత్, కొంత అద్భుతావహమైన
ఘటన మున్నది.

అసలు గ్వాలియర్ నగరాన
పుట్టి హిందువులలో బుందేలు భూపాలు
కొలువులో తానసేన్ కొంతకాలం బుండె.
మరల కొన్నాళ్ళకున్ మానసింగ్ తన్వార్
ధరణి నాయకుని యాస్థానమునకు వచ్చి
గౌరవములు వడసె గ్వాలియర్ నగరాన.

స్వయముగా భూనేత సంగీతవిద్వాంసు,
డాదరించుచునుండు నఖిలగాయకమణుల.
తానసేను మహాద్భుతమ్ముగా నొకనాడు
పాట పాడుచునుండ పరవశుం డయి రేడు
ఒసగె నాదరముతో నొకలక్ష టంకాలు.

కడచిపోయెను కొంత కాల మీరీతి
తాన సేను యశమ్ము దశదిశల్ నిండె
సంగీతలోలు డౌ సార్వభౌమునకు
కర్ణగోచర మయ్యె గాయకు పేరు.
ఎల్ల సద్వస్తువు లేకత్ర చేర్చు
మన పాదుషా వారు మాన్సింగు కడకు
దూతల నంపిరి తోడి తేరంగ
గాయకోత్తంసుని గౌరవమ్మునను.

గత్యంతరము లేక గ్వాలియర్ ప్రభువు
చతురంతయానమ్ము స్వభుజమ్ముమీద
మోపి, సుదూరమ్ము మోసుకు పోయి
సెలవు గైకొనె తానసేను సన్నిధిని.

మొదలుగా ఆనాడు మొన్నటిదాక
అంజలి ఘటియింప డన్యుల కతడు.
అక్బరుపాదుషా యంతటివాని
కైన సలాం వామహస్తముతోనె!

ఇక నీవలి సంఘటనము, ఎవ్వరితో ననబోకుడు :
ఉపవనాన బాదుషాహ ఉస్తాదును నడచుచుండ
అందీ అందక కనబడె ఆమ్రశాఖమీద నొక్క—

పరిణత మైనట్టి ఫలము : పట్టుకొనం బోయినాడు
హస్త మెత్తి తానసేను, అంద లేదు మాతఫలము.
బహువిధాల దానికొరకు ప్రయత్నమ్ము చేసినాడు.

జతన మెల్ల విఫలము కా, షాహాన్ షా చిరునవ్వున
'పండు కోసికొనుడు వీపుపైన ఎక్కి' యనుచు పలికి
ధనువువోలె వంగి నిలువ, తానసేను ప్రీతితోడ

విడుచుచు హర్షాశ్రువులను విభునకు తస్లీం చేసెను.
కౌగిలించుకొనియె ప్రభువు గాయకాగ్రగణ్యు ప్రీతి.
ఇది గూఢము సుమి హాజరత్. ఎవ్వరితో ననగూడదు!"

"ఓహో అదా ఉస్తాద్ సాహబ్ !
మంచిమాటలో మహిమ ఉన్నది.
కవీశుడయినా గవాయి అయినా
శిల్పి అయినా చిత్రంగానే
మంచిమాటతో మారిపోతాడ్ !
నమాజ్ వేళ నాకు అయింది,
ఉంటా, రొఖ్సత్ ఉస్తాద్ సాహబ్ !"

## ఉమర్ ఖయ్యామ్

దైవభక్తి వాదములను ధర్మవిదులతో
చేసి చేసి విసిగిపోతి చిన్నతనములో.

తాళపుచెవి చిక్క లేదు ద్వారసీమకు,
తెలియరాదాయె నేమి కలదో తెరమరుంగున.

స్వర్గవాది కోవిదులకు, సాధుజనులకు
సలాం చేసి, నమ్మకమ్ము సాగద్రోలితిన్.
స్థిరము కాదు జీవిత మని తెలిసిపోయెను:
విరి నశించు శాశ్వతముగ వికసనమ్ములో.
పగలురాత్రి కవాటాల ప్రాతయింటిలో
ఒకరి వెనుక నొకరు రాజు లుండి పోయిరే.
కానరాని దైవతమును మాని తలపులో
పెండ్లి చేసికొంటి మున్ను ప్రీతి దేవతన్.
కాంతతోడ మధువుతోడ కావ్యగోష్ఠితో
చింత మరచి సౌఖ్యమునకు అంతు చూచెదన్.
కడిగి ఆసవమున శవము గప్పి పూవులన్
ప్రాతిపెట్టు డయ్య ద్రాక్ష పందిరినీడలో.

# విస్మృత స్మృతి

౧

## దేవత

విజయ వాటికలోన అవిర్భవించి
పూర్వయుగమున, త్రైలోక్యపూజ్య యైన
కనకదుర్గాంబ నేడు నన్ కనికరించె
అమృత మిచ్చింది మోహనాపాంగవీక్ష!

ఇంద్రకీలాచలం బధిష్ఠించి యున్న
కనక దుర్గాంబ నేడు నన్ కరుణ జూచె
మూడు మారులు మందిరమ్మునకు నేను
స్విన్న నయనాలతో ప్రదక్షిణము సేయ !

కామిసందోహ కల్పవృక్షాయమాన
కనకదుర్గాంబ యీ నాడు కరుణ బూనె
కరములన్ మోడ్చి కల్యాణ కాంక్షి నగుచు
పూర్ణవిశ్వాసమున నేను పూజ సేయ !

౨

నా యి క

తన్మనోహర లోచన ద్వయముమీద
నే విలోచన యుగళమ్ము నిలుపునపుడు
నీరవంబైన కారుణ్య వారిరాశి
మధురమధుర తరంగాయమాన మగును.

తన్మనోహర లోచనద్వయముమీద
నే విలోచనయుగళమ్ము నిలుపునపుడు
కానవచ్చును సప్తలోకాల గూడ
పావనము చేయు శోభనప్రభలు నాకు.

తన్మనోహర లోచన ద్వయముమీద
నే విలోచనయుగళమ్ము నిలుపునపుడు
సకలలోకార్తి వారణక్షమము, శాంత
బోధసత్వావతార ముత్ఫుల్ల మగును.

3

ఆమె ఆరామవాటిక కరుగుదెంచి
సాభిలాషమ్ముగా జూచు సమయమందు
వాడిపోయిన తరువులు పల్లరులును
చివురుటాకులు దొడిగి పుష్పించుచుండు.

ఆమె ఆరామవాటిక కరుగుదెంచి
మృదుపదమ్ములతో భూమి మెట్టునపుడు
వాసయష్టులపై శిఖావళము లెల్ల
ధరణికిన్ డిగ్గి మధురనర్తనను చేయు.

ఆమె ఆరామవాటిక కరుగుదెంచి
పెదవి కదపుచు ఇంచుక పిలుచునేని
శీతకాలమునందైన జీర పడక
పాడుచుండు పుంస్కోకిలల్ పంచమమున.

౪

పదియు నారేండ్ల దుష్కర్మ ఫలముచేత
మధురమైన యొకానొక వ్యథ మదీయ
హృదయమున లీనమై యెడనెడ దవాగ్ని
రీతి దారుణముగ జెలరేగుచుండు.

బహు రహస్యముగా సుధాపాన మెట్లో
చేసి, చక్రాహతి న్నిజశిరము తెగియు
చచ్చి చావని రాహువు చందమునను
మలగుచుండును బాధ మన్మానసమున.

పీల్చి తేజమ్ము దేహమ్ము పిప్పి చేయు
దుఃఖము సమూలముగ నెటో త్రుంగిపోయె
నొక విభావరివేళ ననూహ్యరీతి
నిర్మలం బైన యామె సాన్నిధ్యమందు.

౫

ప్రియా, నాడు కిమ్మీరిత పృథుల రత్నకంబళమున
ప్రభాపుంజ రంజితముగ పండుకొంటి చతుశ్శాల.

ధవళితోపధానమ్ముల స్థగిత మైనశిరములోన
జాలువార దొడగె మధు స్వప్న చిత్రపటశ్రేణి.

మధుర మైనఘట్టములో మహీతలము జేర బుద్ధి
హఠాత్సంభవముగ ప్రియా, అక్షియుగళి తెరపువడియె.

నిండిపోయె నా చూపులు నిర్జరాంగనా విదగ్ధ
విభ్రమమున తావకీన విగ్రహంపు ద్యుతులు ప్రియా!

పంచమస్వరమ్ములోన పలుకరించి నన్ను ప్రియా,
ఆరగింప ఫలరసంబు లరుగుదేరవలె నంటివి.

నీయానతి నందకొనియు నేను మాంద్యవశత ప్రియా,
క్షిప్రముగా లేవ లేక చేతుల నందిచ్చినాను.

నమిత వగుచు సలీలముగ నా దక్షిణపాణి బట్టి
ఊత యొసగినావు నాకు ఉత్థానమునందు ప్రియా!

నీపాణి స్పర్శచేత నిండు మేను రోమాంచిత
మగుచునుండ లేచినాడ హర్షపరవశాత్ముడనై.

నాటిమాట యెట్లు లున్న నా నిముసమ్మునుండి
జీవితమ్ము వరలును నీ చేయూతనె ప్రాణప్రియ!

౬

నవరసమ్ములు నాట్యమాడిన
నాటి యామినివేళ, నేకాం
త ప్రదేశమునందు దరిసితి తల్ప మెట్లెట్లో.

పండుకొంటిని గాని నిద్దుర
పట్ట దద్దమరేయి వరకును
బహు విరుద్ధ ప్రబల భావ భ్రామ్య మాణునకు.

క్లాంతిచే కను మూసినంతనె
కలలు కాంచుచు వివిధ ఘటనల
దేలియాడితి, చివర కట్లో తెలివి వచ్చినది.

కలలు జారగ భార మెడలిన
కంటిరెప్పలు మెల్ల మెల్లన
తెరపువడుచుండంగ సుమదీధితులు చెలరేగెన్.

ఆక్షణమ్మున ఘ్రాణతర్పణ
మర్యొ వివిధ ప్రసవ పరిమళ
మందమందోర్మికలు నాపై మలయుచుండంగా-

అర్ధమీలిత నయన యుగ్మం
బపుడు పూర్ణోన్ముక మగుటను
తోచినది స్త్రీమూర్తి దివ్యద్యుతుల నుపవనిలో!

స్వప్నలోకమునుండి యపుడే
జాగ్రదవనికి నవతరించిన
కారణమ్మున ప్రత్యభిజ్ఞా కలన లేదాయె !
నాకలోక విరాజమానము
నందనోద్యానాంతరమ్మున
పుష్పకన్యక యనెడిభావము పొడమె తొలుదొలుతన్.

నీ శుక శ్యామాంశుక చ్ఛవి
నిఖిలపత్ర లతాంత వితతిని
కలియగా వనదేవతాకృతి కానబడెను ప్రియా!
బాలభాను ప్రభాపటలిని
పసిడి మిసమిసలన్ వెలింగెడి
లలితతావకమూర్తి నిష్కుట లక్ష్మివలె దోచెన్.

చిరునగవు నీయోష్ఠసీమను
చిందులాడుచునుండ, నయ్యెడ
పొడమినావు సుమీ గృహేందిర పొలుపుతోడ ప్రియా!
సుప్రభాత మ్మనెడి మంజుల
శుభ వ్యాహారమ్ము చేరగ
వీనుదోయి, నుపాస్యదేవత విగ్రహమె తోచెన్.

ధవళకాంతులతోడ ముక్తా
స్థగిత తాటంకములు యొప్ప
ల్లలితగండాభోగ దర్పణ లాస్య మొనరింపన్-
తావకాకర్ణాంత నేత్ర
ద్వంద్వ వాహిని శుభ్ర గంగా
నీల యమునా వీచికాద్యుతి నిలయమై యుండన్-

మందహాసోదంచితానన
మండలోపరి తలి నకాల
జ్యోత్స్న లోచన రోచనంబై సొంపులొలుకంగా—

పలుకు వినబడె 'ఏను వరించిన
ప్రథమ యోషిద్రత్న మెవ' రని
ఆంగ్ల వాక్కున: నమోవాక మ్మాసరస్వతికి!

౨

ఆవల నంతర్ధాన మయినావు దేవతా
విగ్రహమ్ము విధాన విరిదోటలో ప్రియా !

ఆకస్మికమ్ముగా నంతరంగమ్ములో
సౌదామినియ వోలె మెరసె నొక భావమ్ము.
ఒడలెల్ల ఝల్లు మనె; ఉష్ణరక్తాపగల్
ప్రవహించె నాడులన్ ప్రబల వేగముతోడ.

క్షణ లవమ్మున నాత్మ జన్మ మెత్తిన యట్లు
స్ఫురియించె, నిజదృష్టి పూర్ణముగా మారె,
కాంచె మెత్తెను తలల్ క్రొంగ్రొత్త కోరికల్.
నాకు నాపై నపుడు నవ్యాభిమానమ్ము
హర్ష పరవశతలో సంకురించెను ప్రియా !

భువన మంతయు మహాద్భుత కాంతులం దోచె
వీక్షణావరణమ్ము వీగిపోవుట జేసి.
చిరకాల మికమీద జీవింపవలె నన్న
కాంక్ష హృదయమ్ములో గాట మయ్యెను ప్రియా !

దేహాభిమానమ్ము స్థిర మయ్యె, దుఃఖముల్
బాధ లాఘులుగూడ పంచత్వముం గాంచె.

జగదంబికా కటాక్షమ్ము భక్తునిమీద
ప్రసరించుచున్నట్లు భావించితిని ప్రియా !
అంతరంగంబులో అభినవాశాజ్యోతి
ప్రజ్వరిల్లినది యాభవ్యక్షణమ్ములో.
నిండియుండుటజేసి నీ వినిర్మలమూర్తి
మానసమ్మున నన్నె మరచిపోతిని సుమీ !
జాలువారెనొ లేదొ సంతోష బాష్పముల్
హస్తయుగ్మము మాత్ర మప్రయత్నమ్ముగా
అంజలిన్ ఘటియించె ననుట నిస్సంశయము.

భవదీయ వాక్పద్మ భరిత మకరందమ్ము
నాస్వాదించెడి నూతనాభిలాషమ్ముతో
చంచరీకమువోలె చరియించె మానసము.
రమణీయ గూఢార్థ రస సంభృతం బైన
మక్తకమ్ము విధాన మోదమ్ము వాసించె
తరచి చూచుకొలంది తావకోక్తిని ప్రియా !

రససిద్ధిచే నజరామరం బయ్యె నా
కాంక్షా శరీరమ్ము కారుణ్య దేవతా !

మరల ప్రశ్నింతువా మంద స్మితమ్ముతో ?
నను వరించినకన్య నారీవతంసంబు !
ప్రథమురా లేతత్ప్రపంచ యాపతములో !
విదిత మా నాకన్న విశదమ్ముగా నీకె
ఆస్వరూప స్వభావాకార రేఖలున్.

౮

నీవు ప్రియా, మధ్యాహ్నము నిషద్యపై వ్రాలియుండి
కానిపించినావు వ్యథాక్రాంత వైనచందంబున.

అనునయమ్ముతోడ నిన్ను నడిగినాడ నలముకొన్న
విచారమ్మురూపు ప్రియా, వివరింపంగలవె యనుచు.

చెప్ప లేదు ప్రియా, బదులు చెమ్మగిల్లు కన్నులతో
చెన్ను దరుగు మోముతోడ చేతుల నందిచ్చినావు.

అప్రయత్నముగను కనుల కద్దుకొంటి ప్రీతితోడ
ముద్దులాడి ప్రియా, భవన్ముగ్ధ హస్తసరోజములు.

శుభలక్షణ లక్షితమ్ము సుందర పాణిద్వయమ్ము
నిముసములో ప్రియ, మదీయ నేత్రతాప మపనయించె.

ఏదో శిరోవేదన యని యెట్లెట్లో పలికి ప్రియా,
అభిముఖి వయినావు, నేను హస్తముల మస్తకమ్ము-

పట్టుకొనుమ వాంఛించితి బాధావారణము ప్రియా!
అమృతకలశ మాత్రుటిలో హస్తగతం బయ్యె ప్రియా!

సువరింపగ జొచ్చినాడ చంచరీక గరున్నీల
చికురజాల మవల ప్రియా, స్నిగ్ధహస్త యుగముతోడ.

నిమిరినాడ కొంతతడవు నీకపోలయుగళి ప్రియా,
అస్మదీయపాణితలము లంగుళులును జలదరింప.

కర్ణపూర మాక్తికాచ్ఛ కాంతులు వ్యాపించుచుండ
అరుణనఖము లెల్ల నప్పు లతిధాతము లయ్యె ప్రియా!

నీ ఫాలస్థలిని జెలగ నీలతిలక మమృతసింధు
మధ్యభాగమందు వెలుగు మణిద్వీపమట్లు ప్రియా !

మారుతాంటి నవల భవన్మూర్ధ ముదితరాగమ్మున
ఘ్రాణతర్పణమ్ము చేయ కమ్మనివాసనలు ప్రియా !

వరలెను సీమంతసరణి వారివాహ నివహమధ్య
తలమునందు మెరసిపోవు తటిల్లేఖవోలె ప్రియా !

౯

అర్ధవలయితాకృతిలో ఆపాన్పున నున్న నీవు
శంభుజటాజూటముపై శశిరేఖగ దోచినావు.

నీ ప్రసన్న నిటలముపై నీలతిలకబిందు వొప్పె
నీరసరోరుహముమీద మిళిందమ్ము వోలె ప్రియా !

వ్యజనవాయు కంపితమై అలక లలముకొనెడి ముఖము
చిరుమబ్బులు గ్రమ్ముచున్న శీతాంశువు వోలె దోచె.

నిదురలోన నొత్తిగిలిన నీ దేహము గోచరించె
భాస్కరుండు తొలగి చన్న పశ్చిమార్ధగోళ మట్లు.

తదుపరి తోచితివి మరల తల్పముపై వెల్లకిలగ
శయనించిన నీవు శేషశాయి మూర్తివోలె ప్రియా !

అవల నిర్నిమేషముగా నాలోకన చేయు నాకు
వటదళ శయనాంతరితునివలె దోచితి వొక్క త్రుటిని.

స్నిగ్ధంబౌ నీ కపోల సీమమీద నలతి ముద్దు
పెట్టి నిన్ను మధురముగా ప్రియా, లేప దలచినాను.

సంకోచమువలన నవల సరోజమ్ముబోలు పాణి
ముద్దు పెట్టుకొనగ ప్రియా, ముందు కడుగు వేసినాను.
కాని నీదు పదపద్మము కదలుట గనుగొన్నపిదప
శిరముతోడ దాకి లేప చింతించితి కొంత ప్రియా !
వాలి యొక్కమారు తనూ వల్లిమీద, మృదుచుంబన
పరీరంభణములు చేయు భావం బొదవినది ప్రియా !
అంతరంగమందు మాత్రమటు లొనర్చి, మంథరముగ
వెనుకడుగులు వేసికొనుచు వెడలిపోయినాను ప్రియా !
ఈ క్షణములు మాసియున్న, ఎట్టు లున్న, నెచట నున్న,
నీ శయానమూర్తి మనో నేత్రవర్తి సుమీ ప్రియా !

## వందనము

(త్యాగరాజ శతవార్షిక వర్ధంతి)

మందమందమ్ముగా మలయ మారుతమట్లు
అరుగుదెంచుచు దక్షిణాశాపథమునుండి
మంజునాదము చేయు మాకు కర్ణోత్సవము.
ఏనాడు ప్రాదుర్భవించె నీ మాధుర్య,
మేనాద కలశాబ్ధి నీ సుధానిష్పత్తి !
రాగిల్లి రాగిల్లి రామనామామృతా
స్వాద ప్రభావాన స్వరవీచికల్ త్యాగ
రాజ ధాత్రాననాంభోజాన వెలువడియె.

ఆక్రాంత కర్ణజ్వ రాంధ్ర కర్ణాటక
ద్రవిడ కేరళములున్ త్యాగరాజ బ్రహ్మ,
నీగాన పీయూష నిష్యందమున దనిసె.

కరగిపోయె కఠోర కంఠరావము లెల్ల
నీగాన వర్షాన నిఖిలరాష్ట్రము లందు.

రామనామమ్ములో రంజిల్లు మధురిమను
గ్రహియించితిమి భవద్గాన వైవిధ్యాన.

ఆంధ్రవాగీశ్వరీ వ్యాహారమున భవ
ద్రచనా ప్రపంచంబు రుచి చూపినది మాకు.

ఆంధ్రజాతికి మహాయశము సమకూరినది
నీ ప్రభావమ్ముచే నిఖిలలోకమునందు.

గాయకోత్తముడవే కాక ఆచార్యుండ
వఖిల దక్షిణ భారతావనీరంగమున.

గాన కవితా భక్తి కమనీయ మేళనము
నిను త్రివేణీప్రాయునిం జేసె సుకృతమ్ము.

భవబంధమును గాఢభక్తి వైరాగ్యాల
ద్యజియించుటంజేసి త్యాగరాజువు నీవు.

ఉత్తమ శ్లోకుండ, వొకనిమేషమె నిన్ను
స్మరియించు మాత్రాన జలదరించును మేను.

వాగ్గేయకారకా, వందనము వందనము !

# హస్త క్షేపము

"తమ కోమలహస్తము దీయదగున్
క్షమతోడ మదంసమునుండి వెసన్ !
భ్రమరంబును మాత్రము సైచు నెటో
కమలంబు, విహంగము నోర్చు నెటుల్ !"

"కోమల యెంచును కోపములోనే,
భామిని, అంటివి—బాగు సరేలే !
ఏ మని యెంచితి వియ్యది హస్తం
బా మదేభ కరమా కుసుమాంగీ !

స్వీయభుజంబున జే యిడ నొక్కం
డేయది సిద్ధమహీశుడు చేసెన్
ప్రేయసి, ఓపిక పెట్టి వినంగా
న్యాయము – సమ్మతమా లలితాంగీ !

సిద్ధనృపాలక శ్రీజయసింహుం
డిద్ధర ఘూర్జరు లెల్లను గొల్వన్
వృద్ధిని గాంచుచు వీరత విద్యా
బుద్ధుల వృద్ధయి పొల్పెసలారెన్.

వేడుకతో పృథివీపతి పోయెన్
చూడ విభావరి సుందరవేళన్
ఆడెడు నాటక మాలయమందున్
ప్రోడనటావళి పూర్ణసమాఖ్యన్.

అతని పార్శ్వములందును వెన్కన్
స్త్రీతమనస్కులు పెద్దలు కొల్వన్

నూతననాట్య మనూన విలాస
స్ఫీతము సాగెను వెన్నెల రేయిన్.

ఆ జనసంఘమునం దొకహస్తం
బో జను పార్శ్వమునుండి యథేచ్ఛన్
రాజభుజంబున వ్రాలినదే! ఈ
తేజము నొందక ధీరతతోడన్-

స్వీయకరమ్మున పీడెము కన్నూ
రీ యుత ముంచెను రేడు ప్రియా, ఆ
వ్యాయత హస్తమునందున కన్నుం
దోయి మరల్పక తూర్ణముగానే.

ఆవల నాటక మంతము కాగా
భూవిభు, డల్లన పోయెడి వానిన్
ఆవలి తానను డై కనుగొంచున్
సేవకు నొటును శిల మెరింగెన్.

స్వీయ భుజమ్మున చే యిడు వానిన్
ఏ యెడ నుండిన నిచ్చటికిం దె
మ్మోయి, యటంచు నియుక్తుని జేసెన్
నాయకు నా మరునాడు నృపుండున్.

భీతమనస్కుఁడు వెల్లుగ, పృథ్వీ
నేతను గాంచి వణిక్సుతు డల్లన్
చేతులు మోడిచి శీర్షము వాల్చెన్
ఆతురతన్ సభ నందరు చూడన్.

దరహాసముతో తన యంసముపై
కర మూను వణిక్తనయుం గనుచున్

ధరణీధవు రాదర వాక్యాన "త్వ
త్కరభారము బాధ శమింప" దనెన్.

అతిభీతుడై యారుదెంచు వణి
క్సుతు డా నృపవాక్సుధ గ్రోలుటచే
మతి చల్లబడన్ మహీకాంతునితో
చతురంబుగ నీ సరణిం బలికెన్ :

"వసుధాభరమున్ వహియించెడి మీ
యసమాన భుజం బవనీశ్వర, యీ
పసివాని తృణ ప్రతిమాన కరా
భ్యసనంబు భరింపగ జాల దొకో !"

సమయోచిత మా సరసోక్తి ప్రయో
గము చేత సభాగతు లోహో యనన్
సుముఖుం డగు రాజు వణిక్సుతునన్
సమకూర్చె విశేష బహూకృతులన్.

జయసింహ మహీశ్వరు డెంత జన
ప్రియుడో రసిక ప్రియుడో తెలిసెన్ !

దయ చూపగదే దయితా, దయితా !
జయతాత్ జయతాత్ శయనీయ మిదమ్ !

## ఆనంద మా

"తరువు మూలము బట్టియున్న వితర్దిపై నుపవిష్టయై,
తరుణి యెవ్వతె యోగినీమయి, దవ్వుచూపుల దిక్కులం
బరపుచున్నటు దోచుచున్నది: బైరగడ్డమువాడు త
చ్చరణ సన్నిధి నెవ్వడాతడు శ్రద్ధతో వివశాత్ముడై?
"జనము మూగుచునున్న చేటికి చక్రరూపముతోడ నా
వనిత చక్కని దిక్కులన్నిట? వైళమే యట సంబరం
బున గనుంగొన బోదమా యను బుద్ధి పుట్టుచు నున్న, దే
మనెద వోవదినా? సరేయన అగ్రగామిని నయ్యెదన్."

"ఆగవే పోవకే ఆ జగత్పూజితన్
యోగినిం జూడగా యుక్తకాలములో
నేగుచో ఆశిషం బిచ్చు నేకాంత భూ
భాగమం దానెడం బ్రస్ఫుట ప్రీతితో.
ఆమహామానవి యాద్భుతోదంతమున్
పామరుల్ విన్నచో భక్తి భారంబునన్
వేమరుం బోదురే వీక్షణోద్రిక్తలై:
ఆమెశక్తి ప్రభావాదికం బట్టిదే!
పాద పద్మ ద్వయాప్రాంతమం దున్నయా
సాదు నెవ్వండు కాజాలునం చెంచెదో?
ఆదిలో భర్తయే ఆమె కా పూరుషుం,
డాదటన్ భక్తుడే యైనవా డావలన్.
కర్తచే జన్మముం గాంచె ఢాకా పురిన్
నిర్మలాదేవి యన్ నీతనామ్ముతో

ఆర్తిలిం బెంపకం బందుచున్ గీమునన్
శర్మముం గూరిచెన్ సాధువృత్తంబునన్.
చిత్రమే మన్న — ఏ చేష్టలో నేనియు
న్నాత్రముం జూపకే యామె బాల్యంబునన్
పాత్రమై ప్రీతికిన్ బంధు సంఘంబులో
స్తోత్రముల్ కాంచె నస్తోక మాత్రముగన్.
దేనిపై రాగమున్ ద్వేషముం దాల్పగా
లేని యా బాలకున్ లిబ్బియున్ ద్రవ్యమున్
మానముం గల్గు సామాన్యకుం బెండిలిం
జానుగా బందుగుల్ సల్పినా రొక్కెడన్.

ఆవలం గొన్నినాళ్ళైన దేహంబునన్
దేవికిన్ యౌవనోద్భేదమై యుండగా
వావిరిన్ భర్తతో పర్తనన్ నాందిగా
ఓవరిం గూర్చినా రొక్కరాత్రింబునన్.

సజ్జితం బైన యా సౌధ భాగంబులో
లజ్జయో భీతియో లాలనౌత్సుక్యమో
ఉజ్జయేమో యటం చూర్చుచున్ భార్యపై
పజ్జ వేయంగనే యాతడున్, నిర్మలా
దేవి యున్నేత్రయై తేరి చూచెన్ వరున్ :
యౌవనోద్రిక్తుడౌ నాత డుత్సాహియై
కావరం బేచగా కన్యకాంసమ్ముపై
వావిరిన్ హస్తముల్ వైచినాడే చెలీ!
కక్ష విద్యుల్లతా ఘాతమైనట్లుగా
తక్షణంబే కరద్వంద్వ ముత్సన్నమై

పక్ష భాగంబులన్ పాలితం బయ్యెనే,
వీక్షణం బంతలో కైవల్యం బారెనే!

వేగమే యెట్టులో వింతగా జేరుచున్
రాగభారమ్మునన్ "రాగదే ప్రేయసీ,
ఈగదే ముద్దు నా కిమ్ముగా కమ్మగా!
కౌగిటం జేర్పవే కామితార్థ ప్రదా!"

అన్నమాత్రమ్ములో నాస్యరంగమ్ముపై
సన్నసన్నమ్ముగా జ్వాల వ్యాపించెనే!
అన్న వుత్పన్నమై యూత డల్లంతలో
తిన్నగా ప్రాలెనే దేవి పాదాలపై.

తేకువన్ మెల్లగా దెచ్చికొన్నట్టి యా
స్తోకయోగ్యుండు తా దోషముం జేసిన
ట్లాకులం బొందుచున్ హస్తముల్ మోడ్చి "నా
వాకులన్ సైప్రుమా వట్టి కామాంధుడన్!

నీవు నిక్కంబ ఉన్నిద్రశాంత ప్రభా
దేవతామూర్తి వన్ ధీ జనించెం జామీ!
కావునన్ భాగ్యగా కాంక్ష చేయ న్నినున్
భావికాలమ్ములో పావన శ్రీనిధీ!

ఒక్కటే కోర్కె నా కున్న దీమీద నే
నిక్కపున్ శ్రద్ధతో నిన్ను సేవించుచున్
చక్కయ న్నిల్వగా సమ్మతింపంగదే
గ్రక్కున" న్నంచు విజ్ఞాపనం జేయగా—

కొంచె మాలోచనం గ్రుంకి యాలించుచున్
మంచిదే యందు దన్నస్త్రకాగ్రంబుపై

నుంచె జేతుల్ కృపన్ యోగినీమూర్తి – సే
వించు నాతండు దేవిన్ సదా శ్రద్ధతో.

ఆ ముఖాబ్జంబుపై నన్యహానందమే
ధామమున్ గైకొనన్ ధర్మభావమ్ముతో
ఆమె 'కానంద మా' యన్నయన్నాక మా
నామమే నిల్చె నా నాట లోకంబునన్.

పొందవచ్చుం గదా ప్రొద్దుటాశీస్సులన్
మందిరంబందె శ్రీ మాతృసేవారతిన్ .–
బిందె మస్తంబునం బెట్టుకోవే చెలీ!
సందె రాగచ్ఛటల్ జారిపోయెం గదే!

సమాప్తము

# కా వ్యా వ ళి

## తృతీయ కదంబము

అంకితము

శ్రీ రాయప్రోలు సుబ్బారావుకు

## చా మె కొం బ

### ౧

వందనం బాచార్య దేవా !
వచ్చినా రెన్నాళ్ళకో మీ
పాదసేవకురాలి నిలయ ప్రాంగణమ్మునకు.

చరణ దివ్య పరాగ కణముల
శ్రావకీ సదనమ్ము నియ్యెడ
పూత మొనరింపగ దగదే భూరికృపతోడన్ ?

తమకు నెయ్యది యభిమతంబో
దానినే కానిందు స్వామీ !
కాని ఆతపతాప మీకడ ఘనము నిలువంగన్.

సాంద్ర సహకారావనీజ
చ్ఛాయలో శశికాంత వేదిక
నధివసించి సుభాషితమ్ముల నానతీయ దగున్.

తాలవృంతము దెత్తు- వలదా ?
తరుచ్ఛాయయె చాలు నందుర ?
వాయుకంపిత శాఖికాతతి వ్యజన మగుగాతన్.

చేత నైనది చేయ నే సం
సిద్ధురాలను : మద్గురూత్తము
లింత చెప్పగ నేల ? ఆనతి ఈయగారాదో ?

సత్వరమ్ముగ సంఘటించెద
జైనకార్యం బైనచో నది.
శ్రావకీహృది కంతకన్నను సంతసము కలదే ?
తెలుపవలసిన దొక్క ఉదయా
దిత్యభూపతి కీ యుదంతము ?
అటులె చేసెద గడచు సప్తాహమ్ము లోపలనే.
బ్రాహ్మణుండును శైవు డయ్యును
పక్షపాతము లేదు నృపునకు-
సకల భువనాశ్రయోపాధియె సార్థకం బయ్యెన్.
పరమ భట్టారకుడు నరపతి
భక్తితో కాలాముఖాభిధ
శైవగణ గురువర్యు విద్యేశ్వరుని గొనియాడున్.
గౌరవోత్కర్షముగ వలహరి
గణ మహాచార్యార్హ నందిని
రాజ పరమేశ్వరుడు సందర్భముల నుతియించున్
మోద మొందగ శ్రావకావళి
మున్ను జైనాలయార్థం బా
విజయవాటికలోని దానికి విభుని యానతిపై-
మంత్రి అత్తిలి నాటి గ్రామము
మల్లిపూడి లిఖించి యొసగెను-
ధరణి విభున కభిన్నభావమె ధర్మకార్యమునన్.
సకల లోకాశ్రయాఖ్యం బగు
జైన భోజనశాల భృతికై
విజయవాటికవారు రాజును వేడు మన్నారు.

విన్నవించితి నిన్న రేనికి;
విని సమగ్రముగా నృపాలుడు
శాంతచిత్తముతోడ చివరకు సమ్మతించె సఖీ !

ఆజ్ఞ యిచ్చెను మహామంత్రికి
అచిరముగ జేయింప శాసన
కార్య, మత్తిలి నాటి గ్రామము కంచుమ గ్రాసగన్.

ఏగుదెంచితి రొక్కొ మీరలు
నేతదర్థమె ? పరమహర్షము !
శిష్యురాలికి వార్త చాలదె సేవ చేయింపన్ ?

ఇందు నన్ను ప్రశంస చేయగ
నేమి కల దాచార్యదేవా ?
జన విభుం డతిధర్మహృదయుడు స్వతస్సిద్ధముగన్.

అదియు మీ రన్నట్లు సత్యం,
అవనివిభు డొక కొంత జైన
ప్రీతి చేయుచునుండు నాపై ప్రేమ మూలమునన్.

స్వీకరించి రసాల ఫలములు
శిష్యురాలి ననుగ్రహింపరో ?
ధన్య చామెక నేడు యుష్మద్దర్శనము వలనన్ !

అర్హానందాచార్యదేవ ప
దాబ్జయుగళికి మత్ప్రణామము !
దివ్య ఫలహారిగణమునకు నతి తెలుపవేడెదను.

సెలవు గైకొనుదాన- నిలుతున ?
చిత్త మట్లే చెప్పవచ్చును
కోప మేటికి గలుగు నస్మద్గురు సదుక్తులకున్ ?

అవును, సకల శ్రావకీగణ
మప్రతిష్ఠకు తావలం బగు
ఉన్నయెడల న్నన్ను బోలిన దాకతె యైన సరే !

నన్ను గాంతురయేని లోకులు
నవ్వుచుందురు, విశేషముగా
బ్రాహ్మణుల్ గణియింత్రు ధర్మ భ్రష్టురాలినిగా.

ఒరుల నిందలు నన్ను ఆచా
ర్యోత్తమా, బాధింప నేరవు
చిత్తవృత్తులు నిరోధించితి సిగ్గు విడనాడి.

ప్రకృత వర్తనముం ద్యజించిన
బడయుదును సద్యోయశమ్మును
కాని అయ్యది నాకు సాధ్యము కాదు గురుదేవా !

శుభదినమ్మున నేను త్రికరణ
శుద్ధిగానే యైతి శ్రావకి,
నదియె హేతువు జైనధర్మము ననుసరించుటకు.

మీరు విజితేంద్రియులు ధర్మము
మీర రా దని బోధ చేసెడి
పథమునందు జరింతు నేనియు పరమసౌఖ్యంబే !

సాధ్యమా మీ రన్నయది ఆ
చార్యదేవా, నాకు నిప్పుడు ?
చిత్తదౌర్బల్యమ్ము లక్ష్యము చేయ బ్రార్థింతున్.

మార్పు గాంచుట యెట్లు ప్రస్తుత
మార్గమును విడనాడి ? వైరా
గ్యమ్ము లేనేలేదు భోగపరాయణత్వమునన్.

పొంద దెన్నడు నూనముగ నుప
భోగమున కామమ్ము శాంతిని :
మనువు చెప్పినయటు హవిస్సున మండువహ్నివలెన్.

కాని రూపారోగ్య సంపద
గలిసి నాకు కఠోర యౌవన,
మఖిల భోగ్య పదార్థజాతం బమరి యుండంగన్-

ప్రథిత చాళుక్యా న్వవాయుడు
పరమ భట్టారకుడు శ్రీమ
ద్రాజపరమేశ్వరు డఖండిత రాగభరితుండై-

అఖిల సుఖముల దేల్చి నను ప్రా
ణాధికమ్ముగ జూచుచుండగ
అన్యకరణీయమ్ము దోచెనె అబల కాచార్యా ! .

చిత్ర, మేటికి నాకు కోపము ?
సిగ్గుతో పని యేమి ? విజయా
దిత్యు కెట్లుపపత్నినైతినో తెలుపగలదానన్.

నిర్ణయింతురు గాక మద్దయ
నీయ వృత్తాంతంబు గురువర !
అవధరించు మనంతరము నాయందు దోషంబున్.

౨

పట్టవర్ధని వంశమున నే
ప్రభవ మందినదాన : అస్మత్
పూర్వపురుషులు ఖ్యాతి కెక్కిన భూసురోత్తములు.

కలదు కొంతధనమ్ము, క్షేత్రము
కలదు, మజ్జనకుండు విబుధుడు
గౌరవంబుగ జేయుచుండెను కాలయాపనమున్.

చెప్పుచుండును రెండువేళల
శిష్యసంఘంబులకు పాఠము
కావ్య చంపూ నాటకాలంకార శాస్త్రంబుల్.

పురుష సంతానమ్ము కలుగక
పోవుటన్ జనకుండు నన్నే
పూర్ణవాత్సల్యమున బెనిచెను పుత్రభావమునన్.

భాగములు రామాయణమ్మున,
పంచతంత్రము జెప్పి జనకుడు
క్రమక్రమముగ జెప్పదొడగెను కావ్యపాఠంబున్.

నాకు పదమూడేండ్లు నిండగ
నాల్గు కావ్యములం బఠించితి,
అర్థ మేలాగున్న శబ్దం బవగతం బయ్యెన్.

నాకు పుత్రీకృతకు వ్యాకర
ణమ్ము చెప్పగ సాగె మత్పిత
ప్రాకృతమ్ములగూడ నించుక పాటవం బొదవెన్.

సంతసమ్మున కాల మీగతి
జరుగుచుండగ నొక్క యామిని
జనని పంచత్వంబు నొందెను సర్పదంశమునన్.

రేయు బవలును తండ్రి అంత
ర్లీన దుఃఖ హుతాశనమ్మున
కుమిలి యారోగ్యమ్ము క్రమముగ గోలుపోజొచ్చెన్.

విగత భర్తృక నా పితృష్వస
విజయవాటిక నుండి వచ్చెను
మాతృ మరణా నంతరమ్మున మాగృహమ్మునకున్.

ఆమె పూనిన దాదిగా గృహ
యాజమాన్యము తండ్రి గారికి
క్రమక్రమముగ స్వాస్థ్య మెట్లో క్రమ్మరిల జొచ్చెన్.

జైనధర్మమునందు నామెకు
చాల నభిమానమ్ము కల్గుట
అర్థ కథలం జెప్ప నాయమ అలకించితిమి.

అర్హనం ద్యాచార్య సన్నిధి
కప్పు డప్పుడు వారు పోనురు
సంప్రదాయ రహస్య వివరణ సంగ్రహణ బుద్ధిన్.

కొంత శ్రుత పాండిత్య మల్లన
కుదురుకొనగా నేను జైన
ప్రాకృతంబును నేర్చికొంటిని బహుతర శ్రద్ధన్.

జాగరూకతతో లిఖించితి
జైన సూత్రములకు ప్రతులను
ఉభయు లుత్సాహ మ్మొసంగుచు నుండ ననుదినమున్.

అధిక వాత్సల్యమ్ము శిష్యుని
యందు జనకున కుద్భవించెను-
సేవ చేయుచునుండు నొజ్జకు శిష్యు డాదృతితో.

చాల యోగ్యుం డైన శిష్యుడు
సహజ సుందరమూర్తి: ఆతని
యందు లగ్నం బయ్యె నా మన మప్రయత్నముగన్.

యౌవనోదయ కాలమున నా
కతని సాన్నిధ్యము లభించుట
వలన గాఢముగా జనించిన వలపు దృఢ మయ్యెన్.

దాటె నాకు చతుర్ద శాబ్దము,
తండ్రి శిష్యుడు నేను నైన
గ్రంథముల్ పఠియించు చుంటిమి గాఢ తత్పరతన్.

నడుమ నడుమను మత్పితృష్వస
నా వివాహముమాట యెత్తిన
చేయ వచ్చునులే యటంచును చెప్పు జనకుండున్.

శిష్యునకు నన్నిచ్చి పెండిలి
చేయు పిత యను తలపు నాకును
ఆత్తకును జనియింప, పరమాహ్లాద మొందితిని.

కడచుచుండగ నిమిష సమముగ
కాల మీగతి వయసు వచ్చెను,
నాకు లజ్జయు నుద్భవించెను నాటినుండియును.

అతడు నేనును కలిసి చదువుట
యాగిపోయె, మదీయ యౌవన
వశమునన్ జనియించె నతనికి వలపు నామీదన్.

అంత నత డొక ప్రదోషమున
నరుగుదెంచి రహస్య సరణిని
తెలిపె నాయెడ దనకు గల యుద్వేల రాగంబున్.

తెలిపితిని మేనత్త కానికి
తెల్లవారిన పిదప విని పిత
సమ్మతించె వివాహ యత్నము సలుప శీఘ్రముగన్.

ప్రాకిపోయెను పట్టణమ్మున
పరిణయోదంతంబు వేగమె
అతని జననీ జనకు లొందిరి అధిక సంభ్రమమున్.

వారు తలచిరి మేము వైదిక
వైరి జైనమతమ్ము చాటుగ
స్వీకరించితి మనియు, పుత్రుని చెరపినా మనియున్.

తనయు డెన్నివిధాల చెప్పిన
తల్లిదండ్రులు వినక, యతినిని
మాగృహమ్మున నడుగు పెట్టుట మానుకో మ్మనిరి.
తల్లిదండ్రుల ధిక్కరించెడి
ధైర్య మేమియు చాలకుండుట
మంత్ర రుద్ధం బైన భుజగముమాడ్కి నతడుండెన్.

సహజకోమల మైన యాస్య
జ్జనకు మనసు చివుక్కు మనియెను,
వదనబింబము నాడు నాడును వాడిపో దొడగెన్.

పట్టణంబున నను గురించిన
పరీవాదము బహు విధంబుల
దుష్టముఖముల వ్యాపి నొందెను దుర్నివారముగన్.
క్రమక్రమముగ లోకనిందలు
కర్ణగోచర మైన కతమున
దుస్సహాంతర్వేదనా దోదూయ మానుండై-

చివరిపర్యాయమ్ము యత్నము
చేసి చూచి ఫలమ్ము లేదని
అతడు తన జామాత యగు నను నాశ విడనాడెన్.

అన్య బెండిలి యాడ నని మే
నత్తతో నే జెప్పుదానను
అతని మీదనె గాఢ రక్తియు నాశ యుండుటచే.

ఆతలంపును విడువు మని నా
కఖిల విధముల బోధ చేసెను
తండ్రి : నాలో నేను పరివర్తనము లేదాయె.

ఇట్టు లుండఁగ బహిష్కారం
బింతలో నే దాపురించిన
కారణంబున తండ్రి చింతాక్రాంతు డయి పోయెన్.

కడకు మంచము పట్టి ఆనాన
క్రమముగా శుష్కించి హృద్రో
గముచే నొకనాడు పొందెను కాలధర్మంబున్.

వర్ణనాతీతమ్ము నా దుర
వస్థ ! జ్ఞాతిజనమ్ముచేతను
ఒదవె నలజడి, తుదకు మెల్లన ఒడ్డునం బడితిన్.

అవల దెలిసెను నేను వలచిన
యతడు నిరతము తల్లిదండ్రులు
పెట్టు పోరు భరింప జాలక పెండ్లి యాడె నని.

దానితోడన శిథిల మయ్యెను
ధైర్యకంచుక మనిర్వాచ్య
వ్యథాభరమున క్రుంగిపోతిని వాడుటాకువలెన్.

బహుదినమ్ముల వరకు మంచము
పట్టియుంటిని ; నా పితృష్వస
సలుపు నుపచారముల నూతన జన్మ మెత్తితిని.

కలిగె నారోగ్యమ్ము, తోడనె
గాఢ వైరాగ్యంబు పొడమెను
అంతరంగిక దుఃఖ భారం బధిక మైపోవన్.

చిత్తశాంతి యొసంగు చుండుట
స్వీకరించితి జైనధర్మము
అవల శ్రావకి నైతి పరిణయమం దనిష్టముచే.

కామ శబ్దమె తలప కెన్నడు
గడిపినా నే దేండ్లు కేవల
ధర్మమార్గమునుండి లవమును దాటి పోకుండన్.

కాని విజయాదిత్య భూపతి
కాంచె నశ్వారూఢుడై యా
దృచ్ఛికమ్ముగ నొక్క దినమువ దివ్య నయనములన్.

అంతవరకును గాఢ రుద్ధం
బైన హృదయ కవాట మా సా
యాహ్నవేళను తెరపు వడినది అప్రయత్నముగన్.

పంపె మరునా డొక్క దూతిక
ప్రభువు నాకడ, కతని కోర్కికి
సమ్మతింపగ లేదు తలచుచు శ్రావకీ వృత్తిన్.

కాని మానస మవశ మయ్యెను
కామ మోహిత నయ్యు, క్రమ్మర
నేగుదెంచిన రాజశంభళి కిట్లు చెప్పితిని :

'నిక్కవమ్ముగ రాజమౌళికి
నిండు ప్రేమమె యున్న నాపై
ధర్మపత్నిగ నన్ను జేకొన దలపగా రాదో? '

పరిణయాధ్వమునందు గల ప్రతి
బంధకర్మల దెలిపి యాయమ
'ప్రభువు నిను భావించు మదిలో భార్యగా' ననియెన్.

నాటినుండియు నాదరించుచు
నన్ను భూపతి పత్నిపోలిక
ప్రేమతో లాలించు నెంతయు, పెండ్లి కాకుంటన్.

ప్రభుని త్రికరణ శుద్ధిగా నే
భర్తగా భావించుచున్నా,
నైన లోకము సత్య మెరుగక అన్యథా తలచున్.

పూని యుండును లోకసంగ్రహ
బుద్ధి సాంఘిక నియమ వాగుర-
సడల జేతురు దాని నెడ నెడ సాహసోన్నతుల్.

ధర్మతత్త్వము గుర్తెరింగిన
తమకు విదితము, వ్యావహారిక
దృష్టి సూక్ష్మ విశిష్టధర్మము దెలిసికో గలదా?

తమ యనుగ్రహ మున్న జాలును!
దర్శనమ్ము నొసంగుచుండుడు
శిష్యురాలికి దేశికోత్తమ! సెలవు గైకొందున్!

అర్హనంద్యాచార్యదేవ ప
దాబ్జయుగళికి మత్ప్రణామము!
దివ్యవలహరి గణమునకు నతి తెలుప వేడెదను!

# మేడూరి వారి కోడలు

## ౧

మేడూరి వారి కోడలి
కీ డెవ్వరు గోచరింప రేగుణమందున్
కోడూరు గ్రామమందలి
వ్రీడావతులందు నెంత వెదకినగానీ.

ఎదు రాడ దత్తగారికి
తదీయ చిత్తానుసరణ తత్పరమతియై
సదనమున మెలగు నాయమ
పదిలమ్ముగ అత్తగారు ప్రమదం బొందన్.

మితభాషిణి యాయమ నిజ
పతి కుపచారమ్ము చేయు బహుళశ్రద్ధా
న్వితయై కనుగొను లోకులు
సతీత్వమును బహువిధాల శ్లాఘింపంగన్.

వినబడియె నేని భిక్షుక
జన యాచ్ఞాకంఠరవము సత్వరగతితో
జని యాయమ భిక్షమ్మును
కనికరమున బెట్టుచుండు కరయుగ్మమునన్.

ఆయమ షోడశవర్ష
ప్రాయమ్మున నత్తవారి భవనము జేరెన్.
ఆయెను సుమహావృద్ధి త
దీయ తనూవల్లియందు దివసక్రమమై.

ఆమె విలోచన కాంతికి
వ్యోమము ధవళాంబుజంబు నోజ వెలుంగున్
కోమల పాదస్పర్శను
భూమిస్థలి కోకనదముపోలిక బొలుచున్.

కోడలు చనుదెంచిన యా
యేడాదికి నత్తవారియింటను హెచ్చెన్
పాడియు పంటయు-గలిచిన
దోడెడి యభియోగ మద్భుతోత్తర మగుచున్.

శుభలక్షణ లక్షిత యని
యభిమానం బతిశయిల్లె నత్తకు స్నుషపై.
అభివృద్ధి గాంచె భర్తకు
నభిరతి నిజకాంతమీద నతివేలముగన్.

యామిని వేళను రెండవ
యామమ్మున దీపకాంతియందు నపూర్వ
శ్రీ మెరయు నామె కన్నులు
స్వామి విలోకించి యధిక సంభ్రమ మొందున్.

మోహమున గాని యత్యు
త్సాహమ్మునగాని యామె శయనమున స్వయం
గ్రాహమ్ము లొసగుచో స
న్నాహమ్ముగ భర్త స్తయము చెందుచు నుండున్.

ఋజువుగ వాసరవేళను
రజనీసమయమ్మునందు రభసముతోడన్
నిజకాంత మెలంగుట క
క్కజ మొందుచునుండు భర్త కరుణాళుండై.

వాసరములు వారమ్ములు
మాసమ్ములు గడచె నిట్లు మహితబలుండా
భూసురుడు కోలుపోయెను వి
కాసము వేసవిని నిమ్నగా స్రుతి వోలెన్.

సోమునకు బహుళపక్ష
క్షామమువలె వల్లభునకు ఛవి యుడు గంటన్
ఆమె మనోజ్ఞ శరీరం
బామనిని తురాయి తరువునట్లు వెలింగెన్.

౨

మేడూరివారి యింటికి
బాడబు డొక్కండు పోయి ప్రాతర్వేళన్
వేడెను భిక్షము : కోడలు
తోడనె బియ్యమును నిండుదోసిట గొనుచున్-

గడప దిగి పోయి నాల్గయి
దడుగులు, ప్రాంగణమునందు నాతనిపాత్రన్
విడిచెను తండులములు సం
దడి చేయగ హేమవలయ తతి హస్తములన్.

ఆయమ పరికించె మహా
కాయుని రుద్రాక్షమాలికా రూప స్ర
క్షేయుని, విశాలలోచను,
నాయత ముఖ భస్మ కుంకుమాలంకారున్.

భూసురుడు తీక్ష్ణ నయన వి
భాసురుడు తదీయవదన పద్మము గాంచెన్

దూసికొని పోవు దృక్కుల-
భాసురగాత్రికి జనించె భయసంభ్రమముల్.

తడబడు పాదములతో
వడివడి లోనికిని బోయి వాకిలి మూయం
బడతుక, చింతాన్వితయై
వెడలె తదీయాంగణము విడిచి యతండున్.

'ఇమ్మెయిని వణికె దేటికి ?
చెమ్మట గ్రమ్మినది వదనసీమను, చెపుమా
ఇమ్మాడ్కి నైన కారణ
మమ్మా !' యని బుజ్జగించె నత్త లతాంగిన్.

ఫాల స్వేద కణములు
చేలాంచల మొత్తి తుడిచి చిన్నియెలుగునన్
లోలాక్షి పలికె: భిక్షుకు
నాలోకింపంగ నాకు నతిభయ మొదవెన్.

అని పలుకు ముద్దుకోడలి
కనునయ వచనములు చెప్పి 'అమ్మా, యిటుపై
జన బోకు నీవు భిక్షుక
జనముకడకు' ననియె నామె సస్నేహముగన్.

రెండవ దినమున నావి
ప్రుం డరుదేరంగ ప్రొద్దు పొడిచిన పిదపన్
నిండుగ దోసిట గొని చని
తండులములు పోసి యత్త తత్పాత్రమునన్-

'ఏ మార్యా, మా కోడలి
నేమో భయపెట్టినారటే నిన్నను ? మి

మ్మే మెపుడు చూడలే, దీ
గ్రామమునకు మీరు క్రొత్తగా వచ్చితిరా?'

ఈ రీతి బలుకరింపగ
భైరవ భట్టిట్టు లనియె : 'భయపడియెను మా
గారాబు చిన్నికోడలు
నారూపము గాంచి – నేను నవ్వుడ నమ్మా!

'ఆమెను బోలిన యందరు
కామినులును నన్ను గాంచి కాంతురు భీతిన్
నాముఖ కుంకుమ ఘనరే
ఖా మంజుల కాంతి నయన కంటక మగుటన్.'

'ఏమో వింతగ నున్నది !
కామినులకు నంతభయము కలుగునె చూడం
గా మీ తిలకము? మాంత్రికు
డేమో యనిపించుచున్న, దిది నిజమేనా?'

ఆయమ యిట్లు వచింపగ
నా యవని సురుడు పల్కె నల్లన : 'నిజమే.
ఏయెడ నున్నది మీస్నుష?
ఈయుదయము గోచరింప దేమి కతంబో?

'నిన్న మిముం గనుగొని యా
చిన్నది యత్యధిక భయము చెందగ, నేనే
అన్నాను పోవవల దని–
ఉన్నది తులసమ్మ కోట నూడ్చి యలుకుచున్.'

అని యత్త చెప్పుమాటలు
విని తల పంకించి మరల విప్రుం డను : 'మీ

యనుగుం గోడలి వర్తన
మున నెన్నడు వైపరీత్యమును గనలేదా ?

లే దనగ నామె, ఆయన—
'కాదమ్మా, ఆపహించు గ్రహ మాతరుణిన్.
ఖేదమ్ము చెందబోకుడు,
మీద శుభం బగును లెండు మీ పుత్రునకున్.

'నమ్మకము లేనిచో నా
కొమ్మను రాతిరికి మీరు కొమరునికడకున్
బొమ్మనక యెట్లో మీ శయ
నమ్మున నే నిల్పుకొనుడు నామాటపయిన్ !'

అని చెప్పి వెడలిపోయెను—
తనయానకుం దెలుప కామె ధైర్యముతోడన్
దన కడ కోడలి నాయా
మిని నిడుకొని కనులు మూసి మేల్కొని యుండెన్.

రెండవ యామము ముగియుచు
నుండగ మేల్కాంచి కోడలుద్రేకమునన్
గెం డడచి యత్తతలపై
పండుకొనం బోయె వడిగ పతిసన్నిధికిన్.

వినయవతి యై మెలంగెడి
తనకోడలి నావహించి తత్సమయమునన్
బెనుభూత మిట్లు చేయిం
చిన దని గ్రహియించి యామె చింతిల జొచ్చెన్.

మరునాడు భైరవార్యుం
డరుదేరగ, పిలిచి లోని కాయనను సమా

దరమున, కోడలి గ్రహమును
పరిహారము చేయు డనుచు ప్రార్థన చేసెన్.

మాటలు మీరును కోమలి,
పాటలు విపరీతముగను పాడును, లేచుం
బోటులకు, మాంత్రికుం డు
చ్చాటన మంత్రములు పలుకు సమయములందున్.

మండలకాలము నిష్ఠ న
ఖండిత జప హోమ తంత్ర కర్మంబుల వి
ప్రుండు పిశాచిం దోలెను
ఖండ నిశానాథమౌళి కరుణ యొసంగన్.

ఆమెయతిమానుషం బగు
ధామము క్షీణించి సహజతనురుచి నిలిచెన్.
నీమముతోడ తదీయ
స్వామికి క్రమ్మరను సహజవర్చ స్సొదవెన్.
మేడూరి వారి కోడలి
కీ డెవ్వరు గోచరింప రేగుణమందున్
కోడూరు గ్రామమందలి
వ్రీడావతులందు నెంత వెదకిన సరియే.

# భ్రమరకీటము

౧

బహుకాలము నాటి గాథ: పలనాటను కృష్ణా నది
తీరస్థ గ్రామమ్మున వీరాచార్యుం డుండెను.

స్వర్ణకార వంశంబున జనియించినవా డతండు,
శ్రీ మహేశ పాదపద్మ సేవా హేవాకబుద్ధి.

ద్వావింశ ద్వర్షముల తరుణ వయస్కుఁ డతడు, కాని
తన్నిర్మల మానసమున తరుణీ చింతనము లేదు.

జననికి శ్రద్ధా భక్తుల సలుపుచుండు నుపచారము,
లెపుడు మాట జవదాటం, డిలు దీర్చుచునుండు నామె.

పరిణయమ్ముగూర్చి జనని ప్రస్తావన చేసినపుడు
అచిరకాలముననె పెండ్లి యాడుదు నని పలుకువాడు.

జనకుని మరణమ్ము పిదప జనియించిన ఋణభారము
పూర్ణముగా మోచనమై పోయెను శివరాత్రి నాడు.

స్వర్ణ శిల్ప వృత్తిచేత జరగుచుండు జీవయాత్ర,
సదన మొకటె మిగిలె, వేరు స్వత్వం బేమియును లేదు.

కొంచెము కొంచెముగ నతడు కూడబెట్టు ధనమువలన
ప్రాతవడిన యతనియిల్లు నూతన రూపమ్ము దాల్చె.

శిల్పవిద్య అభ్యాసము చేసినాడు, చిహ్నముగా
పాలరాల విగ్రహాలు ప్రకోష్ఠాన గానవచ్చు.

చెక్కి రమ్య చంద్రకాంత శిలా నందివిగ్రహమ్ము
పసులపుంత దిమ్మెమీద ప్రతిష్ఠించినాడు నిరుడు.

అలంకార నిర్మాణమునం దపూర్వ రీతు లెన్నొ
కొలది నెలల క్రింద నతడు వెలయించెను నేర్పుతోడ.

గ్రామములో నన్ని తెగల కలవారల యాడువారు
ప్రాత నగల జెరపివైచి నూతనముగ జేయించిరి.

స్వర్ణకారు లన్య్యులున్న చని వీరాచార్యు కడకె
భూషణములు చేయింతురు యోషలు సంభ్రమముతోడ.

కరగిపోసినట్టి శ్మశ్రులు కడాని మైకాంతి వాని
ఆకర్ణాంత విశాలము లగు నేత్రాబ్జముల వాని,

భస్మ కుంకుమాలంకృత ప్రశస్తవదనమ్ము వాని,
చంచరీక గరుద్నీల సాంద్ర శిరోజముల వాని,

మెలి తిరిగిన నల్లపట్టు మీసమ్ముల సొబగువాని,
సన్నని రుద్రాక్షమాల సంధించిన యురము వాని,

గ్రామచైత్యమందు గాని ఘట్టమ్ముల మీద గాని
హట్టకముల గాని ఈశ్వరాలయమ్మునందు గాని

విస్ఫారిత నేత్రమ్ముల వీక్షింతురు యువతులు తము
పరులు సమీక్షించుచున్న పరిగణనము చేయకుండ.

తన్మయత్వ దృష్టితోడ తన్ను విలోకించు వామ
నయనల కుత్సాహం బేనా డాతం డొసగ లేదు.

౨

ఆ దివసమ్మున అపరాహ్ణమ్మున
కృష్ణాతటినీ కీలాలమ్మున
స్నాన మాడి యా స్వర్ణకారకుడు
ధౌత వసనములు ధరించి, భస్మము
ఫాలభాగమున దాలిచి తీరుగ
భూతేశాలయ పురోభాగమున
దనరెడి తుంగ ధ్వజ స్తంభమును
జేరి, హస్తములు కేర్చి శిరమ్మున
భక్తి భరమ్మున ప్రదక్షిణమ్ములు
చేసిన వాడా శివాలయమునకు.

అవల స్వీయ గృహాభి ముఖుండై
వీరాచార్యుడు వెడలుచుండగా
అభిముఖమ్ముగా నరుగుదెంచి యొక
యువకుం డిట్లనె నుత్సుకవదనుడు:

"పోగులజంటను పూర్తి చేసితివ?
అంపినాడు మామయ్య నన్నిపుడు.
జాముసేపులో మామకుమారుని
చెవులు కుట్టవలె, చెప్పవచ్చితిని."

"మంచిది బాబూ, మరవలేదు లే,
చక్క వచ్చెదను సకాలమునకే.
ఒక్కించుక పని యున్నది కానీ
శుభ ముహూర్తమున కభయం బిచ్చెద."

స్వీయ గృహమ్మును జేరి కళాధుడు
హసంతిలోపల నంగారమ్ముల
నునిచి గొట్టమున నూది కుందనము
కరగి శలాకాకారము తేలగ
సాగ గొట్టుచును పోగుల జంటను
జేసి నేరుపున జెక్కె రవ్వలను
ఆరు గడియలకు ఆయాత మొనరిచె.

మరల వచ్చి యా తరుణ వయస్కుడు
"వేగమె రావలె వీరాచార్యా!
ఎల్లరు నీకై యెదురు చూచెదరు"
అని సంభ్రమమున ఆహ్వానించెను.

"నీవు ముందు నడు—నిముసములోనే
బయలుదేరెదను బాబూ" అనుచును
లేచి తోడనే ఆచార్యుడు తన
కాలుసేతులను కడిగి, అంసముల
మేలి సాలువును దాలిచి, పోగులు
శ్రావణముం గొని గ్రామణి యింటికి
బయలుదేరి చనె ప్రసన్నముఖుడై.

3

ఆ గృహస్థు తన్ను నాదరించు పిదప
కర్ణవేధ రుక్మకారు డాచరించె.

చెవులు కుట్టువేళ చిన్నవాని తల్లి
గాటముగను స్వర్ణకారు గాంచుచుండె.

చిన్నవాని ముఖము శిల్పి యాననమ్ము
ఒక్కపోల్కి నుంట పెక్కుమంది కనిరి.

అందు గొంద రెంతో అబ్బురంబు నొంద
కొలదిమంది మిగుల కోపగించినారు.

నాటి సందెవేళ నదీతీరమందు
ఉడుకు రక్త మున్న యువకు లొక్కచోట
చేరి మంతనమ్ము చేసి, సుందరాంగు
దేహశుద్ధి చేయ నూహ చేసినారు.

౪

గగన హంసము మునిగి పోవగ,
క్రమక్రమముగ పశ్చిమాశా
సరసి లోపల మందదీధితి జగతి గ్రమ్ము కొనెన్.

ముసుగు దాల్చిన క్రుద్ధ యువకులు
ముగురు నాడింధముని యింటికి
పయన మైరి క్రమక్రమమ్ముగ బహుళ తమసములో.

పోయి యాతని గృహారామము
పొంత చాటుగ వేచియుండిరి
కొంత తడవు శుభక్షణమ్ముల కొరకు నోపికతో.

పిదప నొక్కడు తోటలోనికి
మృదు పదమ్ముల జేరి చూచెను
జాల మార్గమువెంట మెల్లన జాగరూకతతోన్.

నిండుగా భస్మము దాలిచి
నిటల తటమున స్వర్ణకారుడు
చిన్ని చప్పరమందు నిల్పిన శివుని విగ్రహమున్ —
చేరి సాష్టాంగ ప్రణామము
చేసి యుత్థితుడై మహేశుని
స్తవము చేయ దొడంగె మృదువుగ
సంస్కృతోక్తులతో.

భక్తిభరమున రుక్మకారుడు
పాడుచుండగ ధూర్తయువకుని
చిత్త మెట్లో అల్లనల్లన మెత్తబడి పోయెన్.
స్తోత్ర మయ్యేడువరకు నట్లే
మూఁదుము నిశ్చలుచుండి ధూర్తుడు
మెల్ల మెల్లన బోయి చేరెను మిత్రయుగళంబున్.

ఆలకించుచునున్నారు తద్వృ
త్తాంత, మేమియు జేయ నేరక
దుష్టకృతి విరమించి నాటికి తొలగి చన్నారు.

౫

ఆవల నింకొక్కరేయి అందరు కృష్ణా తటమున
చేరి దురాలోచనములు చేయసాగినారు మరల.

కల తెరంగు శాంతముగా గ్రహియింపక వేగిరపడి
దండనీతి ప్రయోగింప ధర్మము కాదనియె నొకడు.

ఒక్కవేళ దోష మున్న నుభయనిష్ఠ మగును గాని
దండించిన నం దొక్కరి దాన లాభ మే మనియెను.

వేరొక్కడు కోపముతో, పీఠాచార్యుడు పురుషుడు
కావుననే దేహశుద్ధి కావలయును వాని కనియె.

వివిధ కుటుంబములలోని వెలిచవి చపలలకు గూడ
శాస్తి జరుగవలయు గాని సాధ్యము కాదనియె నొకడు.

సంశయమ్ము బాపికొనుట సమంజసము కాని మనకు
సత్య మెట్లు తెలియు వాని చావమోద కుందుమేని ?
బెదరింతుమయేని వాడు భీతచిత్తుడై నిజమ్ము
వెలిగ్రక్కును మనచేతుల వేణుదండములను గాంచి.

పక్షాంతరమందు వాడు భయభ్రాంతుడై నిజమ్ము
గప్పి బొంకులాడి తన్ను గాచుకొనం జూచునేమొ!

ఉన్న యుపాయమ్ములలో నుత్తమమైనది సామమె :
ప్రథమవారమందు దాని బ్రయోగించి చూడవలయు.

ప్రేమవృత్తి సంగ్రహణ బిభీషికలకన్న కాని
నేర్పుమీర నుబ్బవేయ నిజము బయలు పడునుగదా ?

వివిధగతుల నిట్లు మిగుల విచారించి విచారించి
స్నిగ్ధ సరణి ననుసరింప నిర్ణయించినారు వారు.

౬

శిల్పియొక్క సందెవేళ శివాలయమునుండి వెడలు
సమయమునకు బోయి వారు స్వాగతమ్ము పలికినారు.

మంచి మాటతోడ నదీమార్గమునం గొనుము నతని
కూలమునం దొక్కచోట గూరుమండ బెట్టినారు.

వాని గాత్ర వైభవమ్ము వయసు గుణగణమ్ముతోడ
అభినుతించినారు మిగుల నద్భుతమ్ము బహువిధాల.

అఖిల భాగ్యములకు మూల మమ్మవారి కటాక్షమ్ము
కాని వేరు లేదనుచును కలాధుండు పలికినాడు.

"మంచిమాట! కావుననే మన గ్రామాంగన లెందరో
నిన్ను వలచుచున్నట్టులు నిదర్శనాలు కలవు సుమీ !
కరణము దౌహిత్రి సుతుడు, గ్రామణి మేనల్లుకొడుకు
శ్రేష్ఠికుమారుడు, నాయని చెల్లెలిపుత్రుండు కూడ —

అచ్ఛముగా నీరూపం బచ్చున దిగినట్లు మాకు
కానవచ్చుచుంట కేమి కారణమో చెప్పగలవ!"

"బాబులార, మీ మనసుల బాధ పెట్టుచున్న భూరి
సంశయమ్ము దెలిపినారు : సత్యము వివరింతు మీకు.

నేటివరకు నామనస్సు నిక్కముగా పరస్త్రీల
మీది కేగ లేదనుచో మీరు విశ్వసింపవలయు.

తన్మయత్వ మొందిన తరచు తరుణులు వీక్షింతు రెవని
నతనిరూపు వారిమతుల నచ్చుపడుట సహజంబే.

భ్రమరకీట వృత్తాంత ప్రకారమ్ము లోకమందు
రూపరేఖ లచ్చుపడును రూఢిగాను తనువులందు.

కలదు మనకు నిదర్శనము : గతవర్షముకంటె నిపుడు
గ్రామములో కోడెదూడగణము ప్రవృద్ధ మయ్యెగదా ?

పాలరాతి నందిబొమ్మ పసుల పుంతలోన చూచి
కోడెదూడ లెన్నిటినో గోవులు పెట్టినవి కావె ?

ఇంక పరస్త్రీలమాట లెపుడు మనకు వల" దనుచును
అచటినుండి లేచి యింటి కరిగినాడు కలాధుండు.

నాటిరాత్రి భోజనమున నాడింథము డమ్మతోడ
వివాహమ్ము చేసికొందు వేగముగా నని పచించె.

హర్ష బాష్పములను విడిచి అతని తల్లి చేతు లెత్తి
ఆదిదంపతులకు మ్రొక్కి అత్తకా నాశీర్వదించె.

## అవధానులవారి వారి అల్లుడు

౧

అవధానులవారి యల్లు డంద మైనవాడు మిగుల,
ఏలేశ్వర యువకులలో ఇంతటి సుందరుడు లేడు.

తెల్ల జామపండువంటి దేహ కాంతి కలుగువాడు,
ధవళ మల్లికోరకముల దంతపంక్తి కలుగువాడు.

యావన కేశ్య మంజుల ఋజువైన నాస కలుగువాడు,
నీలాలక లల్లాడెడి నిండు మోము సొబగువాడు.

ఉపవన పున్నాగ తరువు నోజ నిడుపు తనువువాడు,
నిజ జానువులం దాకెడి నిడుద బాహు యుగమువాడు.

వీరభద్రమూర్తి బయలు వెడలి, వీధి నేగునపుడు
వెను దిరుగని, వీక్షింపని, వికసింపని, వెలది లేదు.

నిజగ్రామ నికటముగా నిండుగ బారెడి కృషా
తటినీ సలిలమ్ములందు తానమాడు నపుడుగాని,

ఎన్నెన్నో చిత్రగతుల ఈదులాడు నపుడు గాని
ప్రోదినీ తటాన జనము హర్షమునం జూచుచుండు.

స్నానానంతర మతండు సన్నని తడి వలువలతో
కృష్ణాతీరమ్మునుండి గేహమ్మున కేగునపుడు

వ్యాయామ ప్రస్ఫుట మగు వానిదేహ సౌష్ఠవమ్ము,
గమనములో నొలుకు సొబగు కను పండువు సేయుచుండు.

మూర్తికి గల దెంతో వసతి, మున్నూరెకరముల భూమి,
చెంగలువల చెరువు, దాని చెంతనె మామిళ్ళతోట.

గ్రామమునకు చేరువగా కట్టించినవాడు మేడ
నూతన వాస్తు ప్రకార మాతని జనకుండు నిరుడు.

ఆవరణమునందు చిన్ని యారామము, చుట్టు భిత్తి,
అంగణమున పూలమొక్క లన్నిదెసల ఫలతరువులు.

మావితోట శాలలలో మంచి పశు సమృద్ధి కలదు,
అన్నిటికిని తలమానిక మైన కపిలగోవు కలదు.

పెంచినారు వీరభద్రు పితరులు మేనత్తకూడ
ఒక్కండే బిడ్డ డగుట ఎక్కువ గారాముతోడ.

చెడిపోవక పెంపకమున చిన్నవాడు సక్రమముగ
జనప్రీతి పాత్రముగా సద్వర్తనుడే యయ్యెను.

అయి దేడుల నాడు మూర్తి కవధానులవారు తనయ
నిచ్చి పెండ్లి చేసినారు ఎంతో వైభవముతోడ.

వారణాసిలోన మూర్తి వ్యవసాయ పరీక్ష యిచ్చి
గతవారమునందె నిజగ్రామమునకు వచ్చినాడు.

అతని చదువు పూర్ణముగా నవసిత మై యుండుకతన
భార్యవెసకు వ్యగ్ర మ్మయి భావము క్రేళ్ళురుకుచుండె.

౨

అవధానులవారి కూతు రందమ్ముల రాజహంసి,
ఆ పుల్లంపేటలోన అంతటి చక్కనిది లేదు.

పరిపాండు చ్ఛాయ మయ్యు పసిమినిగ్గు లీను మేను,
హారిణీ నేత్రముల రేఖ లంది పుచ్చుకొనెడి కనులు.

భూమీధరపంక్తిబోలు భ్రూయుగళము, కోలముఖము,
సోగ గంధఫలీ నాస, శోణ పూర్ణబింబోష్ఠము-

చరణమ్ములు హస్తమ్ములు సరసీరుహ సన్నిభములు
కల్యాణీదేవి పాలుమ గండారపు బొమ్మవోలె !

అయిదేడుల నాడు జరిగె అసదృశ వైభవముతోడ
వీరభద్ర మూర్తితోడ వివాహమ్ము కల్యాణికి.

కుతుకముతో జెప్పుకొనియె కొన్నినాళ్ళు గాన మామె
ఆగ్రామము విడిచి చనెడి యంతవరకు నాచార్యులు.

ఆంధ్ర గ్రంథములు కొన్ని ఆసక్తిని పఠించిన,
దయినను భాగవత మన్న ఆస్థ మెండు కల్యాణికి.

ఆత్మీయుల కన్యలతో ఆడుచుండు పచ్చీసును,
అప్పుడప్పుడు వినోదముగ అల్లికపని చేయుచుండు.

కాలాతిక్రమమునందు కలిగిన సంతాన మగుట
కల్యాణిని పెంచినారు కడు గారాబమ్ముతోడ.

ముప్పది మాసముల నాడు ముద్దియ పుష్పవతి యయ్యె,
నిండుకొనియె పరిణాహము నితంబమున, వక్షంబున.

కలవారలు గాన లోటు కానబడదు వారియింట
పాలేరులు పనికత్తెలు పరిచారకు లున్నవారు.

పాక క్రియలోన తనకు పలుమారులు సాయపడగ
తల పెట్టెడి తనుజాతను తల్లి నివారించుచుండు.

ఉభయ కుటుంబములవారి కున్నవి సన్నిహితముగా
బాంధవ్యంబును మైత్రియు పరిణయా త్పూర్వమందె.

బాల్యముననె తమబిడ్డలు భార్యాభర్తలుగ ప్రీతి
పెద్దవారు నిర్ణయించి పెండ్లి చేసినారు పిదప.

పెండ్లి కనంతరమునందు బెరకు లేదు కల్యాణికి,
ప్రవర్తించు చనవుతోడ భర్త సన్నిధానమందు.

జవ్వన మంగంబులందు సన్నద్ధం బయిన కొలది
పతిమీదికి నామె మనసు పలుమారులు సాగజొచ్చె.

వారణాసినుండి యతడు వ్రాసి పంపు ప్రతి లేఖకు
ఉచిత మైన ప్రత్యుత్తర మొసగుచుండె ప్రీతి నామె.

చాటుగ పలుమార్లు పతి ఛాయాపట మీక్షించును
ఎడనెడ నాతని పెదవులు ప్రీభరమున ముద్దాడును.

నాథు డంపు కథావళులు నవలలు పత్రికలు చదువు,
పాడుచుండు నవ్యకవుల ప్రణయకావ్య ఘట్టంబుల.

వంగదేశ కలాకార వతంస రచితంబు లైన
వర్ణరమ్య చిత్ర పటావళులు విలోకించుచుండు.

రకరకాల క్రొత్త పాదరక్షలు ధరియించి తిరుగు
తనుజాతను గని ముద్దున తలిదండ్రులు నగుచుందురు.
పదునేడవ యేడు నడచు పట్టున తారుణ్య శ్రీ
కల్యాణీదేవి తోచె గజ్జెల గుర్రము లాగున.
వారణాసి నుండి మూర్తి వచ్చిన వృత్తాంతము విని
తన్ను జూడ నెపుడు వచ్చు దయితుం డని పలవరించు.
తారుణ్యం బనురాగము దళముగ మిథునీకరింప
ముగ్ధ సుస్వప్నంబుల మునిగి తేలి పోవుచుండె.

3

అవధానులవారి భార్య కా పుల్లంపేటలోన
ఎందును సరివచ్చునట్టి యిల్లా లెవ్వరును లేదు.
అతిథుల కభ్యాగతులకు అలయుదు వడ్డనలు చేయు,
సదనమునకు వచ్చు దీనజనులకు దానము లొసంగు.
కానబడదు వర్తనమున గర్వరేఖ యొన్నండును
చల్లని వాక్కుల నాయమ సంప్రీతి జనింపజేయు.
శాంత మూర్తి యన్న జనస్తవ భాజన మగునె కాక
భర్తయాదరంబు గూడ పడసిన దా ధన్యురాలు.
నలువది సంవత్సరాల నడువయసున నున్నయామె
ఆరోగ్యానందంబుల కవతారమువోలె దోచు.
అడిగిననే కాని భర్త కాలోచన చెప్ప దామె,
భర్తకు రుచియింపనట్టి పలుకు నోట రానీయదు.
పాక మింటిలోని యా ప్రబంధుజనము చేయుగాక,
వల్లభునకు పత్త్రమందు వడ్డనంబు తానె చేయు.

జడ యల్లును తనుజాతకు స్వహస్తములతోడ నామె
అభిలషించునపుడు దుహిత కలంకృతియు చేయుచుండు.

శ్రావ్యమైన కంఠముతో చదువుచుండు భాగవతము,
పాడుచుండు రకరకాల పాటలు విశ్రాంతివేళ.

సహోదరుని కుటుంబమ్ము జననియు నాగ్రామమందె
కలరు సుఖముగానె, బంధుగణముకూడ కొంత కలదు.

తనయమీద నున్నట్టులె తనయల్లుని మీద గూడ
అవధానులవారి భార్య కధిక మైన ప్రీతి కలదు.

వారణాసినుండి లేఖ వచ్చునపుడు తన పుత్రికి
దరహాసము చేయుచుండు తల్లి మహాసహనమూర్తి.

పరికిణీలు మాని యింక భర్తతోడ నెపుడు దుహిత
కాపురమ్ము మొదలిడు నని కాంక్షించుచునుండు నామె.

వ్యవసాయ పరీక్ష యిచ్చి వచ్చినాడు స్వగ్రామము
జామాతని విన్నయపుడు సంభ్రమమ్ము చెందె నామె.

౮

అవధానులవా రసాధ్యు డనియెడి
ప్రథ యున్నది యాప్రాంతంబులలో.
అగ్రహారమం దర్ధభాగమున
స్వత్వము కలిగిన చండశాసనుడు.
తన వాక్యంబే తప్పని సరిగా
నిర్వహించుకొను నిపుణ వర్తనుడు.

6

క్రమాంతమ్ముగా కారక సంహిత
శ్రద్ధధానుడై స్వాధ్యాయమ్మును
చేసిన వా డట తన చిన్నతనమ్మున.
ఆయన వేదాభ్యాస జడుం డని
భావించినచో ప్రమాదంబె యగు.

బ్రాహ్మము క్షాత్రము ప్రస్ఫుటముగ నే
తత్కాలమ్మున తాండవ మాడును.
ప్రతిస్పర్థులను ప్రధాన న్యాయ
స్థానము లన్నిట సక్రమమ్ముగను
తీర్థయాత్రవలె త్రిప్పి జయించిన
అసాధ్యకుశలుం డాగ్రహారికుడు.

కఠినమానసుడు కా డవధానులు
సాయము వేడిన శాంతవర్తనుల
కెల్లర కాయన హితమే చేయును.
ఆగ్రహారికము లభియోగంబుల
జయ మొందుటచే శాంతచిత్తమున
చేయును కాలక్షేపము గృహమున.

పూర్వమె విశ్రుత పుణ్యతీర్థముల
సేవించుటచే చీటికి మాటికి
అన్యనగరముల కరుగం డాయన.
గ్రంథంబులతో కాలక్షేపము
జరుగుచుండు విశ్రాంతి వేళలను.

ధర్మపత్నియెడ నిర్మలరాగము
ఆదరముం గల వా భూసురునకు.

పుత్రిక యన్న పూర్ణ ప్రేమను,
కోపం బెరుగక మూర్తిని బెంచెను.

పన్నెం డేడుల ప్రాయపు కన్నెకు
ఘనముగ జేసెను కల్యాణంబును.
అల్లునియెడ గల దధిక ప్రీతియు,
దక్షిణ అన్వారిగ నొసగెను.

పుత్రిక కల్లుడు పుస్తకంబులను
బహు పత్రికలను ప్రణయ లేఖలను
బహుమానంబుల బంపుచు నుండుట
తెలిసియు, అవధానులు వారింపక
వారల యెడగల వాత్సల్యంబున
దరహాసముతో తల పంకించును.

వెనుకటి వర్షము వియ్యంకునితో
వ్యవహారమున వివాదం బెట్లో
పెరిగిన కతమున భీష్మించుక, త
త్సదనములోనికి జనుట మానుకొని
అవధానులు, తన యనుంగు కొమరిత
అడుగు పెట్టబో దత్తవారి గృహ
దేహళిపై నని దీక్ష వహించెను.
విద్యాభ్యాసం బుద్యోగాంతం
బగుట యేటి కని అల్లునితోడను
మూ డబ్దంబుల మున్నే చెప్పెను.
ప్రస్తావనలో బంధువు లల్లుని
మాట యెత్తునెడ, "మన గృహంబునకె

ఉండవచ్చు గద, ఉద్యోగంబా
ఆతని కేటికి?" అని వచియించెను.

ఏతేశ్వరమున కేగుట మానెను
గాని యల్లునెడ గాఢ ప్రీతియె.
యాదృచ్ఛికముగ నాతడు వచ్చిన
ఆదరించువా డల్లుని శ్వశురుడు.

అరుగుదెంచినపు డాతం డత్తకు
భార్యకు నిజముగ పర్వదినంబే.
స్వగ్రామమునకు జనుదెంచిన వా
డల్లుం డని విని అవధానుల వా
రట్టిట్టయినా డాలోచనలో.

౫

కృష్ణవేణీ తరంగిణిపైన నుయ్యాల
లూగు చూగుచు నవలిమొడ్డు కట్టుమీద
చేరు నావ విధాన చిత్తచాంచల్యాన
గడపినా డొకనాడు కడుభారమున మూర్తి.
చాటుగా నొకమారు శ్వశురగేహము జేరి
ఎత్తైన తనభార్య నీక్షించి రావలయు
నన్న యుద్యోగంబు మిన్నందినది, కాని
జనకుండు విన్నచో క్షమియింప డను భీతి
పొంగు నల్లంతనే భూమీస్థలికి దింపె.
తన తోటకును నదీ తటమునకు నాతండు
కాలు కాలిన పిల్లి కరణి దిరుగుచు నుండె.
అవలిమొడ్డున నున్న ఆంజనేయుని మంది

యమునకో దాపులో రంగనాథుని గుడికో
భగవానుసేవకై భార్య యరుదెంచుచో
చూచాయగా నామె జూడవచ్చు నటన్న
ఆశ సప్తాహమున కడుగంటి పోయినది.

సమముగా పితకోడ్ల సహభోజనము లేదు,
ఆగ్రాపవన సదనమందే నివాసమ్ము,
ఏకాకిగా కాల మెట్లో గడపుచుండ
ఒకనాడు ప్రియదర్శనేచ్ఛ గాటంబయ్యె.

నది దాటి చని చిన్న నావలో సాయాహ్న
మవలి యొడ్డున నున్న హనుమాను గుడి జేరి
ముమ్మారు కావించి మూర్తి ప్రదక్షిణాల్
స్తుతియించి దైవతము, జూచె గ్రామమువైపు.

అటకు పుల్లముపేట అనతి దూరమ్ములో
అర్ధచంద్రాకృతిగ అవనీజములలోన
సంఛన్నమై కొంత, స్పష్టముగా కొంత
చిలుకపచ్చని రంగు చీరె కట్టిన యువతి
కమనీయ రేఖలో కానవచ్చుచునుండె.

ఇంతలో నొక బంధు వేతెంచి గుడిదరికి
అడిగి కుశలప్రశ్న, లవధాను లానాడె
గుంటూరు చనినట్లు కొలది దినములలోనె
తిరిగి వచ్చు నటంచు తెలిపి చనె లోపలికి.

గుండె కొంచెము కొట్టుకొనుచుండగా మూర్తి
కొంత మోదమ్ముతో కొంత కౌతుకముతో
బయలుదేరెను శ్వశురభవన మార్గమువెంట.

మస్తకమ్మును వాంచి మందగమనమ్ముతో
అత్తవారింటిపై పాత డరిగెడివేళ
చంద్రికల్ వ్యాపించె సర్వదిక్కులయందు.

గ్రామమ్ము మొగదలం గలదు వారిగృహమ్ము
తూర్పుదిక్కున నుండు తోరణం బున్నతము
ప్రక్కగా ఆగ్నేయ దిక్కులో వంట యిలు
పశ్చిమమ్ముగ నుండు పసువులున్ శకటముల్.

నారంగ జంబీర నారికేళంబులును
ఆమ్రభూమీజమ్ము లన్యదిక్కుల గలవు
చాలుగా నెడనెడం బూలమొక్కలు మొలుచు.

వివృతమ్ముగా నున్న వీథివాకిలి వెంట
అరిగి మెలమెల్లగా నంగణస్థలమునను
మూడుదిక్కుల దృష్టి మూర్తి ప్రసారించె.

ఈశాన్యభాగాన ఎత్తరుగు పంచలో
కర్ర కుర్చీమీద కల్యాణి కూర్చుండి
ఇందు బింబమువంక ఏకాగ్ర దృష్టితో
వీక్షించు చొక్కంత వివశయై కనుపట్టె.

ఉత్ఫుల్ల మయ్యె నా యువకు నేత్రద్వయము
గుండె దడదడ గొట్టుకొనె నొక్కపర్యాయ
మొక్కసారిగ నతని యొడ లెల్ల ఝల్లు మనె
ప్రాణేశ్వరిం గాంచు ప్రథమక్షణమ్ములో.

కొంచె మాగి యతండు గొంతు సవరించుచును
ముం దడుగు వేయగా ముఖము త్రిప్పుచు ముగ్ధ
వీక్షించె ప్రాణేశు విస్మయస్తబ్ధయై.

చేరువకు నరుదెంచి చిన్ని గొంతుకతోడ
కల్యాణి యని పిలువగా ప్రాణనాథుండు
వెస లేచి, ద్వారమ్ముదెస కడుగు వేసినది.

ఎక్కి సోపానమ్ము లొక్కపెట్టున నతడు
ప్రాణప్రియం జేరి బాహువుల్ చాపగా
అప్రయత్నముగాని ఆత్మేశు కంఠంబు
కౌగిలించినది యాకన్నె గాటమ్ముగా.

గాఢ పరిరంభణ గ్రస్తయా ప్రియురాలి
గండమ్ము లోష్ఠముల్ కంఠంబు మూర్ధంబు
ముద్దు జడివానలో ముంచివేసె ప్రియుండు.

ఎవరైన వీక్షింతురేమో యనుచు ముగ్ధ
అరుగుచుండెను లోని కనుసరింప నతండు.
మన కేమి భయ మనుచు మరలించి గదిలోని
కామె నల్లన, మూర్తి యర్గళము బంధించె.

దీప ప్రదీప్తిలో దేవతాకృతితోడ
విలసిల్లు భర్త గని విభ్రాంతితో బాల-
హృదయమ్ము కరిగిపోయినది దేహముతోడ !

ముగ్ధభార్యను మరల మూర్తి యుద్రేకాన
బిగి కౌగిలింతలో జిగి ముద్దుజడిలోన
వివశురాలిని జేసివేసె నిముసములోన :
ప్రాయంపు దంపతుల భావ ముద్రేకించె.

౬

అవధానులుగారి భార్య అత్తజాత నెందులకో
పిలిచె వంటయింటినుండి బిగ్గరగా నింతలోన.

అల్లుని యాగమన విషయ మవిదితంబు కాన నామె.
కల్యాణీ యని పిలిచెను క్రమ్మర నెలుగెత్తి సుతను.

ప్రతివచనము రామి నామె బయలువెడలె తనుజాతను
పాకశాలలోన నేదొ పనికొరకై కొని తేరగ.

నీరవమ్ముగా నర్గళ నిర్మోచన మాచరించి
విడిచి కత్య పంచ జేరి వీరభద్రమూర్తి వేగ
అవతరించి మెట్లవరుస అంగణమ్ము జేరుచుండ
అమ్మాయీ అమ్మాయీ అనుచు వచ్చుచున్న తల్లి
జామాతను గాంచి తొలుత సంభ్రమ మొక్కింత చెంది-
సంతుష్టస్వాంత యగుచు స్వాగతవాక్యంబు పలికె.

మే మెల్లరమును సుఖులము, మీయింటను కుశలమా?
కానరారు మామగారు, కల్యాణికి సుఖ మేనా?

అను నల్లుని వచనమ్ముల కత్తగారు సంతసమున
ఉచిత ప్రతివచనమ్ముల నొసగి యావల 'మూర్తి వచ్చె
కల్యాణీ, నీరు తెమ్ము కాళ్ళు కడుగుకొనగ' ననియె.

గదిలోపలనుండి వెడలి కల్యాణి జలమ్ము దెచ్చి
సిగ్గున తొట్రిలుచు వచ్చి చెంత చెంబు నుంచి తొలగె.

చూచి పోవ వచ్చినాను, వేచన వలె కృష్ణ దాటి
అలసింప నావ దొరక దనియెను తల వాంచి మూర్తి

మామగారు లేరనియెడి మాత్రముననె చనవలెనా !
కలవరించుచున్నది మా కల్యాణి అనుక్షణమ్ము.

చనవచ్చును లెమ్ము రేపు– స్నానమునకు కల్యాణీ,
వేడినీరు తోడవమ్మ వేగిరమే' అని చనియెను.

పరిచారకు బిలువ, వాడు పటాసనము వెన్నెలలో
వేయంగా కూరుచుండె వీరభద్రు డొంటరిగా.

కొత్త వస్త్రములను తల్లి కూతురిచే నిప్పించెను
జామాతకు ప్రీతితోడ స్నానాంతరమునందు.

పంచాంగం బవధానుల భార్య చూచి సంతసమున
క్రొత్తచీరె కట్టించెను కొమరితకు చిరునగవున.
ఒక్కమారె భోజనమున నుభయుల గూర్చుండ బెట్టి
మృదు మధు రాలాపమ్ములు తుదివరకును జేయుచుండె.
ప్రథమయామ మైనవెనుక పానుపు గదిలో నమర్చి
పండుకొనుము గదిలో నని పలికెను జామాతతోడ.

కల్యాణీదేవి కలం కారమ్మైకాంతమందు
చేసి జనని గదిలోనికి సిగ్గిలు పుత్రికను బంపె.

'గ్రహించిన యట్లు తోచు కల్యాణీ, మన సంగతి
చాల దొడ్డ తల్లి !' యనియె జాయతోడ వల్లభుండు.
ఆ శోభన రాత్రి వేళ అవధానులవారి ప్రతిన
భావింపని చందంబున భగ్నపరీపాక మొందె.

౭

రాతిరి యింటికి భోజనమునకై రానందుల కేదో
సాకు చెప్పి తప్పించుకొనియెను చల్లగ కొమరుండు.

కాలం బంతయు తోటయింటిలో గడపుచుండు కతన
ఆత్మీయులకును విదితము కాలే దాతని వృత్తంబు.

మరుసటి రాతిరి చేసి భోజనము మాలి తోట కేగి
అచటి గృహంబున నిద్రపోయినా డర్ధరాత్రిదాక.
చిన్నసంచిలో వలయు దుస్తులను సిద్ధము చేసికొని
చేరినాడు భద్రముగ కృష్ణాతీరమును మూర్తి
నావలోన ప్రత్యేకముగ నదిని దాటు నెడల
అనుమానాస్పద మగుట తథ్య మని అట్లు చేయలేదు.

పొలుచుచుండె గగనమున చంద్రుడు పుచ్చపూవువోలె
నిఖిలలోక మా యర్ధరాత్రమున నీరవమై యుండె.

దేవాలయముల కెదురుగ నుండెడి రేవున దిగలేదు
దేవసదనముల కించుక యావల తిరుగు నుత్తరముగ
పర్వత పంక్తుల నడుమగ కృష్ణా పవిత్ర తోయములు.
నదీతటమున పశ్చిమముగా నడిచి కొంతమేర
చడ్డీమాత్రము ధరించి, శిరసున సంచి కట్టినాడు
వీక్షించిన వా డావలితీరము వీరభద్రమూర్తి.
ఆవలి గట్టున ఆంజనేయుగుడి కభిముఖముగాను
అనువగుచోటను సలిలములలో నవతరించినాడు.

తటములు రెండును రాతితొట్టెలను తలపించుచునుండు
అర్ధక్రోశం బించుమించుగా నచ్చటి వైశాల్యం,
శేకాలంబును ప్రవహించును జల మెండిపోవకుండ.

చల్లని నీరము సోకినంతనే జలదరించె మేను,
అయినను వేసవికాల మగుటచే అతి శీతము కాదు.

సతి కౌగిటిలో కవోష్ణ సౌఖ్యము సంస్మరించినాడు
వివిధ సుఖమ్ముల భావన చేయుచు వేగ మీదినాడు
కొంత భాగమును మండూకమువలె సంతరించినాడు
బారలు వేయుచు నదిలో విశేషభాగ మీదినాడు.

తల యేమాత్రము నదీజలంబుల తడియనీయలేదు
తనూబలంబున కౌశలంబునను తటిని దాటినాడు,
కాకపూర్వమే యిరువది నిముసాల్ గట్టు చేరినాడు.

పొడివస్త్రంబులు ధరించి సూటిగ పోయినాడు గుడికి
ఆంజనేయునకు ప్రదక్షిణమ్ముల నాచరించినాడు,
చెట్లమాటుగా నత్తవారి యిలు చేరినాడు మూర్తి.

జాలమార్గమున దీపకాంతిలో జాయావదనంబు
వీక్షించినవా డుత్సాహముతో వీరభద్రమూర్తి,
గడపచెంత గల కలశోదకమున కాళ్ళు కడిగినాడు.

భార్య తుడిచినది వస్త్రఖండమున పాదమ్ముల తడిని,
శయ్యాగారమువైపున కుభయులు సాగిపోయినారు.

౮

ఈశ్వరుడే పట్టజాల డింటి దొంగ నను సామెత
అన్వర్థం బయిన దా అవధానుల వారియింటం.

పనులు చూచి గుంటూరున బ్రహ్మశ్రీ వేదమూర్తి
అవధానులుగారు వచ్చి రాత్రియ గ్రామమునకు.

నాల్గు రేలు నిజగృహాన నడచు వృత్త మెరుగ రామి
యథారీతి నతడు కాలయాపనమ్ము చేసినాడు.

పగటివేళ నిజపుత్రిక బహుళముగా నిద్రించెడి
కారణమ్ము నించుకైన గ్రహియింపనె లేదు తండ్రి.

చనియెను శాంతముగ రెండు సప్తాహము లీతీరున
కాని కాల మొక్కరీతి గడవ దనుట తథ్యము కద.

నాటి యర్థరాత్రమందు నదిలో దిగునప్పుడు మూర్తి
మెరయుచుండె నాకసమున మిలమిల నక్షత్రమ్ములు.

కాని కొంత దూర మీద గగనమ్మున చిరుమబ్బులు
వ్యాపించుచు చినుకులు పడు వైఖరి కానంగ వచ్చె.

బాహువులను సారించుచు బారుటీతమీద నదీ
తటమును బ్రాపించినాడు త్వరితముగా భద్రమూర్తి.

వలిపములం దాల్చి అత్తవారియింటి కేగుచుండ
చిటపట మని పడజొచ్చెను చినుకు లవిశ్రాంతమ్ముగ.

శ్వశురగృహము జేరుసరికి వస్త్రము లన్నియును తడిసి
నీరు కారిపోవుచుండె నెమ్మేనున ధారలుగా.

తుండుగుడ్డతోడ నొడలు తుడిచికొనుచు పంచలోన
ఆరవేసియున్న బట్ట లాతడు ధరియించినాడు.

కల్యాణీదేవితోడ కవోష్ణసుఖం బనుభవించి
వేకువనే అచటినుండి వెడలిపోయినాడు మూర్తి.

అవధానులుగారు స్నాన మాచరించి యుదయవేళ
పంచలోని కరిగెను మడి బట్టలు ధరించుటకై.

దండెముపై గానరావు ధౌతవస్త్రయుగళ మతడు
'ఆరవేయ మరచితివా' యని భార్యను మందలించె.

ప్రతివచనం బీయ నామె భర్త్రముఖము విలోకించి
చీర చెరగు వ్రేళ్ళ జుట్టి చిరునగవున నిలిచియుండె.

మరల భర్త ప్రశ్నింపగ మందహాస వదనముతో
'అల్లుడు వానిని ధరించి అరిగియుండ నోపు' ననియె.

'అల్లుడు ధరియించు టేమి' అనుచుండగ నతనిదృష్టి
పడినది యాకస్మికముగ తడిబట్టల కుప్పమీద.

అది యే మను భర్తమాట 'కల్లుడు గతరాత్రమందు
విడిచి వాని నిచ్చటనే వెడలియుండు' ననియె నామె.
భర్త్రప్రశ్నపరంపరకు భార్య యనియె సంగ్రహముగ
"గడచె రాత్రి యల్లుడిచట కల్యాణీదేవితోడ."

అవధానులవారి చిత్తమందు బండ్లు పరుగు లిడియె
భూకంప పురస్సరముగ పొంగిపోయె కృష్ణానది.

భార్య యింతలోన తెచ్చి పట్టుబట్ట లిచ్చువేళ
ఘటన లన్ని విస్తరముగ గ్రహియించెను యజమానుడు.

తన దృఢప్రతిజ్ఞ విడిచి తనయమీది ప్రీతిచేత
శిరస్సు పంకించి యనియె చిరునగవున భార్యతోడ.

'కానీ గజయీత గాడు, కానరాని యుపాయమ్ము
అంత నదీజలములయం దడుగడుగున పొడము ననుము.

'సుముహూర్తము పెట్టించెద అమావాస్య దాటగానె
తన తండ్రికి తెలియ జేతు తత్క్షణమే అని చెప్పుము.''

## సలిల సదనము

౧

"మరదలా, మరదలా, మై మరచి నిష్ఠతో
చూచుచున్నావటే జోగులాంబా ప్రతిమ !...
రాజలక్ష్మీ, నీకు మోజు పుట్టిన దటే
పెండ్లి కాకుండనే పిల్లపాపలమీద ?"

"వదినా, యెప్పుడు వచ్చితి వమ్మా ?
బందుగు లందరు బాగున్నారా ?
నవనీతమ్మును నాకెడి యువతుల
గాంచుచు నిను నే గనుగొన నైతిని."

"ప్రొద్దు పోయిన దలంపురము చేరెడుసరికి :
అత్తమామలును మీ అన్నయ్యయును నేను
శివరాత్రికిని ముందె శ్రీశైలమును జేర
పయన మగుదుము రేపు ప్రత్యూషకాలాన."

"ఒకపరి త్రిపురాంతకమును జూచితి
అలంపురములో అయ్యో నివాసము.
తూరుపు పడమర ద్వారము లగు నీ
క్షేత్రద్వయమున సేవలు చేసితి.
శ్రీశైలేశ్వరు సేవింపంగా
భాగ్యము నేటికి పట్టదు వదినా !"

"రా వచ్చు మా వెంట రాజలక్ష్మీ, నీవు
అమ్మయును, కొనిపోదు మశ్రమమ్ముగ మిమ్ము."

"అమ్మకీ నడుమ ఆరోగ్యము చెడె,
మరి ఆపై మీ మరది యేమనునో !"

"పెండ్లి యాడితి వెపుడు పిల్ల, మా కెవ్వరికి
కబు రంపనే లేదు గద్వాల దూరమా ?

"కాదది వదినా, కారణ; మెప్పుడు
బంధుగు లన్నను పరమ ప్రీతియె.

చిత్ర సంఘటనచే సమకూరెను
నా కల్యాణము : నమ్ముము వదినా!"

చెప్పవే చెప్పవే చిత్రవృత్తాంతంబు—
మాతమ్ము డెవ్వరో మరదలా !—సిగ్గేటే."

"శరభారాయుడు : సరి వదినా, మా
యింటికి రాకయె యొచటనో దగితిరి."

"ఆశ్చర్యమే ! పెండ్లి యాడినావా తుదకు
అల్ల శరభారాయనే ! అదృష్టము సుమ్ము !
మంచి మగడే దొరకె మరదలా మరదలా !
అంగీకరింపలే దతని నీ వెన్నాళ్ళో!"

"నిజమే, ఆయన నిండు మనస్సును
బహుకాలము నే బాధ పెట్టితిని."

"మే మందరము కూడ మిగుల వగచితి మపుడు !
నీ వెన్నిమారులో నిరసించితివి కదా
శరభప్ప, నె ట్లతడు సమ్మతించిన వాడో !
విన వలతు మీ పెండ్లి వృత్తాంత మంతయును."

"ఆలయమ్ము విడి అవలకు బోదము
జన సమూహ మిటె సాగివచ్చె నదె."
"తుంగభద్రా తట ద్రుమ శీతల చ్ఛాయ
వివరింప దగును నీ వింత సంఘటనము.
ఆలకించిన పిదప నరుదెంతు నీ తోడ,
నీ మగని, నీజనని నే విలోకింపవలె.

౨

"గండము తప్పిన గాని పట్టదట
యోగ మన్న నుడి యుక్తమె వదినా!
అంతటి యాపద అలసిన పిదపనె
తిరిగెను నా తలతిక్క నిజముగ.
కన్నతల్లి నను గారాబముతో
పెంచుట చేతనె పెంకె నైతి సుమి.
నాయన పోవుట నా దురదృష్టమె:
దర్పము స్వాతంత్ర్యమ్ము హెచ్చినవి.
తల్లిమాట యెడ తగిన లక్ష్యమును
నిలుపగ నైతిని నే నెన్నండును.

బందుగు లోకపరి కందనూలిలో
వేడుక జూడగ వెడల నుండగా.
అయితిని పయనం, బమ్మ యెంతయును
వలదు వల దనుచు వారించెను నను.

పట్టు పట్టితిని: బందుగు లమ్మకు
నచ్చ జెప్పి రెటొ నను కాపాడగ.

ఆ ప్రయాణమే అతి ఘోరముగా
పరిణమించె నొక పట్టున వదినా !

"ప్రయాణమున మాకు నెట్టి ప్రయాసమ్ము కలుగ లేదు
ఆశ్రమముగ జేరినార మందరమును కందనూలు.

రకరకాల సంబరాల సుకముగానె గడపినాము
నగరమ్మున మొదటినాడు నలుమూలలు తిరుగ వేసి.

మానివాస మాపురమున మారుమూల సత్రములో
అప్రయత్నముగనె మాకు నచట తోడు దొరకె నొకతె.

ఎడము చేసి మావారల నెన్నెన్నో నాకు జూపె
సంతలోన సంబరాలు సందెవేళ నూత్నవనిత.

రంగులరాటమ్ములోన రంగు కొయ్యగుర్రముపై
కూరుచుండి తిరిగినాను కొంతతడవు గిరగిరగిర.

కానిడబ్బుతోడ నాడు కాశీ రామేశ్వరాల
అద్దములపెట్టెలోన అనేకమ్ము చూచినాను.

మరుదినాన వచ్చి యామె మావారలతోడ రాత్రి
తోలుబొమ్మలాట కలదు తోడుగ బోవుద మన్నది.

తోలుబొమ్మలాట చూడ రాలే మేమాత్ర మనుచు
బడలికచే మావారలు పండుకొనిరి రాత్రివేళ.

కొత్త చెలిమికత్తె వచ్చి మెత్తని జమకాణముతో
అవలకు గొనిపోయి నన్ను, అన్నది మృదుమధురముగా :

'పోవుదమా ఇపుడు తోలుబొమ్మలాట, బాగుండును.
రాజమ్మా, వేగిరమే రావలె మొదలిడుదు రేమొ.'

స్వగ్రామమునకు రేపే జన నున్నా, వచట లేని
వింత లెన్నో కల విచ్చట వీక్షింతువు నేటిరాత్రి.

కట్టుకొనుము మంచి చీరె, కదలి రమ్ము శీఘ్రముగా
తిరుగ నిన్ను భద్రముగా దిగబెట్టుదు సత్రములో.

పగటివేళ గాఢనిద్ర పట్టి యుండు కతన నాకు
వీకతోడ నేను బయలువెడలితి నాయువతితోడ.

తొలుత నచటినుండి మేము తోలుబొమ్మలాటకు జని
కూరుచుండి చూచినాము కుతుకముతో కొంత తడవు.
ఇక చాలును లెమ్ము, లెమ్ము ఇంకొక చోద్యమ్ము కలదు
దరిసింతము రమ్మని నను త్వరపెట్టం దొడగె నామె.
ఇంతలోనె తెరమీదను గంతులతో కేతిగాడు
కానబడుటచేత నేను కదలనైతి నచటినుండి.

మాటలలో చేష్టలలో మనకు సిగ్గు వేయుచుండు
కాని వానిహాస్యములో కలుగు చమత్కార మెంతో.

పడజాలక ఆమెపోరు బలవంతము మీద లేచి
ఆమె పోవుమార్గమునే అనుసరింప దొడగినాను.

తుంగభద్ర కల్లోలినితో హంద్రీ స్రోతస్విని
సంగమించు ప్రదేశమునకు చనినా మారాత్రివేళ.

మింటిమీద స్వల్పముగా మినుకు మినుకు మనుచునుండె
తారక లే రెండో మూడో, తమ మెల్లెడ నావరించె.

కాని యచటి తీరమునకు కట్టివేసి యున్న కొన్ని
నావలలో దీపమ్ములు నక్షత్రము లట్టు లుండె.

చెంగటనే యున్న పెద్దయంగడిలో పండ్లు తీపి
కారపు తినుబండములను కనుగొనంగ నోరూరెను.

గ్రహించెనో యేమొ చెలిమికత్తె పండ్లు లడ్డువములు
విలిచి నోటి కందించెను వేగముగా బుజ్జగించి.

ఆరగించి యొకటి రెండు హంద్రీనది నీరు త్రాగి
చనవలయును సత్రమునకు సత్వరముగ నంటి నేను.

నడచి పోవ కష్ట మగును పడవమీద చనవచ్చును.
పుట్టి కాదు నీట మునిగి పోవు నన్న భయము లేదు.

చల్లని యీ రాత్రివేళ జల విహార సుఖముకూడ
గాంచవచ్చు, ఎన్నడు మీ గ్రామములో పొందలేవు.

అని ఆయమ వీపు చరచి నంతనె నిస్సంశయముగ
ఆమె ననుసరించుచు నే నందొక పడ వెక్కినాను.

అదియే తొలి పారపాటని అవల గ్రహియించినాను
మాంద్య మ్మాసమయమ్మున మానసమ్ము నావరించె.

ఇంచుక దూరమ్ము పోవ ఎదురుగ గానంబడియెను
తుంగభద్రగర్భమ్మున రంగుల అద్దాల మేడ.

గొందిపల్లినుండి మొదట కందనూలు పుట్టిమీద
మేము ప్రయాణించువేళ మేడదిక్కు జూడలేదు.

సమీపించె నింతలోనె సదనము మా పడవ; జరిగె
నా రెండవ పారపాటాభూరి దుర్ముహూర్తమందు.

ఏ మిది యని నే నడుగగ 'ఇది బొమ్మలమేడ, మనము
అరగడియకు పూర్వమ్మే అన్ని చూచి పోవగలము'

అని, నా సావాసగత్తె ఆన తిచ్చి కళాసులకు
ఆపి పడవ, ఏక నన్ను సోపానము లెక్కించెను.

3

సోపానము లన్ని యెక్కి చుట్టు పిట్టగోడ దాటి
అంగణమ్ములోని కేగ అత్తరు వాసనలు వలచె.

అచట నున్న బూబు మమ్ము నాహ్వానము చేసి లోని
కడుగులతడి యొత్తికొనగ నందిచ్చెను రెండు తుండ్లు.

అవల నచటి ఆసందుల నాసీనల జేసి మమ్ము
నఖ శిఖ పర్యంతముగా నన్ను పరీక్షించి యనియె :

అచ్ఛా, ఇది పల్లెటూరి అందకత్తె : రథమువంటి
నిండు తనువు పుష్టిదాని నేర్పున గొన వచ్చినావు.

అవు నవు నని చెలిమికత్తె ఆమె కేదో సంజ్ఞ చేసి
గోడలపై చిత్తరువులు చూడు మనుచు నన్ను వేడె.

దుర్గముల ముట్టడులును దుష్టజంతు సంహారము
ప్రకృతి రమ్యదృశ్యముల పటములు వీక్షించినాను.

అరుగుదెంచి ఆ బీబీ ఆసవపాత్రమ్ము నాకు
అందిచ్చెను, దిగ్భ్రమతో ఆస్వాదించినాను దాని.

వెడలిపోవ దలచులోన బడలిక వారించు ననుచు
ఏదో మధుర పదార్థమ్ము నిచ్చెను వీడియముతోడ.

విడెము చేసినంత నాకు వింత మాంద్యమావహిల్లె :
దాహ మంటి, నామె పాత్ర త్రావంగా నందిచ్చెను.

అవల నామె తెచ్చి చీర - అత్తరువాసనతోడ
గమగమ వలచెడు దానిని - కట్టుకొందునా యనియెను.

తెలిసికొనక సందర్భము వల దని చెలికత్తె గాంచి
పోవుదమా అన్నట్టులు భ్రూసంజ్ఞలు చేసినాను.

తదుపరి ఆ బీబీ నా తనువునిండ చీరెనిండ
రైకనిండ రాచిపోయె రకరకాల అత్తరువులు.

నవ్వుచు నా కుటిలురాలు నా ప్రక్కన గూరుచుండి
'నీ యదృష్ట మీ రాతిరి నిండుగ పండిన దోసీ!
చెప్పినట్టు చేతువేని సిరి నిను వరియింప గలదు!

కాంచినారు మన నవాబు క్రంతలలోనుండి, నీదు
నంగసౌష్ఠవమ్ము వారి నాకర్షణ చేసినదే.

ఉష్ణజల స్నానాదిక సువిధచేత జేయింతురు
నీ నిర్మల దేహమునకు - నిర్బంధము వేరు లేదు.

చల్లనిరే యిచట గడపి తెల్లవారు సరికి నీవు
సత్రములో నిద్రించెడి స్వజనమ్మును జేరవచ్చు.

పాత్రురాల వైతివేని ప్రభువు నను గ్రహమునకే
నీ యదృష్టరేఖవలన నిక్కాయే జరుగునేమొ!'
అను వాక్యులు దిగ్భ్రమతో నాలకించుచున్న నాకు
చెప్పరాని భయావేశ ముప్పతిల్లె నా క్షణమున.

తొలుత చెలుపకుండ దీని దోలుకు వచ్చితివి, కాన
విషయమ్ములు గ్రహియింపగ విశ్రాంతి నొసంగవలయు!
అనుచు బూబు లోని కేగ- అటు నిటు జూచితిని నేను,
కానబడిరి క్రంతనుండి కావలివా రొకకొందరు.

కొనివచ్చిన పడవక్రింద గోచరింప లేదు, నదీ
జలము మషీరసము వోలె బిలబిల బ్రవహించుచుండె.

చెలికత్తె కొంతవడికి చిరునగవున నరుగుదెంచి,
'ఏమి వత్తు వోక్కొ నవా బెదురు చూచుచున్నవారు.
చేయ గలుగుదేని వారి చిత్తరంజనంబు, పండు
నీ నా భాగ్యమ్ము' లనుచు నిలుచుండెను నామ్రోలను.

ఆపదలో బుద్ధిబలం బభిభూతం బగును, కాని
పక్షమ్మున మెరపుదీగె భాతిని వెల్గు తటాలున.

ఉదయించిన దాక్షణమున నొక్కయూహ, మల్ల నల్ల
తెచ్చికొనుచు లేని నగవు దిటవు పూని యిట్టు లంటి :

'హుజూర్ వారి ఖుషీకోస ముడుకునీళ్ళ తాన మాడి
క్రొత్త సన్నచీరె గట్టి వత్తు' ననుచు విన్నవించు.

అనుచు నేను పలుకు మాట లాలకించి చెలికత్తె
కుటిలురాలు వేవేగమె కుతుకమ్మున లోని కేగె.

చిత్తమ్మున భక్తితోడ శివుని దలచి, మునివ్రేళ్ళను
తివాసీల మీద నడచి తెరచి తలుపు, మరల మూసి

సవ్వడి లేకుండ దాటి సత్వరమే అంగణమ్ము,
సోపానశ్రేణిపంక జూచి దిగితి భద్రముగా.

పండుకొన్నవారు కాన భటులు నన్ను జూడ లేదు,
కుంటెన కత్తియలు కూడ వెంటాడను లే దయ్యెడ.

కలిసివచ్చె నన్ని కూడ, కావున నిశ్శబ్దముగా
ఇష్టదైవతమ్ము దలచి, యీద జొచ్చినాను నీట.

౪

"నిజముగా మరదలా, నిండు గండము తప్పె!
సాహసమ్మున నీకు జయము సమకూరినది!
ఏ మాయె నా మీద? ఎటు లిల్లు చేరితివి?
ఎట్లు శరభానాయనే పెండ్లియాడితివి?"

'నా కీతలో నేర్పు నీకు విదితమె కదా?
నదిలోన ఎవరైన నా వెన్క డిగి రేమొ
యని సావధానముగ నైదారు వారముల్
వెను దిరిగి చూచుచున్, వేగ వాహినిలోన
కొంతదూరము పోయి, కూలమ్ము జేరితిని.

అచ్చోటినుండి నా కారంగు టద్దాల
మేడ కనబడ లేదు – మిన్ను మ న్నేకమై
నీలి బురఖా దాల్చు చాలు మాత్రమె తోచె.

కట్టు చీరెను పిడిచి గట్టు వెనువెంటనే
ఒడ లెరుంగక నడచి నడచి చేరితి నెట్లొ
ఈ యలంపురమునే – ఏ మున్న దామీద!
నేరుగా జని బావగారి యింటికి తలుపు
తట్టినా, నాతండు ద్వారమ్ము దెరచుచునె
ఆకస్మికముగా నంతరాతిరి వేళ
వీక్షించి నను, మహావిభ్రాంతుడై నిల్చె.

అతని పాదాలపై ఆర్తిమెయి వాలితిని:
నను లేవ నెత్తుచున్ కనుల నీరము దుడిచి

మృదువుగా గొనిపోయి సదనమ్ము లోపలికి
సలిపినా డుచితోపచారముల్ మా బావ.

మూన్నాళ్ళు జ్వరములో మునిగి తేలితి నేను,
ఆరోగ్యము లభింప దాయె వారముదాక.
ఆత డడుగక పోయినప్పటికి స్వయముగా
వివరించితిని నేనె వృత్తాంత మంతయును.
విని జాలిపడె గాని వెక్కసంపడ లేదు__
దైవతమ్మె సుమ్ము భావమ్ములో బావ!
ఆవల శీఘ్రమ్ముగా నయ్యె కల్యాణమ్ము."

"గండము తప్పిన నిండుయోగ మట!
నీ పక్షమ్మున నిక్కువ మాయెను.

"ఆవాసమునకు బోవుద మింతట
మరిదల, లే నీ మగని జూడవలె.

"అంగీకారం బమ్మ యొసంగును,
భార్యాభర్తలు బయలుదేరవలె.

"శ్రీశైలేశ్వరు సేవించినచో
శ్రీ శివరాత్రిని సేమము లొదవును!"

సమాప్తము

# కా వ్యా వ లి

## చతుర్థ కదంబము

అం కి త ము

శ్రీ అడుసుమల్లి శ్రీనివాస రావుకు

## నైయాయికుడు

దీక్ష తోని న్యాయాబ్ధి మథించి, అందు
అమృతము లభింప నద్దాని నాస్వదించ,
రామనాథ భట్టాచార్య రమ్యకీర్తి
కాయ మజరామరం బయ్యె గౌడభూమి.

అతని సహధర్మచారిణి అధికభక్తి
యుక్తి నుపచారముల్ సేయుచుండ నెపుడు
దుస్తరం బైన న్యాయాబ్ధి నిస్తరింప
జేయు శిష్యుల భూసుర శ్రేష్ఠు డెలమి.

జగతి కత్యంతముగ భ్రమజనక మైన
నిగ్రహ చ్ఛల జాత్యాది నిగళ పటలి
దత్కరుణ శిష్యమండలి దాటుకతన
ప్రమ జనించి నిశ్శ్రేయసప్రాప్తి యయ్యె.

అతికృపాయత్తచిత్త యైనట్టి వాణి
అతని పూత జిహ్వాగ్రంబు నాశ్రయింప
వేడ్కకైన ప్రసారింప వెరచు లక్ష్మి
నిజకటాక్షమ్ము దత్కుటీనికటసీమ.

మార్పు లేదాయె కాలక్రమమ్ముమీద
నైన నేతద్విరోధ వృత్తాంతమందు.
శ్రవణగత మయ్యె శ్రీకృష్ణచంద్ర ధరణి
నాథునకు నెట్టులో రామనాథుని దశ.

తత్సభాస్థలిలో కవితా లతాంగి
చేయు లాస్యంబు పండితశ్రేణి ప్రోల

ఆ నృపాలోత్తముని యపాంగావలోక
పథగతం బయి తేవడి పరుగువారు.

జ్ఞాత విద్వన్మహా పరిశ్రముడు కృష్ణ
చంద్ర నృపతి అరికత్తహస్తములతోడ
ఆర్ద్రహృదయముతోడ గ్రామాంతరస్థ
పండితుని దర్శనోత్కంఠ బయలు వెడలె.

అశ్వశకటమ్మునందుండి అవతరించి
ప్రభువు విద్వద్వరేణ్యుని ప్రాతయింటి
సవిధభాగమ్మునం బాదచారి యగుచు
అనుచరునితోడ జొచ్చె తదంగణంబు.

ప్రాంశు మేనుర తింత్రిణీ పాదపంపు
నీడ నుపవిష్టుడై కడు నిష్ఠతోడ
పుస్తక విలోకనాయత్తబుద్ధి యైన
పండితోత్తము గన్గొనె ప్రభువరుండు.

అంతికము జేరి బ్రాహ్మణుసంఘ్రిరజము
నిజశిరమున దాలిచి నిలిచె నెదుర
కరసరోరుహములు మోడ్చి గాఢభక్తి
సరసశేఖర శ్రీకృష్ణచంద్ర నృపతి.

ప్రభువు నాశీర్వదించి యా బ్రాహ్మణుండు
శీర్యమాన కటాసనాసీను జేసి
ఆదరమున ననామయం బడిగినంత
కొంతతడ వుత్సుకతతోడ గోష్ఠి సాగె.

పిదప నరపతి విప్రునిపేదరికము
నపనయింపగ నెంచి, వాచ్యమ్ము కాక

వ్యంగ్యమర్యాదతో నిట్టు లనియె : "మీకు
ఆర్య, ఉండునె యేమైన అనుపపత్తి ?"

చిరునగవుతోడ భూసురశ్రేష్ఠు డధిపు
నాననాబ్జ విలోకన మాచరించి
'అనుపపత్తి సహింతుమే అధిప ? మాకు
సకల ముపపన్నమై యుండు శాస్త్రదృష్టి."

అనుటయును, కృష్ణ భూపతి యవని సురున
కనె : "అసంగతి యుండునే ఆర్య, మీకు ?"

"మా కసంగతి యుండ దేమాత్రమేని,
సకలము సుసంగతం బగు జనవరేణ్య."

ఇట్లు నైయాయికుండు వచించినంత
స్పష్టముగ జెల్పినం గాని ఫలము లేమి
అధిపతి గ్రహించి "ధనలోప మార్య, మీకు
శ్రమ మొసంగునె ?" అనుచు ప్రశ్నమ్ము చేసె.

"భుక్తి ధాన్యంబు పండెడు భూమి కలదు,
వండు నిల్లాలు చింతాకు వ్యంజనంబు,
గడచు శాస్త్ర సమీక్షలో కాల మెల్ల,
ధనముతో మాకు పని యేమి ధారుణీశ ?"

అనెడి నిరుపేద విప్రుని యాననమున
శాంత రస ధాత దివ్య వర్చస్సు తోచె.
కాంచె నత్యంత విస్మయాక్రాంతి కృష్ణ
చంద్ర భూపతి పండిత సార్వభౌము !

# వీరశైవుడు

అనుదినము చెప్పుచుండు కల్యాణనగర
రమ్యతోరణ భూమి బౌరాణికుండు
గ్రంథముం జూచి చరితముల్, కాపౌరుకులు
చెవులు రిక్కించి వినగ నచ్చెరువుతోడ.

నిజవదన భస్మ దీధితి నిఖిల దిశల
చంద్రికలు కాయ, కంఠదేశమ్మునందు
దివ్య రుద్రాక్ష మాలిక తేజరిల్ల,
శైవ లింగ పసాయిత శస్త్రధారి
భూరి పంచాక్షరీజప పూతవాక్కు
వీరశైవుడు కక్కయ్య వీథివెంట
పోవువాడు విలోకించి, పుణ్యకథలు
చెప్పుచున్నాడు భట్టని చేరె దరికి.

నాలుగడియలకాల మానా డతండు
తత్పురాణమ్ము వినుచు క్రోధమ్ముతోడ
నేత్రములు జేవురింపగా-
నిలుపు మింక
పక్షపాతి పురాణపు భట్టుగాడ
నీ యసత్కథ! గ్రంథంబు నీరు చేతు!
తునిమెదను నాల్క ఓ శివద్రోహి, ఇదిగో!"
అని మహోగర్జ సేయగా, నచటివారు
మ్రాన్పడిరి భీతిచే నోట మాట లేక.

"హరి జగత్కర్త యనె గాని హరికి భర్త
ఈశ్వరుం డని చెప్పలే దీ కథకుడు.

“హరి పరాశక్తి యని చెప్పె, నంతె కాని
చెప్పడు పరాపరుం డిందుశేఖరు డని.

“హరి మహామాయ యని మాత్ర మనియె గాని
హరి విభుండు మహామాయ యనడు వీడు.

“హరుడు బ్రహ్మకపాలమ్ము హస్తమందు
పట్టి భుజియించె నున్నని పలికె గాని
సంపద లొసంగు నిజభక్తజనుల కనడు.

“ఇట్టిభవి, కట్టిద్రోహికి, ఇట్టిపాపి
కీశ్వరప్రీతి యగునట్టు లిదిగొ శిక్ష!”
అని యురుమునోలె కక్కయ్య అర్చి పేర్చి,
హర, మహాదేవ, త్రిపురసంహరణ! యనుచు
చేతిడొంకెనతో భట్టుశిరము ద్రుంచి
శోణితాక్త శరీర సంశోభి యగుచు,
“జయజయ బసవలింగ, నందికేశ్వర, కుమార,
శివ, భవానీశ!” యనుచు తాండవము చేసె.

## క్రుద్ధముని

### జమదగ్ని

ఎరుక కలదె నీకు ఎంత ప్రొద్దెక్కెనో?
ఎపుడు వెడలిపోతి వింటినుండి!
అడుగులోన నడుగు నిడుకొంచు కూర్మంబు
వరుస మందగతిని వచ్చినావు.

గృహిణి యైనదాన వహరహమ్ము సమస్త
విధులు నియత మైన వేళలందె
చక్కబెట్టుచుందు, వక్రజమ్ముగ నేడు
ఏల చేసినానొ యింత జాగు ?

హోమవేళ దాటె నీమూలమున, నేడు
ప్రత్యవాయ మయ్యె భ్రష్టురాల !
సాధ్వసంబు జూడ సంశయంబు జనించు,
నిజము తెలుపకున్న నిగ్రహింతు !

రే ణు క

కోపరక్తాక్షులను కనుంగొనుటవలన
కంప మొదవెను సర్వాంగకంబులందు
అంతియే కాని యేదోష మాచరింప
సంశయించుట తగదు నిష్కారణముగ.

జ మ ద గ్ని

హోమవేళ దాటు టోసి, యెరుంగక
సిగ్గు విడిచి యెదురు చెప్పె దేమి ?
సాధ్వి కర్హ మగునె సాహసవాక్యమ్ము ?
ఎందువలన నయ్యె నింత జాగు ?

రే ణు క

ఘట్టమున కేగి గంగోదకమ్మునందు
కలశమును ముంచి పూరించి కదలువేళ
శ్రవణ గోచర మయ్యె నుత్సాహ భరిత
మంజుల రవంబు వాహినీ మధ్యమందు.

అపుడు సంజాత కౌతుకాయత్త చిత్త,
నగుచు కనుదోయి బరప బ్రత్యక్ష మయ్యె
వీచికలలోన లోచన రోచనముగ
క్రీడ సల్పెడి యప్సరః స్త్రీగణంబు.

అచ్చరల పిండు వారివిహారలీల
నంత కంతకు నాదెస కరుగుదేర
కానవచ్చెను కామినీ గణములోన
మోహనాంగుడు గంధర్వమూర్తి యొకడు.

రమణు లందరు నా కదూరమ్ములోన
ఆ మనోహరమూర్తితో నంబుకేళి
సలిపి తద్దివ్య కంఠదేశమ్మునందు
విప్ప నంభోజదామమ్ము వేసినారు.

ఆ యపూర్వ విహారమ్మునందు మనసు
తగిలి యుండుటచే కొంతతడవు చనియె.
మరల నెన్నడు నాకు మైమరపు రాదు,
ఈ చరణదాసి నిపుడు క్షమింప దగును.

## జ మ ద గ్ని

మజ్జగమ్ములందు లజ్జావిహీనురా
లింతకంటె గలదె యెవతెయేని !
బ్రాహ్మణోత్తమునకు భార్య వైనట్టి నీ
వెట్లు చూచుచుంటి వితరపురుషు ?

భార్య కపుడు భర్త పరదైవతం బను
ధర్మవాక్య మరపు తగిలె నోసి !

పరమపూత మైన భార్గవాన్వయ కీర్తి
పాడు చేసినావు భ్రష్టురాల !
ఇట్టి యాడుదాని నెట్లు క్షమింతును !
ఒడలు మండిపోవుచున్న దోసి !
పోయి పడుము వేగ పుణ్యభాగీరథీ
తోయముల నఘంబు తొలగి పోవ !

రేణుక

ప్రాణములు పోవు నని నాకు భయము లేదు
కాని, సాధ్వని పుత్రుల గన్నదాని
వయసు దాటినదాని నీ వరుస, మీరు
తపసు లయ్యును దూషింప ధర్మ మగునె ?
పాప మొనరించుచో శిక్ష భావ్య మగును :
కొద్ది జాగయ్యె నని మహాకోప మూని
అనపరాధిని పై నింత యఘము మోపి
మనసు చిల్లులు పడిపోవుమాట లనుము—

జమదగ్ని

నోరు మూసికొనవె యూరక ప్రేలక !
ఒరుని జూడ వచ్చె నొక్కసారి
మరల జూచునెడల మనసులో తాత్కాలి
కానురాగ మున్నదనుట ధ్రువము.

రేణుక

ఎంత విపరీత సిద్ధాంత మిది మహాత్మ !
ఏండ్లు దాటిన బ్రాహ్మణి కేమి రక్తి ?

వేడుక జనించినది జలక్రీడ జూడ:
అన్యభావము లేదు నా కంతకన్న.

### జమదగ్ని

శిష్టులైనవారి సిద్ధాంతమున అష్ట
విధము మైథునమ్ము—వీక్షణమున
నిండుదోష ముండు నిస్సంశయమ్ముగా,
నేత్రదోష మిపుడు నీవు బట్టె.
కాన, పోయి పడుము గంగోదకమ్ములో
మా కుల ప్రతిష్ఠ మాయకుండ.
కదల కున్న నిన్ను ఖండింతు! శ్రోత్రియుల్
ధర్మహాని యన్న తాళ లేరు.

### రేణుక

భర్తచే నిట్టి మాటలు పడిన వెనుక
బ్రదికి యుండిన నేమి శుభమ్ము కలదు!
సాధ్వి కెంత నికారమ్ము సంఘటిల్లె!
చంపివేయుడు నను స్వహస్తముల తోడ.

### జమదగ్ని

భార్గవాన్వయమ్ము బహు కాలమందుండి
నిష్కలంక కీర్తి నెగడుచున్న,
దట్టిదాని నిప్పు డలమె కలంకంబు—
నిజకుల ప్రతిష్ఠ నిలుపవలయు.
వసు, మనాదులార, వైళంబ చనుదెంచి
మత్త దీని జావ మొత్తు డోరి!—

ఊరకుండు రేని భీరువులార, స్త్రీ
హాననఫలము మిమ్ము నంటబోదు.

చెప్పినట్టి పనిని చేయరా యేమిరా !
తండ్రిమాట వినని తనయు లేల?
వరుస వీరి నెల్ల వధియింప నేతెమ్ము
ప్రమథనాథ శిష్య, పరశురామ !

# గురుశిష్యులు

## ప్రథమ రంగము

( ఆశ్రమ పదము : ఉదయకాలము.
గురువు : దేవ శర్మ, శిష్యుడు : విపులుడు.)

### దేవశర్మ

యాగము చేయింపంగా
నేగుచు నున్నాడ నోయి, ఈవేళ, మదీ
యాగమనము పర్యంతం
బేగతి గాపాడ గలవో యీ యాశ్రమమున్ !

కనిపెట్టి యుండు మగ్నుల,
అనువుగ గాపాడుచుండు మాశ్రమ మృగమున్,
మునులును మాన్యాతిథులును
జనుదెంచిన జేయ వలయు సత్కారంబుల్.

ఒక మాట : అప్రమత్తత
నికటంబున మెలగుమండి నీ గురుపత్నిన్
వికచాంబు జాయతాక్షిని
వికసన్నతి రక్షసేయు విపులా, యెపుడున్.

రుచి అధిక సుందరాకృతి
శచీవిభుడు దీని గాంచి చాల దినంబుల్
విచలితు డై యున్నా, డిక
నచిరంబుగ నరుగుదెంచు నాశ్రమమునకున్.

కపటోపాయ ధురీణుడు
విపులా, అమరేంద్రు డెపుడు వేచియె యుండున్.
తపసి జనంబుల గనుగొ
న్నపు డా కాముకుడు పొందు నధిక భయంబున్.

నిను వంచించుట కై యా
యనిమిషపతి యింద్రజాల మవలంబించున్.
కనుగొని నీ వెటులైనను
వనితకు రక్షణము చేయవలయును జుమ్మా!

విపులుడు

అమరవల్లభునకు నన్యదారల యెడ
నుండుగాక మోహ ముత్కటముగ
అతడు వలచినట్టి యాయమ సతి యేని
పాకశాసనునకు పరిభవంబె!

అధిక బాధ కలిగె ఆచార్యదేవ, మీ
రాడినట్టి మాట లాలకింప!

అతి పవిత్ర హృదయ యైన యాచార్యాని
నిట్లు మీరు సంశయింప దగునె !

దే వ శ ర్మ

సంశయము కలిగి కాదా
యంశము వివరించు టెల్ల : అతివల శీల
భ్రంశ విధానము తెలియునె
వింశ త్యబ్దముల వేద విద్యార్థులకున్ ?

నీ వెరుగవు స్త్రీ హృదయము,
కావున విపులా, పురాణకథ వివరింతున్ :
దేవర్షి నారదుడు మును
త్రోవం జనుచుండ నెదుట తొయ్యలి తోచెన్.

ఆమె వియచ్చర కామిని,
నామమ్మున పంచచూడ : నారదు డామెన్
ఏమే నీ వొక నిజం
బే మర్మము లేక తెల్పుదే యని యడిగెన్.

స్వామీ, దేవర్షులు మీ
కేమైనను దెలియనట్టి దెందును గలదే ?
సామాన్యురాలి దేవర
యీ మాడ్కి ననుగ్రహింప నేమి కతంబో ?

అనతి యిండు మహాత్మా,
నే నెరిగిన యంతవట్టు నిజమె వచింతున్
సూనృతము శుభప్రద మని
ఆ నాళీకాక్షి యనియె నతివినయమునన్.

సాకల్యంబుగ దెలుపుము
నాకున్ స్త్రీహృదయ మనుచు నారదు డడుగన్
రే కెత్తిన లజ్జారుణ
యై కామిని పలికె మందహాసముతోడన్.

వనితను నేను మహాత్మా,
వనితాహృదయమ్ము దెలుపవచ్చును! అయినన్
వినినదియును కనినదియును
అనుభవమును విన్నవింతు నానతి యగుటన్.

తరుణికి మనోజ్ఞ చీనాం
బర ధన మాల్యానులేప బహువిధ రత్నా
భరణాదికమ్ము కంటెను
పురుషునితో సంగమమ్ము భూరిప్రియమ్మా.

నారులకు గలుగ దందురు
పూరుషసంతృప్తి: పురుషపుంగవు లలితా
కారుని గనుగొను నెడల వి
కారము చెలరేగి మదనకళ లుదయించున్.

పరిణీత లయ్యు వనితలు
పరపురుషుల మీద వాంఛ బాధం బగుచో
చరియింతురు గూఢముగా,
పరికింపరు కులము ధనము భర్తృగుణంబుల్.

అనుకూల దేశ కాలము
లనువుపడన్ విడువజాల రన్యవయఃస్థున్
వనితలు : పాతివ్రత్యము
పెనుదండన భీతి నుండు పృథ్వీస్థలిలోన్.

ఇది సామాన్యముగా స్త్రీ
హృదయం బని పంచమూడ యీపల్లజన్
మృదు మధురమ్ముగ బలుకగ
ముదితుం డయి దాని కపుడు ముని సెల వొసగన్.

ఇతిహాసము వింటివి నీ,
వతివల హృదయాంబుజంబు లతిచంచలముల్.
సతి యైనను రుచి, యామెకు
జతనమ్మున చేయవలయు సంరక్షణమున్.

## వి పు లు డు

ఆజ్ఞ యిచ్చి నట్టు లాశ్రమ రక్షణ
నెరపువాడ నేక నిష్ఠతోడ
క్రతువు పరిసమాప్తి కావించి ఆచార్య,
అచిరకాలముననె అరుగుదెందు.

# ద్వితీయ రంగము

(ఆశ్రమములో వెనకవైపున పుష్పోద్యాన
ములో రుచీదేవి పరధ్యానముగా కూర్చున్నది.
సమీపములో లేడిపిల్ల ఆడుచున్నది.)

## రు చీ దే వి

ఇచ్చటికి నేతెంచుచున్నా
డెవ్వ డీత డపూర్వ పురుషుడు
త్రస్తభావముతోడ పశ్చాద్ద్వార దేశమునన్.

అలక లల్లల్లాడుచున్నవి
ఆననాబ్జము మీద మృదువుగ
శ్మశ్రు రహితము లైన గండస్థలము లొప్పారున్.

ఎంత యుజ్జ్వల మైన వోహో
యితని యాభరణాంబరంబులు
క్షాత్ర తేజము వెలయు చున్నది చక్షురుత్సవమై.

నిఖిల దిక్కులయందు నిర్వ్యోఢ
నిబిడముగ వ్యాపించు నీతని
కంఠలంబి ప్రసవ మాలా గాఢ సౌరభమే.

దివ్యపురుషుడు వోలె నెంతయు
తేజరిల్లుచు నున్న యీతం
డసమయంబున నేల యిచటికి నరుగుదెంచు నొకో!

వెడలినారు క్రతూపదర్శన
విధిని మా యజమాను లని యీ
ప్రాంతమందలి యెల్లవారికి పరిచితంబె కదా.

కామనీయుం డితడు కర్ణా
కర్ణిగా నా రూపసంపద
నాలకించి దిదృక్షచే నిట కరుగుదెంచు నొకో!

అమర సదృశుం డైన యీతని
కతిథి సత్కారంబు చేయుట
ఆశ్రమానూచాన ధర్మం బాత్మ సమ్మతమున్.

## వి పు లు డు

( ఆవలి గవాక్షమునుండి చూచుచు )

అమ్మ చూచుచున్న దాశ్చర్యమున రెప్ప
పాటు లేక యిట్లు పార్శ్వమునకు.
ఏల యొదవె నీమె కింత యుల్లాసంబు ?
ఆటలాడు నేమొ హారిణకంబు.

వింత సౌరభమ్ము వీతెంచుచున్నది
సకల దిశలనుండి సాంద్రముగను.
అత డెవడు నూత నాద్భుత సుందరుం
డాశ్రమమ్ములోని కరుగుదెంచె!

తెలిసె తెలిసె నితడు దేవేంద్రు, డియ్యది
పారిజాత దామ పరిమళంబు.
నన్ను జూచునేని నాకేశు డల్లంత
పారిపోవగలడు ప్రకృతమందు.

ఎన్న డితడు మరల చేతేర కుండంగ
అమ్మ యొట్టి కలత అందకుండ
చేయవలసి యుండు శీఘ్ర ప్రతిక్రియ :
గురువు దాని కేల కోపగించు ?

( ధ్యానము చేయును )

సత్వరంబ యోగశక్తి నావేశించి
అమ్మదేహమందు, ఆమె నోట-
సిగ్గు పుట్టునట్లు చీవాట్లు పెట్టింప
ఇంద్రు డెపుడు మరల నిటకు రాడు.

( అంతర్ధానము )

## ఇంద్రుడు

( మెల్లగా రుచిని సమీపించి )

ఎంత కాలమ్మునకు నాకో
యిందువదనా, సంఘటిల్లెను
నీ మనోహరమూర్తి సన్నిధి నిలుచు భాగ్యంబు!

స్వర్గధామమునందె కాదో
సరసిజేక్షణ, ఉండ నేర్చునె
నీనఖాగ్రము బోలు సుందరి నిఖిలలోకములన్ !

అఖిల సౌందర్యైకదేవత
నబ్జజాండు సృజించి ప్రజ్ఞను
మునికులమ్మున ద్రోసి చివరకు మూఢుడై పోయెన్.

తావకీన పదాబ్జసంగతి
ధన్యమైనది యీ కుటీరము!
కాని ఇయ్యది కౌముదీరుచి గప్పు మేఘంబే.

మేఘజాతి వశంగతంబై
మెలగుచుండు మదాజ్ఞ గైకొని.
దాప నేటికి నింక, నే నో తరుణి, యింద్రుండన్.

(రుచి లేవ బోయి వెంటనే స్తబ్ధ యగును)

నీ ముఖామల కౌముదీరుచి
నిఖిల దిక్కుల గాయునట్లుగ
వారిదంబును బారద్రోలగ వచ్చినాను రుచీ !

ఏల తావక వదన చంద్రిక
ఇంతలోనె అడంగిపోయెను ?
అమరవల్లభు డీత డను వెర గాక్రమించినదా ?
ఆదిలో నా కభిముఖమ్ముగ
నరుగు దెంచెడి రీతి లేచుచు
తత్క్షణంబె నిషణ్ణ వైతివి ద్వారసవిధమునన్.
నిన్ను గాంచిన నిముస మాదిగ
నేటివరకును నిర్జరీగణ
వదనములపై వలపుజూపులు వాల్పలేదు రుచీ !

(రుచి ముఖము పై కత్తి వెంటనే వాల్చును)

మామకానుచరుండె యయ్యును
మన్మథుం డతిధూర్త వృత్తిని
వేచుచుండును నన్ను నిరతము విబుధలోకమునన్.
చూచె దేటికి చిత్రపటగత
సుందరాకృతివోలె నాదెస ?
ఇంత శీఘ్ర వికార కారణ మేమొ తెల్పగదే !
చాలకాలమునుండి నీకై
సంతసించుచు నే జరించుట
కిచ్చు నిక్కువ మైన సాక్ష్యం బీ వనస్పతులే.

( అనునయముతో )

పలుకవైతివి లేవవైతివి
బాహు లతికలు చాపి వేగమె
ఒసగవైతివి నాకు నీ గాఢోపగూహనమున్ !

## శచీ దేవి

( వికటముగా జూచి నవ్వి )

మంచిమాట ! ఇంట మగవారు లే రని
అరుగుదెంచినారె అదను వేచి!
స్వర్గపురమునుండి చల్లగా వచ్చిన
మార్గముననె వేగ మరలి పొండు !

అనుచరుండె కాన అతిధూర్తమన్మథు
వశము చేసికొనగ వచ్చు మీరు.
అమరలోకనాథు నంతటి వానిని
సేవకుండు వేచ సిగ్గు కాదె!

మీరు కోరగానె మీమీద వాలంగ
కాము మేము దివిజకామినులము.
మానవాంగనలము, మా ధర్మములు వేరు-
ఇంచుకంత జ్ఞప్తి యుంచికొనుడు.

ఎదురు చూచుచుండు నేవేళకును రాని
ధూర్త భర్తకొరకు దుఃఖజనిత
బాష్ప మలిన వదనపద్మ శచీ దేవి :
విబుధలోకమునకు వెడలు డింక !

(ఇంద్రు డులికిపడును. ఆమె కన్నులు మూసికొని గోడ కానుకొని నిశ్చేష్టురా లగును. ఇంద్రుడు తికమకపడి మెల్లగా బయలుదేరి కొంచెము దూరము నడవగా విపులు ఎదురు పడును. ఉలికిపాటు సర్దుకొని నమస్కారము చేసి చిరునవ్వుతో)

### ఇంద్రుడు

ఆర్య, మీ యాచార్య దర్శన
మాచరింపగ నేగుదెంచితి,
ఎచటికో చనినారు వారని యిపుడె తెలిసినది.

తిరుగ వచ్చెద రెప్పు డైనను
దేశికోత్తము దర్శనార్థము.
ఆర్య, సర్వము కుశలమే కద ఆశ్రమ స్థలిలో ?

### విపులుడు

(తీవ్ర స్వరముతో)

తిరుగ వత్తు వొక్కొ దేవేంద్ర, ఆచార్య
దర్శనమ్ము చేయు ధర్మబుద్ధి !
అంత శ్రమము తగునె ? అమరావతీ పుర
మధిక దూర మిచటి కమరనాథ !

ఇప్పు డెవరి దర్శనేచ్ఛతో వచ్చితో
నాకు దెలియు; నీవు నన్ను జూడ
కామె నికటమందు నాడిన దుర్భాష
లైన శృంగభంగ మవగతములె.

నిలుపు కొనుము చూపు నిర్జరాంగనలపై,
మునుల సతులమీద మోహ మేల ?
గౌతమాశ్రమాన గడచిన ఘటనలో
చాలినట్టు లేదు శాస్తి నీకు !

అమర విభుత గాంచి అతిమత్తుడై భవ
త్పత్ని సాధ్వి శచిని బడయ గోరి

భ్రష్టుడైన నహుషుభంగి నైననె కాని
నీకు బుద్ధి రాదు నిర్జరేశ!
ఇంక నెపుడుగూడ నిటువైపు రాబోకు,
మరుగుడెంతు వేని యమరనాథ,
గురుని శాప శిఖికి గురి యయ్యెదవు సుమ్ము!
విబుధ లోకమునకు వెడలు మింక.

( ఇంద్రు డంతర్ధాన మగును )

తొలగి పోయె నేటితోడ నుపద్రవ,
మాశ్రమమ్మునందు నలరు శాంతి!
దేశికేంద్రు మతము దివ్యమ్ము: స్త్రీ రక్ష
ఆచరింపవలయు నధిక యుక్తి.

# ఛిద్ర ఘటి

## ప్రథమ ఘట్టము

“నేడిటు లోయి కృష్ణ, కమనీయ
భవద్వదనాబ్జ దీధితుల్
వాడిన వేమి? నీ నయన వారిజ
యుగ్మ మకారణమ్ముగా

మోడుపు జెందె నేమిటికి?
మోహన దివ్య దరస్మితోల్లస
ద్దాడిమ బీజ సల్లలిత దంతరుచుల్
ప్రసరింప వేలొకో?

ఏల మనోజ్ఞవేళ శయనించితి
వోయి కుమార, యీగతిన్?
చేలము గప్పి యుష్ణ దతసీ
కుసుమోజ్జ్వల గాత్రవల్లి శో
భాలస మేల చేసె దటు? లక్కట,
చిల్కవ దేమి బంధు క
న్గాలను నీ సుధామధుర
నవ్య వచోరస లేశ మేనియున్?

కోపము కల్గె నోయి వ్రజ కుంజర,
నాపయి నేటికేని? సం
తాపము కల్గె నోయి గుణధామ,
యెదో మన రాధమీద ఆ
రోపణ చేయుచున్నది అశోచక
లోకము నింద యంచు? తం
డ్రీ, పలుకంగ రాదె జననీ
హృదయ వ్యధ తీరిపోవగన్?

నాయన, నీ తనూలతిక న
న్నొకమారు స్పృశించి చూడ ని
మ్మాయెడ నుష్ణమే తగిలె నేమొ!"
అటంచు యశోద కృష్ణుపై

జే యిడ, కప్పుకొన్న తన చేల
  మొకింత యెడల్చి యామెపై
నాయత నేత్రముల్ నిలిపి
  అల్లన గోకులచంద్రు డిట్లనెన్ :
"ఏటికి కోపరేఖ యుదయించు
  తనూజ మనమ్ములో దయా
పేటిక యైన మాత యెడ ?
  ప్రేమ సుధారసవృష్టిలో పరాం
కోటిని జెంది యెల్లరకుగూడ
  మహా స్తవనీయ మాతయే :
సాటి మరొండు గాంచుట అసాధ్య
  మసాధ్యము తల్లిప్రేమకున్ !

లోకము కర్ణ శ్రవణ లోలుప
  మెల్లపుడున్, వ్రజాంగనా
నీకములోన రాధపయి నిందలు
  వ్యాపన చేయు భావ మ
స్తోకముగా గనంబడును దోష
  మెరుంగని యామెమానసం
బాకలితంబు నీ సుతున
  కందులకై వగ పొంద నెన్నడున్.

ఈ దివసావసానమున
  నెంతయు వేచుచు నున్న దీక్షతో
వేదన" యన్న భాషణము
  వీనుల సోకిన యంతనే మహా

ఖేదజ మైన గద్గదిక
  కృష్ణునితోడ యశోద "చెప్పగా
రాదుర కన్నతండ్రి, అచిరమ్ముగ
  నీజనయిత్రి కేకథన్ ?

చెప్పితి విప్పు డేనియును,
  చెచ్చెర వైద్యుని బిల్వనంపి నే
జప్పున వత్తు" నంచు మొగసాలకు
  బోయెను దాసి కోసమై.
అప్పుడె లోనికిం గలిపయాంగన
  లొక్కట నేగుదెంచి "నీ
వెప్పటి యట్లు కానబడ వేటికి
  తెల్పుము కృష్ణ!" నావుడున్-

వల్లవకామినీ వదన వారిజముల్
  ముకుళించి పోవగా
ఉల్లము లెల్ల ఝల్లు రన ఉస్సురు
  మంచు యశోదనందనుం
డల్లన నేత్రముల్ దెరచి
  హస్తము చేర్చి లలాటసీమపై
"వెల్లుగ నేడు నన్ను వెత బెట్టు
  శిరోవ్యథ దుర్నివారమై.

అమ్మకు నమ్మక మ్మధిక మౌ వథ
  మన్నను, వైద్యు బిల్చ భా
వమ్మున నేరనో యతని పజకు
  బంపగ బోయె నిప్పుడే.

వమ్ము తదీయ యత్నము, లవమ్ము
 శిరోవ్యథ మాన" దంచు త
ల్పమ్మున వెన్ను వాల్ప వ్రజ
 భామిని యోర్తుక ఆర్తి కృష్ణుతో-

"ఔషధసేవ నిష్ఫలమె యైన
 మరెట్టులు మాను నీ శిరో
దోషము కృష్ణ? ఏమియును
 దోచదుగా భవదీయ బాధ ని
శ్శేషము కానిచో" ననగ,
 చెంగట నున్న ఘటంబు వ్రేల నా
యోషకు జూపి "దాన యమున
 నోదకముం గొని తెచ్చి యెవ్వరేన్-

నేరుపుతోడ నాపయిని
 నీరకణమ్మును రాలనీక ము
మ్మారు ఘటమ్ము త్రిప్పనెడ
 మాను శిరోవ్యథ" యన్న మోహనా
కారుని భాషణమ్ములకు గాటపు
 విస్మయ మావహిల్ల, ఆ
వారిజనేత్ర యిట్టు లను
 వారల గాంచి దర స్మితాస్యయై:

"చూచితిరే నవీన మగు చోద్యము!
 ఛిద్రఘటంబు, సూర్యజా
వీచికలందు ముంచినను వేగమె
 తోయము నిండ, దింటికిన్

వే చనుడెంత మన్న పదవీ
　ముఖమందె స్రవించు బిందువుల్-
తోచుట లేదు నా కిపుడు
　తొయ్యలులార, ఉపాయ మేమియున్.

నీవె విధానముం దెలుప నేర్చిన
　మే లగు నందనందనా !"
నావుడు కృష్ణు డిట్లు లను :
　" నాపయి ప్రేమ నిమేష మేనియున్
భావములోన ఎవ్వ రెడ బాయక
　యుందురో వారు తెచ్చుచో
పోవదు బిందు వేని జల
　పూర్ణముగా ఘట ముండు నెచ్చెలీ !"

అల్లన ఇంతలోన పునరాగత
　యాచు కవాటసన్నిధిన్
తల్లి తనూజుపల్కులను
　తత్పరతన్ విని "ఎన్నడేని నా
యుల్లమునందు నేమరక
　ఒక్క నిమేషముపాటు ప్రేమసం
ధిల్లక యుండునేమొ" యని
　తేకువ తక్కి యనిశ్చితాత్మయై-

అంగణ భూమి నిం పెసగు
　నామ్ర మహీజము వంక గ్రుక్కిళుల్
మ్రింగుచు జూచుచు న్నిలిచె.
　మిక్కిలి తత్తరపాటుతోడ గో

పాంగనలుం బరస్పర ముఖాబ్జ
విలోకన మాచరించుచున్
చెంగులు వ్రేళ్ళ ద్రిప్పుచును
సిగ్గున మౌనము పూని రయ్యెడన్.

## ద్వితీయ ఘట్టము

తన సదనాంతరంబున వితర్దిక పై
నుపవిష్టయై ప్రసా
ధని గొని, భిత్తిపై నిడుద
దర్పణమందు ముఖాంబుజాతముం
గనుగొని, వాలియున్న యలకల్
సవరించుచు పార్శ్వకేశముల్
వెనుకకు దువ్వి రాధ ఘనవేణిని
దాల్చె లతాంత దామమున్.

తిలకము ఫాలభాగమున దీర్చి
కనుంగవయందు కాటుకన్
జెలువుగ దిద్ది, హారములు
చిక్కు తెమల్చి, విలోల కర్ణ కుం
డలముల కాంతి పుంజములు
నాట్యము చేయ కపోలపాళి నా
కలికి లసత్కుచాంశుకము
కట్టుకొనెన్ దరహాస రేఖతోన్.

రుధిరము కానిదో నయనరోచన
    మైనదో గోపకామినీ
ప్రచయ మనోధినాథునకు
    ప్రస్తుత మండన మంచు నెంతయున్
విచలిత చిత్త రాధ నిజ వేషము
    మార్చ దలంచు నంతలో
నచటికి నేగుదెంచినది
    ఆమెసఖీమణి తోట్రుపాటునన్.

కనుగొని యామె నెచ్చెలిని
    కౌగిట జేర్చి "వచింపు నందనం
దను డెట నున్నవా డిపుడు ?
    తప్పక వత్తు నటంచు దూతికం
బనిచెను జాము క్రింద. యమునా
    తట సాంద్రత మాల వాటికిం
జని నిను బంపలేదు గద
    చయ్యన న ద్దొనిపోవగా సఖీ ?

అత డరుదెంచి నీవెనుక
    నంగణ మందలి పొన్నచాటునన్
ద్రుతగతి డాగి, నామనసు
    ధూర్తత బూని పరీక్ష సేయునా ?
మతి యొకవేళ మారె ననుమాట
    చెవిం బడవేయ నంపెనా
కితవుడు నన్ను నాకడకు
    కేవలముం గరుణా విహీనుడై !

చెలి, ఇది యేమి నీ వదన
    సీమ వివర్ణత గాంచె, దీర్ఘమై
వెలువడు నూరుపుల్, తెలుపు వేగమె
    వార్త" యటంచు శంకమై
బలుకగ రాధికా వదన
    పద్మము జూడగలేక నేలపై
నిలిపి విలోచనంబులను
    నెవ్వగతోడ విశాఖ యిట్లనున్ :

"అరుగుచునుంటి నందుని గృహ
    మ్మున కేను తదీయ దాసి స
త్వరగమనమ్ముతో నెదురు
    వచ్చుచునుండగ నేను దానితో
బిరబిర బోయె దెచ్చుటికి
    భీతకురంగి విధాన చెప్పుమా
విరజ అనంగ, కృష్ణకయి
    వెజ్జును బిల్వగ బోదు నెచ్చెలీ !

అనుటయు నామె, నేను భవ
    దంతికమం దెటో వచ్చి వాలినా
ననుగు సఖీ ! భవత్ప్రియున
    కంత తటాలున నేమి బాధయో
కనుగొనగా దలం పపుడు
    కల్గనె లేదు విలోలమానసం
బున జనుచున్న నా, కిపుడు
    పోయి కనుంగొని వత్తునా చెలీ ?"

ఇటు వగతోడ నామె వచియింపగ
రాధిక మోము వెల్లనై
తటుకున పార్శ్వమందలి వితర్దిక
మీదను వాలి, యుష్ణమై
బొటబొట బాష్ప బిందువులు
భూమి పయిం దిగజార, గుండియల్
తటతట లాడ, శోకరస దైవతమో
యన నుండె నత్తరిన్.

నిలువగ జాల నే నిపుడు
నెచ్చెలి! నందకుమారు జాడ బో
వలయును తత్క్షణం బనుచు
వ్యాకుల గద్గద భుగ్నకంఠయై
పలుకగ రాధ, ఆమె చెలి పాణి
యొసంగుచు లేపె వేదికా
తలమునుండి గోపహిమధాముని-
ధామము జేర్చ కోరికన్.

## తృతీయ ఘట్టము

ప్రతిపదమ్మున వేణిలో ప్రసవ మొకటి
నేలపై రాలుచుండంగ నిజవయస్య
భుజమూ నవలంబనమ్ముగా బూని రాధ
తివిరి యెట్టులో నందమందిరము జేర.

ధృష్టకాశ్మీర రేఖికా ఫాలభాగ
గాఢ కజ్జల నీలిమా క్రాంతనేత్ర

కర్ణకుండల శబలిత గండయుగళీ
కంపమానాధరన్యస్త కర జలేజ-
లలిత వక్షోజమండల లాస్య దమల
మణిఖచిత హారవల్లిక మందగమన
విశద బాధను రాధను వేడ్కతోడ
కన్గొనిరి గోపకాంత లాకస్మికముగ.
ఆమె తమ యంతికమ్మున కరుగుదేర
సంభ్రమమ్మున త్రోవ యొసంగినారు.
పార్శ్వముల లోచనమ్ములు పరపకుండ
చనియె రాధిక గోవిందు సవిధమునకు.

నీల బాష్పకణమ్ములు జాలువార
చెక్కిళుల మీద నిగ్రహీత చింతచేత
అపగతాలాపయై తదీయాననాబ్జ
దత్త విస్ఫారితాక్షియై దరిని నిల్చి-
కేవలము రత్నపుత్రికాకృతి వహించి
జాలి గొల్పెడి రాధపై శాంత వీక్ష
ణము ప్రసారించి వల్లవీ నాయకుండు
పలికె నల్లన పరిమృష్టఘాలు డగుచు:
"రాధ, సాయాహ్నమున శిరోబాధ నన్ను
ఏలనో కాని అలయించు: ఎవ్వరేని
ఆ ఘటము నిండ యమునాపగాంబువులను
తెచ్చి తలమట్టు త్రిప్పుచో తెరలి పోవు."
అనుటయును, రాధ నిర్దిష్టమైన ఘటము
కలరవము చేయుచుండంగ కంకణములు

మస్తకంబున దాల్చి అమందగతిని
జనియె యమునా తరంగిణీ జలము కొరకు.

కాంచి రాకేకరాక్షులై గమనవేళ
రాధికా పాద పద్మముల్ రమణు లెల్ల.
అవల దరహాస వదనయై యనియె నిట్లు
గొంతు సవరించుకొని యొక గోపకాంత:

"అనుగు చెలులార, యింత సాహసము మీరు
చూచితిరె యెచ్చటేని యిచ్చోట గాక?
కానరాకుండునే దాని కన్నుగవకు
కారుకొని యున్న చిల్లులు ఘటమునిండ.

వివరముల జూడకుండ నావేశమందు
ఘటము గొనిపోయి యుండునే తటిని కడకు?
ఉదక పూరణ కాలమం దొడలు తెలిసి
తల్లడిల్లదె కర్తవ్యతా విమూఢ?
చేరువ లభించు మృత్తితో ఛిద్రములను
మాటునేనియు సలిల మామాత్రమునకు
అద్భుతావహమై నిల్చె ననుకొనుండు:
తప్పదు పరాగశమన మధ్వమ్మునందు.

పూవు బోండ్లెందరో యుండ బొట్టు పెట్టి
పిలిచిన దెవ్వరో తన్ను, పెద్దరికము
బూని తలక్రిందు చేయగా బోయె నవుర!
వగలమారికి నెంతటి తెగువ కలదు!

మనకు కృష్ణునియెడ నభిమాన లేశ
మైన లేనట్లు, తనకె గాఢానురక్తి

సెలవు కొన్నట్లు నటియించు, నిశ్చయముగ
రాధ కీనాడు జరుగు పరాభవంబు!"

అనగ గోపాంగనల్ దరహాస వక్త్ర
తాననలు తాల్చి యుండిరి మౌనముద్ర.
వారివైఖరి గమనించి వ్రజ సుధాంశు
డల్ల నల్లన వినిమీలితాక్షు డయ్యె.
అంత నొక కొంత తడవున కచటి వార
లులికి పడ నూపురధ్వని యుప్పతిల్లె.
అరుగుదెంచెను లోనికి నంతలోన
భద్రగతి మస్తకన్యస్త భాండ రాధ.
అఖిలగోపాంగనా మనోహరుని చుట్టు
త్రిప్పెను త్రివార మేకాగ్ర దృష్టితోడ
యామునోదక ఘటి రాధ; అందుకొనియె
తత్క్షణంబ యశోద తత్కరమునుండి.
అప్పుడు గోపాలు డున్మీలితాక్షు డగుచు
అపగతం బయ్యె వేదన యనుచు లేచి
అచ్చెరువు పొందు గోపాంగనాస్యములను
శాంతగతి జూచి మందహాసమ్ము చేసె.

కృష్ణు ముఖమండలమ్ము వీక్షింప లేక
వల్లవాంగన లవనత వదన లయిరి.
చేర్చికొని రాధ నక్కున స్విన్నగండ
పాళి ముద్దాడెను యశోద ప్రమద భరిత.

# అగ్రవీక్ష

౧

బృందావనమ్ములో పెద్ద గోపాంగనల్
సంభ్రమమ్మున ఉదయ సమయాన నొక నొంద
రిరుగు పొరుగులవారి నెల్ల సంబోధించి
"మన యశోదాదేవి మగవాని గనె నంట
చూచి వత్తము రండు సుదతులారా !" యనుచు
నంద మందిరమునకు నడవం దొడగినారు.

ఫల పుష్ప భూషణాంబర భాజనములతో
శిశు వీక్షణాయత్త చిత్తలై మార్గమున
సరస సల్లాపాల జనుచుండగా వార
లం దొక్క వ్రజకాంత యనియె నీ రీతిగా :
"కలిగె యశోదా గర్భవాసమున
చిరకాలమునకు శిశు వీనాటికి.

"సుందర మూర్తులు నంద యశోదలు—
బంగరు వన్నియ పాపడె కా దగు.
"అర్భకు నేత్రము లాకర్ణాంతా
యతములు కావలె అమ్మ కనులవలె.
"జనని పోలికను జన్మించినచో
తనయుం డెంతయు ధన్యుం డగు నట."
చామీకరాంగద చ్ఛవులతో గాంగేయ
మణికంకణ ప్రభల్ మలగి నాట్యము లాడ,

మధుర నాదము చేయ మంజీర పుంజంబు,
కులుకు నడకలతోడ గోపికల్ చనినారు.

వ్రజనాయకుని మందిరపు తోరణము దాటి
ప్రాంగణంబును గోపభామినుల్ చేరంగ
గుమి గూడి యున్నారు గోపాలురు తమాల
విటపి మూలములందు వెరగందిన ముఖాల.

అనతి దూరమ్ములో అవనతానన మైన
కామినీ నివహమ్ము కడిమి తరువుల క్రింద
నిలిచి యుండుట గాంచి, నికటంబు ప్రాపించి
పృచ్ఛించినారు గోపికలు కౌతుకముతో :

"నెచ్చెలులారా, నిలిచితి రిచటనె
అంతిపురమ్మున కరుగ రెందులకు ?

"క్షేమమ్మే కద శిశువుకు జననికి ?
అహిత మేమి లే దని భావింతుము."

గొంతు సవరించుకొని గోపకాంత యొకర్తె
పైకెత్తి వదనమ్ము పలికె భారమ్ముగా :

"క్షేమమె మాతకు శిశువుకు, కానీ
నల్లనివా డట నందకుమారుడు.

"జననము మూడవ జామున, బిడ్డడు
తెరవడు కన్నులు తెల్లవారినను.

"సదనములోనికి జనుచో నెల్లరు
అగు నని సందడి ఆగితి మిచటనె."

మాట లాకర్ణించి మ్లాన వదనాలతో
వ్రజ భామినులు నూత్న వార్త లాలింపగా
నంద సదనమువంక నయన పంక్తులు నిలిపి
నిలిచినారు కదంబ నికట భూభాగాల.

౨

అభ్యంతరావాసమం దుండి వృద్ధ
అరుదెంచి మెల్లన అచ్చటి గోప
భామినులం గాంచి పలికె నీరీతి :

"బృందావనమ్ములో పెద్ద పే రున్న
ముఖ్య భిషక్కులు ముప్వురు కూడ
శిశు నేత్రములు పరీక్షించి నేరుపున
తుడిచినా రౌషధీ తోయాలతోడ.

ఉన్మీలనము లేమి యోచించి మరల
చేసి సాధన నిరీక్షించి ఫలమ్ము
కాన రా కుంటచే క్రమముగా కనులు
తెరపుడు వడు నని తెలిపి చన్నారు.

భైషజ్యమునకు లోబడని యనేక
బాధలు గుణములు వ్యాధులు గూడ
తరచుగా మంత్రవేత్తలు నివారింప
కనులార లోకాన కాంచుచున్నాము.

బాలగ్రహాదులు పట్టిన వేమొ
బిడ్డని అనియెడి భీతిచే తండ్రి
కొనివచ్చుటకు మాంత్రికుల శీఘ్రముగను

గోపాల యువకుల కొందర బంపె.
వార్త క్రమ్మర మీకు వచ్చు నందాక
వేచి యుండుడు మీరు వృక్షాల కడనె."
అరిగెను వృద్ధ యి ట్లని ద్వారవీథి.

వారు బృందావన వార్తలతోడ
కాల మొక్కించుక గడపుచునుండ,
మాంత్రికుల్ ప్రాంగణ మార్గంబు వెంట
కాన వచ్చిరి శీఘ్రగమనమ్ముతోడ

అటు నిటు జూడక అగ్రభాగమున
యువకులు నడచుచు నుండగా, వారు
తత్క్షణోన్ముక్తమౌ ద్వారంబు వెంట
అంతఃపురాంగణంబం దడుగిడిరి.

మంగళ చింతచే మ్లానిమ దొరగ
వల్లవభామినీ వదనాంబుజముల.

3

లోలలోచన లెల్ల లోకాభిరామాయ
ణౌత్సుక్యమున కాలయాపనము చేయంగ
మంద మందమ్ముగా మరల నామార్గాన
మ్లాన వదనాలతో మంత్రవేత్తలు చనిరి.

నందనందను డింక నయనాలు విప్ప కే
దేమి లోకేశ్వరీ, యేమి చేయుదు మనుచు
కుంఠితోత్సాహాన గోపీజనము వగచె.

అకస్మికమ్ముగా నంతలోనె హిరణ్య
కంకణారావమ్ము కర్ణగోచర మయ్యె.
చూచినా రొకమారె సుదతుల్ పురోభూమి,
కానవచ్చెను రాధ గంధగజ యానమున.

కప్పుకొన్నది పీత కౌశేయ వసనమ్ము
నిజభుజమ్ముల మీద; నీల కుచ బంధమ్ము
బిగియించినది రమ్య పృథుల వక్షము చుట్టు;
తురుముకొన్నది శ్వేత తులసీదళాలతో
అతసీకుసుమమాల వితతకైశికములో;
కేల ధరియించినది లీలారవిందమ్ము;

స్వస్తికాకారాన సాంద్ర గోరోచనా
తిలకబిందువు తీర్చి దిద్దినది ఫాలమున;
కార్తస్వర ప్రభా గండయుగ్మము మీద
మసృణ కస్తూరికా మకరికా పత్రముల్
రచియించినది భూరి రమణీయ రేఖలో.

ఆనాభి తల లంబియౌ హేమభాండాది
హార సంతతి యీష దాందోళనము చెంద,
కర సరోరుహ రత్న కంకణారవముతో
హాటకాంగద తులాకోటి శింజితముతో
మేఖలా కింకిణీ మృదులనిక్వాణంబు
చల్లగా మిళితమై శ్రవణోత్సవము చేయ
ఏకాగ్ర దృష్టితో నేగుచుండెను రాధ.

బాలభాస్కర కిరణ పటల స్నపిత యగుచు
కనక పుత్రిక వోలె క్షణము తోచెను రాధ.

మరునిమేషములోన మణిగణ ప్రభలతో
శాతకుంభార్చితో సంశ్లిష్టగాత్రయై
జ్యోతిర్మయీదేవి భాతి దోచిన దామె.

ఆశ్చర్య చకితలై అఖిల గోపాంగనల్
వీక్షించు చుండగా, వివృత మహా ద్వారాన
అంతిపురిసీమలో నడుగు పెట్టెను రాధ.

౪

శాద్వలంబు వహించె సాంద్ర మరకత శోభ.
ఇంతలోన కదంబవృక్ష సంతతినుండి
కురిసినవి జలజలని కుసుమముల్ ముకుళముల్,
పొన్నతరువులనుండి పువ్వుముల్ రాలినవి,
విరియబూచెను మల్లి వీక్షణక్షణములో,
వకుళ భూమీజముల్ వర్షించె సుమములను,
నిండె పున్నాగావనీజ మూలములందు
గుట్టలై రాసులై కుసుమ సందోహంబు.

నందపుష్కరిణిలో ఇందీవరాంభోజ
కల్హార పుండరీకములు వికసించినవి.
మల్లికా యూధికా మాలతీ పాటలీ
కేతకీ చంపక కేసరాది లతాంత
పరిమళోద్గారమై పవమానముల్ వీచె.
రాధాంఘ్రి సక్త మార్గము వెంట చాలుగా
జనియించి వికసించె స్థలకమల షండంబు.

ఆలపొదుగులనుండి పాలజాలు స్రవించె
ఉత్సాహావేశమునన్ వత్సకమ్ములు దుమికె
రంకె వేసెను వృషభ రాజముల్ వీకమై
క్రేంకారములతోడ కేకు లాడ దొడంగ
గండు కోయిలపిండు కలకూజితము చేసె
ఝుంకారములతోడ చంచరీకము లాడె
గరుడి కృష్ణా యనుచు గగనతలమున బలికె.

గోప గోపీజనము కుతుకమ్ముతో సాగి
అంతర్గృహాంగణం బాశ్చర్యమున జేర
మొగసాలలోనుండి మ్రోగె వాదిత్రమ్ము
భూసురాశీర్వాద పుణ్యనాదము మొరసె.

సవిధమ్మునకు వారు చని విలోకింపగా
శిశువు కాంచుచు నుండె శ్రీ రాధికా దేవి
నేత్రయుగళమువంక నిర్నిమేషమ్ముగా !
తోచె నొక్కట రవిద్యుతులు శిశునేత్రముల
క్షణలవమ్మున రాధికా దేవి వదనమున
పద్మాలయా ముఖ ప్రభలు వెలుగొందినవి.
నిసువు సందీపించె నీలమేఘ చ్ఛవుల.

ధీరమ్ముగా ప్రదక్షిణరూప వలనాల
గరుడి కృష్ణా యనుచు గగనతలమున పలికె.

హర్ష వివశాత్మమై అఖిలగోపీజనము
దొరకొనెన్ గానమ్ముతోడ రాసక్రీడ :

"జయ కృష్ణాచ్ర శ్యామల గాత్రా
జయ జయ నిరుపమ సారస నేత్రా
జయ జయ రాధా సరసిజ మిత్రా
నంద యశోదా నందనపుత్రా !

స మా ప్త ము

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
T HYDERABAD ( A. P. )

Cl. No. 81 Acc. No. 29402

Sh69S DATE DUE

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 29402

Call No. 31 Sh69S

Author

Title [illegible]

# UNIVERSITY OF HYDERABAD

## LIBRARY

### HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**